www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 18-12-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 260 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: తదియ ఉ. 10.06 తదుపరి చవితి; నక్షత్రం: పుష్యమి రా. 12.58 తదుపరి ఆశ్లేష; వర్జ్యం: ఉ. 8.48-10.25; దుర్ముహూర్తం: ఉ. 11.49-12.33; అమృతఘడియలు: రా. 6.30-8.07; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.42; సూర్యాస్తమయం: 5.40 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

తెలంగాణలో ఎంబీబీఎస్ చేసినవాళ్లు లోకలే



- పీజీ కోర్సుల్లో స్థానిక కోటాకు వారు అర్హులే: హైకోర్టు
- ఈ కోవలో ఏపీ, రాజస్థాన్, ఇతర రాష్ట్రాల విద్యార్థులు
- వారు స్థానికులు కాదన్న ప్రభుత్వ ఉత్తర్వులు కొట్టివేత
- ఈ తీర్పు ప్రస్తుత విద్యా సంవత్సరానికే: ధర్మాసనం
- రాష్ట్ర విద్యార్థులు సీట్లు కోల్పోయే ప్రమాదం? 14
- ఇతర రాష్ట్రాల వారికి ఇక్కడ పీజీ సీట్లల్లో అవకాశం



జగిత్యాల జిల్లా ఇటిక్యాల గ్రామానికి చెందిన ఓ యువకుడు పదో తరగతి చదువుతున్నప్పుడే గంజాయికి అలవాటు పడ్డాడు. ఏళ్లు గడిచిన కొద్దీ దానికి బానిస అయ్యాడు. అనారోగ్యం పాలై.. రోజూ గంజాయి తీసుకోనిదే బతకలేని పరిస్థితికి చేరుకున్నాడు. అందుకోసం బీడీ ప్యాకర్‌గా పనిచేసే నిరుపేద తండ్రిపై, తల్లిపై నిత్యం చేయి చేసుకునే స్థితికి దిగజారాడు. చివరికి ఆరోగ్యం క్షీణించిన అతణ్ని (23).. తల్లిదండ్రులు ఆస్పత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతూ మరణించాడు.

మృత్యు వలయం

వ్యసనాల ఉచ్చులో యువత

- గంజాయి మత్తుకు బానిసై..
- ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌లకు అలవాటు
- అప్పులపాలై ఆత్మహత్యలు.. హత్యలు కూడా
- లోన్ యాప్‌లు, మైక్రో ఫైనాన్స్ సంస్థల
- విష వలయంలో చిక్కుకుని బలవన్మరణాలు
- ఏజెన్సీ ప్రజలే లక్ష్యంగా మైక్రో ఫైనాన్స్ ఆగడాలు
- రవాణాను అరికడుతున్నా గంజాయి లభ్యం
- జూదాన్ని నిషేధించినా ఆన్‌లైన్‌లో అందుబాటు

యువత.. గంజాయికి, బెట్టింగ్‌కు, ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. తొలుత గంజాయి వంటి వ్యసనాలకు అలవాటు పడడం, ఆ మత్తులో మానసిక రుగ్మతకు గురై ఒంటరి కావడం, ఆ క్రమంలోనే ఆన్‌లైన్ గేమ్‌లు ఆడడం, అందుకోసం లోన్ యాప్‌లలో, మైక్రో ఫైనాన్స్ సంస్థల్లో అప్పులు చేయడం, తరువాత ఆ అప్పులు తీర్చలేక.. లోన్ యాప్‌లు, ఫైనాన్స్ సంస్థల వేధింపులు తట్టుకోలేక బలవన్మరణాలకు పాల్పడటం జరుగుతోంది. ఈ వ్యసనాల కారణంగా ఆత్మహత్యలతోపాటు హత్యలకూ పాల్పడుతున్న ఘటనలు రాష్ట్రంలో నిత్యకృత్యమయ్యాయి. అయితే గతంలో నగరాలు, పట్టణాలకు మాత్రమే పరిమితమైన ఈ జాడ్యం కొంతకాలంగా పల్లెలకూ పాకుతోంది. గ్రామీణ

మిగతా 12వ పేజీలో...

జేపీసీకి జమిలి బిల్లులు!

లోక్‌సభలో రెండు బిల్లులను ప్రవేశపెట్టిన కేంద్ర మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్

- తీవ్రంగా వ్యతిరేకించిన విపక్షాలు.. డివిజన్ ఓటింగ్
- అనుకూలంగా 269 ఓట్లు.. వ్యతిరేకంగా 198 ఓట్లు
- మొదటి అడుగులోనే లభించని 2/3 ఆధిక్యం!
- టీడీపీ, శివసేన శిందే వర్గం సంపూర్ణ మద్దతు
- రాజ్యాంగానికి, సమాఖ్యస్ఫూర్తికి విరుద్ధం: విపక్షాలు
- దేశ హితం కోసమే జమిలి: అర్జున్‌రామ్ మేఘ్వాల్
- గైర్హాజరైన 20మంది బీజేపీ ఎంపీలకు నోటీసులు
- విస్తృత చర్చల నిమిత్తం జేపీసీ పరిశీలనకు బిల్లులు!



జమిలి బిల్లుల ప్రవేశంపై లోక్‌సభలో మంగళవారం ఓటింగ్

న్యూఢిల్లీ, డిసెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించే ఉద్దేశంతో మోదీ సర్కారు చేపట్టిన 'ఒకే దేశం- ఒకే ఎన్నిక'కు సంబంధించి చట్టపరమైన ప్రక్రియ ఎట్టకేలకు మొదలైంది! ఈ అంశంపై అధికార, విపక్షాల మధ్య వాడివేడి చర్చ, బిల్లులను ప్రవేశపెట్టే తీర్మానంపై ఓటింగ్ అనంతరం.. జమిలి ఎన్నికలకు సంబంధించి అత్యంత కీలకమైన రెండు బిల్లులను కేంద్ర న్యాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ మంగళవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఆ బిల్లుల్లో ఒకటి.. 129వ రాజ్యాంగ సవరణ బిల్లు, 2024 కాగా, రెండోది కేంద్ర పాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లు, 2024. జమిలి ఎన్నికలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమంటూ ప్రతిపక్షాలు చేసిన ఆరోపణలను అర్జున్ రామ్ మేఘ్వాల్ కొట్టిపారేశారు. ఈ ఎన్నికలకు రాజకీయాలతో సంబంధం లేదని తేల్చిచెప్పారు. అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంట్ ఉభయ సభల ఎన్నికలు, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలు కేంద్ర జాబితాలోనే ఉన్నాయని గుర్తుచేశారు. రాష్ట్రాల అధికారాలను, రాజ్యాంగ మౌలిక స్వభావాన్ని ఈ బిల్లులు దెబ్బతీయవని, దేశ హితం కోసమే జమిలి ఎన్నికలు నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ సూచనల మేరకు.. ఈ బిల్లులను విస్తృత చర్చల నిమిత్తం సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి నివేదించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు చెప్పారు. జేపీసీలో దీనిపై విస్తృత చర్చలు జరుగుతాయని.. జేపీసీ నివేదికను క్యాబినెట్ ఆమోదిస్తుందని, అనంతరం ఈ బిల్లులపై సభలో మరోసారి చర్చ జరుగుతుందని

మిగతా 2వ పేజీలో...

90 రోజులు 31 మంది సభ్యులు..

బిల్లులపై ఎల్లుండిలోపు జేపీసీ 2

2029 నుంచే జమిలి ప్రక్రియ?

లోక్‌సభ పదవీకాలానికి అనుగుణంగానే అసెంబ్లీల పదవీకాలం

129వ రాజ్యాంగ సవరణ బిల్లులో పలు కీలక అంశాలు 2

జమిలి ఎన్నికలతో

ఆర్థికానికి ఊపు: కోవింద్

కంప్యూటర్ ఆధారిత పరీక్ష కేంద్రాలు

ప్రభుత్వ సంస్థల్లోనే..

- ఏడాదిలో ఎన్‌టీఏ ఆ దిశగా చర్యలు తీసుకోవాలి
- నవోదయ, కేవీలను సీబీటీ కేంద్రాలుగా చేయాలి
- 50 మంది పరీక్షలు రాసేలా గ్రామాల్లో కేంద్రాలు
- దేశవ్యాప్తంగా ఏకకాలంలో 2-2.5 లక్షల మంది సీబీటీ పరీక్షలు రాయగలిగే వసరులుండాలి
- ఆర్.రాధాకృష్ణన్ కమిటీ నివేదిక 2
- వచ్చే ఏడాది ఎన్‌టీఏ ప్రక్షాళన: ధర్మేంద్ర ప్రధాన్



అసెంబ్లీ సమావేశాలకు నల్లచొక్కాలు, సంకెళ్లతో హాజరవుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

అప్పుల కుప్పలు మీ వల్లే..

కాదు మీ వల్లే!

అసెంబ్లీలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పరస్పర ఆరోపణలు

- ఏడాదిలోనే 1.27 లక్షల కోట్లు.. ఐదేళ్లలో రూ.6 లక్షల కోట్లకు: హరీశ్
- ఖండించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- ఏడాదిలో ఎఫ్ఆర్‌బీఎం రుణం రూ.52,118 కోట్లేనని వెల్లడి
- కార్పొరేషన్లు తీసుకున్న ఎఫ్ఆర్‌బీఎం యేతర రుణాలు 61,991 కోట్లు
- బీఆర్ఎస్ సర్కారు అప్పు 7.11 లక్షల కోట్లు.. కావాలంటే మళ్లీ శ్వేతపత్రం
- మేలు చేస్తుంటే ప్రివిలేజ్ మోషనా? మీది భూస్వామ్య మనస్తత్వం: భట్టి
- నల్లషర్టులు, బేడీలతో శాసన సభకు బీఆర్ఎస్ సభ్యులు

హైదరాబాద్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ హయాంలో పదేళ్ల కాలంలో చేసిన అప్పులపై, ఏడాది కాలంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అప్పులపై మంగళవారం అసెంబ్లీలో అధికార, విపక్షాలు పరస్పరం విమర్శలు గుప్పించుకున్నాయి. గంటకుపైగా ఈ అంశంపై వాడివేడిగా వాదోపవాదాలు నడిచాయి. ప్రశ్నోత్తరాల సందర్భంగా రాష్ట్రంలో ఎఫ్ఆర్‌బీఎం రుణాలతోపాటు, ఆ పరిధిలోకి రాని రుణాల గురించి విపక్ష బీఆర్ఎస్ సభ్యులు ప్రశ్నలు సంధించారు. ఆ సమయంలో ఉప ముఖ్యమంత్రి, ఆర్థికమంత్రి భట్టి

మిగతా 13వ పేజీలో...

నేడు శాసనసభలో

కొత్త ఆర్‌వోఆర్ యాక్ట్ బిల్లు

- ఉదయం మంత్రివర్గ భేటీ
- ఆమోదం తర్వాత సభలోకి
- వీఆర్‌వో వ్యవస్థ పునరుద్ధరణ

13



ఫార్ములా-ఈ కేసులో

ఏ-1గా కేటీఆర్?

ఏ-2గా ఐఏఎస్ అర్వింద్ కుమార్

- అవినీతి నిరోధక శాఖ నమోదు చేసే అవకాశం
- కేటీఆర్‌పై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి
- ఏసీబీకి లేఖ రాసిన సీఎస్ శాంతికుమారి
- ఫార్ములా-ఈ నిధుల దుర్వినియోగం కేసులో బీఆర్ఎస్ నేత చుట్టూ బిగుస్తున్న ఉచ్చు 12
- సీఎం రేవంత్‌తో పోలీసు ఉన్నతాధికారుల భేటీ
- మాజీ మంత్రి కేటీఆర్ కేసు గురించే చర్చ!


సంధ్య థియేటర్‌కు షోకాజ్

- మీ లైసెన్స్ ఎందుకు రద్దు చేయకూడదు?
- 10 రోజుల్లో వివరణ ఇవ్వండి.. 10
- యాజమాన్యానికి హైదరాబాద్ సీపీ ఆదేశాలు
- ఆస్పత్రికి వెళ్లి శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితి ఆరా

అక్రమ నిర్మాణాలపై

ఉపేక్ష వద్దు

సాకులు చెప్పి క్రమబద్ధీకరించకూడదు



- అవసరమైతే అలాంటి వాటిని కూల్చివేయండి
- కోర్టులూ 'అనవసర సానుభూతి' చూపకూడదు
- అతిక్రమణలు జరిగితే అధికార్లకు జరిమానాలు
- కంప్లీషన్ సర్టిఫికెట్ ఉంటేనే బ్యాంకు రుణాలు
- ఆ పత్రం ఆధారంగానే కరెంటు, నల్లా కనెక్షన్లు
- నిబంధనలు పాటిస్తామని బిల్డర్లు హామీ ఇవ్వాలి
- నిర్మాణ దశలపై అధికారులు రికార్డు రాయాలి
- ఇందులో ఏ ఒక్కటి ఉల్లంఘించినా కోర్టు ధిక్కరణే
- సుప్రీంకోర్టు కీలక మార్గదర్శకాలు

న్యూఢిల్లీ, డిసెంబరు 17: అక్రమ నిర్మాణాల విషయంలో సుప్రీంకోర్టు కీలక తీర్పును వెలువరించింది. పరిపాలనాపరమైన జాప్యం జరిగిందనో, పెట్టుబడులు పెట్టారనో కారణాలు చూపించి ఎట్టిపరిస్థితుల్లోనూ అక్రమ కట్టడాలను క్రమబద్ధం చేయకూడదని స్పష్టం చేసింది. ఈ నిర్మాణాలకు బాధ్యులైన అధికారులపై జరిమానాలు విధించాలని పేర్కొంది. ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో నివాస భవనాలను వాణిజ్య నిర్మాణాలుగా మార్పిడి చేసిన కేసుపై విచారణ జరిపిన జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల ధర్మాసనం అక్రమ కట్టడాల నిరోధంపై వెలువరించిన 36 పేజీల తీర్పులో పలు ఆదేశాలు ఇచ్చింది. ఆ భవనాల కూల్చివేతను సమర్థించింది. భవన నిర్మాణం పూర్తయిన తరువాత కూడా అక్రమంగా పనులు చేపట్టినా సత్వరమే దిద్దుబాటు చర్యలు చేపట్టాలని తెలిపింది. అక్రమంగా నిర్మించిన భాగాన్ని కూల్చివేయడం, తప్పు చేసిన అధికారులకు జరిమానా విధించడం వంటి చర్యలు చేపట్టాలని

మిగతా 2వ పేజీలో...



రాష్ట్రపతికి సాదర ఆహ్వానం శీతాకాల విడిదికి హైదరాబాద్ చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్మును పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

2 రోజులు.. 2వేలు

కందుల ధర అమాంతం పతనం

- నారాయణపేటలో శనివారం రూ.12,450 గరిష్ఠ ధర
- సోమవారానికి రూ.10,756 వరకు తగ్గుదల
- మార్క్‌ఫెడ్ కొనుగోళ్లు లేక వ్యాపారుల ఇష్టారాజ్యం
- గిట్టుబాటు కావడం లేదని రైతుల ఆందోళన 3



నారాయణపేటలో ధర్నా చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో

ప్రకృతి వైద్యం

కేరాఫ్ వికారాబాద్!

- అడవిలో అంతర్జాతీయ ప్రమాణాలతో హెల్త్ రిసార్ట్
- రూ.500 కోట్లతో ఏర్పాటుకు సర్కారు ఆలోచన
- త్వరలో విధివిధానాల ఖరారు

హైదరాబాద్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఊటీగా పేరొందిన వికారాబాద్ అటవీ ప్రాంతాన్ని ప్రకృతి వైద్యానికి చిరునామాగా మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం అంతర్జాతీయ ప్రమాణాలతో అక్కడ హెల్త్ టూరిజం అండ్ రిసార్ట్ సెంటర్ ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేస్తుంది. బెంగళూరులోని జిందాల్ ప్రకృతి ఆరోగ్య కేంద్రం తరహాలో ఈ సెంటర్‌ను అభివృద్ధి చేసి పంచకర్మ, ఆయుర్వేదం, నేచర్‌క్యూర్ విధానాల్లో చికిత్సలు అందించాలనేది ఆలోచన. హైదరాబాద్‌కు సమీపంలోని వికారాబాద్ అడవుల్లోని వికారాబాద్ గుట్టపై ప్రభుత్వానికి సుమారు 200 ఎకరాల

మిగతా 10వ పేజీలో...

జూన్ 2న సనత్‌నగర్ 14

టిమ్స్ ప్రారంభోత్సవం

- సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా కార్యక్రమం
- శరవేగంగా పనులు జరుగుతున్నాయి: మంత్రి కోమటిరెడ్డి

జూలై తర్వాత కట్టిన 14

అక్రమ నిర్మాణాలు కూల్చేస్తాం!

- అనుమతులున్న వాటి జోలికెళ్లం.. నివాసాలను కూల్చం
- నివాసేతర నిర్మాణాలను ఉపేక్షించం: ఏవీ రంగనాథ్
- హైదరాబాద్‌లో చెరువుల పరిశీలనలో హైడ్రా కమిషనర్

నిన్న పాలస్తీనా.. నేడు బంగ్లాదేశ్

» చేతి బ్యాగులతో వినూత్న రీతిలో ప్రియాంక నిరసన




న్యూఢిల్లీ, డిసెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): తొలిసారి పార్లమెంట్ సభ్యురాలిగా ఎన్నికైన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ శీతాకాల సమావేశాల్లో వినూత్న రీతిలో నిరసన తెలుపుతున్నారు. సోమవారం పాలస్తీనాకు మద్దతుగా బ్యాగు ధరించి పార్లమెంట్ మకర ద్వారం వద్ద నిరసన తెలపగా, మంగళవారం బంగ్లాదేశ్‌కు మద్దతుగా అలాంటి బ్యాగుతోనే నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సహా మరికొందరు విపక్ష సభ్యులతో కలిసి కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మంగళవారం ప్రియాంక ధరించిన హ్యాండ్ బ్యాగుపై "బంగ్లాదేశ్ హిందువులు, ముస్లింలకు మద్దతుగా" అని రాసి ఉంది. కాగా, ప్రియాంక బ్యాగుల నిరసనపై బీజేపీ తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తోంది. ఆమెకు దేశంలోని సమస్యల కంటే అంతర్జాతీయ అంశాలపై ఎక్కువ శ్రద్ధని ఆరోపించింది.

మద్దతు ధరకు చట్టబద్ధత!

» వ్యవసాయ రుణాల మాఫీ.. 'పీఎం కిసాన్' 12 వేలు

» పార్లమెంటరీ స్థాయీ సంఘం సంచలన సిఫారసులు

న్యూఢిల్లీ, డిసెంబరు 17: అన్నదాతకు భారీ ఊరట కల్పిస్తూ వ్యవసాయ, పశుసంవర్ధక, ఆహార ప్రాసెసింగ్ రంగాలపై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ స్థాయీ సంఘం సంచలన సిఫారసులు చేసింది. వ్యవసాయ ఉత్పత్తుల కనీస మద్దతు ధరకు(ఎంఎస్‌పీ) చట్టబద్ధత కల్పించడంతో పాటు సాగు రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని తన నివేదికలో పేర్కొంది. మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలన్న ప్రధాన డిమాండ్‌తో శంభు, ఖానౌరీ సరిహద్దుల్లో రైతులు చేస్తున్న తీవ్ర నిరసనల సమయంలోనే స్థాయీ సంఘం సిఫారసులు వారికి అనుకూలంగా రావడం గమనార్హం. కాగా, ఎంఎస్‌పీకి చట్టబద్ధత కల్పించాలన్న రైతన్నల దీర్ఘకాల డిమాండ్‌పై స్థాయీ సంఘం లోతైన అధ్యయనం చేసింది. ఈ మేరకు స్థాయీ సంఘం ఛైర్మన్, పంజాబ్ మాజీ సీఎం చరణ్‌జిత్ సింగ్ చన్నీ మంగళవారం లోక్‌సభకు తొలి నివేదికను సమర్పించారు. దీనికి సంబంధించి లోక్‌సభ సచివాలయం విడుదల చేసిన ప్రకటన ప్రకారం.. రైతుల ఆత్మహత్యలకు ప్రధాన కారణం ఆర్థిక స్థిరత్వం లేకపోవడమేనని స్థాయీ సంఘం గుర్తించింది. ఎంఎస్‌పీకి చట్టబద్ధత కల్పించడం ద్వారా ఆత్మహత్యలను నివారించడంతోపాటు ఆర్థిక స్థిరత్వాన్ని తీసుకువచ్చేందుకు అవకాశం ఉంటుందని కమిటీ భావించింది. అప్పుల బారి నుంచి రైతులను కాపాడేందుకు ఇదే కీలక బ్రహ్మాస్త్రమని తేల్చి చెప్పింది. అదేసమయంలో రైతులు, రైతు కూలీల రుణాలను మాఫీ చేసేందుకు ప్రత్యేక పథకాన్ని తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. 'పీఎం కిసాన్' నిధులను రూ.6 వేల నుంచి రూ.12 వేలకు పెంచాలని, వ్యవసాయ కార్మికుల కనీస వేతన నిర్ధారణకు జాతీయ కమిషన్‌ను నియమించాలని స్థాయీ సంఘం సిఫారసులు చేసింది.

రైతులకు కాంగ్రెస్ ఏమీ చేయదు.. చేయనివ్వదు

జైపూర్, డిసెంబరు 17: కాంగ్రెస్ పార్టీపై ప్రధాని మోదీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రైతుల పేరుతో కాంగ్రెస్ పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతుందని, కానీ వారి కోసం ఏమీ చేయదని, ఇతరులనూ చేయనివ్వదని ఆరోపించారు. రాజస్థాన్‌లో భజన్‌లాల్ ప్రభుత్వం ఏడాది పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం నిర్వహించిన 'ఏక్ వర్ష్- పరిణామ్ ఉత్కర్ష్' కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రాల మధ్య ఉన్న జల వివాదాలకు పరిష్కారాన్ని కనుగొనడానికి బదులుగా కాంగ్రెస్ వాటిని ప్రోత్సహిస్తోందని, తూర్పు రాజస్థాన్ కెనాల్ ప్రాజెక్టును ఆ పార్టీ ఉద్దేశపూర్వకంగా జాప్యం చేయడమే దీనికి ప్రత్యక్ష నిదర్శనమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రూ.46,300 కోట్లకు పైగా విలువైన 24 ప్రాజెక్టులకు మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మరోవైపు, ప్రధాని మోదీ ఈ నెల 21 నుంచి కువైత్‌లో రెండు రోజుల పాటు పర్యటించనున్నారు. 1981 తర్వాత ఈ దేశంలో భారత ప్రధాని పర్యటించడం ఇదే మొదటిసారి.

సుప్రీం కొలీజియం ముందు జస్టిస్ శేఖర్ హాజరు

న్యూఢిల్లీ, డిసెంబరు 17: విశ్వహిందూ పరిషత్ సమావేశంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారన్న ఫిర్యాదులు ఎదుర్కొంటున్న అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ మంగళవారం సుప్రీంకోర్టు కొలీజియం ముందు హాజరయ్యారు. తనపై వచ్చిన ఆరోపణలపై వివరణ ఇచ్చినట్టు తెలిసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా ఆధ్వర్యంలోని కొలీజియం ఆయన వాదనలు విన్నట్టు తెలిసింది. ఈ నెల ఎనిమిదో తేదీన అలహాబాద్‌లో విశ్వహిందూ పరిషత్ లీగల్ సెల్ నిర్వహించిన సదస్సులో జస్టిస్ శేఖర్ మాట్లాడుతూ ఉమ్మడి పౌర స్మృతి తదితర అంశాలపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదమయ్యాయి.



20 నిమిషాలు నిల్చునే ఉండండి..

» పాఠశాలల్లో మాదిరిగా సిబ్బందికి సీఈఓ పనిష్మంట్

» పనిచేయకుండా వృద్ధుడిని నిలబెట్టినందుకు దండన

నోయిడా, డిసెంబరు 17: విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిని ఓ సీఈఓ వినూత్న రీతిలో దండించారు. పాఠశాలల్లో విద్యార్థులను నిల్చోబెట్టిన మాదిరి 20 నిమిషాల పాటు నిల్చొని పనిచేయాలని ఆదేశాలిచ్చారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని నోయిడాలో న్యూ ఓక్లా ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అథారిటీకి చెందిన కార్యాలయానికి సోమవారం పనిమీద ఒక వృద్ధుడు వచ్చారు. ఆయన కౌంటర్ వద్ద నిల్చొని ఉండడాన్ని కెమెరాలో చూసిన ఆ అథారిటీ సీఈఓ.. ఐఏఎస్ అధికారి డాక్టర్ లోకేశ్ ఆయన పనేంటో చూడాలని మహిళా ఉద్యోగికి సూచించారు. ఆ పని చేయడం వీలుకాకపోతే ఆ విషయాన్ని ఆ వ్యక్తికి చెప్పేయాలన్నారు. కానీ 20 నిమిషాల తర్వాత కూడా కౌంటర్ వద్ద వృద్ధుడు నిల్చొని ఉండటాన్ని గమనించిన సీఈఓ వెంటనే కార్యాలయం వద్దకు వచ్చి, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే అంతా 20 నిమిషాలపాటు నిల్చోవాలని ఆదేశించారు. ఆ తర్వాత వారు నిల్చొని పనిచేసిన దృశ్యాలు వైరల్ అయ్యాయి. పలువురు నెటిజన్లు సీఈఓ చర్యను కొనియాడారు.

జేపీసీకి జమిలి బిల్లులు!

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. కాగా.. తొలుత ఈ బిల్లులను సభలో ప్రవేశపెట్టడాన్ని ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించడంతో దీనిపై ఓటింగ్ జరిగింది. దాంట్లో అనుకూలంగా 269 మంది ఓటు వేయగా, 198 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. కాగా.. జమిలి ఎన్నికలకు పూర్తి మద్దతునిస్తున్నామని టీడీపీ నేత, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రకటించారు. తమ నేత చంద్రబాబు నాయుడు ఇలాంటి వినూత్న ఆలోచనల విషయంలో ఎప్పుడూ ముందు వరుసలో ఉంటారని పేర్కొన్నారు. 2024లో ఎన్నికలకు రూ.10వేల కోట్లకు పైగా ఖర్చయిందని, ఒకేసారి ఎన్నికలు జరిగితే 40% ఖర్చు తగ్గిపోతుందని లా కమిషన్, నీతీ ఆయోగ్ నివేదికలు కూడా సమర్పించాయని గుర్తుచేశారు. లోక్‌సభలో నలుగురు సభ్యులను కలిగి ఉన్న వైసీపీ కూడా ఈ బిల్లుకు మద్దతు తెలిపింది. అలా తెలిపిన ఏకైన ఎన్డీయేతర పార్టీ వైసీపీనే కావడం గమనార్హం. లోక్‌సభలో సభ్యులే లేని బీజేడీ వైఖరి ఇంకా తెలియాల్సి ఉంది. ఆ పార్టీకి రాజ్యసభలో ఏడుగురు సభ్యులున్నారు. ఇక.. విప్ జారీ చేసినప్పటికీ అనేక మంది బీజేపీ సభ్యులే మంగళవారం ఓటింగ్ సమయంలో సభకు గైర్హాజరు కావడం గమనార్హం. అలా సభకు రాని 20 మంది బీజేపీ ఎంపీలకు ఆ పార్టీ నోటీసులు పంపింది. మంగళవారం సభలో 467 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. అందులో మూడింట రెండువంతుల మంది అంటే.. 311 మంది! కానీ అనుకూలంగా వచ్చిన ఓట్లు 269 మాత్రమే. సాధారణంగా రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదానికి సభలో మూడింట రెండొంతుల మంది సభ్యుల ఆమోదం అవసరం. బిల్లులను ప్రవేశపెట్టడానికి 2/3 మెజారిటీ అవసరం లేదుగానీ.. ఆ మెజారిటీని అధికార పక్షం ఇప్పుడే సమకూర్చుకోలేకపోవడం ఈ బిల్లు భవిష్యత్తును సూచిస్తోందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

15 పార్టీలు వ్యతిరేకం..32 అనుకూలం

కాంగ్రెస్, ఎన్సీపీ (ఎస్పీ), సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే, శివసేన (యూబీటీ), టీఎంసీ, అకాలీదళ్, ఎంఐఎం, ఐయూఎంఎల్, ఆరెస్పీ సహా 15 పార్టీలు ఈ బిల్లులను వ్యతిరేకించగా.. బీజేపీ, తెలుగుదేశం పార్టీ, శివసేన (శిందే వర్గం) సహా 32 పార్టీలు సమర్థించాయి. రాజ్యాంగ మౌలిక స్వభావంపై ఈ బిల్లులు దాడి చేస్తున్నాయని, రాజ్యాంగంలోని కొన్ని అంశాలను పార్లమెంట్ కూడా మార్చలేదని కాంగ్రెస్ సభ్యులు మనీశ్ తివారీ, గౌరవ్ గొగోయ్ విమర్శించారు. రాష్ట్రాల ఎన్నికలను కూడా నిర్ణయించడం రాజ్యాంగానికి వ్యతిరేకమని మనీశ్ తివారీ మండిపడ్డారు. "ఇది రాజ్యాంగ వ్యతిరేక బిల్లు. దేశ సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధం. మేం దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం" అని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ అన్నారు. "కేంద్ర ప్రభుత్వం పడిపోయినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎందుకు పడిపోవాలి?" అని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ ప్రశ్నించారు. వేరొకరి టైమ్‌టేబుల్ కోసం.. ప్రజా తీర్పు మేరకు పాలన సాగిస్తున్నవారి టైమ్‌టేబుల్ ఎందుకు కుదించుకుపోవాలి?" అని నిలదీశారు. ఒకవేళ ప్రస్తుత వ్యవస్థను జమిలి ఎన్నికలతో మార్చేసినా.. భవిష్యత్తులో కేంద్రంలోగానీ, రాష్ట్రంలోగానీ ప్రభుత్వం కూలిపోతే మళ్లీ ఇదే తరహా గందరగోళం ఏర్పడుతుందని థరూర్ అభిప్రాయపడ్డారు. కాబట్టి ఇప్పుడు జరుగుతున్న వ్యవహారమంతా నిరర్థకం, నిష్ఫలమని వ్యాఖ్యానించారు. ఇక.. జమిలి ఎన్నికలు నియంతృత్వానికి దారితీస్తాయని సమాజ్‌వాదీ ఎంపీ ధర్మేంద్ర యాదవ్ విమర్శించారు. దేశంలో భిన్నత్వాన్ని, సమాఖ్య స్ఫూర్తిని ఈ బిల్లు దెబ్బతీస్తుందని ఆయన ఆందోళన వెలిబుచ్చారు. లోక్‌సభ పదవీకాలానికి, శాసనసభ పదవీకాలానికి ఎలా ముడిపెడతారని తృణమూల్ ఎంపీ కల్యాణ్ బెనర్జీ ప్రశ్నించారు. ఈ బిల్లులు రాష్ట్రాల శాసనసభలకు ఉన్న స్వతంత్ర ప్రతిపత్తిని హరిస్తాయని అన్నారు. జమిలి ఆచరణ సాధ్యం కాదని, అది దేశంలో నియంతృత్వపాలనకు దారితీస్తుందని.. ప్రజాస్వామ్యం, వైవిధ్యం దెబ్బతింటాయని డీఎంకే నేత టీఆర్ బాలు అన్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ స్ఫూర్తికి ఈ బిల్లులు వ్యతిరేకమని ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ మండిపడ్డారు. ఇక.. జమిలి ఎన్నికలకు తమ పార్టీ వ్యతిరేకమని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా స్పష్టం చేశారు. 'ఒకే దేశం- ఒకే ఎన్నిక' విధానం సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తుందని, నియంతృత్వానికి దారితీస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. కాగా, భారత రాజ్యాంగాన్ని కాంగ్రెస్ పార్టీ నెహ్రూ-గాంధీ కుటుంబం వ్యక్తిగత జాగీరుగా, సొంత ఆస్తిగా మార్చుకొందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా విమర్శించారు. పార్లమెంటును మోసగించిందని ఆరోపించారు. మంగళవారం రాజ్యసభలో రాజ్యాంగంపై జరిగిన చర్చ ముగింపు సందర్భంగా ఆయన ప్రసంగించారు. భావ ప్రకటన స్వేచ్ఛను అడ్డుకోవడానికే నెహ్రూ ప్రథమ రాజ్యాంగ సవరణను తీసుకొచ్చారని తెలిపారు.


లోక్‌సభలో జమిలి బిల్లులను ప్రవేశపెట్టిన సందర్భంగా మాట్లాడుతున్న మేఘ్వాల్



ఆకు పచ్చ- జమిలికి మద్దతు(269 మంది)
ఎరుపు- జమిలికి వ్యతిరేకం(198 మంది)
తెలుపు- ఓటింగ్‌కు గైర్హాజరు అయినవారు

ఆర్థిక వ్యవస్థకు ఊపు

» ఎన్నికల ప్రక్రియకు జోష్: కోవింద్

న్యూఢిల్లీ, డిసెంబరు 17: జమిలి ఎన్నికలు జరపాలని సంకల్పించిన కేంద్రం నిర్ణయానికి మాజీ రాష్ట్రపతి కోవింద్ మద్దతు పలికారు. 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' ఎన్నికల ప్రక్రియలో జోష్ తెస్తుందని, దేశ ఆర్థిక వ్యవస్థకూ ఊపు తెస్తుందని పేర్కొన్నారు. మంగళవారం కోల్‌కతాలో జరిగిన ఓ కార్యక్రమంలో కోవింద్ మాట్లాడారు. జమిలి ద్వారా జీడీపీ 1.5 పాయింట్ల మేర మెరుగుపడితే ఇప్పుడున్న జీడీపీకి మరో 10శాతం పెరిగి.. త్వరలోనే మనదేశం ప్రపంచంలోనే ఎకనామిక్ సూపర్ పవర్‌గా టాప్-4 జాబితాలోకి చేరుతుందని పేర్కొన్నారు. కాగా జమిలి కోసం కేంద్ర బీజేపీ సర్కారు నినాదం 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' వెనుక 'వన్ నేషన్-నో ఎలెక్షన్' ఉద్దేశం ఉందని ఏఐసీసీ కార్యదర్శి కేసీ వేణుగోపాల్ బెంగళూరులో విమర్శించారు.

31 మంది సభ్యులు.. 90 రోజులు

శుక్రవారంతో శీతాకాల సమావేశాలు ముగియనున్న నేపథ్యంలో ఆలోగానే లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఈ బిల్లులపై జేపీసీని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అలా చేయలేకపోతే ఈ బిల్లులు మురిగిపోతాయి. వచ్చే సమావేశాల్లో మళ్లీ వీటిని ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. కమిటీలో సభ్యుల కూర్పు.. సభలో ఆయా పార్టీలకు వచ్చిన సీట్లపై ఆధారపడి ఉంటుంది. సభలో అత్యధిక సీట్లున్న అతిపెద్ద పార్టీ బీజేపీ కాబట్టి జేపీసీలో ఆ పార్టీ సభ్యులు ఎక్కువ మంది ఉంటారు. కమిటీకి నాయకత్వం వహించే అవకాశం కూడా ఆ పార్టీకే దక్కుతుంది. జేపీసీలో గరిష్ఠంగా 31 మంది ఎంపీలు ఉంటారు. అందులో 21 మంది లోక్‌సభ నుంచి ఉంటారు. జేపీసీ 90 రోజుల్లోగా నివేదికను సమర్పించాల్సి ఉంటుంది. అవసరమైతే ఆ గడువును పొడిగించవచ్చు.

లోకం తీరు



జమిలి ప్రక్రియ 2029లోనే ప్రారంభం

లోక్‌సభకు అనుగుణంగానే అసెంబ్లీల పదవీకాలం..మధ్యలో రద్దయితే మిగిలిన కాలానికి మాత్రమే ఎన్నికలు

న్యూఢిల్లీ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): లోక్‌సభలో కేంద్రం మంగళవారం ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లు ఎలాంటి సవరణలూ లేకుండా ఆమోదం పొందితే.. లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయనే విషయంపై న్యాయనిపుణుల మధ్య చర్చ జరుగుతోంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 82కు చేర్చిన సవరణలో.. సార్వత్రిక ఎన్నికల తర్వాత లోక్‌సభ మొదటి సిటింగ్ జరిగే రోజు రాష్ట్రపతి నోటిఫికేషన్ జారీ చేస్తారని, ఆ నోటిఫికేషన్ తేదీని సభ నియామక తేదీగా నిర్ణయిస్తారని పేర్కొనడం గమనార్హం. దీంతో 2029లో జరిగే సార్వత్రిక ఎన్నికల తర్వాతే జమిలి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుందని న్యాయనిపుణులు భావిస్తున్నారు. నియామక తేదీ నుంచి ఐదు సంవత్సరాల పాటే లోక్‌సభ పదవీకాలం ఉంటుంది. నియామక తేదీ తర్వాత ఏర్పడే అసెంబ్లీల పదవీకాలం కూడా లోక్‌సభ పూర్తి పదవీకాలంతో పాటు ముగుస్తుందని తెలిపింది. అలాగే.. ఒక శాసనసభ పదవీకాలం రద్దయితే మిగిలిన కాలానికే ఎన్నికలు జరుగుతాయని బిల్లు స్పష్టం చేసింది. ఏ అసెంబ్లీకైనా ఎన్నికలు నిర్వహించలేకపోతే ఆ అసెంబ్లీ ఎన్నికలు తర్వాత జరిగినా దాని పదవీకాలం లోక్‌సభ పదవీకాలానికి అనుగుణంగానే ఉంటుందని బిల్లు పేర్కొంది. కాగా, ఎన్నికల నిర్వహణకు భారీగా ఖర్చు కావడం, అత్యధిక సమయం పట్టడం, దేశంలో అనేక ప్రాంతాలలో ప్రవర్తన నియమావళి అమలు వల్ల అభివృద్ధి దెబ్బతినడం, సాధారణ ప్రజాజీవనానికి విఘాతం కలగడం, ఉద్యోగులను సుదీర్ఘకాలంపాటు ఎన్నికల నిర్వహణకు నియమించాల్సి రావడం వంటి కారణాల వల్ల జమిలి ఎన్నికలు తప్పనిసరిగా భావించినట్లు బిల్లులో వివరించారు.

18 వేల మంది భారతీయుల మెడపై.. ట్రంప్ సర్కారు బహిష్కరణ కత్తి!

» జాబితాలో ఏపీ పౌరులతోపాటు పంజాబీలు, గుజరాత్ రాష్ట్రీయులు

» భారత్‌కు పంపేందుకు నేషనల్ గార్డ్స్‌ను వాడుతానన్న ట్రంప్



వాషింగ్టన్, డిసెంబరు 17: అమెరికాలో వచ్చే నెలలో కొలువుదీరనున్న డొనాల్డ్ ట్రంప్ సర్కారు.. అక్రమ వలసదారులపై దృష్టి సారించింది. తప్పుడు పత్రాలతో అమెరికాకు వచ్చిన వారి చిట్టాను సిద్ధం చేసింది. ఈ కోవలో 14.45 లక్షల మంది ఉండగా.. వీరిలో భారతీయుల సంఖ్య 17,940. వీరందరినీ భారత్‌కు తిప్పి పంపే(బహిష్కరణ/డీపోర్టేషన్) ఏర్పాట్లు జరుగుతున్నట్లు అమెరికా ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్(ఐసీఈ) వెల్లడించింది. ట్రంప్ కూడా ఇటీవల టైమ్ మ్యాగజీన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని ప్రస్తావించారు. మిలటరీ (నేషనల్ గార్డ్స్)ను సాధారణంగా ఇలాంటి పనులకు వినియోగించరు కదా? అని టైమ్ ప్రతినిధి ప్రశ్నించగా.. "అమెరికాలోకి అక్రమంగా చొరబాట్లు జరిగాయి. ఇది అమెరికాపై దురాక్రమణగా భావిస్తాం. పలు దేశాలు ఈ విషయంలో మాకు సహకరించడం లేదు. మేము గుర్తించిన వ్యక్తుల పౌరసత్వం వివరాలు అడిగాం. కానీ, స్పందన లేదు. అలాంటి 15 దేశాలను 'సహకరించడం లేదు' అనే జాబితాలో పెట్టాం. ఆ దేశాలు సహకరించకపోతే.. నేషనల్ గార్డ్స్ సాయంతో వారిని తిప్పి పంపుతాం" అని అన్నారు. కాగా.. భారత్ కూడా బహిష్కరణ కోసం 18 వేల మంది వివరాలు అడిగితే.. ఇవ్వడం లేదని ఐసీఈ పేర్కొంది. అమెరికాలో తప్పుడు పత్రాలతో నివసిస్తున్న భారతీయుల్లో ఎక్కువగా పంజాబ్, గుజరాత్, ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారున్నట్లు వివరించింది. పాకిస్థాన్, చైనా, ఇరాన్, వెనెజువెల నుంచి సహకారం అందడం లేదని తెలిపింది. మరోవైపు, డొనాల్డ్ ట్రంప్‌కు కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. క్రిమినల్ కేసులేవీ లేకుండా అధ్యక్ష పీఠంపై కూర్చోవాలనే ఆశకు కోర్టు నిర్ణయంతో బ్రేక్ పడింది. అధ్యక్షుడికి ప్రాసిక్యూషన్ నుంచి రక్షణ ఉంటుందని సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఆధారంగా హష్ మనీ కేసులో తీర్పును కొట్టివేయాలని తాజాగా ట్రంప్ పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌ను మన్‌హటన్ కోర్టు జడ్జి జస్టిస్ జువాన్ మెర్చన్ తిరస్కరించారు. న్యూయార్క్ స్టేట్ కేసును ముందస్తుగా మూసివేయడానికి నిరాకరించారు. ఆ కేసు ట్రంప్ వ్యక్తిగత ప్రవర్తనకు సంబంధించినది అని, అది ఆయన అధికార కార్యక్రమాలకు చెందినది కాదని పేర్కొంటూ పిటిషన్‌ను తిరస్కరించారు.

పరీక్ష కేంద్రాలు ప్రభుత్వ సంస్థల్లోనే

కంప్యూటర్ ఆధారిత పరీక్షలకు ఎన్‌టీఏ ఆ దిశగా చర్యలు తీసుకోవాలి

» నార్మలైజేషన్ పక్కాగా ఉండాలి

» రాధాకృష్ణన్ కమిటీ సిఫారసులు

న్యూఢిల్లీ, డిసెంబరు 17: కంప్యూటర్ ఆధారిత పరీక్షల(సీబీటీ) విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇస్రో మాజీ చీఫ్ ఆర్.రాధాకృష్ణన్ నేతృత్వంలో నియమించిన కమిటీ కీలక సూచనలు చేసింది. ఈ కమిటీ నివేదిక మంగళవారం మీడియాకు విడుదలైంది. సీబీటీ పద్ధతిలో ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్న జాతీయ పరీక్షల సంస్థ(ఎన్‌టీఏ) ఇకపై పకడ్బందీగా వ్యవహరించాలని.. డిజీ-యాత్ర మాదిరిగా 'డిజీ-పరీక్షల వ్యవస్థ'ను ఏర్పాటు చేయాలని కమిటీ సూచించింది. ఇందుకోసం ఎన్‌టీఏలో డైరెక్టర్ల స్థాయిలో ప్రక్షాళన అవసరమని పేర్కొంది. సాంకేతికత, ఉత్పాదకత, ఆపరేషన్స్, సైబర్ భద్రత, నిఘా విభాగాలను ఏర్పాటు చేసి, ఎన్‌టీఏను బలోపేతం చేయాలని స్పష్టం చేసింది. ఇకపై.. సీబీటీలను ప్రైవేటు కేంద్రాల్లో కాకుండా.. ప్రభుత్వ సంస్థల్లోనే నిర్వహించాలని సూచించింది. "ఇందుకోసం దేశవ్యాప్తంగా ఉన్న నవోదయ, కేంద్రీయ విద్యాలయాలను వినియోగించుకోవాలి. అక్కడ సీబీటీకి సంబంధించిన వనరులను సమకూర్చాలి. కనీసం 400-500 కేంద్రాలను ప్రభుత్వ సంస్థల్లో ఏర్పాటు చేయాలి. ఇందుకోసం ఏడాది సమయం తీసుకోవచ్చు. దశల వారీగా ఈ పనిని పూర్తిచేయాలి" అని రాధాకృష్ణన్ కమిటీ తన నివేదికలో సిఫారసు చేసింది. అంతేకాదు.. గ్రామీణ ప్రాంతాలకూ సీబీటీని విస్తరించాలని, ప్రవేశ పరీక్షల విషయంలో మారుమూల ప్రాంతాల్లో ఉండే విద్యార్థులకు దూరాభారాన్ని తగ్గించాలని పేర్కొంది. ఇందుకోసం మొబైల్ టెస్టింగ్ కేంద్రాలను(ఎంటీసీ) ఏర్పాటు చేయాలని.. వీటిల్లో 30-50 మంది విద్యార్థులు పరీక్షలు రాసే వనరులను సమకూర్చాలని తెలిపింది.



తగ్గనున్న పుస్తకాల ధరలు

వచ్చే ఏడాది నుంచి కొన్ని తరగతులకు సంబంధించిన ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్య పుస్తకాల ధరలు తగ్గుతాయని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మంగళవారం వెల్లడించారు. ఏటా 5 కోట్ల పాఠ్య పుస్తకాలను ముద్రిస్తున్న ఎన్‌సీఈఆర్‌టీ.. వచ్చే ఏడాది నుంచి ఆ సామర్థ్యాన్ని 15 కోట్లకు పెంచేందుకు కసరత్తు చేస్తున్నట్లు చెప్పారు. దీంతో పాఠ్య పుస్తకాల కొరత తీరుతుందన్నారు. నూతన విద్యా విధానాన్ని అనుసరించి 9-12 తరగతులకు రూపొందించిన పాఠ్య పుస్తకాలు 2026-27 విద్యా సంవత్సరం నుంచి అందుబాటులోకి వస్తాయని చెప్పారు.

వచ్చే ఏడాది ఎన్‌టీఏ ప్రక్షాళన

వచ్చే ఏడాది ఎన్‌టీఏను సమూలంగా ప్రక్షాళన చేస్తామని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మంగళవారం ప్రకటించారు. నీట్, యూజీసీ-నెట్‌లలో ప్రశ్నపత్రాల లీకేజీ అనుమానాలు వచ్చిన విషయాన్ని ఆయన ప్రస్తావిస్తూ.. ఇకపై పకడ్బందీగా పరీక్షలు జరుగుతాయని స్పష్టం చేశారు. పేపర్-పెన్/ఓఎంఆర్ కాకుండా.. ప్రవేశ పరీక్షలన్నీ సీబీటీ విధానంలో జరుగుతాయన్నారు. నీట్ విషయంలో ఓఎంఆర్ విధానమా? సీబీటీనా? అనే అంశంపై కేంద్ర ఆరోగ్య శాఖతో సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. ఎన్‌టీఏ ఇకపై ఎలాంటి రిక్రూట్‌మెంట్ పరీక్షలను నిర్వహించదని, కేవలం ప్రవేశ పరీక్షలకే పరిమితమవుతుందని స్పష్టం చేశారు. సీయూఈటీ-యూజీని ఏడాదికి ఒకసారే నిర్వహిస్తారని చెప్పారు. పలు సంస్థల(స్వయం పోర్టల్ వంటి కోర్సులు) కోసం ఎన్‌టీఏ పరీక్షలు నిర్వహించడం వల్ల ఆ సంస్థపై ఎక్కువ భారం పడుతోందన్నారు.

ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్య పుస్తకాలు అన్ని షెడ్యూల్ భారతీయ భాషల్లో ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లలో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. కాగా.. సీబీఎస్‌ఈకి అనుబంధంగా ఉండే పాఠశాలల సంఖ్య రెట్టింపు(2014లో 14,974 ఉండగా 2024కల్లా.. 30,415కు చేరుకున్నాయి) అయినట్లు ధర్మేంద్ర ప్రధాన్ వివరించారు.

అక్రమ నిర్మాణాలపై ఉపేక్ష వద్దు

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశించింది. పట్టణ ప్రణాళిక చట్టాలను కచ్చితంగా అమలు చేయడంతో పాటు, అధికారుల్లో జవాబుదారీతనం ఉండేలా చూడాల్సి ఉందని తెలిపింది.

● స్థానిక అధికారులు ఆమోదించిన బిల్డింగ్ ప్లాన్‌ను ఉల్లంఘించి పనులు చేపట్టడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించకూడదు. అసలు బిల్డింగ్ ప్లానే లేకుండా చేపట్టే నిర్మాణాలను ధైర్యంతో నిలిపివేయాలి.

● నిబంధనలను ఉల్లంఘించి నిర్మాణాలు జరుగుతున్నట్టు కోర్టు దృష్టికి వస్తే వాటిని ఆపాలి. ఏ మాత్రం కనికరం చూపినా అది 'అనుచిత సానుభూతి' కిందకు వస్తుంది.

● అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణలో ఆలస్యం, పరిపాలనపరమైన వైఫల్యాలు, నియంత్రణ వ్యవస్థల అసమర్థత, నిర్మాణ వ్యయం అధికంగా ఉందన్న కారణం చూపడం, పెట్టుబడులు పెట్టారని చెప్పడం, చట్టం అమలులో అధికార యంత్రాంగం నిర్లక్ష్యం, బద్ధకంగా వ్యవహరించిందన్న కారణాలు చూపించి అక్రమ నిర్మాణాలకు అనుకూలంగా వ్యవహరించకూడదు.

● అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణను అసాధారణ పరిస్థితుల్లోనే చేపట్టాలి. అదీ కేవలం ఒకేఒకసారి ఏకకాల పరిష్కార మార్గంగా చేపట్టాలి. అంతకుముందు సర్వే చేసి వాస్తవాలను నిర్ధారించాలి.

● క్రమబద్ధమైన అభివృద్ధి ఉండాలన్న ఉద్దేశంతో ప్రణాళికలు రూపొందిస్తారు. వాటిని ఉల్లంఘించి నిర్మాణాలు చేపడితే విద్యుత్తు, భూగర్భ జలాలు, రోడ్లపై ఒత్తిడి పెరిగి అసలు హక్కుదార్లకు ముప్పు ఏర్పడుతుంది. వారి జీవనానికి ఇబ్బంది అవుతుంది.

● భవనం పనులు జరుగుతున్నంత కాలం నిర్మాణ స్థలంలో 'ఆమోదం పొందిన బిల్డింగ్ ప్లాన్'ను ప్రదర్శించాలి. అధికారులు కూడా నిర్ణీత వ్యవధిలో తనిఖీలు చేస్తూ వాటిని రికార్డుల్లో రాయాలి.

● నిబంధనలు పాటిస్తామంటూ బిల్డింగ్ ప్లాన్‌కు ఆమోదం తెలిపే సమయంలో బిల్డరు/దరఖాస్తుదారు నుంచి ఓ హామీ పత్రం తీసుకోవాలి. "సంబంధిత అధికారుల నుంచి కంప్లీషన్/ఆక్యుపేషన్ సర్టిఫికెట్ తీసుకున్న తరువాతే బిల్డింగ్‌ను యజమానులు/లబ్ధిదారులకు అప్పగిస్తాను" అంటూ ఆ హామీ పత్రంలో రాయాలి.

● తనిఖీలు చేసిన అనంతరం ఎలాంటి అతిక్రమణలు లేకుండా పనులు జరిగినట్టు అధికారులు సంతృప్తి చెందితే అనవసర జాప్యాలు లేకుండా కంప్లీషన్/ఆక్యుపేషన్ సర్టిఫికెట్ జారీ చేయాలి. అతిక్రమణలు జరిగినట్టు గుర్తిస్తే చట్టం ప్రకారం తీసుకోవాలి. కంప్లీషన్ సర్టిఫికెట్ జారీని వాయిదా వేయాలి. తగిన మార్పులు, చేర్పులు చేసిన తరువాత మాత్రమే ఆ సర్టిఫికెట్ ఇవ్వాలి.



● కంప్లీషన్/ఆక్యుపేషన్ సర్టిఫికెట్ పొందిన తరువాత మాత్రమే విద్యుత్తు, మంచి నీరు, మురుగునీటి కనెక్షన్ల సౌకర్యాలను సంబంధిత అధికారులు ఇవ్వాల్సి ఉంటుంది.

● కంప్లీషన్ సర్టిఫికెట్ ఇవ్వలేదనో, అక్రమ నిర్మాణాన్ని క్రమబద్ధం చేయలేదనో, అతిక్రమణలను రాటిపై చేయలేదనో బిల్డర్/యజమాని చేసిన ఫిర్యాదులు, పెండింగ్‌లో ఉన్న అప్పీళ్లు, రివిజన్లపై చట్టంలో పేర్కొన్న విధంగా 90 రోజుల్లోగా అధికారులు నిర్ణయం తీసుకోవాలి.

● కంప్లీషన్ సర్టిఫికెట్‌ను నిశితంగా తనిఖీ చేసిన అనంతరమే భవనాన్ని తనఖాకు పెట్టుకొని బ్యాంకులు, ఆర్థిక సంస్థలు రుణాలు మంజూరు చేయాలి.

● వీటిలో ఏ ఒక్క ఆదేశాన్ని ఉల్లంఘించినా అది కోర్టు ధిక్కరణ కిందికే వస్తుంది.

ఈ ఆదేశాలను అన్ని హైకోర్టులు అమలు చేసేలా తీర్పు కాపీలను వాటికి పంపాలని సుప్రీంకోర్టు రిజిస్ట్రార్‌ను ధర్మాసనం సూచించింది.

షార్‌కు చేరిన స్పాడెక్స్ ఉపగ్రహం

పీఎస్ఎల్వీ-సీ60 ప్రయోగానికి ఏర్పాట్లు

సూళ్లూరుపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది చివర్లో మరో పీఎస్ఎల్వీ రాకెట్ ప్రయోగానికి ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. ఈ నెల 30న పీఎస్ఎల్వీ-సీ60 రాకెట్ ద్వారా అంతరిక్షంలోకి పంపే స్పాడెక్స్ ఉపగ్రహం మంగళవారం శ్రీహరికోటలోని షార్‌కు చేరుకుంది. బెంగళూరులోని ఉపగ్రహ కేంద్రం నుంచి రోడ్డు మార్గాన ప్రత్యేక వాహనంలో భారీ భద్రత నడుమ దీన్ని షార్‌కు తరలించారు. క్లీన్‌రూమ్‌లో తుది పరీక్షలు నిర్వహించిన అనంతరం ఉపగ్రహాన్ని రాకెట్ శిఖర భాగాన అమర్చనున్నారు. రాకెట్ మూడు దశల అనుసంధాన పనులను ఇస్రో శాస్త్రవేత్తలు పూర్తిచేశారు. ఈ నెల 30వ తేదీ రాత్రి 9:48 గంటలకు షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి పీఎస్ఎల్వీ-సీ60 రాకెట్ స్పాడెక్స్ ఉపగ్రహాన్ని తీసుకుని నింగిలోకి దూసుకెళ్లనుంది.

స్కూటర్ బాంబుతో రష్యా టాప్ జనరల్ హత్య

మాస్కో/న్యూఢిల్లీ, డిసెంబరు 17: రష్యా రాజధాని మాస్కోలో మంగళవారం జరిగిన స్కూటర్ బాంబు పేలుడు ఘటనలో ఆ దేశ టాప్ జనరల్ ఇగోర్ కిరిల్లోవ్, ఆయన సహాయకుడు మరణించారు. కిరిల్లోవ్ ప్రస్తుతం రష్యా అణు, జీవ, రసాయన రక్షణ బలగాల(ఎన్‌బీసీ) అధిపతిగా ఉన్నారు. తమ దేశంపైకి రసాయన ఆయుధాల ప్రయోగానికి ఆయన అనుమతి ఇచ్చారని ఉక్రెయిన్ ఆరోపించిన తర్వాతి రోజునే కిరిల్లోవ్ హత్య జరగడం చర్చనీయాంశంగా మారింది. స్కూటర్‌లో పేలుడు పదార్థాలను అమర్చి, కిరిల్లోవ్ తన నివాసం నుంచి బయటకు వస్తున్న సమయంలో దాడికి పాల్పడ్డారని రష్యా ఫెడరల్ దర్యాప్తు సంస్థ పేర్కొంది. కాగా, ఉక్రెయిన్ అంతర్గత భద్రతా విభాగమే (ఎస్‌బీయూ) ఈ దాడి చేసిందని ఆ ఏజెన్సీకి చెందిన అధికారి ఒకరు పేర్కొన్నారు. కిరిల్లోవ్ ఒక యుద్ధ నేరస్తుడన్నారు.



ఈనెల 29న జరగనున్న కొమురవెల్లి మల్లికార్జున స్వామి కల్యాణోత్సవానికి హాజరు కావాలని సీఎం రేవంత్ రెడ్డిని దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ఆహ్వానించారు. ఈ మేరకు మంగళవారం రేవంత్‌కు సురేఖ, జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, ఆలయ అధికారులు ఆహ్వాన పత్రిక అందజేశారు. మల్లన్న శేష వస్త్రాలు, తీర్థప్రసాదాలు, చిత్రపటాన్ని సీఎంకు ఆలయ ఈవో అందజేశారు. - చేర్యాల, హైదరాబాద్, ఆంధ్రజ్యోతి

భార్య కిడ్నీ ఇస్తే.. కొడుకు కాలేయమిచ్చాడు!

» ఇంటిపెద్దను బతికించుకున్న కుటుంబం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇంటిపెద్దకు అనారోగ్య సమస్య వస్తే ఆ కుటుంబం తల్లడిల్లిపోయింది! రెండు కీలక అవయవాలు చెడిపోవడం, వాటిని ఎవరైనా దానం చేస్తే తప్ప ఆయన అనారోగ్య సమస్యల నుంచి బయటపడరని వైద్యులు చెప్పడంతో ఆయన్ను ఎలాగైనా బతికించుకోవాలని అనుకున్నారు. భార్య, కుమారుడు అవయవాలను దానం చేయడంతో సంపూర్ణ ఆరోగ్యాన్ని సంతరించుకున్నారు ఆ ఇంటిపెద్ద! ఏపీలోని ఒంగోలుకు చెందిన ఓ కుటుంబ సభ్యులు ఇలా ఆదర్శాన్ని చాటుకున్నారు. శస్త్రచికిత్స వివరాలను మంగళవారం నానక్‌రాంగూడలోని స్టార్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైద్యులు వెల్లడించారు. ఒంగోలుకి చెందిన వ్యాపారవేత్త 54 ఏళ్ల రామారావు కాలేయం, కిడ్నీ వైఫల్యంతో బాధపడుతున్నారు. అధిక రక్తపోటు, మధుమేహం, హెపటైటిస్-బి ఇన్ఫెక్షన్ వంటి సమస్యలున్నాయి. కాలేయం పూర్తిగా చెడిపోయింది. కిడ్నీలు ఫెయిల్ అవ్వడంతో రక్తంలో విషపదార్థాలు పేరుకుపోయాయి. కుటుంబసభ్యులు ఆయన్ను స్టార్ ఆస్పత్రిలో చేర్చారు. పరీక్షించిన వైద్యులు వెంటనే కాలేయం, మూత్రపిండాలను మార్చాలని సూచించారు. దీంతో ఆయన భార్య నాగవల్లి(45), కొడుకు కౌశిక్(25) తమ అవయవాలను దానం చేయడానికి ముందుకొచ్చారు. నాగవల్లి నుంచి కిడ్నీని, కౌశిక్ కాలేయం నుంచి కొంత భాగం సేకరించి రోగికి అమర్చారు.



భార్య, కొడుకుతో కలిసి కేక్ కట్ చేస్తున్న అవయవమార్పిడి చేసుకున్న రామారావు, చిత్రంలో వైద్యులు



'పోలీస్ అక్క' పోస్టర్, ఫోన్ నంబర్లను ఆవిష్కరిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

'పోలీస్ అక్క'లు వస్తున్నారు!

» రాజన్న సిరిసిల్ల జిల్లాలో వినూత్న కార్యక్రమం

సిరిసిల్ల, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణకు రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసులు 'పోలీస్ అక్క' పేరిట వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పద్మనాయక కల్యాణ మండపంలో షీటీమ్ ఆధ్వర్యంలో చేపట్టిన 'పోలీస్ అక్క' కార్యక్రమాన్ని ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రారంభించారు. ఇందులో భాగంగా మహిళల రక్షణకు జిల్లా వ్యాప్తంగా ప్రతీ పోలీస్ స్టేషన్‌లో ఒక మహిళా కానిస్టేబుల్‌ను నియమించారు. పోలీస్ అక్కగా ఉండే ఆ కానిస్టేబుల్ పాఠశాలలు, కళాశాలలను సందర్శిస్తూ పోక్సో, లైంగిక వేధింపులు, ఈవ్‌టీజింగ్, గుడ్ టచ్.. బ్యాడ్ టచ్, మహిళా చట్టాలపై అవగాహన కల్పిస్తూ షీటీమ్‌కు సహాయంగా పని చేస్తారు. అత్యవసర సమయాల్లో డయల్ 100తోపాటు పోలీస్ అక్క ఫోన్ నంబరును సద్వినియోగం చేసుకోవాలని అవగాహన కల్పించనున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ఆకతాయిల ఆట కట్టిస్తూ షీటీమ్ సత్ఫలితాలు సాధిస్తోందని, ఈ సంవత్సరం 52 మంది ఆకతాయిలను పట్టుకున్నదని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐ కృష్ణ పాల్గొన్నారు.

రైతుబీమా కోసం 'చావు' తెలివి!

» బతికుండగానే డెత్ సర్టిఫికెట్

» ఇద్దరు రైతుల పథకం.. బీమా సొమ్ము స్వాహా

మెదక్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు మహిళలు రైతుబీమా సొమ్ము రూ.5 లక్షలు పొందేందుకు పథకం వేశారు. భర్త చనిపోయినట్లుగా నకిలీ పత్రాలు సృష్టించారు. రైతుభరోసా కింద రూ.5 లక్షల చొప్పున ఆ ఇద్దరు మహిళలకు స్వాహా చేశారు. మెదక్ జిల్లా రూరల్ మండలం గుట్టకిందిపల్లెలో మూడేళ్ల క్రితం ఒకరు, ఏడాది క్రితం మరొకరు రైతుభరోసా పథకం కోసం ఇలా చావు తెలివితేటలు ప్రదర్శించారు. ఇది.. తాజాగా జరుగుతున్న కులగణన సర్వేతో బట్టబయలైంది. సర్వేలో భాగంగా కుటుంబసభ్యుల వివరాల నమోదు కోసం అధికారులు వెళ్లినప్పుడు ఆ ఇద్దరు మహిళలు రైతుబీమా కింద లబ్ధి పొందినట్లుగా చెప్పడం, దీనిపై స్థానికులు కొందరు చనిపోయారంటున్న ఆ రైతులు బతికే ఉన్నట్లుగా అధికారులకు సమాచారం అందించడంతో గుట్టు రట్టయింది. గుట్టకిందిపల్లెకు చెందిన పిట్ల శ్రీనివాస్, ఎలిగేటి మల్లేశం బతికున్నా చనిపోయినట్లుగా వారి కుటుంబసభ్యులు నకిలీపత్రాలు సృష్టించారు. తన భర్త శ్రీనివాస్ 2021 మే 22న చనిపోయినట్లు అతడి భార్య జ్యోతి అప్పటి పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ నుంచి డెత్ సర్టిఫికెట్ తీసుకొని రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకుంది. అదే సంవత్సరం జూలై 26న రైతుబీమా కింద రూ.5లక్షలను జ్యోతికి అందజేశారు. ఇక 2023 ఫిబ్రవరి 7న మల్లేశం చనిపోయినట్లు అతడి భార్య శేఖవ్వ పంచాయతీ కార్యదర్శి నరేందర్‌కు దరఖాస్తు చేసుకొని డెత్ సర్టిఫికెట్ పొందింది. అదే ఏడాది మార్చి 29న ఆమెకు రూ. 5 లక్షలను అధికారులు అందజేశారు. జనరల్ ఇన్సూరెన్స్ కింద దరఖాస్తు చేసుకొని రూ.2లక్షల చొప్పున సొమ్మునూ ఆ మహిళలు క్లెయిమ్ చేసుకున్నారు. కాగా ఈ అక్రమాలపై తమకు ఈనెల 14న సమాచారం అందిందని, విచారణ చేపట్టగా మృతిచెందారని చెబుతున్న పిట్ల శ్రీనివాస్, ఎలిగేటి మల్లేశం బతికే ఉన్నట్లు తేలిందని పోలీసులు వెల్లడించారు. అప్పట్లో రాజ్‌పల్లి క్లస్టర్ పరిధిలో పని చేసే ఏఈవో భార్గవి, విచారణ చేశారని, ఆ తర్వాతే రైతుబీమాకు ఆమె సిఫారసు చేసినట్లు మంగళవారం పోలీసుల విచారణలో తేలింది. నిందితులు పిట్ల జ్యోతి, శేఖవ్వలపై కేసు నమోదు చేసినట్లు మెదక్ రూరల్ పోలీసులు తెలిపారు.

రెండు రోజుల్లోనే రూ.2వేలు ఢమాల్

కందుల ధరలు అమాంతం పతనం... నారాయణపేటలో శనివారం రూ.12,450 గరిష్ఠ ధర

» సోమవారానికి రూ.10,756 వరకు తగ్గుదల

» మార్క్‌ఫెడ్ కొనుగోళ్లు లేక వ్యాపారుల ఇష్టారాజ్యం

» గిట్టుబాటు కావడం లేదని రైతుల ఆందోళన



నారాయణపేట మార్కెట్‌లో కందుల బస్తాలు

మహబూబ్‌నగర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కందిపప్పు ధరలు బహిరంగ మార్కెట్‌లో ఆకాశాన్ని అంటుతున్నా వాటిని పండించే రైతుల కష్టానికి మాత్రం ప్రతిఫలం దక్కడం లేదు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడాన్ని ఆసరాగా తీసుకుని వ్యాపారులు ధరల అంశంలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ కంది రైతులకు నష్టం చేస్తున్నారు. సీజన్ ఆరంభం నుంచి శనివారం వరకు బాగానే పలికిన ధరలు సోమవారానికి రూ.2 వేల మేర పడిపోయాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. రాష్ట్రంలో మహబూబ్‌నగర్, రంగారెడ్డి, ఆదిలాబాద్, మెదక్, నల్లగొండ జిల్లాల్లో కంది సాగు అధికంగా జరుగుతోంది. సుమారు 3.50 లక్షల టన్నుల కందులు మార్కెట్‌కు వస్తుంటాయి. కేంద్ర ప్రభుత్వం 2024-25కు గాను కందులకు క్వింటాలుకు రూ.7550 కనీస మద్దతు ధర నిర్ణయించింది. అయితే ఈ ధర రైతులకు సరిపోదు. మద్దతు ధర కంటే ఎక్కువ మొత్తం చెల్లిస్తుండడంతో రైతులు వ్యాపారులనే ఆశ్రయిస్తుంటారు. ఇదే వ్యాపారులకు అవకాశంగా మారింది.

వ్యాపారుల సిండికేట్..!

రాష్ట్రంలోని తాండూరు, నారాయణపేట మార్కెట్ యార్డుల్లో కందుల కొనుగోళ్లు ఎక్కువగా జరుగుతాయి. ఈనామ్ విధానంలో ప్రతీరోజు వ్యాపారులు ధరలను నిర్ణయిస్తారు. ఈక్రమంలో ధరల్లో హెచ్చుతగ్గులు ఉంటాయి. అయితే, శనివారం వరకు మంచి ధరలు ఇచ్చిన వ్యాపారులు మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలు లేవని సోమవారానికి ధరలు బాగా తగ్గించేశారు. నారాయణపేట మార్కెట్‌లో శనివారం ఓ క్వింటాలుకు గరిష్ఠంగా రూ.12,450 ధర పలకగా సోమవారానికి అది రూ.10,756కు పడిపోయింది. వికారాబాద్ జిల్లా తాండూరులో సోమవారం గరిష్ఠ ధర రూ.9254 రాగా సగటు ధర రూ.8811 పలికింది. నవాబుపేటలో రూ.9011, జడ్చర్ల మార్కెట్‌లో రూ.8066 మాత్రమే వచ్చింది. శనివారంతో పోలిస్తే ఈ మార్కెట్లలో ధరలు సోమవారానికి రూ.2వేలకు పైగా తగ్గాయి. వ్యాపారులంతా సిండికేట్‌గా మారి ధరలు తగ్గించేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. పైగా, ప్రతీ మార్కెట్‌లో గరిష్ఠ ధరను తక్కువ లాట్లకే ఇస్తుంటారు. ఉదాహరణకు ఎక్కువ పంట తీసుకొచ్చిన రైతుకు వ్యాపారులు తక్కువ ధర ఇస్తారు. తక్కువ కందులు తెచ్చిన రైతుకు గరిష్ఠ ధర చెల్లిస్తారు. మరోపక్క, ఆయా మార్కెట్లలోని కమీషన్ ఏజెంట్లు 4 శాతం మేర కమీషన్‌గా వసూళ్లు చేస్తుండడంతో రైతులు నష్టపోతున్నారు. కాగా, వ్యాపారులు ధరలను అమాంతం తగ్గించేయడంపై నారాయణపేట మార్కెట్‌లో రైతులు సోమవారం ఆందోళనకు దిగారు. కార్యాలయంలోని కుర్చీలను ధ్వంసం చేశారు. మంగళవారం కూడా ఆందోళన కొనసాగడంతో ఆర్డీవో రాంచందర్, మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ప్రసాద్ రైతులతో చర్చలు జరిపారు. సోమవారం టెండర్ అయిన ధరకు రూ.250 అదనంగా ఇస్తామని చెప్పి రైతులను ఒప్పించారు. కానీ, టెండర్లు వేయక ధరలు నిర్ణయించలేదు కొనుగోళ్లు జరగలేదు. అయితే, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే తమకు మంచి ధరలు వస్తాయని రైతులు అభిప్రాయపడుతున్నారు.

పెట్టుబడి కూడా రావడం లేదు



కందులను మార్కెట్‌కు తీసుకువస్తే అనుకున్న ధర లభించడం లేదు. శనివారం కన్నా సోమవారం దాదాపు రూ.1500 తక్కువ ధర పలికాయి. ఇలా ధర తగ్గిస్తే రైతుల పరిస్థితి ఏంటి. రూ.11 వేల కంటే తక్కువకు కందులు కొనుగోలు చేస్తే మేము నష్టపోతాం. నేను ఐదు బస్తాల కందుల తీసుకెళ్లా. క్వింటాలుకు రూ.8780 ధర నిర్ణయించారు.

- ఎల్లమ్మ, రైతు, మన్నపూర్, మద్దూర్ మండలం

ఓరుగల్లులో 'అజంజాహి' రగడ

కార్మికభవన్ స్థలంలో భూమి పూజ.. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి కసరత్తు

» ఆ భూమి తనదేనంటున్న ఓ వస్త్ర వ్యాపారి

» ఆయనతోపాటు భూమి పూజలో పాల్గొన్న కొండా మురళి

» స్థలం కార్మికులకే చెందాలంటూ విపక్షాలు, ప్రజాసంఘాల ఆందోళన

వరంగల్ సిటీ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వేలాది మంది కార్మికులకు కేరాఫ్ అడ్రస్‌గా, వందలాది పోరాటాలకు కేంద్రంగా నిలిచిన వరంగల్‌లోని అజంజాహి కార్మిక భవన్‌పై తీవ్ర దుమారం చెలరేగుతోంది. గత ఏడాది కూల్చివేసిన కార్మిక భవన్ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి.. నగరానికి చెందిన ఓ ప్రముఖ వస్త్ర వ్యాపారి సోమవారం భూమి పూజ నిర్వహించటం, మంత్రి కొండా సురేఖ భర్త, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు దగ్గరుండి ఆ పూజల్లో పాల్గొనటం రాజకీయ రగడకు తెరలేపింది. కోట్ల రూపాయల విలువైన కార్మికుల భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని బీఆర్ఎస్, బీజేపీ, వామపక్షాలతో పాటు కార్మిక సంఘాలు మంగళవారం ఆందోళనకు దిగాయి.

ఇదీ నేపథ్యం..

నిజాం హయాంలో తెలంగాణలోనే అతిపెద్ద వస్త్ర పరిశ్రమగా వెలుగొందిన అజంజాహి మిల్లులో పని చేసే కార్మికుల కోసం 1944లో సుమారు ఆరువందల గజాల స్థలంలో కార్మిక భవన్‌ను నిర్మించారు. వేలాది మంది కార్మికులు పైసా పైసా జమ చేసుకుని ఈ భవన్‌ను నిర్మించుకున్నారు. అప్పటి నుంచి 2003లో అజంజాహి మిల్లు మూతపడే వరకు కూడా ఈ కార్మిక భవనం అనేక ఉద్యమాలకు కేంద్రబిందువుగా నిలిచింది. మిల్లు మూతపడిన సమయంలో పలువురు కార్మికులు వీఆర్ఎస్ తీసుకున్నారు. వృద్ధులైన కొందరు మృతి చెందగా, మరి కొందరు ఉపాధి కోసం వలసబాట పట్టారు. అజంజాహి మిల్లునే నమ్ముకున్న కార్మికులు.. కార్మిక భవన్ స్థలంలో తమకు ప్లాట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేస్తూ అధికారుల చుట్టూ ఏళ్లపాటు తిరిగారు. అయితే, కార్మిక భవన్ కాగితాలు సరిగా లేవన్న విషయం తెలుసుకుని, నకిలీ పత్రాలు సృష్టించి, రహస్యంగా కార్మిక భవన్ స్థలాన్ని కబ్జాదారులు వారి పేరున మార్చుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అనంతరం నగరంలోని ఓ ప్రముఖ వస్త్రవ్యాపారికి ఆ భూమిని తక్కువ ధరకు విక్రయించినట్టుగా ప్రచారం జరిగింది. ఆ సమయంలోనే భవనాన్ని నేలమట్టం చేశారు. ఆ వ్యాపారి గతప్రభుత్వ హయాంలో తన పలుకుబడిని ఉపయోగించి మునిసిపల్ కార్పొరేషన్ రికార్డుల్లో కూడా తన పేరుపై వచ్చేలా చూసుకున్నారని సమాచారం. అజంజాహి మిల్లు కార్మిక భవన్ స్థలం ఓ వస్త్ర వ్యాపారి చేతుల్లోకి వెళ్లిందనే విషయం గతేడాది మార్చి 11న సీపీఐ (మావోయిస్టు) జేఎండబ్ల్యూపీ డివిజన్ కమిటీ కార్యదర్శి కంకణాల రాజిరెడ్డి ఓ ప్రకటన విడుదల చేయడంతో వెలుగులోకి వచ్చింది. వస్త్ర వ్యాపారితో పాటు అప్పటి బీఆర్ఎస్ ఎమ్మెల్యే నరేందర్‌ను హెచ్చరిస్తూ ఆ ప్రకటన వెలువడింది. దీంతో కార్మిక భవన్ స్థలంలో నిర్మాణాలకు వ్యాపారి వెనుకడుగు వేసినట్టుగా ప్రచారం జరిగింది. అయితే, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సమీకరణలు మారాయి. కార్మిక భవన్ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సోమవారం భూమి పూజ జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి కొండా సురేఖ భర్త కొండా మురళీధర్‌రావు హాజరవడం, పూజా కార్యక్రమాలు నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కార్మికభవన్ స్థలం కార్మికులదే అంటూ వారికి అండగా నిలిచిన మురళి ప్రస్తుతం వస్త్ర వ్యాపారితో కలిసి భూమి పూజలో పాల్గొనటం రాజకీయ రగడకు తెరలేపింది.



కార్మిక భవన్ స్థలంలో భూమి పూజ చేస్తున్న కొండా మురళి

తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఏపీజీవీబీ విలీనం

» కేవలం తెలంగాణ వరకే.. ఏపీలో అదే పేరుతో కొనసాగింపు

ఖమ్మం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వరంగల్ కేంద్రంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో పలు జిల్లాల్లో సేవలందిస్తున్న ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్(ఏపీజీవీబీ)కు సంబంధించి తెలంగాణలోని బ్రాంచులన్నీ తెలంగాణ గ్రామీణ బ్యాంకు(టీజీబీ)లో విలీనం కానున్నాయి. జనవరి 1నుంచి తెలంగాణలోని ఏపీజీవీబీ బ్రాంచులన్నీ తెలంగాణ గ్రామీణ బ్యాంకు పేరుతోనే సేవలందించనున్నాయి. ఇందుకోసం ఏపీజీవీబీ బ్యాంకు బోర్డులను తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా మార్చబోతున్నారు. ఈ మార్పుల నేపథ్యంలో ఈ నెల 28 నుంచి 31వరకు తెలంగాణలో ఏపీజీవీబీ సేవలు నిలిచిపోనున్నాయి. ఏటీఎంలు, ఆన్‌లైన్ నగదు లావాదేవీలతో పాటు ఇతర బ్యాంకు కార్యకలాపాలు పూర్తిగా స్తంభించనున్నాయి. ఈ మేరకు ఏపీజీవీబీ ఖమ్మం రీజనల్ మేనేజర్ మహ్మద్ రియాజ్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. జనవరి 1నుంచి బ్యాంకు పాస్‌పుస్తకాలు, వోచర్లు, డీడీలు, చెక్కు పుస్తకాలను తెలంగాణ గ్రామీణ బ్యాంక్ పేరుతోనే జారీ చేస్తామన్నారు. ఇప్పటివరకు కొన్ని జిల్లాలకే పరిమితమైన ఈ బ్యాంకు బ్రాంచులను రాష్ట్రమంతా విస్తరింపజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

రుణయాప్ వేధింపులు తాళలేక.. భగీరథ కాంట్రాక్టు ఉద్యోగి ఆత్మహత్య

» మెదక్ జిల్లా కాట్రియాలలో ఘటన



గంగాధర్ (ఫైల్)

రామాయంపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక అవసరాల నిమిత్తం రుణయాప్‌ఎలో అప్పు తీసుకుని వాయిదాలు చెల్లించలేక, రుణయాప్ నిర్వాహకుల బెదిరింపులు తాళలేక మిషన్ భగీరథ కాంట్రాక్టు ఉద్యోగి ఒకరు బలవన్మరణానికి పాల్పడ్డారు. మెదక్ జిల్లా రామాయంపేట మండలం కాట్రియాల గ్రామానికి చెందిన మద్ది గంగాధర్ (28) మిషన్ భగీరథలో పంప్ ఆపరేటర్‌గా కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్నారు. వివిధ అవసరాల కోసం రుణయాప్‌ఎలలో రూ. 3 లక్షల వరకు రుణం తీసుకున్నారు. అయితే వాయిదాలు సకాలంలో కట్టలేకపోయారు. రుణయాప్ నుంచి వాయిదాల కోసం వేధింపులు ఎక్కువ కావడంతో అప్పు తీర్చే మార్గం కనిపించక మనస్తాపంతో మూడు రోజుల క్రితం గ్రామ శివారులో గుళికలు మింగి ఆత్మహత్యాయత్నం చేశారు. అటుగా వెళ్తున్న వారు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు వచ్చి వెంటనే నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం చనిపోయారు. గంగాధర్‌కు భార్య, ఐదేళ్లలోపు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

జమిలి దిశగా...!

నిన్నటిదా, మొన్నటిదా...దశాబ్దం నాటి కల, ఇప్పుడు నిజం చేసుకొనే ప్రయత్నంలో తొలి అడుగుపడింది. లోక్‌సభ, అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికల నిర్వహణకు ఉద్దేశించిన జమిలి బిల్లు పార్లమెంటులో ప్రవేశించింది. బిల్లు సభముందుకు రాగానే కాంగ్రెస్, సమాజ్ వాదీ పార్టీ, తృణమూల్ ఇత్యాది విపక్షాలు తాడెత్తున లేవడం, అరుపులూ కేకలతో నిరసనలు తెలియచేయడం అనూహ్యమైనవేమీ కావు. ఎంతోకాలంగా తమను వెంట తరుముతున్న ఈ ఒకేదేశం–ఒకే ఎన్నిక బిల్లు ఏదో ఒకరోజు కచ్చితంగా తమముందుకు రావడం ఖాయమని వారికీ తెలుసు. జమిలి బిల్లుల ప్రవేశాన్ని అనుమతిస్తూ 269మందే ఓటుచేయడం విపక్షానికి ఎందుకో అధికారపక్షం బలహీనతగా కనిపిస్తున్నది. బీజేపీ బలం, బలగం లెక్కలు అటుంచితే, బిల్లు ప్రవేశం దశలో మూడింట రెండువంతుల బలం అక్కరలేదన్న విషయం తెలియనిదేమీ కాదు.

అధికారంలో ఎవరున్నా తాము చెబుతున్నదీ చేస్తున్నదీ ప్రజాప్రయోజనార్థమేనని అంటారు. తయారవుతున్న చట్టాలు దేశ సంక్షేమం కోసమే తప్ప తమ స్వార్థరాజకీయం కాదంటాయి. ఒకేదేశం–ఒకే ఎన్నిక ఆలోచనలో విపక్షాలకు ఒక బలమైన రాజకీయ కుట్ర కనిపిస్తోంది. ఇది రాజ్యాంగ మౌలిక స్వరూపానికి విరుద్ధమనీ, నియంతృత్వానికి దారితీస్తుందని, రాష్ట్రాల హక్కులు దెబ్బతింటాయనీ, ప్రాంతీయపార్టీలు ఉనికికోల్పోతాయనీ విపక్షాలు అంటున్నాయి. విపక్షాలు ప్రతీదానినీ రాజకీయకోణంలోనే చూస్తాయనీ, మోదీ భయం వాటిని కుదిపేస్తున్నదని అధికారపక్షం అంటోంది. రెండు బిల్లులనూ అడ్డుకోవడానికి ఆఖరుక్షణం వరకూ విపక్షాలు ప్రయత్నిస్తాయనీ, జేపీసీకి పంపాలని ఎలాగూ డిమాండ్ చేస్తాయనీ తెలుసు కనుక, మంత్రివర్గ సమావేశంలోనే మోదీ జేపీసీ సూచన చేశారని అమిత్ షా ముందే తేల్చేశారు. సదరు కమిటీలో బీజేపీ సంఖ్యాబలం సహజంగానే ఎక్కువ ఉంటుంది కనుక, మిగతాదశలూ కష్టనష్టాలమాట అటుంచితే, ఈ దశ దాటడం ఖాయం. జమిలిని మ్యానిఫెస్టోలో పెట్టడం నుంచి, ఎర్రకోట ప్రసంగాలు, రాష్ట్రపతుల హితవులు, పార్టీపెద్దల అసందర్భోచిత ప్రస్తావనలు చాలా చూశాం. జమిలికి వకాల్తాపుచ్చుకున్న మాజీ రాష్ట్రపతి తన నివేదికలో దానిని ఓ చారిత్రాత్మక పరిణామంగా ముందుకు తోయడంలో ఆశ్చర్యమేమీ లేదు. జమిలికిపోతే జీడీపీ ఒకటిన్నరశాతం పెరుగుతుందన్న లెక్క ఆర్థికవేత్తలకు ఇంకా అర్థంకావాల్సి ఉంది. ఎన్నికల ఖర్చు తగ్గుతుందని, సునాయాస పాలనకు వీలుకలుగుతుందనీ పాలకపక్షం నేతల మాదిరిగానే ఈ కమిటీ కూడా చాలా చెప్పింది. ప్రతీ చిన్న ఎన్నికనూ ఓ యుద్ధంలాగా చేయడం బీజేపీ వచ్చిన తరువాతే పెరిగింది కానీ, అంతకుముందు ఎక్కడో ఎన్నికలు జరుగుతూంటే ఢిల్లీ ఏలికలు పెద్దగా ఆయాసపడిందేమీ లేదు. మంచిచెడులతో నిమిత్తం లేకుండా విపక్షాలన్నీ జమిలిని వ్యతిరేకించడానికి అసలు కారణం ప్రాంతీయ ప్రాధాన్యతలు వెనక్కుపోయి, జాతీయాంశాలు ముందుకు వస్తాయని, కేంద్రం బలపడుతుందని. ఎన్నికలవేళ మతాన్ని రగిలించి, దేశభక్తిని రంగరించి, సర్జికల్ దాడులతో మోదీ ఓట్లు ఎగరేసుకుపోతారని.

రాజ్యాంగ సవరణ బిల్లు అయినప్పటికీ కూడా సభాప్రవేశం దశలో మూడింట రెండువంతుల మెజారిటీ అవసరం లేదని విపక్షాలకు తెలియదనుకోలేం. ఈ దశలోనే అధికారపక్ష కూటమి బలం తుస్సుమని తేలిపోయిందనీ, రేపు కచ్చితంగా జమిలి ఓడిపోతుందని నిజంగానే అవి నమ్ముతున్నపక్షంలో ఇప్పుడే అంత ఆవేశపడనక్కరలేదు. ఏ దశలో ఏ అడుగువేయాలో, ఎవరిని మోహరించి గట్టెక్కాలో అధికారపక్షానికి తెలిసిన విద్య కనుక తిమ్మినిబమ్మిని చేయగలదన్న భయం విపక్షాలకు లోలోన ఉన్నదేమో. బిల్లు నెగ్గదు అని విపక్షాలు అనడం, నెగ్గించి తీరుతామని అధికారపక్షం వాదించడం వాటి స్థానాల రీత్యా సహజం. గత రెండుపర్యాయాలు సొంతబలంతో అధికారంలో ఉన్న బీజేపీ, ఇప్పుడు మిత్రపక్షాల చేయూతలేనిదే అడుగువేయలేని దశలో రాజ్యాంగసవరణలకు అవసరమైనంత సంఖ్యాబలాన్ని కూడగట్టగలనన్న నమ్మకంతోనే ఈ సాహసానికి పూనుకుందా? అన్నది ప్రశ్న. పదేళ్ళపాటు అవధులు దాటిన ఆత్మవిశ్వాసంతో వ్యవహరించిన ఒక పార్టీకి, మూడోవిడతలో మరొకరి ఊనికతో నడవాల్సిరావడం భరించలేని విషయం. ఉన్న ఆ కాస్త హవా ఇంకొంత హరించుకుపోకముందే, జమిలితో దేశాన్నంతా చాపచుట్టేయాలని ఆశించడంలో తప్పేమీ లేదు. బలం లేనంతమాత్రాన సంకల్పం సన్నగిల్లలేదనీ, ఆత్మవిశ్వాసం చెదరలేదనీ, వెనక్కుతగ్గేదే లేదని దూకుడు చూపడం రాజకీయాల్లో అత్యంత ముఖ్యం.

మళ్లీ విద్వేషాలు విజృంభిస్తున్న వేళ..





■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

కొందరి పేర్లు చరిత్ర పుటల్లో నిలిచిపోతాయి. ఎంత కాలం గడిచిపోయినా చరిత్రలో వారి పేర్లను, వారు చేసిన పనులను చెరిపివేయడం అంత సులభం కాదు. పాములపర్తి వెంకట నరసింహారావు ఇదే డిసెంబర్ మాసంలో దివంగతులై రెండు దశాబ్దాలు గడచిపోయాయి. ఇప్పుడు మరోసారి ఆయన పేరు స్మరించుకునే అవసరం నేటి రాజకీయ నాయకులకు కలిగింది. సుప్రీంకోర్టుకు, జాతీయ సమగ్రతా మండలికి బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం చేసిన వాగ్దానాలను కూడా విస్మరించి, ఆ పార్టీ అగ్రనేతల సమక్షంలో బాబ్రీ మసీదు కట్టడం కూల్చివేత జరిగింది. ఈ ఘటనకు పీవీనే చాలా మంది తప్పుపట్టారు. అయితే అంతకు సరిగ్గా ఏడాది ముందే 1991లో ప్రార్థనా స్థలాల (ప్రత్యేక నిబంధనలు) చట్టాన్ని పార్లమెంట్‌లో ఆమోదింపచేసి దేశ వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో మతపరమైన భావోద్వేగాలు తలెత్తకుండా చూసింది కూడా పీవీయే అన్న విషయం చాలా మంది మరిచిపోయారు! సంభల్‌లో మతపరమైన హింసాకాండ, మధురలో వివాదం నేపథ్యంలో ఇప్పుడు బీజేపీ, కాంగ్రెస్ నేతలకు కూడా ఆ చట్టం గుర్తుకువచ్చింది. ఇదే ఏడాది ప్రథమంలో పీవీకి భారతరత్న పురస్కారాన్ని ప్రకటించిన బీజేపీ ప్రభుత్వం ఇప్పుడు ఈ చట్టాన్ని రద్దు చేయాలని తమ పార్టీ నేతలే అంటుంటే వారించలేకపోతోంది. నరసింహారావును అనేక సార్లు అగౌరవపరిచిన కాంగ్రెస్ నేతలకు కూడా ఇప్పుడు పీవీ ప్రభుత్వమే ప్రార్థనా స్థలాల చట్టాన్ని ఆమోదింపచేసిన విషయం గుర్తుకు వచ్చింది.

నిజానికి ఈ చట్టంపై మళ్లీ చర్చ రేపి తీగ లాగింది కొద్ది రోజుల క్రితం పదవీవిరమణ చేసిన సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్. ఒక మత ప్రదేశపు స్వభావాన్ని మార్చడం 1991 చట్టం క్రింద నిషేధించినప్పటికీ, ఆ ప్రదేశపు మత స్వభావాన్ని తెలుసుకునే ప్రయత్నం చేయడాన్ని ఆ చట్టం అడ్డుకోలేదని చంద్రచూడ్ వ్యాఖ్యానించి ప్రస్తుత వివాదాలన్నిటికీ తెర లేపారు. దేశంలో అనేక ప్రాంతాల్లోని ప్రార్థనా స్థలాలలో సర్వేల కోసం పిటిషన్లు దాఖలయ్యాయి. వారణాసిలోని జ్ఞానవాపి మసీదులో పురావస్తు శాఖ సర్వేకు ఆదేశించిన స్థానిక కోర్టు ఈ చట్టం ప్రభావాన్ని తగ్గించే ప్రయత్నం చేసింది. ఆ తర్వాత 1991 చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించింది. తాజాగా యూపీలోని సంభల్ మసీదులో అలాంటి సర్వేను జిల్లా కోర్టు అనుమతించినందుకే గత నెలలో మతపరమైన హింసాకాండ జరిగింది.

ఈ నేపథ్యంలో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం ప్రార్థనా మందిరాల విషయంలో దేశంలో అన్ని కోర్టులు యథాతథ స్థితి నెలకొనేలా చూడాలని గత వారం ఆదేశించడం ప్రాధాన్యం సంతరించుకుంది. 1991 చట్టం చెల్లుతుందా లేదా అన్న విషయం తాము తేల్చేంతవరకూ ప్రార్థనా స్థలాల్లో సర్వేలు జరిపించాలని దాఖలైన పిటిషన్లను ఏ కోర్టూ నమోదు చేసుకోవద్దని, ఎలాంటి ఆదేశాలు జారీ చేయకూడదని సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశించింది. అసలు ఈ చట్టం రాజ్యాంగబద్ధతపై కేంద్ర ప్రభుత్వం నాలుగు వారాల్లో తన అభిప్రాయం ఏమిటో చెప్పాలని స్పష్టంగా నిర్దేశిస్తూ 2025 ఫిబ్రవరి 17 వరకు తదుపరి విచారణను వాయిదా వేసింది. దీనితో కనీసం మూడు నెలల వరకైనా ప్రార్థనా స్థలాల విషయంలో మత పరమైన భావోద్వేగాలకు అడ్డుకట్ట వేసినట్లైంది.

> 'ఒక ముస్లిం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అహంకారంతో నోరుపారేసుకుంటూంటే ఓ హిందూ పటేల్ అతణ్ణి హృదయపూర్వకంగా సమర్థిస్తాడు. ఓ హిందూ మేనేజర్ హిందూ మహిళలను అవమానిస్తూ ఒక ముస్లిం జాగీర్దార్‌కు విధేయుడుగా ఉంటాడు. ప్రజల్ని అష్టకష్టాలు పెడుతున్న ముస్లిం ప్రభువుల దుష్టపాలనకు లొంగి ఉండాలని ఒక హిందువు తన కుమారుడికి ఉద్బోధిస్తాడు' అని నిజాం కాలంలో పరిస్థితుల గురించి తన 'లోపలి మనిషి' నవలలో పీవీ రాశారు. చరిత్ర పట్ల విద్వేష వైఖరి అవలంబిస్తే అశాంతిని ఆహ్వానించడమే అవుతుంది.

అయోధ్యలో రామజన్మభూమిపై బీజేపీ నిర్వహిస్తున్న ఉద్యమం తారస్థాయికి చేరుకుంటున్న సమయంలో అధికారంలోకి వచ్చిన పీవీ నరసింహారావు, వచ్చీ రాగానే దేశవ్యాప్తంగా ఇతర ప్రార్థనాస్థలాల్లో ఇలాంటి భావోద్వేగాలు తలెత్తకుండా ఉండేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ప్రార్థనాస్థలాల్లో యథాతథ పరిస్థితిని పరిరక్షించేందుకు చట్టం చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు 1991 జూలైలో రాష్ట్రపతి వెంకట్రామన్ పార్లమెంటు ఉభయ సభల నుద్దేశించి చేసిన ప్రసంగంలోనే స్పష్టం చేశారు. ఆ తరువాత సెప్టెంబర్‌లో రెండు రోజుల పాటు లోక్‌సభలో అద్భుతమైన చర్చ జరిగింది. ఇటీవలి కాలంలో కొన్ని వర్గాలు దేశంలో అసహనం వ్యాప్తి చేయాలని చూస్తున్నాయని, ప్రజలు ఏనాడో మరిచిపోయిన వివాదాలను తిరగదోడి తమ స్వార్థ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నాయని, అలాంటి కొత్త వివాదాలు రేకెత్తకుండా ఉండేందుకే ప్రార్థనా స్థలాల (ప్రత్యేక నిబంధనలు) బిల్లును ప్రవేశ పెడుతున్నామని హోంమంత్రి ఎస్.బి. చవాన్ స్పష్టం చేశారు. ప్రేమ, శాంతి, సుహృద్భావ వాతావరణాన్ని ఏర్పర్చడమే ఈ బిల్లు లక్ష్యమని అన్నారు. బీజేపీ నుంచి అద్వానీ, జస్వంత్ సింగ్, ఉమాభారతి, రాంనాయక్ తదితరులు; కాంగ్రెస్ నుంచి దిగ్విజయ్ సింగ్, పిఎం సయీద్, మణిశంకర్ అయ్యర్; సీపీఐ(ఎం) నుంచి సోమనాథ ఛటర్జీ; సీపీఐ నుంచి ఇంద్రజిత్ గుప్తా, గీతా ముఖర్జీ అత్యంత ప్రతిభావంతంగా చర్చలో పాల్గొన్నారు. ఆ చర్చల ప్రామాణికతతో పోలిస్తే ఇవాళ్టి చర్చలు పేలవంగా కనిపిస్తాయి. ఈ బిల్లు వల్ల మనం సాధించేది ఏమీ లేదని, కొత్త వివాదాలు ప్రారంభమయ్యే అవకాశాలున్నాయని అద్వానీ అన్నారు. ప్రతి వివాదానికీ పరిష్కారం లభించాల్సిందేనని, అన్ని మత ప్రదేశాల పూర్వ వైభవాన్ని పునరుద్ధరించాలని ఉమాభారతి స్పష్టం చేశారు. తర్వాతి కాలంలో బీజేపీకి మిత్రుడుగా మారిన అప్పటి జనతాదళ్(యు)కు చెందిన దళిత నేత ఒకరు ఈ బిల్లును బలంగా సమర్థించారు. ఈ దేశంలో 33 కోట్ల మంది దేవుళ్లు ఉన్నప్పటికీ దేశంలోని 5,76,000 గ్రామాలకు స్వచ్ఛమైన నీరు అందడం లేదని గుర్తు చేశారు. లక్షలాది ప్రజలు ఆకలితో, వైద్య చికిత్సలు లేకుండా, ఉపాధి లభించకుండా మరణిస్తున్నారని, ఇలాంటి తీవ్రమైన అంశాలను పరిష్కరించకుండా మతపరమైన ఘర్షణల్లో కూరుకుపోవడం శోచనీయమని, ఎక్కడ మసీదు ఉందో, ఎక్కడ ఆలయం ఉందో తేల్చడం ప్రధానం కాదని సీపీఐ(ఎం) నేత సోమనాథ ఛటర్జీ అన్నారు. అదే సమయంలో అయోధ్య వివాదాన్ని చర్చల ద్వారా లేదా న్యాయవ్యవస్థ ద్వారా పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు.

ప్రార్థనాస్థలాల బిల్లు ఆమోదం పొందిన తర్వాత ఒక్క అయోధ్యలో మినహా దేశంలో దాదాపు మూడు దశాబ్దాల పాటు ఎక్కడా ప్రార్థనాస్థలాల విషయంలో వివాదాలు రేగలేదు. ఒక్క అయోధ్య అంశం వల్లనే బీజేపీ క్రమక్రమంగా ఎన్నికల రాజకీయాల్లో పుంజుకొన్నది కనుక ఇతర అంశాలను పక్కన పెట్టింది. అయోధ్యతో బస్ ఝూంకీ హై, కాశీ మధురా బాకీ హై అని ఒకప్పుడు బీజేపీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు నినాదాలు చేసేవారు. కాని మేనిఫెస్టోలో మాత్రం ఇతర ప్రార్థనా స్థలాల గురించి ప్రస్తావించకుండా సంయమనం పాటించారు. కాశీ, మధుర మాటేమిటి? అని 2022 లో బీజేపీ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డాను ప్రశ్నించినప్పుడు ఏ వివాదమైనా కోర్టులు, రాజ్యాంగం ద్వారా పరిష్కరించుకోవాల్సిందేనని చెప్పారు. అయోధ్య ఉద్యమం ఒక మినహాయింపు మాత్రమేనని, ప్రతి మసీదు లోనూ శివలింగం గురించి వెతకడం సరైంది కాదని ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత్ స్పష్టం చేశారు. ఆసేతు హిమాచలాన్ని సమైక్య పరిచే శ్రీరాముడు వివాదాల్ని సృష్టించడని, ఆయన పరిష్కారాలు సూచిస్తారని రామమందిర ప్రారంభం తర్వాత ప్రధాని నరేంద్రమోదీ కూడా అన్నారు. చారిత్రక తప్పిదాలను సవరించడం కన్నా శాంతి సామరస్యాలతో కలసికట్టుగా జీవించడంపై దృష్టి కేంద్రీకరించాలని ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ వంటి బీజేపీ నేతలు కూడా అన్నారు. అయోధ్య తీర్పు సమయంలో కూడా ప్రార్థనా స్థలాల చట్టం ప్రాధాన్యాన్ని సుప్రీంకోర్టు గుర్తు చేసింది. దేశ రాజకీయ వ్యవస్థలో అత్యంత కీలకమైన లౌకికవాద లక్షణాలను ఈ చట్టం కాపాడుతుందని ఒకప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా ఒక తీర్పులో స్పష్టం చేశారు. కనుక మళ్లీ ఈ రకమైన వివాదాలు రేకెత్తడం, సుప్రీంకోర్టు కూడా కలుగచేసుకోవాల్సి రావడానికి కారణమేమిటి? పైకి ఎన్ని చెప్పినప్పటికీ దేశమంతటా మతపరమైన భావోద్వేగాలు రేకెత్తించి ప్రయోజనం పొందడానికి బీజేపీ ప్రయత్నిస్తుందా? జమిలి ఎన్నికలకూ, ప్రస్తుత పరిణామాలకూ ఏమైనా సంబంధం ఉన్నదా? పీవీ హయాంలో ఆమోదించిన ప్రార్థనా స్థలాల చట్టంపై తన అభిప్రాయం ఏమిటో మోదీ ప్రభుత్వం స్పష్టంగా చెప్పిన తర్వాతే ఈ ప్రశ్నలకు సమాధానం లభిస్తుంది.

ఇంతకీ ఈ మతపరమైన భావోద్వేగాలపై పీవీ అభిప్రాయం ఏమిటి? 'దేశంలో రక్తపాతాన్ని నివారించలేకపోతే చరిత్ర మనల్ని క్షమించదు' అని ఆయన 1992 జూలై 24న జరిగిన కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో అన్నారు. మతతత్వవాదం వల్ల ఎన్నో దేశాలు నిద్రలేని రాత్రుళ్లు గడుపుతున్నాయని ఆయన తనపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి జవాబు చెబుతూ అన్నారు. దేశ పాలన రాజ్యాంగం ప్రకారం సాగాల్సిందేనని, మూక మనస్తత్వం ఉన్నవారికి లొంగితే రాజ్యాంగానికి తిలోదకాలివ్వాల్సిందేనని పీవీ అన్నారు. మతం, రాజ్యం రెండూ వేరువేరేనా? 'ఒక ముస్లిం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ దుస్సహమైన అహంకారంతో నోరుపారేసుకుంటూంటే ఓ హిందూ పటేల్ అతణ్ణి హృదయపూర్వకంగా సమర్థిస్తాడు. ఓ హిందూ మేనేజర్ హిందూ మహిళలను అవమానిస్తూ ఒక ముస్లిం జాగీర్దార్‌కు విధేయుడుగా ఉంటాడు. ప్రజల్ని అష్టకష్టాలు పెడుతున్న ముస్లిం ప్రభువుల దుష్టపాలనకు లొంగి ఉండాలని ఒక హిందువు తన కుమారుడికి ఉద్బోధిస్తాడు' అని నిజాం కాలంలో పరిస్థితుల గురించి తన 'లోపలి మనిషి' నవలలో పీవీ రాశారు. మూడు దశాబ్దాలు గోల్కొండను ఏలిన ఇబ్రాహీం కులీ కుతుబ్ షాను 'మల్కిభరామా!' అని కందుకూరి రుద్రకవి కీర్తించాడు. చరిత్రను శాస్త్రీయ దృక్పథంతో అర్థం చేసుకోవాలి. అలా కాకుండా విద్వేష వైఖరిని అవలంబిస్తే అశాంతిని ఆహ్వానించడమే అవుతుంది.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

రంగన్న ఆశలు నెరవేరుతాయా?

మహబూబ్‌నగర్ జిల్లాకు సాగునీరు సాధించటం అనే ఆశయానికి నిబద్ధమైన వ్యక్తి నల్లవెల్లి రంగారెడ్డి. 1951లో గన్యాగుల గ్రామంలో జన్మించాడు. మధ్య తరగతి కుటుంబం అనుభవించే ఈతిబాధలన్నీ అనుభవించాడు. 1976లో డిప్యూటీ ఇంజనీర్‌గా సాగునీటి శాఖలో ప్రవేశించి వనపర్తి, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, గద్వాల, హైదరాబాద్, శ్రీకాళహస్తి, నల్లగొండ తదితర చోట్ల విధులు నిర్వహించి, 38 సంవత్సరాలు వివిధ హోదాలలో పనిచేసి, సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా ఉద్యోగ విరమణ చేశాడు.

ఉమ్మడి రాష్ట్రంలో అనేక ప్రాజెక్టులను, ఎత్తిపోతల పథకాలను పరిశీలించాడు. ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు ఎందుకు మహబూబ్‌నగర్ జిల్లాను వివక్షకు గురి చేస్తున్నాయని చింతించేవాడు. ఆర్థిక వెనుకబాటుతో ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకోకపోవడం వల్ల విధాన నిర్ణయాలను ప్రభావితం చేసేచోట జిల్లా ప్రజలు లేరని, అందువల్ల లోపల ఏం జరుగుతుందో మనకు తెలియడం లేదని అనేవాడు. రాజకీయ నాయకులకే పట్టింపు లేనప్పుడు మనం ఏం చేయగలమని బాధపడేవాడు. అయితే వారిని చైతన్యం చేస్తే మాట్లాడతారని ఆశపడ్డాడు. దీనికి ఎలిమినేటి మాధవరెడ్డి ఎత్తిపోతల పథకం విజయం కలిసి వచ్చింది. స్వయంగా తోటి ఇంజనీర్లతో కలిసి బస్సుల్లో ఎ.ఎం.ఆర్ పథకం పనితీరును జిల్లా రాజకీయ నాయకులకు చూపించాడు.

అప్పటికే మేము కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకాలు చేపట్టాలని పార్టీలు, రాజకీయ నాయకులపై పోరాడుతూ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నాం. అయినా పదేళ్ల పాటు చిన్న రాయి కూడా వేయకుండా కేవలం శంకుస్థాపనల తంతు నడిపారు. చివరికి 2005లో పనులు ప్రారంభించి 2012 నాటికి కొంత మేర పూర్తి చేశారు. కృష్ణా నది జలసాధన ఉద్యమంలోంచే తెలంగాణ ఉద్యమం పుట్టినా, తెలంగాణ ఏర్పడి పదేండ్లు దాటినా మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలకు సాగునీటి న్యాయం దక్కనే లేదు. తెలంగాణలో ఏర్పడిన తొలి ప్రభుత్వం జల వివాదాలున్న నీటి ఎద్దడి ప్రాంతం కోసం కాక, కాళేశ్వరం చేపట్టి నిధులు అటు మళ్లించిందని రంగారెడ్డి ఆవేదన చెందాడు.



> ఐదు దశాబ్దాల వృత్తి, ప్రవృత్తి జీవితానుభవంతో నల్లవెల్లి రంగారెడ్డి చివరికి ఒక ప్రతిపాదన చేశాడు. ఏటా వేల టీఎంసీల నీరు సముద్రం పాలవుతోంది. జూరాల ఎగువ నుంచి 200 టీఎంసీల నీరు తీసుకుని, నిలువ చేసుకునే వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటే మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలు బాగుపడతాయి.

ఆయనను తీవ్రంగా కలచివేసిన విషయం... పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని 2013 ఆగస్టులో సాధించుకున్న 72 జీవోతో కాక, 2015 జూన్ 11న కేసీఆర్ విడుదల చేసిన 105 జీవోతో చేపట్టి, వంచించటం. ఇది సరి కాదని రామకృష్ణారెడ్డి, మల్లయ్య, రవీందర్‌రెడ్డి వంటి నిపుణులైన మహబూబ్‌నగర్ ఇంజనీర్లు ఎంత మొత్తుకున్నా కేసీఆర్ వినలేదు. ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని అరకొర నిధులతో పనులు నానబెట్టారు. ఈ పనుల కోసం ఆయన రంగారెడ్డినే ఓఎస్డీగా నియమించాడు. కానీ, ఎప్పటికప్పుడు వాస్తవాలు తెల్పటాన్ని జీర్ణించుకోలేక, రెండోసారి ఆయన పదవీకాలాన్ని పొడిగించలేదు. మూడేళ్లలో పూర్తి కావలసిన పథకం ఇంకా మూలన పడి ఉన్నది. పనులు పూర్తి కాకుండానే ఒక పంపు నీరు దుంకించి మన జిల్లాను అవమానించాడని రంగన్న బాధపడ్డాడు. మహబూబ్‌నగర్ రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం ఏర్పడాలనే మా సంకల్పానికి సహకరించాడు.

పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి ఇన్‌టేక్ పాయింట్‌ను జూరాల నుంచి కాక శ్రీశైలానికి మార్చడంతోనే వివాదాలు చుట్టుకున్నాయి. శ్రీశైలం అంతర్రాష్ట్ర ప్రాజెక్టు కావటం వల్ల ఆంధ్రా అడ్డుకుంది. ఎ.ఎం.ఆర్, ఎస్.ఎల్.బి.సి నీరు తీసుకునే అవకాశం ఉన్నా, ఒకరిద్దరు స్వార్థపరులు పాలమూరు–డిండి అనే కొత్త పథకం ముందుకు తెచ్చారు. డిండి ఎత్తు పెంచి నార్లాపూర్ లేదా ఏదుల లేదా వట్టెం నుంచి నీరు తరలించుకుపోయే ప్రతిపాదన తెచ్చారు. దీనిపై జిల్లా ప్రజలు పెద్ద ఎత్తున పోరాడవలసి వచ్చింది. ఈ అంశంపై ప్రభుత్వానికి లేఖ రాయడానికి ఎమ్మెల్యేలను ఒప్పించడంలో రంగన్న పాత్ర ఉంది. కేసీఆర్ కూడా అసెంబ్లీలో ఆ ప్రతిపాదన ఉండదన్నారు. పాలమూరు పథకంలో చివరిదైన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ ఎందుకు చేపట్టలేదో రంగన్న వివరంగా చెప్పాడు. ప్రభుత్వం రియల్ ఎస్టేట్ లాబీ చేతిలో ఉందన్నాడు. బీఆర్ఎస్ ప్రభుత్వం పోయి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినా, భట్టి విక్రమార్క స్వయంగా హామీ ఇచ్చినా లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనుల్లో చలనం లేదు.

అసలు మహబూబ్‌నగర్ సాగునీటి పథకాలు చాలా చిన్నవి. ఆర్డీఎస్ పథకం దెబ్బతిని పోయింది. సుంకేశుల ఆనకట్టను భారీగా నిర్మించారు కానీ, ఆర్డీఎస్‌ను వదిలేశారు. కోర్టు తీర్పు ప్రకారం ఇవ్వాల్సిన నీరు కూడా ఇవ్వడం లేదు. జూరాల నిర్వహణ సరిగా లేదు. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ పథకాల పంపుల సామర్థ్యం, కాలువల సామర్థ్యం, రిజర్వాయర్ల సామర్థ్యం చాలా చిన్నవి. వాటి స్థాయి మెరుగుదలకు ఏం చేయాలో కేసీఆర్ ఒక్కసారి కూడా సమీక్ష జరపలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా ఏమీ చేయలేదు. ఒక ఇంజనీర్ల బృందంతో అధ్యయనం చేయించి వారి సూచనలు అమలు చేయాలని కోరినా ఎవరూ పట్టించుకోలేదు.

పాలమూరు–రంగారెడ్డి పథకానికి కేటాయించిన 90 టిఎంసిల నీటిని రెండు భాగాలుగా విభజించి, సగం నీటిని జూరాలకు వచ్చే తొలి వరద నుంచి, మిగతా సగం నీటిని శ్రీశైలం నుంచి తీసుకుని కల్వకుర్తి పథకంతో సమన్వయపరచి నిర్వహించాలని కోరాం. మన వాటా నీరు నిలుపుకోవడానికి వెల్టూరు–గొందిమల్ల గ్రామాల మధ్య జోగులాంబ రిజర్వాయర్ నిర్మించాలని కోరాం. అమ్రాబాద్‌కు చంద్రసాగర్ నుంచి కల్వకుర్తి పథకం నీరు తరలించాలని చెప్పాం. ఈ ప్రతిపాదనలన్నీ గొప్పగా ఉన్నాయి. మున్ముందు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సాధించుకోవచ్చేమో అని నల్లవెల్లి రంగారెడ్డి ఆశ పడ్డాడు. ఆయనను మహబూబ్‌నగర్ సాగునీటి పథకాల సలహాదారుగా 2024 మే 14న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నియమించింది. అయితే అనారోగ్యంతో బాధ్యతలు చేపట్టకుండానే మే 27న రంగన్న మరణించాడు. ఇంజనీర్ రఘురాంరెడ్డి, ఇతర మిత్రులు రంగన్న మరణం వారి కుటుంబానికి, బంధువులకు మాత్రమే కాదు ఎంతో కాలంగా మోసపోతున్న మహబూబ్‌నగర్ రైతాంగానికి నష్టం అని కంటతడి పెట్టుకున్నారు. పోరాడి తెలంగాణ సాధించుకున్నాం కానీ, జిల్లాకు నీరు సాధించుకోలేకపోయాం, ఇప్పుడైనా అవుతుందేమో అనుకుంటే ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది అని టీజేఏసి మాజీ చైర్మన్ జి. రాజేందర్‌రెడ్డి బాధపడ్డారు.

ఐదు దశాబ్దాల వృత్తి, ప్రవృత్తి జీవితానుభవంతో రంగారెడ్డి చివరికి ఒక ప్రతిపాదన చేశాడు. ఏటా వేల టిఎంసిల నీరు సముద్రం పాలవుతోంది. జూరాల ఎగువ నుంచి 200 టిఎంసిల నీరు తీసుకుని, నిలువ చేసుకునే వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటే మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలు బాగుపడతాయి. నీరు లేనప్పుడు లెక్క ప్రకారమే వాడుకోవచ్చు. ఉన్నప్పుడు తీసుకోకపోవడం ప్రభుత్వాల అసమర్థత కాదా అన్నాడు. ఈ సవాలును స్వీకరించి నిజాయితీగా పనిచేసే శక్తి రాష్ట్ర ప్రభుత్వానికి ఎప్పటికైనా వస్తుందా? ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ విషయం మీద దృష్టి సారిస్తారా? రంగన్న ఆశలు, కలలు నెరవేరుతాయా?

• ఎం. రాఘవాచారి
పాలమూరు అధ్యయన వేదిక

ఈ కూలి రేట్లతో ఎలా బతికేది?

జీవన స్థితిగతుల్లో మార్పు లేక కూలీలు బతుకుబండి అతికష్టం మీద లాగుతున్నారు. కూలీ రేట్లు పెరగడం లేదు. కాని ప్రజా ప్రతినిధుల వేతనాలు మాత్రం పెచ్చుమీరి పెరుగుతున్నాయి. చెమట చుక్కల్ని నమ్ముకొన్న కూలీలకు రోజుకు రూ.300 నుంచి 400 వరకు గిట్టుబాటు అవుతున్నది. ఒక్కో రాష్ట్రంలో ఒక్కొక్క విధంగా కూలీ రేట్లు ఇస్తున్నారు. కనీస రోజుకూలీ కేరళ రాష్ట్రంలో అధికంగా రూ.670 ఉన్నది. కాగా మహారాష్ట్రలో అతి తక్కువగా రూ.240 ఉన్నది. ప్రజాప్రతినిధులు అత్యధికంగా వేతనాలు పొందుతున్న రాష్ట్రం తెలంగాణ కావడం విశేషం. ఇక్కడ ప్రజాప్రతినిధులు నెలవారీగా రూ.2.50 లక్షల దాకా వేతనం పొందుతున్నారు. ప్రజాప్రతినిధుల వేతనాలు ఎప్పటికప్పుడు పెరుగుతున్నాయి. కాని కూలీ రేట్లు పెరగక కూలీలు శ్రమ దోపిడికి గురవుతున్నారు. కూలీలు మధ్యప్రదేశ్‌లో రూ.290, మహారాష్ట్రలో రూ.240, జమ్మూ కశ్మీర్‌లో రూ.453, బిహార్‌లో రూ.267, హిమాచల్ ప్రదేశ్‌లో రూ.343, ఉత్తర ప్రదేశ్‌లో రూ.271, కర్ణాటకలో రూ.264, తెలంగాణలో రూ.415 కూలిగా పొందుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో రూ.300 నుంచి రూ.400 వరకు కూలీ రేట్లు ఉన్నాయి. ఆయా రాష్ట్రాలతో పాటు తెలంగాణ లోనూ ఆంధ్రప్రదేశ్ లోనూ సగటు కూలీ రేట్లలో తగ్గుదల ఉంటున్నది. దిన కూలీలు, అడ్డా కూలీలు, వ్యవసాయ కూలీలు ఇలా అసంఘటిత రంగంలో పనిచేసే కూలీలకు దిన కూలీ గిట్టుబాటు కాక ఆర్థికంగా చితికి పోతున్నారు. తమకు రోజువారీ కూలి చట్టబద్ధంగా అందేలా పాలకులు చర్యలు తీసుకోవాలని కూలీలు కోరుతున్నారు. రోజువారీ కూలీ సక్రమంగా గిట్టుబాటు అయ్యేలా సమగ్ర కూలీ చట్టం తీసుకువచ్చి కూలీల జీవితంలో పాలకులు వెలుగు నింపాలి.

– గుర్రం రాంమోహన్ రెడ్డి



వాహ్! ఉస్తాద్..!!


రెండు తబలాలపై
వినసొంపుగా
నాట్యమాడే ఆ వేళ్ల నెమళ్లు

ఎగిసెగిసి పడే హోరుగా
కంటికింపుగా
కదిలే జులపాల కెరటాలు

స్వరస్వర్గాలను
మనముందరే దించిన
జంత్రమాంత్రికుని
మూడు గుండెలు

మూగవోయినా
సుస్వరయాత్ర
సాగుతూనే ఉంది.

కవీ! ఎందుకా వ్యర్థప్రయత్నం
ఆ శబ్ద ఝరీగమనంలో
నీ మాటల ముఖాలు
చూసుకోవాలని

అజరామరమైన
ఆ నెమళ్లింకా

తబలాలపై
కనులముందు
ఆడుతూనే ఉన్నాయి

అశ్రువులు
వాహ్ ఉస్తాద్.. అల్విదా
అని చెబుతున్నా
చెవులింకా...
అబద్ధమనే అంటున్నాయి.

– మడిపల్లి రాజ్‌కుమార్

మీ కోసం ఆదివాసీలు నిర్వాసితులు కావాలా?

> పాలక వర్గాలు ఒకవైపు దేశంలోని విశాలమైన అడవులలోని విలువైన సంపదను తరలించుకుపోవడానికి పూనుకుంటూనే, అందుకు వ్యతిరేకంగా ప్రబలుతున్న ప్రజా నిరసనను నిర్దాక్షిణ్యంగా అణచివేయడానికి వీలుగా ముందునుంచే భారతసైన్యాలకు గెరిల్లా యుద్ధతంత్రంలో శిక్షణను అందిస్తున్నాయి.



భారతసైన్యాలు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణ్‌పూర్ జిల్లా, మాడ్ (ప్రభుత్వం, మీడియా 'అబూజ్‌మాడ్' అనడం పట్ల మాకు అంగీకారం లేదు) ప్రాంతాన్ని తమ బలగాల సైనిక శిక్షణ కోసం కైవసం చేసుకోవడానికి ఎడతెరిపి లేకుండా ప్రయత్నిస్తున్నాయి. భారత సైన్యాలు కోరుతున్న ప్రాంతం దాదాపు 55 వేల హెక్టార్ల అటవీ, జనావాస, పంట భూముల ప్రాంతం (1,34,778 ఎకరాలు). ఇది మాడ్ నడిగడ్డన సోన్‌పూర్ నుంచి గార్స మధ్య గల ప్రాంతం. వారు నిర్దిష్టంగా కోరుతున్న ప్రాంతం అదే అయినప్పటికీ దానికి అనేక రెట్లకు పైగా గ్రామ పంచాయతీల పరిధిలోని భూభాగాన్ని ఖాళీ చేయించడానికి ఆగమేఘాల మీద సర్వే పనులు జరుగుతున్నాయి. 72 గ్రామాలు ఖాళీ చేయాలనే తాఖీదులు చేరుతున్నాయి. ఈ ప్రాంతంలోని ప్రజలకు దూరంగా ఎక్కడో పునరావాసం కల్పిస్తామని అంటున్నారు. కానీ, మాడ్ కొండలలోని బాధిత ప్రజలు మాత్రం తమ అడవులను, భూములను వదలడానికి సిద్ధంగా లేరు. వారు ఇప్పటికే సంబంధిత అధికారులకు విన్నపాలను వినిపించుకుంటున్నారు. కానీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందుకు ఎంతమాత్రం సిద్ధంగా లేవని వాటి వైఖరి తెలుపుతోంది.

2024 జనవరి నుంచి మొదలై మాడ్‌తో సహా యావత్ దండకారణ్య ప్రాంతంలో కొనసాగుతున్న ఆపరేషన్ కగార్‌లో భాగంగా సైనిక దాడులతో రక్తసిక్తమవుతున్న అడవుల నుంచి ప్రజలను ఖాళీ చేయించే చర్యలను కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాయపూర్‌లో జరిపిన ఏడు మావోయిస్టు ఉద్యమ రాష్ట్రాల పోలీసు అధికారుల సమావేశం నేపథ్యంలో అర్థం చేసుకోవాలి. దేశంలో మావోయిస్టులను, మావోయిజాన్ని 2026 మార్చ్ నాటికి అంతమొందిస్తామని ఆ సమావేశం ప్రకటించింది. అందుకోసం ప్రస్తుత కగార్ దాడులను రెట్టింపు వేగంతో, తీవ్రతతో కొనసాగించాలనీ నిర్ణయించింది. ఈ దాడులను 'మాడ్ బచావో' కేంపెయిన్ పేరుతో కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. వారి లక్ష్యాన్ని చేరడానికి మాడ్ కొండలలో భారత సైన్యాల శిక్షణా శిబిరాన్ని ఏర్పాటు చేయడంతో పాటు, మాడ్ ప్రాంతం నుంచి ప్రజలను బలవంతంగా ఖాళీ చేయించే చర్యలను చేపడుతున్నారు. తిరిగి మూడేళ్లకు మీ ప్రాంతాలకు మీరు చేరుకుంటారనీ ప్రజలను మభ్య పెడుతున్నారు. భారత సైన్యాలు మావోయిస్టు ఆపరేషన్లలో పాల్గొనవని కేంద్ర హోంమంత్రి బుకాయిస్తున్నారు కానీ, ఇప్పటికే అనేక సంవత్సరాలుగా వేరు వేరు రూపాలలో భారత సైన్యాలు నక్సల్ వ్యతిరేక ఆపరేషన్‌లలో పాల్గొంటున్న విషయం బహిరంగ రహస్యమే.

కార్పొరేట్ వర్గాల ప్రయోజనాల కోసం వివిధ ప్రాజెక్టుల పేరుతో దేశంలో నిర్వాసితులైన వారిలో ఆదివాసీలే అధిక సంఖ్యలో ఉన్నారు. దండకారణ్యంలో 1970లలో చేపట్టిన కిరండాల్ తవ్వకాలతో పెద్ద ఎత్తున ఆదివాసీలు నిర్వాసితులయ్యారు. ఇంచుమించు అదే సమయంలో మార్దూంలో అత్యంత రహస్యంగా భారత రక్షణరంగ యూనిట్‌ను నిర్మించినపుడు ఆదివాసీలు నిర్వాసితులయ్యారు. 1980ల నాటికి మాడ్ కొండలపై నుండి ఆదివాసీలను మైదాన ప్రాంతాలకు తరమడానికి అన్ని సన్నాహాలు జరిగాయి. అడవుల నుంచి మనుషులను తరిమివేసి పులులను పెంచి పోషించే ప్రభుత్వ విధానాలతో 1980లలోనే వర్తమాన బీజాపుర్ జిల్లా నేషనల్ పార్క్ ఏరియా నుంచి పదుల గ్రామాలను ఖాళీ చేయించ పూనుకున్న పరిస్థితులలో ఆదివాసీలు సంఘటితంగా దానిని ఎదుర్కొన్నారు. తిరిగి ఇపుడు వారికి తమ గ్రామాలను ఖాళీ చేయాలనే ఆదేశాలు జారీ అయ్యాయి.

గత నాలుగేళ్ల నుంచి అనేక కార్పొరేట్ వర్గాల ప్రయోజనాల కోసం వేగంగా కొనసాగిస్తున్న గనుల తవ్వకాలతో బృహత్ బస్తర్‌లో, గడ్‌చిరోలీలో కాలుష్యం ప్రబలుతూ ప్రజల పంట భూములు వల్లకాడై పోతున్నాయి. జనావాసాలు నివాసయోగ్యం కాకుండా పోతున్నాయి. పచ్చని అడవులు నాశనమవుతున్నాయి. 2030 నాటికి గడ్‌చిరోలీ జిల్లాను పారిశ్రామిక జిల్లాగా మారుస్తామని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిండే ప్రకటించాడు. ఈ పరిణామాలతో ఈ ప్రాంతాలలోని ఆదివాసీలు ఏ పట్టణాలకో, ఏ నగరాలకో, ఏ మురికివాడల జీవితాలకో బలి కానున్నారు.

చాలా బాధాకరమైన విషయం ఏమంటే, ఈ ప్రాంతాలలోని ఆదివాసీ తెగలు భారత రాజ్యాంగం ప్రకారం అంతరించిపోతున్న తెగల జాబితా లోకి వస్తారు. కార్పొరేట్ల ప్రయోజనాల కోసం ఆదివాసీల జీవితాన్ని పణంగా పెడుతూ వారి అస్తిత్వాన్నే ధ్వంసం చేస్తున్నారు.

గతంలో ఫాసిస్ట్ సల్వాజుడుం సమయంలో సుక్మా, దంతెవాడ, బీజాపుర్ జిల్లాల్లోని వేలాదిమంది ప్రజలను తమ అడవుల నుంచి, గ్రామాల నుంచి తరిమి 'సహాయశిబిరాల' పేరుతో రోడ్డుపక్కన నిర్మించిన 'షెల్టర్'లలోకి తరలించారు. ఆ షెల్టర్లన్నీ నరక కూపాలే. వాస్తవంగా అవన్నీ కాన్‌సెంట్రేషన్ క్యాంపులే. అక్కడ ప్రజలకు ఎలాంటి అవకాశాలు ఉండవు. మహిళల జీవితాలలో కనీస భద్రత కరువైంది. అడవులలో స్వేచ్ఛగా తిరుగుతూ తమ దైనందిన అవసరాలను తీర్చుకునే ఆదివాసీలకు 'సహాయ శిబిరాల' జీవితాలు మృత్యు కుహరాల్లాంటివే. బలవంతంగా ఆ శిబిరాలకు తరలించబడిన ప్రజలు అక్కడ ఉండలేక వివిధ రూపాలలో తిరిగి తమ అడవులకు, గ్రామాలకు చేరుకున్నారు. వారికి విప్లవోద్యమంతో సహా అనేకమంది ప్రజాస్వామికవాదులు, ఆదివాసీ శ్రేయోభిలాషులు సహకరించారు.

"1950లో భారతదేశ ప్రజాస్వామ్యానికి నైతిక పునాది అయిన భారత రాజ్యాంగాన్ని పార్లమెంటు ఆమోదించిన రోజు నిజానికి ఆదివాసులకు దురదృష్టకరమైన రోజు. రాజ్యాంగం వలస విధానాన్నే స్థిరీకరిస్తూ ఆదివాసుల నివాస ప్రాంతాలకు రాజ్యం సంరక్షకురాలిగా ఉంటుందని తేల్చింది. ఉన్నట్టుండి మొత్తం ఆదివాసీ సమూహాలన్నింటినీ వాళ్ల సొంత నేల మీదే పరాయివాళ్లను చేసింది. అటవీ ఉత్పత్తుల మీద వారి సంప్రదాయ హక్కును నిరాకరించి వారి జీవన విధానాన్నే నేరమయం చేసింది. ఓటుహక్కుకు బదులుగా, వాళ్ల జీవించే హక్కును, ఆత్మగౌరవాన్ని లాగేసుకుంది" – అని అరుంధతీరాయ్ 'వాకింగ్ విత్ కామ్రేడ్స్' పుస్తకంలో సరిగ్గా వ్యాఖ్యానించారు.

ప్రస్తుతం మాడ్ కొండలలోని ప్రజలు కోరుతున్నదేమిటి? వారు తమ 'కొండలను ఖాళీ చేయం' అంటున్నారు. వారు తమ భూములను వదలం అంటున్నారు. తమ అడవులను కాపాడుకోవాలంటున్నారు. ప్రకృతి వనరులను దేశం కోసం, ప్రజల కోసం, భవిష్యత్ తరాల కోసం నిలుపుకోవాలంటున్నారు. మాడ్ కొండలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన అన్ని చర్యలను తక్షణం నిలిపివేయాలని కోరుతున్నారు. మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్‌లలో భారత సైన్యాలు పాల్గొంటాయా, లేదా అనేది వేరే విషయం. దానితో, ఈ అంశాన్ని ముడిపెట్టడం ప్రభుత్వాల మోసకారి విధానమే అవుతుంది.

మధ్య భారత అడవులలో భారత సైన్యాల శిక్షణా శిబిరం ఏర్పాటును ఒక దీర్ఘదృష్టితో వ్యూహాత్మక పథకంతో రూపొందిస్తున్నారు. గత అనేక సంవత్సరాలుగా ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన పాలకవర్గాలు దానినుంచి బయటపడడానికి ఒకవైపు దేశంలోని విశాలమైన అడవులలోని విలువైన సంపదలను తరలించుకుపోవడానికి పూనుకుంటూనే, అందుకు వ్యతిరేకంగా ప్రబలుతున్న ప్రజా నిరసనను నిర్దాక్షిణ్యంగా అణచివేయడంలో భాగంగా ముందునుంచే భారత సైన్యాలకు గెరిల్లా యుద్ధ తంత్రంలో శిక్షణను అందిస్తున్నారు. అనేక దేశాలలో ప్రజలు సంక్షోభాలకు వ్యతిరేకంగా వెల్లువెత్తుతున్నారు. వర్తమాన పరిస్థితులలో అలాంటి వెల్లువ భారతదేశంలో కూడా సంభవించడానికి పూర్తి అవకాశాలున్నాయని గ్రహించే ఇలాంటి ముందస్తు చర్యలకు దిగుతున్నారు. ఇలాంటి పరిస్థితులలో, దేశంలోని సమస్త ప్రగతిశీల శక్తులు, విద్యార్థి, మేధావి, కార్మిక, కర్షక శక్తులు, రచయితలు, కళాకారులు మాడ్ ప్రజల న్యాయమైన అస్తిత్వ సమస్యను సమర్థిస్తూ వారికి అండగా నిలువాలనీ, మాడ్ కొండలలో భారత సైన్యాల శిక్షణా శిబిరాన్ని రద్దు చేయడానికి ఉద్యమించాలనీ మా విన్నపం.

■ కురుసం శంకర్
ఆదివాసీ రచయితల, కళాకారుల ఐక్య వేదిక
(బస్తర్–గడ్‌చిరోలీ)

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY హనుమకొండ HANUMAKONDA
బుధవారం 18 డిసెంబరు 2024

లీగల్ సెల్‌తో కబ్జాలకు చెక్

కేయూ ఆక్రమిత భూములపై ప్రత్యేక కార్యాచరణ

- పాలక మండలి సమావేశంలో భూముల రక్షణపై చర్చ
- కేయూ లీగల్ సెల్‌కు మరిన్ని అధికారులు
- ప్రత్యేక న్యాయవాదుల నియామకానికి పచ్చజెండా
- ఇప్పటికే రూ.5కోట్ల వర్సిటీ భూములు పరాధీనం
- విజిలెన్స్ విచారణ ఆలస్యం కావడంపై అసంతృప్తి
- భూములను కాపాడేందుకు నడుంబిగించిన ఉన్నతాధికారులు



కేయూ క్యాంపస్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ అక్రమిత భూములను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు వర్సిటీ నడుం బిగించింది. అక్రమార్కుల కబంధ హస్తాల్లోంచి వర్సిటీ భూములను తిరిగి న్యాయపరంగా సాధించుకునేందుకు ప్రత్యేక నజర్ పెట్టింది. ఇటీవల రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, వర్సిటీ పాలక మండలి సభ్యులు వర్సిటీ అక్రమిత భూములను తిరిగి సాధించుకోవడంతో పాటు ఉన్నవాటికి రక్షణపై సుదీర్ఘంగా చర్చించారు. భూములను కాపాడేందుకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేయాలని వర్సిటీ ఉన్నతాధికారులను ఆదేశించారు. వర్సిటీ లీగల్ సెల్‌ను పకడ్బందీగా రూపొందించడంతో పాటు వర్సిటీ భూముల వ్యవహారాలను చూసేందుకు మరొక అడ్వకేట్‌ను నియమించుకునేందుకు పచ్చజెండాను ఊపింది. దీంతో వర్సిటీ భూములను చెరపట్టిన భూ బకాసురుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

రోజు రోజుకూ మాయం

వర్సిటీలో రోజు రోజుకూ విద్యార్థుల సంఖ్య పెరగడంతో పాటు ఆధునాతన కోర్సులను అందుబాటులోకి తెచ్చేందుకు వర్సిటీ అధికారులు ముందుకు వచ్చారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ వర్సిటీలను బలోపేతం చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు సబ్బండ వర్గాలకు ఉన్నత విద్యను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. అయితే పెరుగుతున్న వర్సిటీ అవసరాల దృష్ట్యా వర్సిటీకి ఇప్పుడున్న భూమితోపాటు మరింత భూమి అవసరమయ్యే పరిస్థితి నెలకొంది. వాస్తవానికి 1976లో కేయూ ఏర్పడినప్పుడు అప్పటి ప్రభుత్వం తాత్కాలిక అవసరాల రీత్యా 600పై చిలుకు ఎకరాల భూమిని సేకరించి వర్సిటీకి ఇచ్చింది. అప్పుడు నక్సలైట్ ఉద్యమ ప్రభావంతో వర్సిటీలోనే పోలీస్‌స్టేషన్‌తో పాటు సీఆర్‌పీఎఫ్ క్యాంపునకు పోలీసులకు కొంత వర్సిటీ భూమిని ఉచితంగా కేటాయించారు. దీంతో పాటు వరంగల్ ఆల్ ఇండియా రేడియో స్టేషన్‌కు వర్సిటీ క్యాంపస్ భూమినే కేటాయించారు. వర్సిటీ మొదటి గేటు ప్రాంతంలోని డబ్బాల రోడ్డులో రోడ్డు వెడల్పులో చాలా భూమిని వర్సిటీ కోల్పోయింది. అలాగే ఎస్ఆర్ఎస్పీ కాలువ నిర్మాణంతో అనేక ఎకరాల వర్సిటీ విలువైన భూములు ఆవిరయ్యాయి. అలాగే అక్రమార్కుల చేతుల్లో భూములు హాంఫట్ అవుతున్నాయి.

రూ.5కోట్ల వర్సిటీ భూముల్లో అక్రమణలు

కాకతీయ యూనివర్సిటీలో సుమారు రూ.5కోట్ల విలువ చేసే భూమి అప్పనంగా రాజకీయ నేతలు, పలుకుబడిన కలిగిన పోలీసు అధికారులు, అలాగే వర్సిటీలోనే పనిచేసే సిబ్బంది అక్రమణలకు పాల్పడ్డారు. వర్సిటీలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర విజిలెన్స్ అధికారుల సర్వేల్లో భూముల దురాక్రమణల విషయం వెల్లడైంది. జిల్లా రెవెన్యూ, వరంగల్ మున్సిపల్, పోలీసు, విజిలెన్స్ బృందాలు సంయుక్తంగా వర్సిటీలో చోటు చేసుకున్న అవినీతి అక్రమాలు, అధికార ప్రీతిని వెలికితీస్తున్నాయి.

ప్రత్యేక కార్యచరణ

విజిలెన్స్ విచారణ ఉండగానే వర్సిటీ భూములపై రక్షణపై వర్సిటీ పాలక మండలి ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. రూ.5కోట్ల విలువ చేసే వర్సిటీ భూమిని కాపాడేందుకు రూ.5లక్షలు వర్సిటీ నుంచి న్యాయపరంగా వెచ్చించలేమా? అని

మిగతా 6వ పేజీలో...

విజిలెన్స్ విచారణలో జాప్యం

వర్సిటీ భూముల చెర వ్యవహారంలో వర్సిటీ పాలక మండలి కార్యాచరణ ప్రకటించిన నేపథ్యంలో గతంలో రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేసిన విజిలెన్స్ విచారణ ఆగిపోవడంపై వర్సిటీలో పలు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. వర్సిటీ న్యూబాయ్స్ హాస్టల్స్ ప్రాంతంలోని సర్వే నెంబర్ల ఆధారంగా కేయూ డెవలప్‌మెంట్ అధికారులు రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి ఫిజికల్ సర్వే చేశారు. సర్వేలో వర్సిటీలో పనిచేసే పలువురు ఇళ్లు ఉన్నట్లు నిర్ధారణ చేశారు. అలాగే గుండ్ల సింగారంలో ప్రధాన రహదారి సైతం వర్సిటీ భూమిలోనే ఉన్నట్లు విజిలెన్స్ విచారణలో తెలింది. ఇదిలా ఉండగా, గత కొంత కాలం నుంచి వర్సిటీలో మిగిలిన సర్వే నెంబర్లలో ఫిజికల్ సర్వే చేసేందుకు రెవెన్యూ, మున్సిపల్ అధికారులు రావడం లేదని వర్సిటీ అధికారులు చెబుతున్నారు. కావాలనే రావడం లేదా..? లేకపోతే ఇందులో ఏదైనా మర్మం ఉందా..? అనే చర్చ వర్సిటీ వర్గాల్లో జోరందుకుంది.

ప్రతీ డివిజన్‌కు రూ.30లక్షలు

- పనుల కోసం కార్పొరేటర్లకు కేటాయింపు
- బల్దియా అధికారులతో మేయర్ సుధారాణి



అధికారులతో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలోని 66 డివిజన్‌లలో వివిధ అభివృద్ధి పనులు నిర్వర్తించేందుకు ఒక్కో డివిజన్‌కు రూ.30లక్షలు కేటాయిస్తున్నట్లు వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి తెలిపారు. మంగళవారం బల్దియా కార్యాలయంలో బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో పాటు వివిధ విభాగాల అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేసి మాట్లాడారు. 66 డివిజన్‌ల కార్పొరేటర్లకు ఈ నిధులు మంజూరు చేస్తామన్నారు. డివిజన్‌లలో నెలకొన్న సమస్యలను గుర్తించి త్వరితగతిన పనులు నిర్వర్తించి నిధులు ఖర్చు చేయాలని సూచించారు. అలాగే పనులు పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు. అదే విధంగా క్రిస్మస్ పండగ పర్వదినం సందర్భంగా వరంగల్ నగర వ్యాప్తంగా ఏర్పాట్లు పక్కగా జరగాలని చెప్పారు. గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో 105 చర్చిలు ఉన్నాయని, చర్చిలలో విద్యుత్ అలంకరణ అందంగా ఉండేలా అధికారులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో రాజారెడ్డి, హెచ్‌వో రమేష్, ఇంచార్జ్ సిటీ ప్లానర్ రవీంద్ర రాడేకర్, ఎంహెచ్‌వో రాజేశ్, ఈఈలు మహేందర్, సంతోష్, శ్రీనివాస్, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వినయ్‌భాస్కర్

పేదల భూములు లాక్కునేందుకు
కాంగ్రెస్ కుట్ర

- లగచర్ల రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలి
- మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయభాస్కర్
- అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం

హనుమకొండ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): కేసీఆర్ ప్రభుత్వంలో రైతుల సంక్షేమానికి కృషి చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం పేద రైతుల భూములను లాక్కోవాలని చూస్తోందని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ ఆరోపించారు. మంగళవారం బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు లగచర్ల రైతులపై పెట్టిన అక్రమ కేసులను ప్రభుత్వం ఉపసంహరించుకుని రైతులను జైలు నుంచి విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. దేశానికి అన్నంపెట్టే రైతన్నలను అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు. రేవంత్‌రెడ్డి తన అల్లుడి కోసం లగచర్ల రైతులపై అక్రమ కేసులు నమోదు చేశాడన్నారు. రైతులకు అండగా బీఆర్ఎస్‌పార్టీ ఉంటుందని, రైతుల పక్షాన పోరాటం చేస్తామన్నారు. రైతు రుణవిమోచన కమిషన్ మాజీ ఛైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం లగచర్ల రైతులపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపిందని విమర్శించారు. రైతుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజాక్షేత్రంలో నిలదీస్తామన్నారు. రైతులకోసం ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెడుతున్నారని విమర్శించారు. రైతుల చేతిలో సీఎం రేవంత్‌రెడ్డికి గుణపాఠం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్, బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు లలితాయాదవ్, కార్పొరేటర్ సోదా కిరణ్, మాజీ కార్పొరేటర్‌లు కుసుమ లక్ష్మీనారాయణ, జోరిక రమేష్, మేకల బాపురావు నయీముద్దీన్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నాయినికి..
ఉపసభాపతి?

ఉమ్మడి జిల్లా నుంచి మరో కీలకపదవి

- అసెంబ్లీ, పార్టీ వ్యవహారాల్లో చురుగ్గా ఉంటున్న నేపథ్యంలో సీఎం మొగ్గు
- రాజకీయంగా క్రియాశీలకంగా ఉండే పదవి కోరుతున్న రాజేందర్‌రెడ్డి
- చీఫ్‌విప్ లేదా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోసం అధిష్ఠానంపై ఒత్తిడి
- శాసనసభ సమావేశాల ముగిసిన అనంతరమే స్పష్టత

వరంగల్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి శాసనసభ ఉపసభాపతి పదవి దక్కే అవకాశాలున్నాయనే ప్రచారం జరుగుతోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత అటు పార్టీ వ్యవహారాలతో పాటు అసెంబ్లీలో విపక్షాల తీరును ఎండగడుతూ సమర్థవంతంగా ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల్లో నాయిని మొదటి వరుసలో ఉన్నట్లు కాంగ్రెస్ అధిష్ఠానం భావిస్తోంది. పాతికేళ్లకు పైగా కాంగ్రెస్‌లో వివిధ పదవులు నిర్వహించి, 11ఏళ్లకు పైగా డీసీసీ అధ్యక్షుడిగా పని చేసిన నాయిని రాజేందర్‌రెడ్డికి పార్టీ పట్ల ఉన్న విధేయతకు తగిన గుర్తింపు ఇవ్వాలని అటు అధినాయకత్వం.. ఇటు సీఎం యోచిస్తున్నట్లు సమాచారం. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఎన్నికైన ఎమ్మెల్యేల్లో చాలా మంది వివిధ పార్టీలు నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చినవారే అధికంగా ఉన్నారు. ఇప్పటికే ఎస్టీ, బీసీ వర్గాల నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఇద్దరు మహిళలను మంత్రి వర్గంలోకి తీసుకున్నారు. ఎస్సీ ఓసీ ఎమ్మెల్యేలకు అవకాశం ఇవ్వాల్సి ఉందనే చర్చ జరుగుతున్న నేపథ్యంలో స్పీకర్‌గా ఎస్సీ సామాజిక వర్గం నుంచి గడ్డం ప్రసాద్ ఉండటంతో డిప్యూటీగా ఓసీ సామాజిక వర్గం నుంచి నాయినికి అవకాశం ఇచ్చే అవకాశాలున్నాయనే చర్చ జరుగుతోం ది. తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ విపక్షాలను ఎదుర్కొనడంలో మంత్రులకు దీటుగా రాజేందర్ రెడ్డి దూకుడుగా వ్యవహరి స్తుండటంతో డిప్యూటీ సీట్లో కూర్చోబెట్టడం ద్వారా

మిగతా 6వ పేజీలో...

అసెంబ్లీలో రాజేందర్ రగడ!

- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వెయ్యి కోట్లు సంపాదించారని ఆరోపణలు
- నాయిని వాఖ్యలపై గులాబీనేతల అభ్యంతరం.. స్పీకర్‌కు ఫిర్యాదు
- ప్రివిలేజ్ మోషన్‌పై చర్చకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పట్టు
- వెయ్యి కాదు.. పది వేల కోట్లు అక్రమంగా సంపాదించారంటూ నాయిని ఎటాక్

6

కేయూ రిటైర్డు ప్రొఫెసర్ల సమస్యలను పరిష్కరించాలి

- కుర్తా అధ్యక్ష, కార్యదర్శులు ప్రొఫెసర్ సదానందం, రవీందర్‌ల డిమాండ్

6

హద్దు దాటొద్దు..

- సోషల్ మీడియాతో జాగ్రత్తలు అవసరం
- తప్పుడు పోస్టులు చేస్తే చర్యలు తప్పవు

8

వసతి గృహాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి

అధికారుల సమీక్షలో వరంగల్ కలెక్టర్ సత్యశారద



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, డిసెంబరు 17: (ఆంధ్రజ్యోతి): వసతి గృహాల నిర్వహణపై సంబంధిత అధికారులు, వార్డెన్లు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వసతిగృహాల్లో నూతన ఏకరీతి ఆహార ప్రణాళిక పక్కాగా అమలు జరగాలన్నారు. ప్రతీ విద్యార్థికి ఆరోగ్యచార్ట్, వైద్య శిబిరం ఏర్పాటు చేయాలన్నారు. వసతి గృహాల్లోని విద్యార్థులకు అవసరమయ్యే నోట్‌బుక్స్, పుస్తకాలు, బ్లాంకెట్లు అందించాలని సూచించారు. పదో తరగతి పరీక్షలు సమీక్షిస్తున్న నేపథ్యంలో ప్రణాళికాబద్ధంగా పాఠ్యాంశాల వారీగా విద్యార్థులకు బోధించి 100శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలన్నారు. కాకతీయ టెక్స్‌టైల్ పార్కు, విమానాశ్రయం ఏర్పాటు, ఇన్నర్ రింగ్ రోడ్, నేషనల్ హైవే గ్రీన్ కారిడార్ తదితర అంశాలపై సంబంధిత అధికారుతో సమావేశం నిర్వహించి నిర్దేశిత గడువులోగా లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. అంతకుమందు క్రిస్మస్ పండగను పురస్కరించుకొని జిల్లా మైనార్టీ శాఖ అధికారి రమేశ్ ఆధ్వర్యంలో క్రిస్మస్ కేక్ కట్ చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, వరంగల్, నర్సంపేట ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్, జిల్లా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ సంక్షేమ శాఖ అధికారులు, ఆర్‌సీఓలు, డీసీవోలు, డీఎస్‌డీవోలు, వసతి గృహాల సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.



నాడు తప్పు.. నేడు ఒప్పా?

రాజకీయ దుమారం రేపుతున్న 'ఆజంజాహి' వ్యవహారం

- గతంలో కార్మికుల భూమి సంరక్షణకు హామీ ఇచ్చిన కొండా మురళి
- ఇప్పుడు షాపింగ్ కాంప్లెక్స్‌కు భూమి పూజకు హాజరు
- ఏడాదిన్నరలో ఏం జరిగిందంటూ ప్రతిపక్షాల మండిపాటు
- కార్మికుల పక్షాన పోరాటానికి సిద్ధమైన బీజేపీ, బీఆర్ఎస్, సీపీఎం పార్టీలు

6

దళారులను ఆశ్రయించొద్దు..

పారదర్శకంగా రవాణా శాఖ సేవలు

ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పుప్పాల శ్రీనివాస్



ఫటా.. ఫట్

ఆంధ్రజ్యోతి : ఉమ్మడి వరంగల్‌లో ఎన్ని వాహనాలున్నాయి? సేవల కోసం రోజూ ఎంత మంది వస్తుంటారు.?

డీటీసీ : జనగామ మినహా వరంగల్, హనుమకొండ, ములుగు, మహబూబాబాద్, భూపాలపల్లి మొత్తం కలిపి 10,64,387 వాహనాలున్నాయి. అందులో 70శాతం మేరకు ద్విచక్రవాహనాలు ఉంటాయి. ఆయా జిల్లాల ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాలకు రోజు సుమారు 1000 నుంచి 1200 మంది వాహనదారులు వివిధ సేవల కోసం వస్తుంటారు.

ఆంధ్రజ్యోతి : వాహనదారులకు అందించే ఆర్‌సీ, డ్రైవింగ్ కార్డుల కొరత ఉందని తెలిసింది నిజమేనా?

డీటీసీ : కొరత ఏమీ లేదు. ఎప్పటికప్పుడు కార్డులను తెప్పిస్తుంటాం. పోస్టల్ అడ్రస్‌కు పంపిన వాటిలో కొన్ని అడ్రస్‌లో లేక తిరిగి వస్తుంటాయి. దీంతో వేల కార్డులు కార్యాలయాల్లో ఉన్నాయి. కార్డులు రాని వారు దరఖాస్తు చేసుకున్న రిసిప్ట్, ఆధార్ కార్డు చూపి కార్డులు తీసుకువెళ్లాలి.

ఆంధ్రజ్యోతి : వాహనదారులకు ప్రస్తుతం ఎన్ని సేవలు అందుబాటులో ఉన్నాయి?

డీటీసీ : మొత్తం 74 సేవలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. ఈ సేవలు పొందేందుకు టీయాప్ పోలియో యాప్‌తో పాటు కొత్తగా మీసేవా అనే మొబైల్ యాప్ కూడా అందుబాటులోకి వచ్చింది. దీనిలో 13 రకాల సేవలు పొందొచ్చు.

ఆంధ్రజ్యోతి : కాలం చెల్లిన వాహనాలను ఎం చేస్తారు?

డీటీసీ : జిల్లా ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయానికి దరఖాస్తు చేసుకుంటే ఎంవీఐ వచ్చి పరిశీలిస్తారు. ఆ తర్వాత ఛాసిస్ నెంబర్ వరకు గ్యాస్ కట్టర్‌తో కట్ చేపించి ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంలో అప్పగిస్తే వాహన యాజమానిగా అతడి పేరు తొలిగిస్తారు. అనుమతులు లేకుండా స్క్రాప్‌కు అప్పగిస్తే చిక్కులే. కొత్తగా కొనే వాహనంపై 2 శాతం జీఎస్టీ భరించాల్సి వస్తుంది.

ఆంధ్రజ్యోతి : రోడ్డు భద్రతా నియామాల గురించి ఏ విధంగా అవగాహన కల్పిస్తున్నారు.

డీటీసీ : రోడ్డు భద్రత నిబంధనలపై విద్యాసంస్థల్లో అవగాహన కల్పిస్తున్నాం. రోడ్డు భద్రత నిబంధనలు ఉల్లఘించే వాహనదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. నిబంధనలను అతిక్రమించి వైట్‌నెంబర్ ప్లేట్ వాహనాల్లో ప్రయాణికులను తరలిస్తే చర్యలు తప్పవు.

- వరంగల్ క్రైం

వ్యాపార పరిశ్రమలకు అనుగుణంగా స్కిల్స్ పెంచుకోవాలి



మాట్లాడుతున్న ప్రముఖవిద్యావేత్తలు శివప్రసాద్, పాండురంగరావు, రాజేశం

కేయూ క్యాంపస్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మారుతున్న ప్రపంచీకరణకు అనుగుణంగా వస్తున్న పెనుమార్పులను ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులు ఎప్పటికప్పుడూ అవగాహన చేసుకుని స్కిల్స్‌ను పెంపొందించుకోవాలని ప్రముఖ విద్యావేత్త, ఎథిక్ కేరీర్ గైడెన్స్ ఫౌండర్ ఛైర్మన్ లైఫ్ కోచ్, సైకాలజిస్టు గూడెల్లి శివప్రసాద్ అన్నారు. మంగళవారం హనుమకొండ న్యూ సైన్స్ పీజీ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చింతకింది రాజేశం అధ్యక్షతన ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్, కేరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ హాజరై మాట్లాడారు. మారుతున్న ప్రస్తుత ప్రంచీకరణ ప్రక్రియలో వర్తక వ్యాపార పారిశ్రామిక రంగాల్లో వస్తున్న పెను మార్పులకు అనుగుణంగా తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని అన్నారు. ప్రపంచంలోని వర్తక వ్యాపార సంస్థల, బీజినెస్ గ్లోబల్ రీడర్ల సక్సెస్‌ను ఉదాహరణతో చెబుతూ విద్యార్థులకు ఉత్సాహపరిచారు. యువత ఉజ్వల భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలని సూచించారు. విద్య, ఉద్యోగాల స్కిల్స్ లోపాలను సవరించుకోవాలని అన్నారు. ప్రస్తుత పారిశ్రామిక విధానాలకు అనుగుణంగా నడుచుకోవాలని కోరారు. వరంగల్ ఎన్ఐటీ రిటైర్డు ప్రొఫెసర్, సాధన ఎడ్యుకేషన్ సొసైటీ ఛైర్మన్ ప్రొఫెసర్ ఎం.పాండురంగరావు తన సుదీర్ఘమైన జీవిత అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. సక్సెస్‌కు దగ్గరి దారి ఏమీ లేదని, కష్టపడి ముందుకుసాగడమేనని అన్నారు. ఉజ్వల భవిష్యత్‌కు క్రమబద్ధంగా ముందుకుసాగాలని సూచించారు. ఈ సదస్సులో న్యూసైన్స్ కళాశాలల డైరెక్టర్ ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ అహ్మద్ ఖాన్‌లు విద్యార్థులకు కళాశాలలో అందుబాటులో ఉన్న సౌకర్యాలను వివరించారు. ఉద్యోగాలు సాధించుకోవాలని అన్నారు. ప్రిన్సిపాల్ చింతకింది రాజేశం మాట్లాడుతూ.. మంచి ఉద్యోగాలకు ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు ఉత్తమని పేర్కొన్నారు. జీవితంలో త్వరగా స్థిరపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నాడు తప్పు.. నేడు ఒప్పా?

రాజకీయ దుమారం రేపుతున్న 'అజంజాహి' వ్యవహారం



మిల్లు కార్మికుల స్థలంలో సోమవారం వస్త్రవ్యాపారి కడుతున్న భవనం భూమి పూజకు హాజరైన మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు

వరంగల్ సిటీ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నాడు.. మిల్లు కార్మికుల భూమిని కబ్జా చేస్తే సహించేది లేదన్నవారు.. నేడు కబ్జా చేసిన వారితోనే కలిసి భవన నిర్మాణానికి భూమి పూజ చేయడంపై విమర్శలు వస్తున్నాయి. నాడు తప్పు అయింది.. నేడు ఒప్పు ఎలా అవుతుందని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. ఈ మధ్య కాలంలో ఏం జరిగి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నాయి. వివరాల్లోకి వెళితే..

వరంగల్ ఆజంజాహి మిల్లు కార్మికులు 1944లో చందాలు వేసుకుని వెంకట్రామా థియేటర్ సమీపంలో 12 గుంటల భూమి కొనుగోలు చేసి అందులో యూనియన్ భవనాన్ని నిర్మించుకున్నారు. కాలక్రమేణా అందులో కొంత భూమి రోడ్లకింద పోగా, మరి కొంత కాబ్జాకు గురైంది. ప్రస్తుతం సుమారు 500 నుంచి 600 గజాలు మాత్రమే మిగిలింది. ఇపుడు దాని విలువ సుమారు రూ.20 కోట్ల వరకు ఉంటుంది. కొంతకాలానికి మిల్లు మూత పడడంతో 320 మంది కార్మికులు వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నారు. తర్వాత వారిలో కొందరు చనిపోగా మరికొందరు చెట్టుకొక్కరు పుట్టకొక్కరు అన్నట్లు వెళ్లిపోయారు. విగిలినవారు అప్పుడప్పుడు అందులో సమావేశాలు నిర్వహించుకునేవారు. 2010 తరువాత అది కూడా తగ్గింది. దీంతో ఆ స్థలంపై కొందరి కన్ను పడింది. తప్పుడు పత్రాలు సృష్టించి సదరు భూమిని తమ పేరిట మార్చుకున్నారు.

ఆ తరువాత ఓ వస్త్ర వ్యాపారికి దాన్ని అమ్మేశారు. అనంతరం 2023లో ఆ వ్యాపారి యూనియన్ భవనాన్ని కూల్చివేసేందుకు ప్రయత్నిం చాడు. విషయం తెలుసుకున్న ప్రజాసంఘాలు, రాజకీయ నాయకులు ఖండించారు. మవోయిస్టులు సైతం ఆ భూమి జోలికి వెళ్లొద్దంటూ అప్పటి ఎమ్మెల్యేతో పాటు వస్త్ర వ్యాపారికి లేఖలు రాశారు. అదే సమ యంలో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు కూ డా మిల్లు కార్మికులకు అండగా ఉండి న్యాయం చే స్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా నాటి ఎమ్మె ల్యే తీరును మురళీధర్‌రావు కూడా ఖండించిన విషయాన్ని ప్రస్తుతం ప్రతిపక్షాలు గుర్తుచేస్తున్నాయి.

కట్‌చేస్తే..

నాడు భూ కబ్జాను వ్యతిరేకించిన మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు సుమారు ఏడాదిన్నర తర్వాత.. సోమవారం నాడు అదే వ్యాపారితో కలిసి నూతన భవన నిర్మాణానికి భూమి పూజలో పాల్గొన్నారు. ఇప్పుడీ విషయం నగరంలో హాట్ టాపిక్‌గా మారింది. కార్మికులకు ఇచ్చిన హామీలు నీటిమూటలేనా అని ప్రజా సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.

ప్రతిపక్షాలు, ప్రజా సంఘాల మద్దతు..

రూపాయి రూపాయి పోగేసుకుని కార్మికులు కట్టుకున్న యూనియన్ కార్యాలయాన్ని కబ్జా చేస్తుంటే ఊరుకునేది లేదని భారతీయ జనతా పార్టీ, బీఆర్‌ఎస్, సీపీఎం, సీపీఐ ప్రజా సంఘాలు ప్రతినిధులు హెచ్చరిస్తున్నారు. అన్ని రాజకీయ పార్టీలను, ప్రజా సంఘాలను కలుపుకుని జేఏసీగా ఏర్పడి పోరాడుతామని, కార్మికులకు న్యాయం చేస్తామని ప్రతిజ్ఞ చేస్తున్నారు.

అధికారం ఇచ్చింది ప్రజల ఆస్తులను దోచుకొమ్మని కాదు

బీజేపీ నాయకుడు, మాజీ మేయర్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, రాజేశ్వర్‌రావు

కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చింది ప్రజల ఆస్తులను కబ్జా చేయమని కాదని బీజేపీ నాయకుడు, మాజీ మేయర్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, నాయకులు వంగాల సమ్మిరెడ్డి, రత్నం సతీష్‌షా తది తరులు కూల్చివేసిన కార్యాలయ స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధికారపార్టీ అండదండల తోనే ఆ పార్టీ నాయకులు కబ్జాలు చేస్తు న్నారని ఆరోపించారు. వెంటనే ఆ స్థలాన్ని వదిలేసి కార్మికులకు క్షమాపణ చెప్పాలని, లేదంటే వరంగల్ ప్రజల ఆగ్రహం చవి చూస్తారని హెచ్చరించారు. కుడా, కార్పొరేషన్ అధికారులు వెంటనే స్పందించి భవన నిర్మాణానికి ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ దోపిడీ చేస్తోంది..

బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్



కాంగ్రెస్ పార్టీ ప్రజల ఆస్తులను దోపిడీ చేస్తోందని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆరోపించారు. ఈ విషయంలో గతంలో తమపై ఆరోపణలు చేశారని గుర్తు చేశారు. కార్మికుల స్థలం జోలికి పోతే బాగుండదని సదరు వ్యాపారిని హెచ్చరించామని, అప్పటి నుంచి ఇప్పటి వరకు దాని జోలికి ఎవరూ రాలేదని అన్నారు. ఇపుడు కాంగ్రెస్ నాయకులు వస్త్ర వ్యాపారితో కలిసి 320 మంది కార్మికుల పొట్టగొట్టి అందులో కాంప్లెక్స్ కట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. తాము కార్మికుల పక్షాన నిలబడుతామని, భవన నిర్మాణం ఎలా చేస్తారో చూస్తామని హెచ్చరించారు.

వస్త్రవ్యాపారిపై చర్యలు తీసుకోవాలి

ఆల్ ట్రేడ్ యూనియన్ డిమాండ్



ఆల్ ట్రేడ్ యూనియన్ సమావేశంలో మాట్లాడుతున్న నర్రా ప్రతాప్

మిల్లు కార్మికుల కార్యాలయాన్ని వస్త్ర వ్యాపారి కూల్చివేయడాన్ని ఆల్ ట్రేడ్ యూనియన్ నాయకులు ఖండించారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. ముందస్తు సమాచారం ఇవ్వకుండా కూల్చివేయడం నియంత ధోరణికి నిదర్శనమన్నారు. ఆ స్థలంలో ప్రభుత్వమే నూతన భవనం నిర్మాణం చేసి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్రా ప్రతాప్, ఇనుముల శ్రీనివాస్, ఎస్.బాబు, గంగుల దయాకర్, ఎం.డి.కాశీం తదితరులు పాల్గొన్నారు.

మిల్లు కార్మికుల స్థలాన్ని కాపాడాలి

సీపీఐ ఎంఎల్ లిబరేషన్ డిమాండ్

అజాంజాహి మిల్లు కార్మికులకు సంబంధించిన స్థలాన్ని కాపాడాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ డిమాండ్ చేసింది. మంగళవారం వారు యూనియన్ కార్యాలయ స్థలాన్ని సందర్శించిన అనంతరం మాట్లాడారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాగం స్పందించి కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి అక్కనపెల్లి యాదగిరి, ఎస్కె పాషా, శంకరాచారి, సదయ్య, రామచంద్రు పాల్గొన్నారు.



స్థలాన్ని సందర్శించిన ఎంసీపీఐ (యు)సీపీఎం నాయకుల బృందాలు

కార్మికుల భూమిని కాపాడాలి

ఎంసీపీఐ (యు), సీపీఎం నాయకుల డిమాండ్

మిల్లు కార్మికుల స్థలాన్ని కాపాడాలని సీపీఎం, ఎంసీపీఐ(యు) నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఎంసీపీఐ (యు), సీపీఎం నాయకులు సదరు స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. తక్షణమే కబ్జాదారులు ఆ స్థలాన్ని విడిచి వెళ్లాలని హెచ్చరించారు. లేదంటే కార్మికులను కూడకట్టి ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ రంగయ్య, ఎంసీపీఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దాపురం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీలో ఎమ్మెల్యే నాయిని రగడ!

రాజేందర్‌రెడ్డి వాఖ్యలపై గులాబీనేతల అభ్యంతరం.. స్పీకర్‌కు ఫిర్యాదు



ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిపై ఫిర్యాదు చేస్తున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని

వరంగల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): శాసనసభలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి చేసిన వాఖ్యలతో మంగళవారం దుమారం రేగింది. సభలో నిబంధనలకు విరుద్ధంగా నాయిని రాజేందర్‌రెడ్డి వాఖ్యలు ఉన్నాయని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం అసెంబ్లీలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఒక్కొక్కరు వెయ్యి కోట్లు సంపాదించారని ఆరోపణలు చేశారు. దీనిపై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు అభ్యంతరం వ్యక్తం చేశా రు. మంగళవారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిసి ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి వాఖ్యలపై ఫిర్యాదు చేశారు. ప్రివిలేజ్ మోషన్‌పై చర్చించాలని పట్టుబట్టారు. రూల్ 319 ప్రకారం సభ్యుడు ఇతర సభ్యులపై వ్యక్తిగత ఆరోపణలు చేయకూడదని, అసభ్యకరమైన వాఖ్యలు స్పష్టం చేస్తుందని, రూల్ 320 ప్రకారం స్పీకర్‌కు ముందస్తు సమాచారం లేకుండా ఎవరిపైనా అవహేళనాత్మకంగా లేదా దూషణల ఆరోపణలు చేయకూడదని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. నాయిని రాజేందర్‌రెడ్డి చేసిన వాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని విజ్ఞప్తి చేశారు. రికార్డులు పరిశీలిస్తానని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు స్పీకర్ హామీ ఇచ్చారు.

అయితే అసెంబ్లీ సమావేశాలు మొదలు కాగానే ఇదే అంశంపై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు నాయినిపై ఇచ్చిన ప్రివిలేజ్ మోషన్‌పై చర్చ జరగాలని పట్టుబట్టారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. అయితే ఆ తరువాత అసెంబ్లీలోని మీడియా పాయింట్ వద్ద నాయిని రాజేందర్‌రెడ్డి మరోసారి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలపై విరుచకపడ్డారు. అసెంబ్లీలో పొరపాటుగా మాట్లాడాను.. చలికాలం కావటం వల్ల వాళ్లకు 90శాతం డిస్కౌంట్ ఇచ్చినా.. వాళ్లు వెయ్యి కాదు.. పదివేల కోట్లు అక్రమంగా సంపాదించారని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ఆరోపణలు చేశారు. ఇదే విషయమై ఎమ్మెల్యే ఆంధ్రజ్యోతితో ఫోన్‌లో మాట్లాడారు. అసెంబ్లీలో ప్రివిలేజ్ మోషన్ అంటున్నారు.. ఇప్పుడు ప్రజాక్షేత్రంలోకి వాళ్ల పదేళ్ల పాలన, అక్రమ సంపాదనపై చర్చకు దమ్ముంటే రావాలని డిమాండ్ చేస్తున్నానని నాయిని రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు.

కేయూ రిటైర్డు ప్రొఫెసర్ల సమస్యలను పరిష్కరించాలి

- కుర్తా అధ్యక్ష, కార్యదర్శులు ప్రొఫెసర్ సదానందం, రవీందర్‌ల డిమాండ్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ సదానందం, రవీందర్ తదితరులు

కేయూ క్యాంపస్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ ఉద్యోగ విరమణ పొందిన ప్రొఫెసర్ల ఏరియర్స్ ఇతర బెనిఫిట్స్‌ను వెంటనే చెల్లించాలని కాకతీయ యూనివర్సిటీ రిటైర్డు ప్రొఫెసర్ల సంఘం (కుర్తా) అధ్యక్షకార్యదర్శులు ప్రొఫెసర్ ఎ.సదానందం, ప్రొఫెసర్ వడ్డె రవీందర్ డిమాండ్ చేశారు. మంగళవారం కేయూ సెనెట్ హాల్‌లో కేయూ రిటైర్డు ప్రొఫెసర్ల సంఘం నేతృత్వంలో పెన్షనర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సభకు అధ్యక్షత వహించిన ప్రొఫెసర్ ఎ.సదానందం, రవీందర్ మాట్లాడుతూ.. కేయూ వర్సిటీ అభివృద్ధిలో రిటైర్డు ప్రొఫెసర్ల కృషి మరవలేనిదని చెప్పారు. వర్సిటీ రిటైర్డు ప్రొఫెసర్ల సమస్యలను వర్సిటీ అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వర్సిటీలో పెన్షన్‌దారులకు ప్రతికూల పరిస్థితులున్నప్పటికీ రిటైర్డు ప్రొఫెసర్లందరూ ఉత్సాహంగా సమావేశంలో పాల్గొనడంపై ఆనందం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ప్రముఖ గుండె వైద్యుడు డాక్టర్ రామక శ్రీనివాస్ 'హృద్రోగం- జాగ్రత్తలు' అనే అంశంపై మాట్లాడారు. సీపీఆర్ బోధన, శిక్షణను తప్పనిసరి చేయాలని, వర్సిటీ గ్రాంట్ కమిషన్ దృష్టికి తీసుకుపోవాలని సూచించారు. వ్యక్తి చనిపోయే దశలో సీపీఆర్ కీలకమన్నారు. సీపీఆర్ పాఠశాల, కళాశాలల్లోనే అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సభలో న్యూఢిల్లీలోని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రిసెర్చ్ మాజీ ఛైర్మన్ ప్రొఫెసర్ వై.సుదర్శన్‌రావు మాట్లాడుతూ.. కేయూ వర్సిటీ క్యాంపస్‌లో ఆధునాతన పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ప్రొఫెసర్ ఎం.కిష్టయ్య మాట్లాడుతూ.. వర్సిటీ రిటైర్డు ప్రొఫెసర్లందరూ మేడారం ప్రాంతంలో కుటుంబ సమేతంగా పల్లెటూరి వాతావరణంలో గడిపేలా ప్రణాళిక బద్దంగా చూడాలని కుర్తా కార్యవర్గానికి సూచనలు చేశారు. అలాగే ఏడాదికి రెండు దఫాలుగా కుర్తా సమావేశం నిర్వహించేలా చూడాలని కోరారు. సభలో 75 ఏళ్లు నిండిన కుర్తా బాధ్యులైన ప్రొఫెసర్లకు ఘనంగా సన్మానం చేశారు.

ఈ సమావేశంలో కుర్తా జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ వడ్డె రవీందర్, వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ మద్దెల ఎర్రగట్టు స్వామి, జాయింట్ సెక్రటరీ డాక్టర్ ఎ.కృష్ణారెడ్డి, కోశాధికారి ప్రొఫెసర్ గుగులోత్. వీరన్ననాయక్, కుర్తా ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు ప్రొఫెసర్ సుధాకర్, ప్రొఫెసర్ చింత సమ్మయ్య, మాజీ వైస్ చాన్స్‌లర్లు ప్రొఫెసర్ వంగాల గోపాల్‌రెడ్డి, ప్రొఫెసర్ వి.విద్యావతి, ప్రొఫెసర్ ఆర్.సీతారామారావు, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి మాజీ ఛైర్మన్ ప్రొఫెసర్ తుమ్మ పాపిరెడ్డి, మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్, ప్రొఫెసర్ మహ్మద్ ఇక్బాల్ అలీ, ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే, ప్రొఫెసర్ జ్యోతిరాణి, ప్రొఫెసర్ డేవిడ్, ప్రొఫెసర్ గడ్డం భాస్కర్, ప్రొఫెసర్ విజయబాబు, ఇంద్రాసేనారెడ్డి, రమణయ్య, నరేంద్రబాబు, ప్రొఫెసర్ గుర్రం దామోదర్, సత్యనారాయణ, రామిరెడ్డి, రామ్‌నాథ్‌కిషన్, ప్రొఫెసర్ వి.శోభ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నాయినికి ఉపసభాపతి?

(5వ పేజీ తరువాయి)

ఆయనకు సరైన గౌరవం ఇచ్చినట్టవుతుందని, అదే క్రమం లో ప్రతిపక్షాలను నియంత్రించవచ్చనే ఆలోచనలో కాంగ్రెస్ పెద్దలున్నట్టు ప్రచారం జరుగుతోంది. స్పీకర్‌గా అధికార పార్టీ నుంచి గడ్డం ప్రసాద్‌కుమార్ ఉండగా, డిప్యూటీ స్పీకర్ పదవిని ప్రతిపక్షం నుంచి బీఆర్‌ఎస్‌కు కేటాయించాలని ఆ పార్టీ డిమాండ్ చేస్తోంది. అయితే బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో డిప్యూటీ స్పీకర్ పదవిని విపక్షాలకు కేటాయించే అనవాయితీని పాటించలేదని, దీంతో కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో ఒకరికి డిప్యూటీ పదవి ఇవ్వాలని అధికార పార్టీ నిర్ణయించినట్టు సమాచారం. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాకు కేంద్రంగా ఉన్న వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి డిప్యూటీ స్పీకర్ పదవి దక్కే అవకాశాలున్నాయని సమావేశం. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి సైతం నాయినికి డిప్యూటీ స్పీకర్ పదవి పట్ల సుముఖంగా ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. నాయిని విషయంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఒకరిద్దరు ఎమ్మెల్యేలు మినహా విగతా వారంత కూడా సానుకూలంగానే ఉన్నారనే చర్చ జరుగుతుంది.

చీఫ్‌విప్ లేదా వర్కింగ్ ప్రెసిడెంట్‌పై నాయిని నజర్

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని డిప్యూటీ స్పీకర్ సీట్లో కూర్చోపెట్టాలని ప్రభుత్వ పెద్దలు భావిస్తుంటే.. రాజ్యాంగబద్ధమైన పదవిలో కూర్చోపెట్టి తన మాటలను కట్టడి చేయవద్దని నాయిని అధిష్ఠానం వద్ద విజ్ఞప్తి చేస్తున్నట్టు తెలుస్తోంది. సుదీర్ఘకాలం కాంగ్రెస్ రాజకీయాల్లో ఉన్నానని, ప్రస్తుతం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత రాజ్యాంగ పదవిలో ఉంటే ప్రతిపక్షాలపై విమర్శలు చేయటం కుదరదని, నాయిని తన సన్నిహితుల వద్ద చెబుతున్నట్టు తెలిసింది. అవకావం ఉంటే తనకు మంత్రి వర్గంలో చాన్స్ ఇవ్వాలని సీఎంను కోరినట్టు తెలిసింది. ఒకవేళ మంత్రి వర్గంలో అవకాశం రాలేకపోతే శాసనసభలో ఖాళీగా ఉన్న చీఫ్‌విప్ పదవిని ఇస్తే బాగుంటుందని తన సన్నిహితుల వద్ద నాయిని ప్రస్తావించారని సమాచారం. ఇదికూడా కుదరకపోతే రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గానైనా అవకాశం ఇవ్వాలని అధిష్ఠానాన్ని కోరుతున్నట్టు తెలిసింది. నెల రోజుల క్రితం ఢిల్లీకి వెళ్లిన నాయిని రాజేందర్‌రెడ్డి తనకు వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇవ్వాలని ఏఐసీసీ పెద్దలను కలిసి విజ్ఞప్తి చేసి వచ్చినట్టుగా సమచారం. ప్రభుత్వ పదవులకంటే పార్టీ పదవుల వైపే నాయిని రాజేందర్‌రెడ్డి మొగ్గ చూపుతున్నట్టు ఆయన సన్నిహితులు కూడా చెప్పుతున్నారు. చీఫ్‌విప్ లేదా వర్కింగ్ ప్రెసిడెంట్ పదవులుంటే రాజకీయంగా మరింతా క్రియాశీలకంగా, ప్రజలకు దగ్గరగా ఉండే అవకాశం ఉంటుందని నాయిని భావిస్తున్నట్టు సమాచారం. ఈ నెల 21వ తేదీ వరకు అసెంబ్లీ సమావేశాలు జరుగనున్నాయి. ఈ సమావేశాల ఆజెండాలో డిప్యూటీ స్పీకర్ ఎన్నిక లేదు. దీంతో ఒకవేళ డిప్యూటీ స్పీకర్ పదవే అయితే బడ్జెట్ సమావేశాలు జరిగే ఫిబ్రవరి వరకు ఆగాల్సిందే. చీఫ్‌విప్ లేదా వర్కింగ్ ప్రెసిడెంట్ పదవులైతే మాత్రం జనవరిలో ప్రకటించే అవకాశం ఉందనే ప్రచారం ఉంది. ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా పని చేసిన అనుభవం ఉండటంతో నాయినికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సన్నిహితులున్నారు. దీంతో వరంగల్ పశ్చిమ ఎమెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి రాజ్యాంగ బద్ధమైన డిప్యూటీ స్పీకర్ పదవి దక్కుతుందా లేదా తాను కోరుకుంటున్న చీఫ్‌విప్ లేదంటే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవుల్లో ఏది దక్కుతుందనే దానిపై ఓరుగల్లు కాంగ్రెస్ కేడర్‌లో ఆసక్తికర చర్చ జరుగుతోంది.

లీగల్ సెల్‌తో కబ్జాలకు చెక్

(5వ పేజీ తరువాయి)

వర్సిటీ పాలక మండలిలో తీవ్రంగా చర్చ జరిగింది. వర్సిటీ భూములను ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోవద్దని, న్యాయపరంగా ప్రత్యర్థులకు దీటుగా వర్సిటీ లీగల్ సెల్‌ను తీర్చిదిద్దాలని నిర్ణయించారు. అందుకోసం ఇప్పుడున్న అడ్వకేట్‌తో పాటు మరో పేరు ప్రఖ్యాతి గాంచిన అడ్వకేట్‌ను నియమించుకోవాలని పాలక మండలి నిర్ణయించింది. వర్సిటీ లీగల్ సెల్‌కు అదనపు సిబ్బందిని నియమించడంతో పాటు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని పాలక మండలి వర్సిటీ ఉన్నతాధికారులకు ఆదేశించింది.

ప్రత్యేక న్యాయవాదుల నియామకాలకు పచ్చజెండా

వర్సిటీ న్యాయపరమైన విషయాల్లో చాలా వెనకబడి ఉందని, ప్రత్యర్థులు వర్సిటీకి వ్యతిరేకంగా వేసే కేసులను ఎదుర్కోవడంలో వర్సిటీ ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నారని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీతో పాటు ఇతర అధికారులు వర్సిటీ అధికారులను అప్పుడప్పుడు మందలిస్తూనే ఉన్నారు. అయితే వర్సిటీ ఉన్నతాధికారులకు న్యాయపరమైన విషయాల్లో లోతైన అవగాహన, పరిశీలన లేకపోవడాన్ని గుర్తించిన రాష్ట్రప్రభుత్వం.. వర్సిటీ భూములతోపాటు ఇతర లీగల్ విషయాలలో పకడ్బందీగా వ్యవహరించేలా ప్రత్యేక న్యాయవాదులను నియమించుకునేందుకు వర్సిటీ అత్యున్నత పాలక మండలి పచ్చజెండా ఊపింది. గత పాలక మండలి సమావేశంలో వర్సిటీకి అదనంగా మరొక అడ్వకేట్‌ను తీసుకునే వెలుసుబాటును కల్పించారు.



ఎస్ఏల దీక్ష వద్ద మాట్లాడుతున్న రావు పద్మ

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులైజ్ చేయాలి

హనుమకొండ టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సర్వశిక్షలో 15 ఏళ్లుగా కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పనిచేస్తున్న వారందరినీ రెగ్యులైజ్ చేయాలని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. ఏకశిలా పార్కు వద్ద ఎస్ఏ కాంట్రాక్ట్ ఉద్యోగులు చేస్తున్న దీక్షలకు ఆమె మంగళవారం మద్దతు తెలిపి మాట్లాడారు. ప్రజాప్రభుత్వంగా చెప్పుకుంటున్న సీఎం రేవంత్‌రెడ్డికి ప్రతీ జిల్లాలో వేలాది మంది మహిళలు రోడ్లు ఎక్కి దీక్షలు చేస్తుంటే కనబడటం లేదా? అని ప్రశ్నించారు. శాంతియుతమైన సమ్మెను ప్రభుత్వం అర్థం చేసుకొని సమస్యలను పరిష్కరించాలన్నారు. విద్యావ్యవస్థలో కీలకంగా ఉన్న ఎస్ఏ కాంట్రాక్ట్ ఉద్యోగుల సమ్మెవల్ల విద్యాప్రగతి కుంటుపడుతుందని, ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు. వారిని రెగ్యులైజ్ చేసేంత వరకు సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మినిమం టైం స్కేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్మ టీచర్స్ యూనియన్(డీటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ.. కిందటేడు ఇదే ఎస్ఏ కాంట్రాక్ట్ ఉద్యోగులు దీక్షలు చేస్తుంటే హనుమకొండకు పీసీసీ చీఫ్‌గా రేవంత్‌రెడ్డి వచ్చి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే గౌరవంగా ఎస్ఏ ప్రతినిధులను పిలిపించి సమస్యలను పరిష్కరిస్తానని చెప్పి ఇపుడు మాత్రం పట్టించుకోకపోవటం మోసపూరితం అన్నారు. రైతుసంఘం రాష్ట్ర నాయకుడు సోమిడి శ్రీనివాస్ దీక్షలకు సంఘీభావం తెలిపి మాట్లాడారు.

వర్సిటీ అధ్యాపకులకు న్యాయం చేయాలి

కేయూ క్యాంపస్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా 12 వర్సిటీల్లో పనిచేస్తున్న 1445 మంది కాంట్రాక్టు అధ్యాపకులకు న్యాయం చేసిన తర్వాతే వర్సిటీల్లో నూతన అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలు చేపట్టాలని వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం జనరల్ సెక్రటరీ డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయం ఎదుట కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం నేతృత్వంలో నిరసన ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా తమ డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని చైర్మన్ బాలకృష్ణారెడ్డికి అందచేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం అధ్యక్షకార్యదర్శులు రామేశ్వర్‌రావు, శ్రీధర్‌కుమార్‌లోథ్‌లు మాట్లాడారు. వర్సిటీలో ప్రస్తుతం పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తమకున్యాయం చేయాలని మండలి ఎదుట ధర్నా చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇ.పురుషోత్తంలకు వినతి పత్రాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, ఉదయ్, హర్షిత, అధిత్య మూర్తి, కవిత, భరత్, రాధిక, కె.కృష్ణ, కల్యాణి, శృతి, పద్మశ్రీ, శిరీష, పద్మ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులపై పీడీఎస్‌యూ ధర్నా

కేయూ క్యాంపస్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా చలో అసెంబ్లీ నేపథ్యంలో పీడీఎస్‌యూ నేతలను అక్కడికక్కడ పోలీసులు అరెస్టులు చేయాడం పట్ల కేయూ పీడీఎస్‌యూ కార్యవర్గం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు మంగళవారం కేయూ మొదటి గేటు వద్ద పీడీఎస్‌యూ వర్సిటీ నేత కావ్య పి.అనూషల నేతృత్వంలో నిరసన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ నాయకులు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో విద్యారంగానికి జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నిస్తూ విద్యార్థులు ఉద్యమిస్తే అక్రమంగా అరెస్టులు చేస్తారా? అని ప్రశ్నించారు. విద్యకు నిధులు పెంచాలని, విద్యాశాఖ మంత్రిని నియమించాలని, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ విద్యార్థినేతల అక్రమ అరెస్టులను అందరూ ఖండించాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో పోలీసులు అరెస్టు చేసిన వారిలో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. నరసింహారావు, సహాయ కార్యదర్శి కాంపాటి పృథ్వీ, ఎస్.అనిల్, నరేందర్, భాస్కర్, సాయి, సురేష్, వి.వెంకటేశ్, రాకేశ్‌లున్నారు. వీరిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు సాధన, పూజిత, స్వాతి, అఖిల, జ్యోతి, రమేశ్, సంజయ్, సుమంత్, బాలు, కల్యాణ్, అశ్విన్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు డీసీపీని అభినందించిన సీపీ

వరంగల్ క్రైం, డిసెబంబర్ 17 (ఆంధ్రజ్యోతి): ఏఆర్ డీసీపీగా పదోన్నతి పొంది సైబరాబాద్ కమిషనరేట్‌కు బదిలీపై వెళుతున్న ఆడిషినల్ డీసీపీ సంజీవ్‌ను సీపీ అంబర్ కిషోర్‌ఝా అభినందించారు. పదోన్నతి వచ్చిన సందర్భంగా మంగళవారం సీపీని సంజీవ్ కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా పదోన్నతితో బాధ్యతలు పెరుగుతాయని, సమర్థవంతంగా విధుల్లో రాణించాలని సూచించారు.

కేయూకు ఎడ్‌సెట్-2025 నిర్వహణ బాధ్యతలు

కేయూ క్యాంపస్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీకి ఎడ్‌సెట్-2025 నిర్వహణ బాధ్యతలను అప్పగిస్తూ మంగళవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధికారులు షెడ్యూల్ ప్రకటించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి నేతృత్వంలో జరిగిన సమావేశంలో రాష్ట్రంలోని వర్సిటీలకు ప్రవేశాల పరీక్షల నిర్వహణ బాధ్యలను అప్పగిస్తూ ఉత్తర్వులు వెలువరించారు. ఈ దఫా వరంగల్ కాకతీయ యూనివర్సిటీకి ఎడ్‌సెట్-2025 నిర్వహణ చేపట్టాలని తెలంగాణ ఉన్నత విద్యామండలి సెక్రటరీ ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా బీఈడీ కళాశాలల్లో 2025-26 ఏడాదికి గాను అడ్మిషన్లు చేపట్టేందుకు ఎడ్‌సెట్ ప్రవేశాల పరీక్షలు నిర్వహిస్తారు. ఎడ్‌సెట్ పరీక్షల్లో చూపిన ప్రతిభ ఆధారంగా బీఈడీ కళాశాలల్లో అడ్మిషన్లు చేపడుతారు. కాకతీయ యూనివర్సిటీ గతంలో 1997-1998 నుంచి 2022 దాక ఐదు దఫాలుగా సమర్థవంతంగా ఎడ్‌సెట్ నిర్వహణ బాధ్యతలు స్వీకరించి సమర్థవంతంగా పరీక్షలను నిర్వహించింది.

క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

- జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలి
- మేయర్ గుండు సుధారాణి
- జేఎన్ఎస్‌లో జిల్లాస్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు షురూ

వరంగల్ స్పోర్ట్స్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జిల్లా స్థాయి సీఎం కప్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభకనబర్చి రాష్ట్ర స్థాయిలో పతకాలు కొల్లగొట్టి జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని మేయర్ గుండు సుధారాణి కోరారు. సీఎం కప్ క్రీడా పోటీల్లో భాగంగా హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో మంగళవారం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి క్రీడా పోటీలను మేయర్ సుధారాణి, హనుమకొండ ఇన్‌చార్జ్ కలెక్టర్ సత్య శారదతో కలిసి జెండా ఊపి క్రీడా పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. వరంగల్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అసెంబ్లీ సమావేశాల్లో ఉండగా వర్చువల్‌గా ఆడియో ద్వారా క్రీడా పోటీలను ప్రారంభిస్తున్నట్లుగా మేయర్ ప్రకటించారు. అనంతరం అతిథులు క్రీడాకారులతో కలిసి క్రీడల్లో పాల్గొని ఉత్సాహపరిచారు.

ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందని అన్నారు. సీఎం కప్ క్రీడా పోటీల్లో భాగంగా ఇప్పటికే గ్రామ, మండల స్థాయిలో నిర్వహించిన క్రీడల్లో ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయికి చేరుకోవడం అభినందనీయమన్నారు. స్వతహాగా ఫుట్‌బాల్ క్రీడాకారుడు కావడం, క్రీడాకారుల కష్టాలు తెలిసిన వ్యక్తిగా క్రీడలను అభివృద్ధి చేయడంతో పాటు ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ప్రోత్సహించడానికి రూ.375కోట్ల నిధులు అందించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. జేఎన్ఎస్ క్రీడా మైదానంలో మౌలిక వసతుల కోసం జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక నిధులు కేటాయించి



హ్యాండ్‌బాల్ క్రీడలను ప్రారంభిస్తున్న మేయర్ సుధారాణి, కలెక్టర్ సత్యశారద, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

అభివృద్ధి చేసిందన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి క్రీడల అభివృద్ధికి, క్రీడాకారులను ప్రోత్సహించడానికి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. జేఎన్ స్టేడియంలో సింథటిక్‌ట్రాక్ లోపల లైటింగ్ ఏర్పాటు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విశిష్ట అతిథి కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ.. క్రీడలకు నిలయమైన ఓరుగల్లులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఉండటం విశేషం అన్నారు. క్రీడల్లో గెలుపోటములు సమానంగా తీసుకున్నప్పుడే అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటారన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో రాణించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ.. గ్రామ, మండల స్థాయిలో కష్టపడి రాణించినట్లుగానే జిల్లా స్థాయి పోటీల్లో క్రమశిక్షణ పట్టుదలతో సాధన చేసి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించాలని సూచించారు. హనుమకొండ డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. హనుమకొండ జిల్లా స్థాయిలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న 20 చాంపియన్‌షిప్ పోటీలు, 16 వివిధ క్రీడా పోటీల్లో ఎంపికలు నిర్వహిస్తామన్నారు.

కాగా, తొలి రోజు అథ్లెటిక్స్, ఆర్చరీ, హ్యాండ్‌బాల్, జిమ్నాస్టిక్స్, ఉషు, బిలియర్డ్స్ స్నూకర్, బాడ్మింటన్, వాలీబాల్, ఖోఖో, క్రీడాంశాలలో పోటీలు నిర్వహించగా జిల్లా వ్యాప్తంగా 2500మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా, అదనపు కలెక్టర్ ఎ.వెంకట్‌రెడ్డి, ఆర్డీవో రాథోడ్ రమేష్, వరంగల్ జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్, అథ్లెటిక్స్ అసోసియేషన్ చైర్మన్ వరదరాజేశ్వర్‌రావు, అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కుదురుపాక సారంపాణి, బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రమేష్‌రెడ్డి, ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి శ్యామ్, పీఈటీ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి దస్రూ, హనుమకొండ డీఎస్ఏ కోచ్‌లు నరేందర్, కూరపాటి రమేష్, రాయబారపు నవీన్, కొత్త ప్రశాంత్, పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, ఎం.డి. అఫ్జల్, రాజు, రమేష్, ఓనపాకల శంకర్, విష్ణు, పీడీలు, పీఈటీలు, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే పెన్షనర్లకు అండగా ఉంటా..

మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్



సమావేశంలో మాట్లాడుతున్న దాస్యం వినయ్ భాస్కర్

కాజీపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రైల్వే పెన్షనర్లకు ఏ కష్టమొచ్చినా అండగా ఉంటానని మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. కాజీపేట రైల్వే కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం 42వ పెన్షనర్స్ డే వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైల్వే పెన్షనర్ల శాశ్వత భవన నిర్మాణానికి తాను ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నానన్నారు. పెన్షనర్‌ల భవన స్థలం, నిర్మాణానికి అవసరమైతే సొంత డబ్బులు వెచ్చించి కొనిస్తానన్నారు. పదవిలో ఉన్నా, లేకున్నా ప్రజల పక్షాన ఉంటానన్నారు. అంతకుముందు 80 సంవత్సరాలు దాటిన పెన్షనర్లను ఘనంగా సన్మానించారు. పెన్సనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. సంగమయ్య అధ్య క్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జోనల్ సెక్రటరీ పి. యుగంధర్, స్థానిక కార్పొరేటర్లు సంకు నర్సింగరావు, జక్కుల రవీందర్ యాదవ్, జోనల్ అసిస్టెంట్ సెక్రటరీలు సుధాకర్, సీహెచ్. కొమ్మాలు, డివిజనల్ ప్రెసిడెంట్ బాబురావు, సెక్రటరీ పి. వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీలు పి.వెంకటేశ్వర్లు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రైతులకు సంకెళ్లు వేయడం సిగ్గుచేటు



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

హసన్‌పర్తి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రైతుల చేతులకు సంకెళ్లు వేసి దేశద్రోహుల్లా చిత్రీక రించడం సిగ్గుచేటని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్ అన్నారు. బీఆర్ఎస్ 66వ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్ ఆధ్వర్యంలో లగచర్ల రైతు లను కాపాడాలని కోరుతూ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి మంగళవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ జిల్లా ఆత్మ చైర్మన్ కందు కూరి చంద్రమోహన్, సొసైటీ డైరెక్టర్లు వీసం కర్నాకర్‌రెడ్డి, మల్లా రెడ్డి, నుద్దనూరి నాగ రాజు, నాయకులు రాజునాయక్, బోడ యుగందర్, పీ ప్రభాకర్ పాల్గొన్నారు.

చెత్త తొలగింపును నిర్లక్ష్యం చేయొద్దు

కాజీపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): డివిజన్లలో చెత్త తొలగింపులో నిర్లక్ష్యం చేయొద్దని మునిసిపల్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ రాజారెడ్డి సిబ్బందికి ఆదేశించారు. మంగళవారం ఉద యం కాజీపేటలో ప లు డివిజన్లలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకన్నతో కలిసి పర్యటించారు. చెత్త ఉన్న పరిసరాల్లో సిబ్బందితో వెంట నే చెత్త తీయించారు. కాలనీల్లో, రోడ్లపై చెత్త వేస్తే గృహాల ఓనర్లకు జరిమానా విధిస్తామని చెప్పారు. జవా న్లు సుధాకర్, కొమ్ము అనుదీప్, సుశీల్, వర్దన్ పాల్గొన్నారు.

ఉచిత విద్య, వైద్యం, ఉపాధి కల్పించాలి

హనుమకొండ టౌన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పేదలకు విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ధర్మ సమాజ్ పార్టీ హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఏకశిల పార్కు ఎదుట ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద రమేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో నెల నుంచి పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ ఆదేశాలతో ప్రభుత్వం ఉచిత విద్య, వైద్యం అందించాలని కలెక్టర్‌కు వినతి పత్రాలు ఇచ్చినా స్పందించడం లేదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు చుక్క రత్నాకర్, జిల్లా ఉపాధ్యక్షుడు సలీంపాషా, జిల్లా ప్రధాన కార్యదర్శి మైదం రవి, బరిగెల బాబు, ప్రసాద్, ఏసోబు, ప్రతాప్, ఎల్లస్వామి, అమరేందర్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీఐ సాధన కమిటీ ఎన్నిక

ఉమ్మడి జిల్లా అధ్యక్షురాలిగా చెట్టిపల్లి దేవిక నియామకం

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం సాధన కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసినట్లు కమిటీ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ చంటి ముదిరాజ్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సూర స్రవంతి మంగళవారం హనుమకొండలో జరిగిన సమావేశంలో ప్రకటించారు. ఉమ్మడి వరం గల్ జిల్లా అధ్యక్షురాలిగా చెట్టిపల్లి దేవిక, హనుమకొండ జిల్లా అధ్యక్షులుగా మీసా ల విజయ్‌లను నియమించారు. అనంతరం ఎంపికైన వారికి జాతీయ, రాష్ట్ర బాధ్యులు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చంటి ముది రాజ్ మాట్లాడుతూ.. ఆర్టీఐ చట్టం సామాన్యుడి చేతిలో వజ్రాయుధం లాంటిదని, ఈ చట్టాన్ని ప్రతీ ప్రభుత్వ కార్యాలయంలో పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఉమ్మడి జిల్లా నూతన అధ్యక్షురాలు చెట్టిపలి దేవిక మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు ఈ చట్టాన్ని ఉపయోగించుకుని ప్రభుత్వ కార్యాలయాల్లో జరుగుతున్న అవినీతిని బయటకు తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో ఆకుల కుమార్, మార్క రాజు, సంఘాల చిట్టిబాబు, రాయికంటి సురేష్, మోడం రాజేష్, ఏరుకొండ శశివకుమార్, బూర శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణ పనులను వేగవంతం చేయండి

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో జరుగుతున్న కల్వర్టు నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. స్మార్ట్ సిటీ నిధులతో మనుమకొండ పరిధిలో జరుగుతున్న కల్వర్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హనుమకొండలోని జవహర్‌నగర్, రాజాజీనగర్, పెద్దమ్మగడ్డ సమీపంలోని అజర ఆస్పత్రి సమీపంలో జరుగుతున్న కల్వర్టు పనులను పర్యవేక్షించారు. అక్కడ జరుగుతున్న పనుల తీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కల్వర్టు పనులు చివరి దశకు చేరుకోగా పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

పనులను త్వరగా పూర్తిచేసి రహదారులను ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, ఈఈ సంతోష్‌బాబు, డీఈ రవికిరణ్, ఏఈ సతీష్, స్మార్ట్ సిటి పీఎం భాస్కర్‌రెడ్డితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన ప్రభుత్వం

వడ్డెపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చకుండా విస్మరించిందని 66వ డివిజన్ కార్పొరేటర్, బీజేపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ గురుమూర్తి శివకుమార్ దుయ్యబట్టారు. మంగళవారం గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్‌లో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు మందోటి మహేందర్ పటేల్ ఆధ్వర్యంలో నిర్వహించిన డివిజన్ స్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని నమ్మబలికిన కాంగ్రెస్ ప్రభుత్వం అసంపూర్తిగా మాఫీ చేసిందని, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం కింద రూ. లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పిన హామీని అమలు చేయలేదని దుయ్యబట్టారు. దివ్యాంగులు, వృద్ధులకు ప్రస్తుతం ఇస్తున్న పింఛన్‌ను రెట్టింపు ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు అమలు చేయలేదని ఆరోపించారు. అనంతరం 56వ డివిజన్‌లోని 14 బూత్ కమిటీలకు బీజేపీ అధ్యక్షులను నియమిస్తూ వారికి పత్రాలను శివకుమార్ అందజేశారు. ఈ సమావేశంలో బీజేపీ ఎస్సీ మోర్చ వరంగల్ ఇన్‌చార్జి నమిండ్ల బాబురావు, ప్రధాన కార్యదర్శి ఉసిల్ల దయాకర్, బూత్ కమిటీల డివిజన్ అధ్యక్షులు హుస్సేన్ నాయక్, తాడెం రాజేందర్, పేరాల కుమారస్వామి, బొద్దిరెడ్డి సురేందర్‌రెడ్డి, మందోటి మహేందర్, తక్కళ్లపల్లి అమృతరావు, కటకం రాజేష్, ముల్కనూరు చంద్రమౌళి, వేల్పుల శ్రీనివాస్, కోటగిరి నరేందర్ పాల్గొన్నారు.

పెన్షనర్ల సంక్షేమాన్ని పట్టించుకోని ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న తిరువరంగం ప్రభాకర్

వడ్డెపల్లి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం పెన్షనర్ల సంక్షేమాన్ని విస్మరించిందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి తిరువరంగం ప్రభాకర్ దుయ్యబట్టారు. మంగళవారం హనుమకొండలోని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యాలయంలో హనుమకొండ యూనిట్ అధ్యక్షుడు మాదిరెడ్డి మల్లారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన పెన్షనర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. హనుమకొండ డీటీవో శ్రీనివాస్‌కుమార్, హార్ట్ స్పెషలిస్టు డాక్టర్ రామకృష్ణారెడ్డి, ఏటీవోలు శ్రీనివాస్‌రెడ్డి, అన్వర్ హుస్సేన్, సంఘ గౌరవ అధ్యక్షుడు ప్రొఫెసర్ వెంకటనారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ప్రభాకర్ మాట్లాడుతూ.. పెన్షనర్లకు డీఆర్‌తో పాటు పీఆర్‌సీని ప్రకటించాలని నగదు రహిత వైద్య సేవలను అందించాలని అన్నారు. సమావేశంలో జిల్లా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కె.గోపాల్‌రెడ్డి, జిల్లా బాధ్యులు కందుల సంజీవరెడ్డి, నయీం, నారాయణ రావు, నర్సింహచారి, విద్యాసాగర్, రాజశేఖరయ్య తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థినితో పాఠశాల యాజమాన్యం

బాలసముద్రం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జమ్మూ కాశ్మీర్‌లో ఈ నెల 20 నుంచి 24 వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ సబ్ జూనియర్ పోటీలకు హనుమకొండ సెయింట్ పీటర్స్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని పోలెపాక విరి ఎంపికైంది. సెప్టెంబరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపు మత్యాస్‌రెడ్డి, డైరెక్టర్ సునితారెడ్డి, పీఈటీ సాగర్, కోచ్ వినయ్ విద్యార్థినిని అభినందించారు.

సంక్షిప్త వార్తలు

చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలి

కాజీపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ డిసెంబరు 21న చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ మునిసిపల్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఉప్పలయ్య డిమాండ్ చేశారు. కాజీపేట మినీ మునిసిపాలిటీలో మంగళవారం పారుశుధ్య కార్మికులతో సీఐటీయూ నాయకులు ప్రత్యేక సమా వేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉప్పలయ్య, మండల కార్యదర్శి ఎర్ర నరేశ్ మాట్లాడారు. మేడారం జాతర విధులు నిర్వహించిన కార్మికులకు వెంటనే డబ్బులు ఇవ్వాలని, అనారోగ్యానికి గురవు తున్న కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు అవకాశం కల్పించాలని, డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు వెంకన్న, జవాన్లు సుశీల్, రవీందర్ పాల్గొన్నారు.

దివ్యాంగుడి శస్త్ర చికిత్సకు ఆర్థిక సాయం

వడ్డెపల్లి (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ వడ్డెపల్లి ప్రాంతానికి చెందిన కాటిమల్ల ఐలయ్య పుట్టుకతోనే దివ్యాంగుడు. ఇటీవల ఐలయ్య రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. దాత కుందావజ్జల కృష్ణమూర్తి సహకారంతో శస్త్ర చికిత్స కోసం వడ్డెపల్లిలోని విద్య ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బిల్ల మహేందర్ రూ. 10 వేల ఆర్థిక సహాయాన్ని మంగళవారం బాధితుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మౌనిక, పొలసాని వెంకన్న, ఇస్లావత్ చందు తదితరులు పాల్గొన్నారు.

పింగిళి కళాశాల ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా సుహాసిని

వడ్డెపల్లి (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ వడ్డెపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల నూతన ఫుల్ అడిషనల్ చార్జ్ (ఎఫ్ఏసీ) ప్రిన్సిపాల్‌గా కళాశాల జువాలజీ విభాగాధిపతి, పరీక్షల విభాగ కంట్రోలర్‌గా పనిచేస్తున్న జి.సుహాసిని మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న డాక్టర్ బి.చంద్రమౌళి సెలవులో ఉన్నారు. ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా సుహాసినికి అదనపు బాధ్యతలు ఇస్తూ కళాశాల విద్య కమిషన్ ఉత్తర్వులు జారీ చేశారు. కళాశాల సిబ్బంది నూతన ప్రిన్సిపాల్ సుహాసినిని కళాశాలలో ఘనంగా సత్కరించారు.

ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థులను గెలిపించాలి

హనుమకొండ (ఆంధ్రజ్యోతి): రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థులు పట్టున్న డివిజన్లలో పోటీ చేస్తారని, సీపీఐ అభ్యర్థులను గెలిపించేందుకు కార్యకర్తలు కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నా రు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం సీపీఐ పార్టీ హనుమకొండ మండల కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కర్రె భిక్షపతి మాట్లాడుతూ.. ప్రశ్నించే గొంతుగా పనిచేసే సీపీఐ పార్టీని ప్రజలు ఆదరించాలన్నారు. నగరంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను పేదలకు పంపిణీ చేయాల న్నారు. కేంద్రం రాష్ట్ర విభజన హామీలు అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలైన అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలతో పాటు పక్కా ఇళ్ల నిర్మాణం కోసం కృషి చేస్తామని యేడాది గడిచినా ఇప్పటివరకు అమలు చేయలేదని, వెంటనే అమలు చేయాలన్నారు. సమావేశంలో సీపీఐ నాయకులు కండె నర్సయ్య, మద్దెల ఎల్లేష్, యశబోయిన శ్రీనివాస్, కర్రె లక్ష్మణ్, కొట్టెపాక రవి, ప్రభాకర్, అరుణ, సుదర్శన్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ, విద్యారంగ హామీలను నెరవేర్చాలి

టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్

వరంగల్ ఎడ్యుకేషన్ (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది గడుస్తున్న నేపథ్యంలో ఉపాధ్యాయ, విద్యారంగానికిచ్చిన హామీలన్నీ వెంటనే నెరవేర్చాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం భోగేశ్వర్ మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో ఉపాధ్యాయులకిచ్చిన హామీల ప్రకారం రెండేళ్ల పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బిల్లులను సత్వరమే విడుదల చేయాలన్నారు. ఇకనుంచి ఎప్పటి బిల్లులను అప్పుడే మంజూరు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఉద్యోగ విరమణ పొందిన వారికి వెంటనే వారికి చెల్లింపులు చేసే విధంగా ప్రభుత్వం ఏర్పాట్లు చేయాలన్నారు. జీవోనెం 317తో స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులందరినీ వారి స్థానాలకు తిరిగి తీసుకురావాలన్నారు. బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం 15 శాతం నిధులు కేటాయించి ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాలన్నారు. అధికారంలోకి వచ్చాక ఆరునెలల్లో సీపీఎస్‌ను రద్దు చేస్తామన్న వాగ్దానాన్ని నిలబెట్టికోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఊట్కూరి అశోక్, ఈదుల వీరస్వామి పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి

ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్

కేయూ క్యాంపస్ (ఆంధ్రజ్యోతి): హనుమకొండ పలివేల్పుల సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో విద్యార్థుల సమస్యలను తెలుసుకునేందుకు వెళ్లిన తమను అడ్డుకున్న ప్రిన్సిపాల్‌పై వెంటనే సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ అధ్యక్షకార్యదర్శులు స్టాలిన్, మంద శ్రీకాంత్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హాస్టల్ గేటు ఎదుట నిరసన ఆందోళన చేపట్టారు. ప్రిన్సిపాల్‌కు వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

అనంత రం స్టాలిన్, మంద శ్రీకాంత్‌లు మాట్లాడుతూ.. గురుకులాల్లో ఆహార కల్తీలో విద్యార్థులు చనిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు సాయి, కిరణ్, అజయ్, అభిషేక్, సందీప్, మల్లేశ్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుట్కాల పట్టివేత

వరంగల్ క్రైం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): చట్టవిరుద్ధంగా విక్రయిస్తున్న రూ.76,300 విలువ చేసే గుట్కాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ కథనం ప్రకారం.. ముల్కనూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శనిగరపు వేణు నుంచి రూ.33,500 విలువ చేసే పొగాకు ఉత్పత్తులు, బల్లు రమేశ్, కిరాణం వ్యాపారి నుంచి రూ.42,800విలువ చేసే గుట్కాలను స్వాధీనం చేసుకొని తదుపరి చర్యలు కోసం ముల్కనూర్ పోలీసులకు అప్పగించామన్నారు.


నకిలీ ఎలక్ట్రికల్ వైర్లు, స్విచ్ బోర్డులు సీజ్

వరంగల్ క్రైం (ఆంధ్రజ్యోతి) : గృహనిర్మాణాల్లో వినియోగించే ఎలక్ట్రికల్ వైర్లతో పాటు స్విచ్‌బోర్డులను మంగళవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు పక్కా సమాచారం మేరకు పట్టుకొని సీజ్ చేశారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ కథనం ప్రకారం.. బ్రాండెడ్ కంపెనీల ముసుగులో నకిలీ వాటిని నమ్మిస్తూ విక్రయిసున్నారనే సమాచారంతో పెగడపల్లి డబ్బాల వద్ద సాయి గణేశ్ ఎలక్ట్రికల్స్, శివ ఎలక్ట్రికల్స్‌లో సోదాలు చేసి రూ.4,64,507 విలువ గల నకిలీ వైర్లు, స్విచ్‌బోర్డులను స్వాధీనం చేసుకొని తర్వాత చర్యల కోసం కేయూ పోలీసులకు అప్పగించామన్నారు.

ఏఎన్ఎంల ముందస్తు అరెస్టు

హసన్‌పర్తి (ఆంధ్రజ్యోతి): మండలంలోని హసన్‌పర్తి, కాకతీయ యూనివర్సిటీ పోలీసు స్టేషన్‌ల పరిధిలోని సెకండ్ ఏఎన్ఎంలను ముందస్తు అరెస్టు చేసినట్లు హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ పట్టె చేరాలు, కేయూ ఇన్‌స్పెక్టర్ సుంకరి రవి కుమార్ తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా సెకండ్ ఏఎన్ఎంలు పరీక్షలు నిర్వహించకుండా తమను విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు మంగళవారం చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళుతున్నట్టు సమాచారం అందిందన్నారు. దీంతో సెకండ్ ఏఎన్ఎంలను ముందస్తు అరెస్టు చేశామన్నారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.

పల్లెపై చలి చిత్రం


మంచు దుప్పటి మనుగొండ గ్రామం

చలి పంజా విసురుతోంది. రోజురోజుకు రాత్రి ఉష్ణోగ్రతలు కనిష్ఠానికి పడిపోతున్నాయి. రోజంతా చల్లని గాలులు వీస్తున్నాయి. సాయంత్రం నుంచి తెల్లవారుజాము వరకు పొగమంచు కురుస్తోంది. ఈ క్రమంలో పక్షులు గూళ్లు దాటి బయటకు రావడం లేదు. వృద్ధుల నుంచి చిన్నారుల వరకు చలిమంటలను ఆశ్రయిస్తున్నారు. పల్లెల్లో అయితే రైతులు, వ్యవసాయ, ఇతర కూలీ పనులకు వెళ్లేవారు గజగజ వణుకుతూనే రోజువారీ పనుల్లో నిమగ్నమవుతున్నారు. మంగళవారం వరంగల్ జిల్లా గీసుగొండ, మనుగొండ, ఎలుకుర్తి సమీప ప్రాంతాల్లో కనిపించిన చలి చిత్రాలివీ.

ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ


గీసుగొండ వద్ద తాటిచెట్టు తొర్రలో నుంచి నక్కి చూస్తున్న గుడ్లగూబలు


మంచు దుప్పటిలోనే పొలం పనుల్లో నిమగ్నమైన ఓ రైతు


గీసుగొండలో చలి మంట వద్ద ఉపశమనం పొందుతున్న కుటుంబం


మనుగొండ గ్రామంలో చలిమంట కాగుతున్న స్థానికులు

జూపార్కుకు రెండు అడవి దున్నలు..

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): హనుమకొండ హంటర్‌రోడ్‌లోని కాకతీయ జులాజికల్ పార్కుకు సోమవారం అర్ధరాత్రి రెండు అడవి దున్నల జంట వచ్చింది. 5 యేళ్ల అనిత, 4 ఏళ్ల శివను జిల్లా అటవీ శాఖ అధికారులు హైదరాబాద్‌లోని నెహ్రూ జులాజికల్ పార్కు నుంచి తీసుకువచ్చారు. ఇప్పటికే అడవి దున్నలకు జూపార్కులో ఎన్‌క్లోజర్ ఏర్పాటు చేయగా, అందులో ఈ అడవి దున్నలను ఉంచారు. ఆడ అడవి దున్న ప్రస్తుతం గర్భంతో ఉందని జిల్లా అటవీశాఖ అధికారి లావణ్య తెలిపారు. అలాగే మరి కొన్ని రోజుల్లో రెండు తెల్లపులులు, ఒక సింహం కూడా జూపార్కుకు రానుంది. దీంతో జూపార్కుకు సందర్శకుల తాకిడి పెరిగే అవకాశం ఉంది.


జూపార్కుకు వచ్చిన అడవి దున్నలు

మీ సేవలకు యాప్

అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వం

- నష్టపోనున్న ఉమ్మడి జిల్లాలోని 623 మీసేవ సెంటర్ల నిర్వాహకులు
- అమలు చేయొద్దని ప్రభుత్వానికి వినతులు

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఇటీవల మీ సేవ యాప్‌ను అందు బాటులోకి తెచ్చింది. ఈ యాప్ పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తే ప్రజలకు అరచేతిలో సమాచారం ఉంటుంది. కానీ దీనిని వినియోగించుకునే అవగాహ న అందరికీ ఉంటుందా ఉండదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ శాఖలకు సంబంధించిన పత్రాలు అప్‌లోడ్ చేయడం కొందరు ప్రజలకు తెలియక దళారులను ఆశ్రయించే అవకాశం ఉంది. ఈ క్రమంలో మీ సేవ నిర్వాహకులు నష్టపోతారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా మీ సేవ సెంటర్లు 2011 సంవత్సరంలో అమలులోకి రాగా అప్పటి నుంచి మీ సేవ సెంటర్ల ద్వారా ప్రజలకు కావాల్సిన అన్ని సౌకర్యాలు లభిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల నూతన మీ సేవ యాప్ అమలులోకి తీసుకురావడంతో తమకు తీవ్ర నష్టం జరుగుతుందని మీసేవ నిర్వాహకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన నేపథ్యంలో ప్రభుత్వం ఆ యాప్‌ను తాత్కాలికంగా ఆపేశారు. ప్రభుత్వం తీసుకొచ్చే కొత్త సర్వీసు వల్ల మీ సేవలను నిర్లక్ష్యం చేయడమే కాకుండా కొన్ని సేవలను మీ సేవ ద్వారా ప్రజలకు అందించే అవకాశం కూడా పోతోంది.

ఉమ్మడి జిల్లాలో మీ సేవ సెంటర్లు ఇలా
హనుమకొండ- 140
వరంగల్- 125
జనగామ- 70
మహబూబాబాద్- 141
భూపాలపల్లి- 96
ములుగు- 51

నష్టపోనున్న మీసేవ సెంటర్ల నిర్వాహకులు

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 623 మీ సేవ సెంటర్లు ఉన్నాయి. కొత్త యాప్ పూర్తిస్థాయిలో అమలులోకి వస్తే ఈ సెంటర్ల నిర్వాహకులు నష్టపోయే అవకాశాలున్నాయి. ప్రభుత్వ సేవలతో పాటు ప్రజలకు కావాల్సిన సర్టిఫికెట్లు మీ సేవ సెంటర్ల ద్వారా సులువుగా పొందే అవకాశం ఉందని, ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త విధానం వల్ల అవగాహన లేని ప్రజలు దళారులను ఆశ్రయించి మోసపోయే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



హనుమకొండ చౌరస్తాలో ఉన్న మీ సేవ సెంటర్

కొత్త యాప్‌తో తీవ్రంగా నష్టపోతాం



ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన మీసేవ యాప్ వల్ల మీసేవ సెంటర్ల నిర్వాహకులు తీవ్రంగా నష్టపోతారు. ఈ యాప్‌ను ఎలా వినియోగించాలో తెలియక ప్రజలు దళారులను ఆశ్రయించే అవకాశం ఉంటుంది. తద్వారా అటు ప్రజలు.. ఇటు మేం నష్టపోతాం. ప్రజలకు కావాల్సిన సర్టిఫికెట్లు, ప్రభుత్వానికి సంబంధించిన పనులు మీ సేవల వల్ల సులభంగా అందుతున్నాయి. యాప్ అమలుపై ప్రభుత్వం పునరాలోచించాలి.

- రావిపాటి దేవేందర్‌రావు, మీసేవ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

వాట్సాప్‌లోనూ వినియోగదారుల కమిషన్‌కు ఫిర్యాదు చేయొచ్చు

బాలసముద్రం, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రస్తుతం వాట్సాప్‌లో కూడా వినియోగదారుల కమిషన్‌కు ఫిర్యాదు చేయవచ్చని ఆల్ ఇండియా కన్జూమర్స్ కౌన్సిల్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ పల్లెపాడు దామోదర్ అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా వినియోగదారుల సలహా సంఘం ఏర్పాటు చేసిన వినియోగదారుల చైతన్య సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. డిసెంబరు 24 జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని దేశ వ్యాప్తంగా 7 రోజుల పాటు ఈ నెల 18 నుంచి 24 వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరకు వస్తువులు విక్రయించినా, నాసిరకం ఉత్పత్తులు అంటగట్టి సేవా లోపానికి పాల్పడినా ఇక నుంచి వినియోగదారులు ఇంటి నుంచే కమిషన్‌కు ఫిర్యాదు చేయవచ్చని ఆయన తెలిపారు. కేంద్ర వినియోగదారుల మంత్రిత్వ శాఖ అందుకోసం వాట్సాప్ సేవలను తీసుకొచ్చిందని దామోదర్ వివరించారు.

వాట్సాప్ నంబర్ : 88000 01915 లో మొదట హాయ్ అని టైప్ చేయాలని అందులో వచ్చే సూచనల ఆధారంగా వివరాలు నమోదు చేస్తే జాతీయ వినియోగదారుల కమిషన్ హెల్ప్ లైన్‌లో ఫిర్యాదు నమోదవుతుందని తెలిపారు. అనంతరం కేసు పరిష్కారం కోసం ఆవివరాలను ఆయా జిల్లా వినియోగదారుల కమిషన్‌కు పంపుతారని ఆయన పేర్కొన్నారు. కేసు పరిష్కారం అయ్యే వరకు అవసరమైన సలహాలు, సూచనలు కూడా అందిస్తారన్నారు. దీంతో పాటు 1800114000 లేదా 1915కు ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. సమావేశంలో వినియోగదారుల సలహా సంఘం సభ్యులు ప్రముఖ న్యాయవాది మల్యాల మనోహర్‌రావు, కవిరాజ్, ఇందిర, జోష్న, సతీష్, నరేష్, మంజుల తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పల్లెపాడు దామోదర్

హద్దు దాటొద్దు..

- సోషల్ మీడియాతో జాగ్రత్తలు అవసరం
- తప్పుడు పోస్టులు చేస్తే చర్యలు తప్పవు



వర్ధన్నపేట, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ ఫోన్లు వినియోగించే వారంతా దాదాపు సోషల్ మీడియా వినియోగిస్తూనే ఉంటారు. అయితే ఫేస్‌బుక్, వాట్సాప్ లాంటి వాటిల్లో పంపే సందేశాలు ఏమాత్రం అటుఇటు అయినా కటకటాల పాలుకావాల్సి వస్తుంది. అభ్యంతరకరమైన సందేశాలు మనకు వస్తే వాటిని మరొకరికి ఫార్వర్డ్ చేసినా తప్పే. అందుకే సందేశాలు పంపే ముందు ఫార్వర్డ్ చేసే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. సోషల్ మీడియాలో వాట్సప్‌కు ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. స్మార్ట్ ఫోన్ ఉన్న ప్రతీ ఒక్కరు ఈ యాప్ వాడు తున్నారు. సంక్షిప్త సందేశాలు మాత్రమే కాకుం డా నిర్ణీత పరిమాణంలో ఉన్న వాయిస్ ఫొటో లు, వీడియో ఫైల్స్ కూడా మార్పిడి చేసుకునే అవకాశం ఈ యాప్‌లో ఉంది. ఈ క్రమంలో ఎవరికి వారు ఇష్టారాజ్యంగా విచ్చలవిడిగా ఫొటోలు, వీడియో సందేశాలను ఎక్కువ మంది కి పంపేందుకు వీలుగా వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసుకుంటున్నారు. స్నేహితులు తమ తమ ఆలోచనలకు అనుగుణంగా.. ప్రభుత్వ ప్రైవేట్ సంస్థల అధికారులు, ఉద్యోగులు పరి పాలన సౌలభ్యం కోసం, త్వరితగతిన సమాచార మార్పిడి కోసం వాట్సప్ గ్రూపులను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇక కొందరైతే రైళ్లు, బస్సులు, దేవాలయాలు, ఫిట్‌నెస్, ధ్యానం, రియల్‌ఎస్టేట్, చిరువ్యాపారాలు, సినిమా అభిమానులు, కవులు, కళాకారులు, అపార్ట్‌మెంట్స్, కాలనీలు ఇలా ఎవరి అవసరాలకు తగ్గట్టు వారు గ్రూపులు పెడుతున్నారు. ఇలా ఒక్కొక్కరు పదుల సంఖ్యలో గ్రూపుల్లో సభ్యులుగా ఉన్నారు. ఈ గ్రూపు క్రియేటర్లు, అడ్మిన్లు గ్రూపులోకి వచ్చే ప్రతీ సందేశానికీ బాధ్యత వహించాల్సి ఉంటుంది. గ్రూపులో చేర్చుకునే ముందే అవతలి వ్యక్తికి సంబంధించిన సమాచారం తెలిసి ఉంటే అతడిని చేర్చుకోవాలో, లేదో అర్థమవుతుంది.

పాటించాల్సిన జాగ్రత్తలివే...

వాట్సప్ గ్రూపు అడ్మిన్ అనుమతి, ప్రమేయం లేకుండా గ్రూపు సభ్యులు గ్రూపులో అశ్లీల చిత్రాలు, అసభ్యకర ఫొటోలు, మనసుకు బాధ కలిగించే సందేశాలు పంపకూడదు. అలా పంపిస్తే అతడిపైనా, గ్రూపు అడ్మిన్‌పైనా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. దీనికి అడ్మినే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఆ గ్రూపునకు చెందిన లేదా ఇతర వ్యక్తులెవరైనా ఫిర్యాదు చేస్తే సమాచార చట్టం కొంద శిక్షపడే అవకాశం ఉంది. వాట్సప్, ఫేస్ బుక్‌లలో సందేశాలు, ఫొటోలు పెట్టేవారు ముందుగా వాట్సప్‌ను డౌన్‌లోడ్ చేసుకునే ముందు డిస్‌క్లైమర్‌ను అంగీకరిస్తారు. అందులోని నిబంధనల ప్రకారం వాట్సప్ సభ్యులు అడ్మినిస్ట్రేటర్ కొన్నిరకాల సందేశాలు, ఫొటోలు, వీడియోలు హోస్టు చేయడం, పోస్టు చేయడం, పోస్టు డిస్‌ప్లేలు మార్పులు, చేర్పులు అప్‌డేట్ చేయడం, షేక్ చేయడం నిషేధం. అధికారికంగా మరో వ్యక్తికి చెందినవి, ఇతరులకు ఇబ్బంది కలిగించే అసభ్యకరమైన అశ్లీలతో కూడిన ఓ మతం, వర్గం, వర్ణం, కులం, జాతులను కించపరిచే పోస్టులు, రెండు వర్గాల మధ్య వైరుధ్యాలు, రెచ్చ గొట్టేవి, మైనర్లకు హానికరంగా పరిగణించేవి, శాంతి భద్రతలు, ప్రజా జీవితాలకు భంగం కలిగించేవి, దేశ, జాతి, రాష్ట్ర, ప్రాంతీయ సమగ్రతకు ముప్పుగా మారే పుకార్లు, కేసుల దర్యాప్తునకు ఆటంకంగా మారేవి, వ్యక్తుల గ్రూపులను లక్ష్యంగా చేసుకుని బెదిరింపులు, హెచ్చరికలు వంటి వాటిపై నిషేధం ఉంది.

ఫిర్యాదులు వస్తే కేసులు నమోదు చేస్తాం



వాట్సప్ గ్రూపుల్లో ఉండే ఇతర సభ్యులకు ఇబ్బంది కలిగించేలా పోస్టులు పంపిన వ్యక్తిపై ఎవరైనా ఫిర్యాదుచేస్తే ఖచ్చితంగా చర్యలు తీసుకుంటాం. మనోభావాలను దెబ్బ తీసేలా, మత విద్వేశాలను రెచ్చగొట్టేలా, ఎవరినైనా కించపరిచేలా సందేశాలు పెట్టినా, అశ్లీల చిత్రాలు, వీడియోలు, మాటలు పంపినా.. రుజువులతో ఫిర్యాదు చేస్తే అలాంటి వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

- అంబటి నర్సయ్య, ఏసీపీ, వర్ధన్నపేట

ఆ నలుగురు.. కరువవుతున్నారు!

మారుతున్న ఆఖరిమజిలీ తీరు

పాడె మోసేవారు లేక వైకుంఠరథాల్లో అంతిమయాత్రలు

ఆచారవ్యవహారాలను అంతగా పట్టించుకోని నేటితరం

వెంకటాపూర్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు అయిన వారు ఎవరైనా చనిపోతే సప్త సముద్రాలు దాటైనా వచ్చేవారు. ఇప్పుడు కడసారి చూపునకు సప్తసముద్రాలు దాటడం మాట దేవుడెరుగు, కనీసం గడపదాటకుండానే మాయదారి సెల్‌ఫోన్లలోనే చివరి అంత్యక్రియల తంతును వీక్షిస్తున్నారు. ఆధునిక సాంకేతికత.. రక్త సంబంధాలను కూడా తెంచేసుకునే పరిస్థితి తెస్తోంది. చివరకు పల్లెల్లో కూడా ఎవరైనా చనిపోతే పాడెకట్టే వారు లేరు.. మోసేందుకు ఆ నలుగురు లేక వైకుంఠ రథాల్లోనే శ్మశానవాటికకు తీసుకెళ్తున్నారు. అయిన వారేమో ఫోన్లలోనే కన్నీరు కారుస్తున్నారు.

నాడు.. నేడు..

గతంలో తమవారు ఎవరైనా చనిపోతే అందరూ పనులు మానుకుని అంత్యక్రియలు పూర్తయ్యేవరకు అన్నం కూడా తినకుండా పస్తులు ఉండేవారు. గ్రామాలు, పట్టణాల్లో ఉన్న బంధువులకు, స్నేహితులకు విషయం తెలియాలంటే ప్రత్యేకించి ఒక మనిషిని పంపి సమాచారం తెలిపేవారు. ఇంటి చుట్టు పక్కల ఎవరికైనా ఫోన్ ఉంటే దాని ద్వారా తెలిపే వారు. దగ్గరి బంధువులు వచ్చేవరకు అంత్యక్రియలు చేసేవారు కూడా కాదు. శవాన్ని మోసేందుకు కట్టెలతో పాడె కట్టేవారు. డప్పుచప్పుళ్లతో అంత్యక్రియలు ఘనంగా నిర్వహించేవారు. గంగిరెద్దులను ఆడిపించేవారు. బంధువులు, స్నేహితులు శ్మశానవాటిక వరకు పాడెను మోసుకెళ్లేవారు. అంత్యక్రియలు ముగిశాక గ్రామ శివారుల్లో ఉన్న చెరువులు, కుంటల వద్ద స్నానాలు చేసేవారు. కానీ నేడు అవేమీ కానరావడం లేదు.

శవం వద్ద కుటుంబీకులు మాత్రమే ఉంటున్నారు. నేటి తరం వారైతే ఆచార వ్యవహారాలను అంతగా పట్టించుకునే పరస్థితి కనిపించడం లేదు. మొత్తం ఫోన్‌లో సమాచారం ఇస్తుండటంతో దూరంలో ఉన్న బంధు వులు కూడా గంటల వ్యవధిలో వచ్చి ఆఖరి చూపు చూస్తున్నారు. పాడె కట్టేవారు లేక.. వైకుంఠరథాల్లో అంతిమ యాత్రగా శ్మశాన వాటికలకు తీసుకెళుతున్నారు. ఇక ఇప్పుడు ప్రతీ గ్రామంలో ఆధునిక వైకుంఠధామాలు ఉండటం, అక్కడే స్నానపుగదులు, మరుగుదొడ్లు ఇతర సౌకర్యాలు కల్పించడంతో అన్నీ అక్కడే జరిగిపో తున్నాయి. పట్టణాల్లో అయితే కట్టెలతో కాల్చే పని కూడా లేకుండా విద్యుత్ దహన వేదికలు అందుబాటులోకి వచ్చాయి. విదేశాల్లో ఉండే వారైతే అప్పటికప్పుడు స్వదేశానికి రాలేక వీడియో కాల్స్‌లో తమవారిని చివరి చూపు చూస్తూ కన్నీరు కారస్తున్న సందర్భాలున్నాయి. పరిస్థితులున్నాయి.


అంత్యక్రియల్లో డప్పు వాయిస్తున్న కళాకారులు (ఫైల్)


పాడెపై మోసుకెళ్తున్న దృశ్యం (ఫైల్)



వైకుంఠ రథం (ఫైల్)



వైకుంఠధామం

ఆడబిడ్డల పిండి వంటకాలేవీ?

ఓ వ్యక్తి చనిపోతే ఆ ఇంటి ఆడబిడ్డ మూడు రోజుల పాటు ఆ ఇంట్లోనే ఉండి తీరొక్క వంటకాలు చేసి తమ కుటుంబీకులకు వండి పెట్టేవారు. ఆ తర్వాతే బంధువులు, స్నేహితులు రోజుకొకరు బాధిత కుటుంబం వారికి వంటకాలు చేసి పెడతారు. దినవారాలు పూర్తయ్యే వరకు అది కొనసాగుతుంది. ఇక దశదినకర్మ పూర్తయ్యేవరకు బంధువులు చనిపోయి న వ్యక్తి కుటుంబీకులకు చేదు విడిపించడం తెలంగాణ ప్రజల ఆనవాయితీ. ఇప్పుడివన్నీ కానరావడం లేదు.

ఒగ్గోళ్ల రాగాలు ఏమాయె?

దశదినకర్మ రోజున చనిపోయిన వ్యక్తి పేరును గుర్తుకు చేస్తూ ఒగ్గోళ్లతో రాగాలు పలికించేవారు. కథ చెబుతుంటే అందరూ ఒక్కచోట చేరి కథను చూసేవారు. కథ చెబుతుంటే కొంతమంది ఏడ్చేవారు. నేడు ఆ రాగాలు కనుమరుగయ్యాయి.

భజనలు, ఒగ్గు కథలు చెప్పించేవారు



నాడు ఎవరైనా చనిపోతే అంత్యక్రియలకు జనాలు ఎక్కువ వచ్చేవారు. అప్పుడు ఉన్న ప్రేమలు ఇప్పుడు కనిపించడం లేదు. చివరకు శవాన్ని పాడెపై తీసుకెళ్లే వారు కూడా లేరు. రాత్రివేళల్లో భజనలు, ఒగ్గుకథలు చెప్పించే వారు... ప్రస్తుతం అవేవీ లేవు. చుట్టాలు, స్నేహితులు ఇలా వచ్చి అలా వెళుతున్నారు. వైకుంఠదామాలు వచ్చిన తర్వాత అన్ని సౌకర్యాలు ఉండటంతో.. చెరువులు, కుంటల వద్ద స్నానాలు చేసే పరిస్థితులు పోయాయి.

- జనగాం రామస్వామి, నల్లగుంట

ఫ్యాషన్



ఫ్యాషన్‌కు అడ్డొస్తాయనే కారణంతో చలి కాలంలో శాలువాలు కప్పుకోడానికి వెనకాడే వాళ్లూ ఉంటారు. కానీ వెచ్చదనాన్ని అందిస్తూనే ఫ్యాషన్‌గా కనిపించేలా చేసే శాలువాలు మార్కెట్లో దొరుకుతున్నాయి. వాటినొకసారి చూద్దామా?

ఉన్ని, నూలు, పట్టు.. ఇలా వేర్వేరు దారాలతో తయారయ్యే భిన్నమైన శాలువాలు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. మృదువైన మెటీరియల్‌తో అత్యంత సౌకర్యవంతంగా ఉండే శాలువాలు అటు ఆధునిక వస్త్రధారణకూ, ఇటు సంప్రదాయ కట్టుబొట్టుకూ నప్పేలా తయారవుతున్నాయి.

శాల్ సోకు

కలంకారి: కలం అంటే పెన్ను, కారి అంటే పనితనం. ఎంబ్రాయిడరీతో మోటిఫ్స్, పూలు, లతల డిజైన్లను సృష్టించడం ద్వారా కలంకారి కళాకారులు అందమైన శాలువాలను రూపొందిస్తూ ఉంటారు. రాజ దర్బారు, మొఘల్ దర్బారు, బారాత్ బార్డర్లతో తయారయ్యే కలంకారి శాలువాలు సర్వత్రా ప్రజాదరణ పొందుతున్నాయి.

సోజ్ని: ఇదొక తరహా నీడిల్ ఎంబ్రాయిడరీ. దీంతో సాదాసీదా వస్త్రం కాస్తా, అద్భుతమైన శాలువా రూపాన్ని సంతరించుకుంటుంది. 15వ శతాబ్దంలో పర్షియన్లు ఈ కళను కాశ్మీరు లోయలో ప్రవేశపెట్టడంతో సోజ్ని పనితనం ప్రఖ్యాతి పొందింది. పర్షియా భాషలో సోజ్ని అంటే 'సూది'. అందంగా, మృదువుగా ఉండే సోజ్ని శాలువాలు తేలికగా కూడా ఉండడంతో వీటి వాడకం విస్తృతంగా విస్తరించింది.



పష్మీనా

ఫ్యాషన్‌గా కనిపించడంతో పాటు సంప్రదాయాలనూ, వారసత్వాన్నీ కలిగి ఉండే పష్మీనా శాలువాలు ఎంతో ప్రత్యేకమైనవి. లడాక్, కాశ్మీరులకు చెందిన చంగ్‌తాంగి పష్మీనా గొర్రెల ఉన్నితో తయారయ్యే స్వచ్ఛమైన పష్మీనా శాలువాలకు ప్రపంచవ్యాప్తంగా గిరాకీ ఉంది. ఎంచుకున్న డిజైన్, ఉపయోగించిన ఉన్ని ఆధారంగా కళాకారులు ఈ శాలువాల ధరలను నిర్ణయిస్తూ ఉంటారు. ఈ శాలువాల తయారీలో కళాకారులు సౌకర్యానికీ, మన్నికకు పెద్ద పీట వేస్తూ ఉంటారు.

'సుమో రెజ్లింగ్' అనగానే గుర్తుకొచ్చేది భారీకాయులైన పురుషులే... పురుషుల ఆధిపత్యం కొనసాగే ఈ క్రీడలో ధైర్యంగా అడుగుపెట్టడమే కాదు... భారతదేశంలో తొలి మహిళా సుమో రెజ్లర్‌గా, ప్రపంచంలో టాప్-5లో ఒకరుగా తనదైన చరిత్ర సృష్టించారు **హేతల్ దావే**.

ఆమె కథతో రూపొందిన 'సుమో దీదీ' చిత్రం పలు అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో ప్రదర్శితమై మన్ననలు అందుకుంది.

"ఈ రంగంలో మన దేశం నుంచి ఎక్కువమంది మహిళా ఛాంపియన్లను తయారుచేయడమే తన ధ్యేయం" అంటున్న 36 ఏళ్ల హేతల్ విభిన్నమైన ప్రయాణం గురించి ఆమె మాటల్లోనే...

సుమో దీదీ!



"నలుగురూ వెళ్ళే దారిలో వెళ్లడం సౌకర్యంగా ఉంటుంది. అయితే అది అన్ని వేళలా సంతృప్తికరంగా ఉండదు. అందుకే ఎప్పుడూ ఏదైనా కొత్తగా ప్రయత్నించాలని అనుకుంటాను. ఈ స్వభావం నాకు మొదటినుంచీ ఉంది. అదే నన్ను ఈ స్థాయిలో నిలిపింది. దీనికి తొలి ప్రేరణ నా కుటుంబం నుంచే లభించింది. నా స్వస్థలం ముంబాయి. మా నాన్న సుధీర్ ధావేకి క్రీడలంటే ఎంతో ఇష్టం. అందుకే మా అన్నయ్య అక్షయ్‌ను మార్షల్ ఆర్ట్స్‌లో ప్రోత్సహించారు. అన్నయ్య సాధన చేస్తున్నప్పుడు తనతోపాటు నేనూ వెళ్ళేదాన్ని. అలా నాకు తెలియకుండానే వాటి మీద ఇష్టం పెరిగిపోయింది. బ్రూస్లీ, జాకీచాన్ సినిమాలు కూడా నన్ను ప్రభావితం చేశాయి. అన్నయ్యతోపాటు నేనూ జూడో నేర్చుకుంటానని ఇంట్లో చెప్పాను. మా కుటుంబంలో చాలాకాలం తరువాత పుట్టిన ఆడపిల్లనని నన్ను అందరూ అపురూపంగా చూసుకొనేవారు. అందుకే వాళ్ళు వద్దంటారని అనుకున్నాను. కానీ అమ్మానాన్నతో పాటు మా తాతయ్య, బామ్మ... ఇలా అందరూ ప్రోత్సహించారు. అప్పుడు నా వయసు అయిదేళ్ళే. జూడోలో ప్రావీణ్యం వచ్చిన తరువాత... కుస్తీ నేర్చుకున్నాను. సుమో రెజ్లర్ కావాలనే నా కలకు అప్పుడే బీజం పడింది. కానీ అది అంత సులభంగా నెరవేరలేదు.

ఆశ వదిలేసుకున్నా...

నాకు శిక్షణ ఇచ్చేవారి కోసం నాన్న ఎంతోమంది కోచ్‌లను కలిశారు. కానీ "అమ్మాయిలకి సుమో రెజ్లింగ్ ఏమిటి? మీకు మతిపోయిందా?" అంటూ అందరూ తిరస్కరించారు. చివరకు మా నాన్న, అన్నయ్య నాకు కోచ్‌లుగా మారారు. మన దేశంలో ప్రాక్టీస్ చెయ్యడానికి సుమో రింగ్‌లు లేవు. దాంతో మామూలు మైదానంలోనే సాధన చేశాను. మరోవైపు వీడియోలు చూస్తూ మెళకువలు నేర్చుకున్నాను. నా చదువు, క్రీడల్లో అభ్యాసం సమాంతరంగా సాగాయి. బి.కామ్. పూర్తి చేశాను. సుమో రెజ్లింగ్‌లో నాకు నైపుణ్యం వచ్చిందనుకున్న తరువాత... పోటీలకు వెళ్లాలనుకున్నాను. కానీ మన దేశంలో నేనే మొదటి మహిళా సుమో రెజ్లర్‌ని. కాబట్టి పోటీల్లో పాల్గొనాలంటే విదేశాల్లోనే సాధ్యం. అదే పెద్ద సమస్యగా మారింది. నన్ను స్పాన్సర్ చెయ్యడానికి ఎవరూ లేరు. ఎవరినైనా అడిగినా... కనీసమైన సాయం చెయ్యకపోగా... ఎగతాళిగా, నిరుత్సాహపరిచేలా మాట్లాడేవారు. సామాజికంగా ఎన్నో అవమానాలను ఎదుర్కొన్నాను. శారీరకంగా చాలా గాయాలు భరించాను. శిక్షణలో ప్రతిరోజూ ఒక సవాలుగానే గడిచింది. వాటన్నిటికన్నా... నా ప్రతిభను ప్రదర్శించే అవకాశం లేకపోయిందనే ఆలోచన నన్ను తీవ్రంగా బాధపెట్టింది. ఒక దశలో దాదాపు ఆశ వదిలేసుకున్నాను. ఆ సమయంలో నాన్న, అన్నయ్య ఎంతో కష్టం మీద డబ్బు సమకూర్చారు. 2008లో ఈస్టోనియాలో జరిగిన 'నేషనల్ సుమో ఛాంపియన్‌షిప్' పోటీలో, ఆ తరువాత పోలండ్, ఫిన్‌లాండ్... ఇలా పలు దేశాల్లో జరిగిన ఈవెంట్స్‌లో నా సామర్థ్యాన్ని ప్రదర్శించే అవకాశం వచ్చింది. 2015లో 'ఏషియన్ సుమో ఛాంపియన్ షిప్'లో కాంస్యం, 2016లో మనదేశంలోనే జరిగిన 'నేషనల్ సుమో ఛాంపియన్ షిప్'లో స్వర్ణ పతకం సాధించాను. చైనాలో నిర్వహించిన 'ఆసియా ఛాంపియన్ షిప్స్', చైనీస్ తైపీలో జరిగిన 'వరల్డ్ గేమ్స్'... ఇలా ఎన్నో ఈవెంట్స్‌లో మన దేశం తరఫున ప్రాతినిధ్యం వహించాను. విదేశాల్లోని మహిళా సుమో రెజ్లర్లకు గట్టి పోటీ ఇచ్చే భారతీయురాలిగా పేరు వచ్చింది. ప్రపంచ స్థాయిలో అయిదో ర్యాంక్‌లో నిలిచాను.

ఆ తరువాతే చాలామందికి తెలిసింది...

ఇప్పటివరకూ ఇండియాలో, విదేశాల్లో 200కు పైగా పోటీల్లో పాల్గొన్నాను. ఎన్నో పతకాలు గెలిచాను. మన దేశంలో మొదటి ప్రొఫెషనల్ మహిళా సుమో రెజ్లర్‌గా ఖ్యాతిని, పలు పురస్కారాలను అందుకున్నాను. కొన్నిసార్లు పురుషులతోనూ పోటీ పడి నా ప్రతిభను నిరూపించుకున్నాను. 'లిమ్కా బుక్‌ఆఫ్ రికార్డ్స్'లో నా పేరు చోటుచేసుకుంది. కిందటి ఏడాది నా జీవిత కథతో 'సుమో దీదీ' అనే సినిమా రూపొందింది. కొత్త దర్శకుడు జయంత్ రోహత్గీ ఈ సినిమా గురించి ప్రతిపాదనతో వచ్చినప్పుడు... మొదట్లో సంకోచించినా, నా కథ కొందరికైనా స్ఫూర్తినిస్తుందనే ఉద్దేశంతో ఒప్పుకున్నాను. ఆ సినిమాలో నా పాత్రను శ్రియమ్ భగ్నానీ పోషించారు. 2023 'టోక్యో అంతర్జాతీయ చలన చిత్రోత్సవం', ఈ ఏడాది 'పామ్ స్ప్రింగ్స్ అంతర్జాతీయ చలన చిత్రోత్సవం', '24వ న్యూయార్క్ ఇండియన్ చలన చిత్రోత్సవం' తదితర పలు ప్రతిష్ఠాత్మకమైన చిత్రోత్సవాల్లో 'సుమోదీదీ' ప్రదర్శితమయింది. ప్రేక్షకుల నుంచి, విమర్శకుల నుంచి ప్రశంసలు అందుకుంది. నిజానికి ఆ సినిమా తరువాతే నా గురించి మన దేశంలో చాలామందికి తెలిసిందన్నా అతిశయోక్తి లేదు.

అదే నా తపన...

నన్ను కలిసిన ఎంతోమంది పిల్లలు సుమో రెజ్లర్స్ అవుదామనుకుంటున్నామని చెప్పినప్పుడు... ఎంతో సంతోషం కలుగుతూ ఉంటుంది. సుమో రెజ్లింగ్‌లో మన దేశం నుంచి ప్రాతినిధ్యాన్ని పెంచాలి. ఎక్కువమంది అమ్మాయిలు ఈ క్రీడను కెరీర్‌గా ఎంచుకోవాలి. ఇదే నా తపన. అందుకే తీరిక సమయాల్లో ముంబాయిలోని పాఠశాలలకు వెళ్ళి కుస్తీ, జూడో, సుమో రెజ్లింగ్‌లో పిల్లలకు శిక్షణ ఇస్తున్నాను. ఇది కేవలం పోటీల్లో పాల్గొనడం, పతకాలను గెలవడానికి మాత్రమే సంబంధించిన విషయం కాదు. ముఖ్యంగా అమ్మాయిలపై సామాజికమైన నియంత్రణలు ఎన్నో ఉంటాయి. వాటన్నిటినీ దాటాలంటే శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలి. దానికి క్రీడలు ఎంతో దోహదం చేస్తాయి. ఎలాంటి సవాల్‌నైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండి, పట్టుదలతో, అంకిత భావంతో కృషి చేస్తే విజయం తప్పకుండా లభిస్తుంది. దానికి నేనే ఉదాహరణ."



ఒంటరిగా ఎదిగి... ప్రేరణగా నిలిచి

జీవితం ఆమెకు వడ్డించిన విస్తరి కాదు.
ప్రేమించినవాడి మోసానికి బలయింది.
పెళ్లి కాకుండానే పిల్లాడికి తల్లి అయింది.
చంకలో బిడ్డ... మంచాన పడ్డ నాన్న... ఒంటరిగా బతుకు పోరు మొదలుపెట్టి... సొంతంగా ఒక కంపెనీ ప్రారంభించి... నేడు తనలాంటి మహిళలకు ఉపాధి మార్గమయింది. అవరోధాలనే అవకాశాలుగా మార్చుకొని... ప్రతి పనినీ ఒక సవాలుగా తీసుకొని... ఎందరికో స్ఫూర్తిమంత్రమైన గిరిజన మహిళ **యంగ్‌మిలా జిమిక్** కథ ఇది.

స్ఫూర్తి



"కష్టాలు ఎదురయ్యాయని బాధపడుతూ కూర్చుంటే జీవితం అక్కడే ఆగిపోతుంది. జీవితమంటేనే పోరాటం. ఈ సత్యం నాకు చిన్న వయసులోనే బోధపడింది. మణిపూర్ ఉఖరుల్ జిల్లాలో ఓ పేద గిరిజన కుటుంబం మాది. పెద్దగా చదువుకోలేదు. యుక్త వయసులో ఒక వ్యక్తితో ప్రేమలో పడ్డాను. పెళ్లి చేసుకొంటానన్న అతడి మాటలు నమ్మి... బిడ్డకు తల్లినయ్యాను. తీరా బిడ్డ పుట్టాక నన్ను వదిలేసి వెళ్లిపోయాడు. ఇదంతా 1991లో. అప్పటికి నా వయసు 21 సంవత్సరాలు. అవివాహిత తల్లిగా ఈ సమాజం చూసే చూపు నాకు నిద్ర లేని రాత్రులు ఎన్నో విగిల్చింది. అయితే తేరుకోవడానికి ఎక్కువ కాలం పట్టలేదు. ఎందుకంటే నా మీద ఆధారపడి రెండు ప్రాణాలున్నాయి. మా అబ్బాయి, రోగంతో మంచంలో ఉన్న మా నాన్న... ఇద్దరి బాధ్యత తీసుకున్నాను. బాధను దిగమింగుకొని, అవహేళనలను భరించాను.

కూరగాయలు అమ్ముతూ...

నాకంటూ ఏ ఆధారం లేదు. కానీ నాతోపాటు మరో ఇద్దరిని బతికించాలి. ఏంచేయాలో తోచలేదు. ఆలోచించాను. చేతిలో నాలుగైదు వందలు ఉన్నాయి. వాటితో కూరగాయలు కొన్నాను. వాటిని బుట్టలో పెట్టుకుని, తెల్లవారుజామునే నేను నివసించే ఫరుంగ్ గ్రామం నుంచి ఏడు కిలోమీటర్ల దూరంలోని ఉఖరుల్ పట్టణానికి నడిచి వెళ్లేదాన్ని. మధ్యలో కొండలు ఎక్కి దిగాలి. మధ్యాహ్నం వరకు అమ్మి, ఇంటికి రావడం... భోజనం చేసి తిరిగి వెళ్లడం... ఇలా పదేళ్ల రాత్రనక పగలనక కష్టపడ్డాను. ఇది నేను కోరుకున్న జీవితం కాదు. కానీ పరిస్థితులకు తగినట్టు సర్దుకుపోతేనే ముందడుగు వేయగలం.



సరికొత్త ప్రయత్నం...

కూరగాయల వ్యాపారం అంత లాభసాటిగా లేకపోవడంతో... పాత దుస్తులు అమ్మడం మొదలుపెట్టాను. దాంతోపాటే పౌల్ట్రీ రంగంలో ప్రయత్నించాను. ఆశించిన ఫలితాలు రాలేదు. ఎన్నో ఒడుదొడుకుల తరువాత 2016లో కానీ ఆర్థికంగా నిలదొక్కుకోలేకపోయాను. ఆ ఏడాది ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలోకి దిగాను. దాని కోసం ఓ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ తీసుకున్నాను. కేవలం ఐదు వందల రూపాయల పెట్టుబడితో అంకుర సంస్థ... 'షిరిన్ ఫుడ్స్' నెలకొల్పాను. క్యాండీలు తయారు చేసే సంస్థ ఇది. దీని ద్వారా నేను తెచ్చిన మొట్టమొదటి ఉత్పత్తి... ఉసిరికాయ క్యాండీ. దానికి మంచి ఆదరణ లభించింది. తరువాత నుంచి ఆలివ్, యాపిల్, అంజీరా, మామిడి తదితర పండ్లతో క్యాండీలు తయారు చేస్తున్నాం. స్థానికంగా బాగా అమ్ముడుపోయాయి.

ఇతర ప్రాంతాల్లోనూ...

తొలి ప్రయత్నం విజయవంతం కావడంతో ఆర్గానిక్ పచ్చళ్ల తయారీ కూడా ప్రారంభించాను. పచ్చిమిర్చి, వెల్లుల్లి, వంకాయ వంటి వాటితో పచ్చళ్లు చేసి విక్రయానికి పెట్టాం. వెంటనే అమ్ముడుపోయాయి. పచ్చళ్ల తయారీలో 'కృషి విజ్ఞాన్ కేంద్ర' (కేవీకే) వారి వద్ద శిక్షణ తీసుకున్నా. ప్రస్తుతం ఉఖరుల్ ప్రాంతంలో ఒక యూనిట్ నడుస్తోంది.మా ఉత్పత్తులు ఇప్పుడు మణిపూర్‌లోనే కాదు... అసోం, నాగాలాండ్, ఢిల్లీ తదితర ప్రాంతాల్లో కూడా అందుబాటులో ఉన్నాయి. ఫేస్‌బుక్, ఇతర ఆన్‌లైన్ వేదికల ద్వారా విక్రయిస్తున్నాం. ఆరంభంలో ఇంటింటికీ తిరిగి అమ్మేవాళ్లం. నాకు సాయం కోసం ఒకే ఒక వర్కర్ ఉండేది. ప్రస్తుతం పన్నెండు మంది గిరిజన మహిళలు పని చేస్తున్నారు. ఏ దిక్కూ లేని నేను ఇవాళ కొంతమందికైనా ఉపాధి అవకాశాలు కల్పించగలిగానంటే... ఎంతో సంతోషంగా ఉంది.

ఒక తల్లిగా...

ఇప్పుడు మా అబ్బాయి కూడా ఎదిగొచ్చాడు. వాడికి ఆరేళ్లప్పుడు మా నాన్న తనతో నాగాలాండ్ తీసుకువెళ్లారు... మంచి చదువులు చదివించడానికి. ఒక్కగానొక్క బిడ్డ దూరంగా వెళుతుంటే నన్ను నేను నియంత్రించుకోలేకపోయాను. వాడు కూడా బిక్క ముఖం వేశాడు. కానీ తప్పదు. కొన్ని సాధించాలంటే కొన్ని వదులుకోవాలి. నా బిడ్డ బంగారు భవిత కోసం నేను దాదాపు ఇరవై ఏళ్లు వాడికి దూరంగా గడిపాను. పదేళ్ల కిందట మా అబ్బాయి తిరిగి వచ్చాడు. 'మా అమ్మను చూసి నేను గర్వపడుతున్నా. ఎన్నో సవాళ్లు, ఒడుదొడుకులు. వేటికీ వెనకడుగు వేయలేదు. ధైర్యంగా అన్నిటినీ ఎదుర్కొని... తన కాళ్లపై తాను నిలబడడమే కాదు, తనలాంటి మరికొంతమంది మహిళలకు అండగా నిలుస్తోంది. అందుకే అమ్మను చూసినప్పుడు నా గుండె ఆనందంతో ఉప్పొంగుతుంది. నా ముందు నిలుచున్న ప్రేరణ శక్తిగా అనిపిస్తుంది' అంటూ మా అబ్బాయి నా గురించి సందర్భం వచ్చినప్పుడల్లా అందరికీ చెబుతుంటాడు. అది వాడికి నా మీద ఉన్న ప్రేమ.

అవార్డులు... రివార్డులు...

నా ఈ ప్రయాణంలో ప్రతిష్ఠాత్మక అవార్డులు కూడా వరించాయి. 'విజయలక్ష్మీ దాస్ ఎంట్రప్రెన్యూర్‌షిప్' అవార్డుతో పాటు 'అసోం ఉమెన్ ఆంట్రప్రెన్యూర్స్' పురస్కారం కూడా అందుకున్నాను. మణిపూర్ గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు స్వయంశక్తితో ఎదగడానికి స్ఫూర్తి రగిలించి, వారి జీవన స్థితిగతుల్లో మార్పునకు ప్రభావవంతమైన పాత్ర పోషించినందుకు గానూ నాకు ఈ అవార్డులు లభించాయి. అంతేకాకుండా భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ నిర్వహించే పలు వర్క్‌షాపులకు వెళ్లి వివిధ అంశాలపై మాట్లాడుతుంటాను. నాకంటూ పెద్దగా కోరికలు ఏమీ లేవు. స్వయంకృషితో ఎదగాలనుకొనే మహిళలకు నేను ఒక స్ఫూర్తిమంత్రం కావాలని కోరుకొంటున్నా. ఈ సంస్థను విస్తరించి... మరింత మందికి ఉపాధి మార్గంగా నిలవాలనే ధ్యేయంతో పని చేస్తున్నా."

యుక్తవయసు రాకముందే...

పిల్లలు పెరిగి పెద్దవారై జీవితంలో విజయం సాధించాలంటే తల్లిదండ్రులు కీలక పాత్ర పోషించాల్సి ఉంటుంది. పిల్లలకు చిన్నతనంలోనే క్రమశిక్షణ, నైతిక విలువలు, కష్టపడే తత్వం తదితరాల ప్రాముఖ్యాన్ని వివరించాలి. వీటినే పునాదులుగా చేసుకొని పిల్లలు ఉన్నత శిఖరాలు చేరుకోగల్గుతారు. యుక్తవయసు రాకముందే పిల్లలకు తల్లిదండ్రులు ఏ పనులు నేర్పించాలో తెలుసుకుందాం.

వంటింటి పనులు: తల్లిదండ్రులు వంట చేసేటపుడు సహాయం చేయమని అడిగితే పిల్లలు సంతోషపడతారు. కూరగాయలు కడగడం, వాటి తొక్కు తీయడం వంటివి చెప్పి చేయించండి. బ్రెడ్‌కు వెన్న రాయడం, శాండ్‌విచ్‌లు తయారు చేయడం, గుడ్లు గిలక్కొట్టడం, ఉడికించిన గుడ్లకు పెంకు తీయడం, చపాతీలు పామడం, బియ్యం కడగడం, వంట పూర్తయిన తరవాత స్టవ్ శుభ్రం చేయడం, చిన్న పళ్లాలు-గిన్నెలు-గ్లాసులు కడగడం వంటి వాటిని పిల్లలకు నేర్పించండి. దీనివల్ల పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

గది సర్దడం

పిల్లలకు వారి గదిని అందంగా ఉంచుకోవడం నేర్పించాలి. ఉదయం నిద్ర లేవగానే వారు కప్పుకున్న దుప్పటి మడతపెట్టి దానిని నిర్దేశిత స్థానంలో ఉంచమని చెప్పి చేయించాలి. మంచం మీద దుప్పటిని చక్కగా పరచడం, దిండుని సరిగా పెట్టడం నేర్పించాలి. బొమ్మలతో ఆడుకున్నాక వాటిని అరల్లో సర్దమని చెప్పాలి. పాఠశాలకు తీసుకెళ్లే బ్యాగ్, పుస్తకాలను నిర్లక్ష్యంగా పడేయకుండా టేబుల్ మీద సర్దుకోవడం చేసి చూపించాలి. సెలవు రోజుల్లో గదిని ఊడవడం, తుడవడం; కిటికీ తలుపులు, ఫ్యాన్ రెక్కలను శుభ్రం చేయడం వంటి వాటిని పిల్లలతో చేయించాలి.



చెత్త బుట్ట: పనికిరాని కాగితాలు, ప్లాస్టిక్ వస్తువులు, ఇతర చెత్తను నిర్దేశిత బుట్టలో వేయాలని పిల్లలకు చెప్పండి. తడి చెత్త, పొడి చెత్తలను వేరుచేసే విధానాన్ని తెలియజెప్పాలి. చెత్తను తీసుకెళ్లే పారిశుధ్య కార్మికులు ఇంటి ముందుకి వచ్చినపుడు వారికి చెత్త బుట్టలను ఇచ్చే పనిని పిల్లలకు చెప్పి చేయించండి. దీనివల్ల పిల్లలకు పరిశుభ్రత విలువ, పర్యావరణ రక్షణ తదితర అంశాలు అర్థమవుతాయి.

ఇంటి పనులు: తల్లిదండ్రులు ఇంట్లో చేసే పనుల్లో సులభమైనవాటిని పిల్లలకు అప్పజెప్పడం మంచిది. మొక్కలకు నీళ్లు పోయడం, బల్బు లేదా ట్యూబ్‌లైట్ మార్చడం, నీళ్లు పట్టడం, కిరాణా కొట్టు నుంచి అవసరమైనవాటిని కొనుక్కుని రావడం, సంతకెళ్లి పండ్లు లేదా కూరగాయలు తీసుకురావడం, రేషన్ షాపు ముందు క్యూలో నిల్చోవడం వంటి వాటిని పిల్లలచేత చేయించాలి. దీనివల్ల పిల్లల్లో సానుకూల దృక్పథం, సంభాషణా నైపుణ్యం పెరుగుతాయి. తోటివారితో మెలగాల్సిన తీరు అర్థమవుతుంది. ఏదైనా సమస్య వస్తే సొంతంగా పరిష్కరించుకునే తెలివి అలవడుతుంది.

సమయపాలన: పిల్లలకు అన్ని పనులను సమయానుసారం చేయడం నేర్పించాలి. ఉదయాన్నే లేవడం, ఆలస్యం కాకుండా పాఠశాలకు వెళ్లడం, బద్ధకించకుండా హోం వర్క్ చేసుకోవడం, సమయానికి నిద్రపోవడం అలవాటు చేయాలి. పనులను వాయిదా వేయడాన్ని ప్రోత్సహించవద్దు. ఎప్పటి పనులు అప్పుడే చేయమని కచ్చితంగా చెప్పి చేయించండి. దీనివల్ల పిల్లలకు సమయపాలన అలవడుతుంది. ఇది వారి ఉన్నత స్థితికి కారణమవుతుంది కూడా.

పొదుపు

డబ్బుని పొదుపుగా వాడడం ఎలానో పిల్లలకు తెలియజెప్పాలి. వారికిచ్చే పాకెట్‌మనీని అవసరం మేరకు వాడుకుని మిగిలిన మొత్తాన్ని దాచమని చెప్పాలి. దాచుకున్న డబ్బుతో మంచి పుస్తకాలు లేదంటే ఇష్టమైన బొమ్మలు కొనుక్కోవడం, స్నేహితులకు పుట్టినరోజున బహుమతులు ఇవ్వడం వంటివి నేర్పించాలి. అనవసరంగా డబ్బు ఖర్చు చేయవద్దని గట్టిగా చెప్పాలి.

ఉమ్మడి ప్రవేశ పరీక్షలకు కన్వీనర్ల నియామకం

హైదరాబాద్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిర్వహించే వివిధ ప్రవేశ పరీక్షలకు సంబంధించి కన్వీనర్లను ఉన్నత విద్యా మండలి నియమించింది. ఏడు సెట్‌లకు కన్వీనర్లను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. నాలుగింటికి పాత వారినే కొనసాగిస్తుండగా.. మూడు సెట్లకు సంబంధించిన కన్వీనర్లను కొత్త వారిని ఎంపిక చేసింది. ఏ యూనివర్సిటీ ఏ పరీక్షను నిర్వహిస్తుందో కూడా ప్రకటించింది.

కన్వీనర్ల వివరాలు

సెట్ పేరు	యూనివర్సిటీ	కన్వీనర్ పేరు
ఎప్‌సెట్	జేఎన్‌టీయూ	డీన్ కుమార్
పీజీఈసెట్	జేఎన్‌టీయూ	అరుణ కుమారి
ఐసెట్	మహాత్మా గాంధీ	అలువల రవి
ఈసెట్	ఉస్మానియా	చంద్రశేఖర్
లాసెట్	ఉస్మానియా	విజయలక్ష్మీ
ఎడ్‌సెట్	కాకతీయ	వెంకట్రామ్‌రెడ్డి
పీఈసెట్	పాలమూరు	ఎస్ ఎస్ దిలీప్

విష్ణు ఎలాంటి గొడవా చేయలేదు

- పోలీసులకు మోహన్‌బాబు భార్య లేఖ

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): 'ఈ నెల 14న నా పుట్టినరోజు సందర్భంగా జల్‌పల్లిలోని ఇంటికి వచ్చిన నా పెద్ద కొడుకు విష్ణు ఎలాంటి గొడవా చేయలేదు. కేక్ తీసుకొచ్చి నా పుట్టినరోజును సెలబ్రేట్ చేసి వెళ్లిపోయాడ'ని సినీనటుడు మోహన్‌బాబు భార్య నిర్మల స్పష్టం చేశారు. విష్ణు గొడవ చేసినట్లు తన చిన్న కొడుకు మనోజ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తన దృష్టికి వచ్చిందని, అతని ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని ఆమె రాచకొండ పోలీసులకు లేఖ రాశారు. ఇంట్లో వివాదాలపై మొదటిసారిగా ఆమె స్పందించారు. తమ ఇంట్లో మనోజ్‌కు ఎంత హక్కు ఉందో విష్ణుకు అంతే హక్కు ఉందన్నారు.

సంధ్య థియేటర్‌కు షోకాజ్ నోటీసు

- మీ లైసెన్స్ ఎందుకు రద్దు చేయొద్దు?
- 10 రోజుల్లో వివరణ ఇవ్వండి
- థియేటర్ యాజమాన్యాన్ని ఆదేశించిన సీపీ ఆనంద్

హైదరాబాద్ సిటీ/రాంగోపాల్‌పేట్/పంజాగుట్ట, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): పుష్ప 2 ప్రీమియర్ షో సందర్భంగా ఈ నెల 4న సంధ్య థియేటర్‌లో చోటుచేసుకున్న తొక్కిసలాట ఘటనపై ఆ థియేటర్ యాజమాన్యానికి నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మృతిచెందగా ఆమె కుమారుడు శ్రీతేజ తీవ్రంగా గాయపడి.. ఇంకా కోలుకోలేదు. థియేటర్ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే తొక్కిసలాట జరిగిందని, థియేటర్ లైసెన్సు ఎందుకు రద్దు చేయకూడదో తెల పాలని నోటీసులో పేర్కొన్నారు. పది రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు. ప్రీమియర్ షోకు హీరో, హీ రోయిన్ రావొద్దని, వస్తే ఇబ్బందులు తలెత్తుతాయని చిక్కడపల్లి పోలీసులు థియేటర్ యాజమాన్యానికి ముందుగానే తెలిపిన విషయాన్ని గుర్తుచేశారు. పక్కపక్కనే రెండు థియేటర్లు, ఆ ప్రాంతంలో రెస్టారెంట్లు ఉండడం వల్ల రద్దీ ఎక్కువగా ఉంటుందని, శాంతిభద్రతల సమస్య ఉత్పన్నమయ్యే ప్రమాదం ఉందని చెప్పినా థియేటర్ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడం, అల్లు అర్జున్ ఓపెన్ టాప్ వాహనంలో అభివాదం చేసుకుంటూ రావడంతో తొక్కిసలాట జరిగి.. ఓ కుటుంబం చిన్నాభిన్నమైందని నోటీసుల్లో పేర్కొన్నారు. కాగా, శ్రీతేజ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడానికి ప్రభుత్వం తరపున సీపీ ఆనంద్.. ఆరోగ్య శాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టీనా, సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాంశ్‌తో కలిసి మంగళవారం కిమ్స్ ఆస్పత్రికి వచ్చారు. వైద్యులతో మాట్లాడారు. అనంతరం క్రిస్టీనా మాట్లాడుతూ శ్రీతేజ ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని, చికిత్సకు అవసరమైన సహకారాన్ని ప్రభుత్వం నుంచి అందిస్తామని చెప్పారు. త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నామన్నారు.

శ్రీతేజకు తగ్గిన జ్వరం

శ్రీతేజకు పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (పీఐసీయూ)లోనే వెంటిలేటర్ సహాయంతో చికిత్స అందిస్తున్నామని కిమ్స్ కడల్స్ ఆస్పత్రి వైద్యులు చేతన్ ఆర్.ముందాడ, విష్ణు తేజ్‌పుడి తెలిపారు. మంగళవారం సాయంత్రం హెల్త్ బులెటిన్‌ను విడుదల చేశారు. శ్రీతేజకు ఇంతకుముందు అడపాదడపా జ్వరం వస్తుండేదని, ఇప్పుడు రావడంలేదని పేర్కొన్నారు. అతని వైటల్ పారామిటర్స్ స్థిరంగా ఉన్నాయని, ట్యూబ్ ద్వారా ఆహారం బాగానే తీసుకుంటున్నాడని వివరించారు. కాగా, పుష్ప సినిమా లాభాల్లో 10% శ్రీతేజ కుటుంబానికి ఇవ్వాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న డిమాండ్ చేశారు. శ్రీతేజ ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవడానికి వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ భవిష్యత్తులో ప్రీమియర్ షోలకు అనుమతివ్వొద్దని శాసనమండలిలో చర్చిస్తానన్నారు. మరోవైపు.. జనసేన పార్టీకి అల్లు అర్జున్ ఎంతో నష్టం చేశారని సినీ దర్శకుడు వారణాసి సూర్య ఆరోపించారు. పుష్ప-2 ప్రీమియర్ షో సందర్భంగా తొక్కిసలాటలో ఒక మహిళ మృతిచెందినా, ఆమె కుమారుడు ఐసీయూలో చికిత్స పొందుతున్నా వారి కుటుంబాన్ని అల్లు అర్జున్ ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడారు.

10కి చేరిన అరెస్టుల సంఖ్య

హైదరాబాద్ సిటీ/చిక్కడపల్లి: సంధ్య థియేటర్‌లో తొక్కిసలాట కేసులో చిక్కడపల్లి పోలీసులు మంగళవారం మరో నిందితుడిని అరెస్టు చేసినట్లు తెలిసింది. దీంతో ఇప్పటివరకు అరెస్టు చేసిన నిందితుల సంఖ్య పదికి చేరింది. మరో ఆరుగురు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వారి కోసం ప్రత్యేక పోలీసు బృందాలు గాలిస్తున్నాయి.

ప్రకృతి వైద్యం కేరాఫ్ వికారాబాద్!

(మొదటి పేజీ తరువాయి)

భూమి ఉంది. ఇందులోని కొంత భాగంలో రూ.300 కోట్ల నుంచి రూ.500 కోట్ల మేర వ్యయంతో ప్రకృతి ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం అనుకుంటుంది. అయితే, ఈ కేంద్రం ఏర్పాటుకు టెండర్లు ఆహ్వానించాలా ? పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చే సంస్థలకు ప్రాజెక్టు అప్పగించాలా? ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో ఏర్పాటు చేయాలా? అనే అంశాలపై ప్రభుత్వం ప్రస్తుతం కసరత్తు చేస్తోంది. త్వరలోనే విధివిధానాలను ఖరారు చేసుకుని అధికారిక ప్రకటన చేయనుంది.

ఎన్నెన్నో వనమూలికలు...

"హైదరాబాద్ కీ హవా.. ఏక్ లాక్ కీ దవా.." అనే నానుడి పూర్వకాలం నుంచి ఉంది. హైదరాబాద్‌కు అతి సమీపంలో ఉన్న వికారాబాద్ అడవుల్లో లెక్కకు మిక్కిలి వనమూలిక చెట్లు ఉండటమే ఇందుకు కారణం. వికారాబాద్ అడవుల్లో వీచే గాలులు కూడా ఎన్నో వ్యాధులను నయం చేస్తాయనే పేరుంది. అత్యంత ప్రమాదకరమైన క్షయను నయం చేసే వనమూలికలు వికారాబాద్ అడవిలో ఉన్నాయి. దాని వల్లే ప్రభుత్వం ఇప్పటికే అక్కడ క్షయ చికిత్స కేంద్రాన్ని నిర్వహిస్తుంది. ఇప్పటికే పర్యాటక ప్రాంతంగా మారిన ఈ ప్రాంతాన్ని ప్రకృతి వైద్యానికి కేంద్రంగా మారిస్తే.. ఈ ప్రాంతానికి అంతర్జాతీయ గుర్తింపు లభించి పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందుతుందని ప్రభుత్వ ఆలోచన.

నవ్య | చిత్రజ్యోతి

ఇడిచిపెట్టను.. తేల్చాల్సిందే



వైవిధ్యమైన చిత్రాల్లో నటిస్తూ ప్రేక్షకులకు దగ్గరయిన హీరో అడివి శేష్. షానీల్ డియో దర్శకత్వంలో ఆయన నటిస్తున్న చిత్రం 'డెకాయిట్'. 'ఓ ప్రేమ కథ' ఉప శీర్షిక. మంగళవారం, ఆయన పుట్టిన రోజు సందర్భంగా చిత్ర బృందం ఈ సినిమా నుంచి ఓ పోస్టర్‌ను వదిలింది. ఇందులో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. ఇదివరకు విడుదల చేసిన గ్లింప్స్‌లో కథానాయికగా శ్రుతిహాసన్‌ని చూపించారు. అయితే ప్రస్తుతం రిలీజ్ చేసిన పోస్టర్‌లో మృణాల్ ఠాకూర్‌ను హీరోయిన్‌గా ఎంపిక చేసినట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ పోస్టర్‌ను సోషల్‌మీడియాలో షేర్ చేసిన అడివి శేష్ .."అవును ప్రేమించావు.. కానీ మోసం చేశావు. ఇడిచిపెట్టను.. తేల్చాల్సిందే" అని పేర్కొన్నారు. దీనికి స్పందించిన మృణాల్.. "అవును వదిలేశాను.. కానీ మనస్ఫూర్తిగా ప్రేమించాను" అని తన ఖాతాలో పోస్టర్‌ను షేర్ చేసి, శేష్‌కు బర్త్ డే విషెస్ తెలిపారు. మరోవైపు, అడివి శేష్ నటిస్తున్న చిత్రాలు 'గూఢచారి' సీక్వెల్ 'జీ 2'.. 'హిట్ 3'. ఈ సినిమాల్లో శేష్ లుక్‌ను విడుదల చేసిన చిత్రబృందాలు ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపాయి.

ఆ విషయంలో నాన్న.. ముఫాసా ఒక్కటే!



'ద లయన్ కింగ్'కు కొనసాగింపుగా తెరకెక్కిన సినిమా 'ముఫాసా: ద లయన్ కింగ్'. ఇందులో టైటిల్ పాత్ర తెలుగు వెర్షన్‌కు మహేశ్ బాబు వాయిస్ అందించిన విషయం తెలిసిందే. ఈ నెల 20న సినిమా విడుదల వుతుండడంతో చిత్రబృందం ప్రమోషన్స్‌ను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా సితార ఘట్టమనేని ఈ సినిమా గురించి మాట్లాడిన వీడియోను విడుదల చేసింది. "ముఫాసా లాంటి గొప్ప పాత్రకు నాన్న గొంతునిస్తున్నందుకు ఎంతో గర్విస్తున్నాను. ప్రేమించడంలో.. జాగ్రత్తగా చూసుకునే విషయంలో నాన్నకూ.. ముఫాసాకు చాలా పోలికలు ఉన్నాయి. నాన్న ఈ సినిమాలో భాగమయ్యారని తెలియగానే ఎంతో సంతోషించా.. సినిమా కోసం ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నాను. నీ కంటే ముందుగానే 'ఫ్రోజెన్' సినిమాతో డిస్నీ ప్రపంచంలోకి అడుగుపెట్టానని అప్పుడప్పుడూ.. నాన్నను ఆటపట్టిస్తుంటాను" అని చెప్పారు.


అప్పట్లో గాలి శీను... ఇప్పుడు బచ్చలమల్లి



అల్లరి నరేశ్

"'నాంది' తర్వాత ఓ విభిన్న చిత్రం చేయాలనుకున్నాను. కథ కోసం ఎదురు చూస్తున్న సమయంలో దర్శకుడు సుబ్బు మంగాదేవి ఈ సినిమా కథను వినిపించాడు. సింగిల్ సిట్టింగ్‌లోనే సినిమా చేసేందుకు అంగీకరించాను. ఇప్పటివరకూ నేను చేసిన పాత్రలతో పోల్చితే 'బచ్చలమల్లి' చాలా వైవిధ్యం ఉన్న పాత్ర. ఒక్క హాస్యం తప్ప మిగిలిన అన్ని ఎమోషన్స్‌ని ఈ పాత్ర పలికిస్తుంది" అని అల్లరి నరేశ్ అన్నారు. ఆయన కథానాయకుడిగా సుబ్బు దర్శకత్వంలో రాజేశ్ దండా నిర్మించిన చిత్రమిది. ఈ నెల 20న విడుదలవుతోంది. ఈ సందర్భంగా అల్లరి నరేశ్ సినిమా విశేషాలను మీడియాతో పంచుకుంటూ..' 'గమ్యం'లో గాలి శీను పాత్ర ప్రేక్షకులను అలరించినట్లే, ఈ 'బచ్చలమల్లి' పాత్ర కూడా ప్రేక్షకులపై చాలా ప్రభావం చూపిస్తుంది. నా కంఫర్ట్ జోన్ నుంచి బయటకొచ్చి కొత్తగా ప్రయత్నించాను. 'బచ్చలమల్లి' అనే వ్యక్తి జీవితంలో జరిగిన కొన్ని సంఘటనల స్ఫూర్తితో దర్శకుడు ఈ కథ రాసుకున్నారు. ఆ పాత్రను చేసే క్రమంలో నటుడిగా చాలా సవాళ్లు ఎదురయ్యాయి. నడక, ఏడ్చే విధానం, మాట్లాడే తీరు... ఇలా ప్రతిదీ సరికొత్తగా ఉండేలా ప్రయత్నించాను. ప్రతి మనిషి ఏదో ఒక సందర్భంలో పొగరుతో కొన్ని నిర్ణయాలు తీసుకుంటాడు. దానివల్ల ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతాయి అనే పాయింట్ చుట్టూ అల్లుకున్న కథ ఇది. కథలో అంతర్లీనంగా మంచి సందేశం ఉంది. అమృత అయ్యర్ పాత్రకు చాలా పేరొస్తుంది. పాత్రల భావోద్వేగాలను ప్రేక్షకులు అనుభూతి చెందేలా విశాల్ చంద్రశేఖర్ మంచి సంగీతం అందించారు. నిర్మాత రాజేశ్ కూడా కథతో ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యారు' అని అన్నారు.

రీ ఎంట్రీకి రెడీ



రమణ గోగుల

కథ, కాంబినేషన్, దర్శకుడు... ఇలా అన్నీ కుదిరితే మళ్లీ సంగీత దర్శకుడిగా పనిచేయడానికి తాను సిద్ధం అని రమణ గోగుల చెప్పారు. కొన్నాళ్లుగా సినిమాలకు దూరంగా ఉన్న ఆయన వెంకటేశ్ నటించిన 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రంలోని 'గోదారి గట్టు' పాటను ఆలపించారు. ఇటీవలే విడుదలైన ఆ గీతానికి చక్కని స్పందన దక్కుతోంది. ఈ సందర్భంగా రమణ గోగుల మీడియాతో మాట్లాడుతూ... 'నాకు సాంకేతిక పరిజ్ఞానం అంటే ఆసక్తి ఎక్కువ. కృత్రిమమేధ, డేటా ఎనలిటిక్స్ విభాగాల్లో పలు ప్రాజెక్టులు చేశాను. ఓ రోజు సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో ఫోన్ చేసి వెంకటేశ్ సినిమా కోసం ఓ పాట పాడాలని అడిగారు. భాస్కరభట్ల సాహిత్యం నచ్చింది. పాట విడుదలయ్యాక చక్కటి స్పందన వచ్చింది. వెంకటేశ్ ఫోన్ చేసి ప్రశంసించారు. మధు ప్రియ కూడా అద్భుతంగా పాడింది. పవన్ కల్యాణ్ క్రియేటివ్ పర్సన్. చాలా కొత్తగా ప్రయత్నిస్తారు. ఫస్ట్ టైం తెలుగు సినిమాల్లో ఇంగ్లీష్ పాటను ఆయన సినిమా కోసమే కంపోజ్ చేశారు. ఇప్పుడు కృత్రిమమేధ వల్ల గాయకుడు పాట పాడాల్సిన అవసరం లేకుండాపోయింది. ఆటోమేటిగ్గా సాంగ్ వస్తుంది. అయితే మనిషి పాడితేనే ఆ పాటకు ప్రాణం వస్తుంది' అని చెప్పారు.

శ్రీమురళి... రెండు సినిమాలు



ఇటీవలే 'బఘీర' చిత్రంతో తెలుగు ప్రేక్షకులను అలరించారు కన్నడ హీరో శ్రీ మురళి. ఆయన కథానాయకుడిగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మాతగా కొత్త చిత్రం ఖరారైంది. ఈ విషయాన్ని మంగళవారం నిర్మాణసంస్థ అధికారికంగా ప్రకటించింది. శ్రీమురళి పుట్టిన రోజు సందర్భంగా అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను యూనిట్ విడుదల చేసింది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థకు ఇది 47వ సినిమా. కాగా, మరో సంస్థ 'బ్రాండ్ స్టూడియోస్' శ్రీమురళీతో 'పరాక్' అనే సినిమాను నిర్మించనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు శ్రీమురళికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతూ పోస్టర్‌ను రిలీజ్ చేసింది 'బ్రాండ్ స్టూడియోస్' చిత్రబృందం.

గన్ అప్పగించిన మోహన్‌బాబు

సినీనటుడు మోహన్‌బాబు తన లైసెన్స్‌డ్ గన్‌ను ఫిల్మ్‌నగర్ పోలీసులకు మంగళవారం అప్పగించారు. ఆయన ఇంట్లో జరుగుతున్న కుటుంబ తగాదాల నేపథ్యంలో ఆయుధాలను సరెండర్ చేయాలని రాచకొండ కమిషనర్ ఆదేశించారు. కాగా, ఓ గన్‌ను రెండు రోజుల క్రితం చిత్తూరు జిల్లా చంద్రగిరి పోలీసుస్టేషన్‌లో మోహన్‌బాబు సరెండర్ చేశారు.

బంజారాహిల్స్ (ఆంధ్రజ్యోతి)

రాబిన్‌హుడ్ వాయిదా...



నితిన్, శ్రీలీల జంటగా వెంకీ కుడుముల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'రాబిన్‌హుడ్'. ఈ నెల 25న క్రిస్మస్‌కు విడుదల కావాల్సిన ఈ సినిమా వాయిదా పడినట్లు చిత్రనిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ప్రకటించింది. "కొన్ని అనివార్య కారణాల వల్ల 'రాబిన్‌హుడ్' సినిమా ముందుగా అనుకున్న డేట్‌కు విడుదల కావట్లేదు. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం" అని పేర్కొంది.

అందరికీ నచ్చుతుంది



పవన్ సుంకర దర్శకత్వంలో షణ్ముఖ్ జస్వంత్ లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'లీలా వినోదం'. అనగ అజిత్ హీరోయిన్. శ్రీధర్ మారిసా నిర్మించారు. ఈనెల 19 నుంచి ఈటీవీ విన్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌లో షణ్ముఖ్ జస్వంత్ మాట్లాడుతూ 'నాకు సరైన సమయంలో 'లీలా వినోదం' వచ్చింది. ఈ మూవీ మీ అందరికీ నచ్చుతుంది' అని అన్నారు. చిత్ర దర్శకుడు పవన్ మాట్లాడుతూ 'ఈ మూవీలో ఓవర్ థింకింగ్ అనే కాన్సెప్ట్‌ని చూపిస్తున్నాం. దీనికి అందరూ రిలేట్ అవుతారు' అన్నారు.

కేసీఆర్‌కు కొనసాగింపు



రాకింగ్ రాకేశ్ కథానాయకుడిగా నటించిన కుటుంబ కథా చిత్రం 'కేశవ చంద్ర రమావత్ (కేసీఆర్)'. ఇటీవలే విడుదలైన ఈ చిత్రం చక్కటి ఆదరణతో కొనసాగుతోన్న సందర్భంగా యూనిట్ సక్సెస్‌మీట్‌ను నిర్వహించింది. హీరో రాకింగ్ రాకేశ్ మాట్లాడుతూ 'ఒక కసితో ఈ సినిమా చేశాను. డైరెక్టర్ అంజి నేను తలెత్తుకొని తిరిగేలా ఈ సినిమా తీశారు. ఈ సినిమాకు పార్ట్ 2 కూడా ఉంది. త్వరలో నా కొత్త చిత్రాన్ని ప్రకటిస్తా' అన్నారు.

టాప్-3లో మంధాన

దుబాయ్: టీమిండియా మహిళల జట్టు వైస్ కెప్టెన్ స్మృతీ మంధాన ఐసీసీ వన్డే, టీ20 ర్యాంకింగ్స్‌లో తన స్థానాన్ని మెరుగుపరచుకొని టాప్-3లో చోటు దక్కించుకుంది. వన్డే బ్యాటర్లలో మూడు స్థానాలు ఎగబాకి రెండో ర్యాంకులో నిలిచిన మంధాన.. టీ20ల్లో ఓ స్థానం మెరుగై మూడో స్థానం అందుకుంది. వన్డేల్లో టీమిండియా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ రెండు స్థానాలు కోల్పోయి 13వ ర్యాంక్‌లో ఉండగా, జెమీమా రోడ్రిగ్స్ ఆరు స్థానాలు ఎగబాకి 15వ ర్యాంకులో నిలిచింది. బౌలర్లలో దీప్తి శర్మ 5వ, రేణుక 26వ, అరుంధతి రెడ్డి 51వ ర్యాంకుల్లో కొనసాగుతున్నారు. టీ20 ర్యాంకింగ్స్‌లో హర్మన్‌ప్రీత్ 10వ, జెమీమా 15వ స్థానాల్లో ఉన్నారు. బౌలర్లలో దీప్తి 2వ, టిటాస్ సాధు 52వ ర్యాంకుల్లో నిలిచారు.


మంధాన (62)

ఈసారి ఓటమి

- రెండో టీ20లో భారత్‌కు చుక్కెదురు
- మంధాన అర్ధ శతకం వృథా
- 9 వికెట్లతో విండీస్ విజయం

ముంబై: కెప్టెన్ హేలీ మాథ్యూస్ (47 బంతుల్లో 17 ఫోర్లతో 85 నాటౌట్) ధనాధన్ బ్యాటింగ్‌తో విరుచుకుపడడంతో.. భారత మహిళల జట్టు చేతిలో వరుస 9 పరాజయాలకు వెస్టిండీస్ బ్రేకులు వేసింది. మంగళవారం జరిగిన రెండో టీ20లో విండీస్ 9 వికెట్ల తేడాతో భారత్‌ను చిత్తు చేసింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 1-1తో సమం చేసింది. మోకాలి నొప్పితో బాధపడుతున్న కెప్టెన్ హర్మన్‌ప్రీత్ ఈ మ్యాచ్‌కు దూరం కాగా.. రాఘ్వి బిస్త్ అరంగేట్రం చేసింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 159/9 స్కోరు చేసింది. ఓపెనర్ స్మృతి మంధాన (41 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్‌తో 62), రిచా ఘోష్ (17 బంతుల్లో 32) మినహా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. డోటిన్, హెన్రీ, మాథ్యూస్, ఫ్లెచర్ తలో 2 వికెట్లు తీశారు. ఛేదనలో వెస్టిండీస్ 15.4 ఓవర్లలో వికెట్ నష్టానికి 160 పరుగులు చేసి గెలిచింది. జోసెఫ్ (38) కలసి తొలి వికెట్‌కు 66 రన్స్ జోడించిన మాథ్యూస్.. క్యాంప్‌బెల్ (29 నాటౌట్) జతగా రెండో వికెట్‌కు 55 బంతుల్లో 94 పరుగుల అజేయ భాగస్వామ్యం నెలకొల్పింది. దీంతో విండీస్ 26 బంతులు మిగిలుండగానే విజయాన్ని అందుకొంది.

హమ్మయ్య..

గండం గడిచింది

ఫాలోఆన్ తప్పింది

ఆసీస్‌తో మూడో టెస్టు


రాహుల్ (84)


జడేజా (77)

భారత్ తొలి ఇన్నింగ్స్ 252/9 ● రాహుల్, జడేజా అర్ధసెంచరీలు

ఆఖర్లో ఆదుకున్న ఆకాశ్, బుమ్రా ● కమిన్స్‌కు నాలుగు వికెట్లు

బ్రిస్బేన్: ఓవైపు వరుణుడు వస్తూ, పోతూ ఎంతగా విసిగిస్తున్నా.. భారత బ్యాటర్లు మాత్రం అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. దీంతో అనూహ్యంగా ఫాలోఆన్ గండం నుంచి జట్టు గట్టెక్కింది. ముందుగా కేఎల్ రాహుల్ (84), రవీంద్ర జడేజా (77) నిలకడగా ఆసీస్ బౌలర్లను ఎదుర్కొంటూ ఆశలు కల్పించారు. కానీ, కీలక సమయంలో ఈ జోడీ వెనుదిరగడంతో ఇక అంతా అయిపోయిందనిపించింది. అయితే, ఎవరూ ఊహించని విధంగా ఆకాశ్ దీప్ (27 బ్యాటింగ్), బుమ్రా (10 బ్యాటింగ్) ఎదురొడ్డి నిలిచారు. ప్రధాన బ్యాటర్లకు తామేమీ తక్కువ కాదంటూ పట్టుదలగా క్రీజులో నిలిచిన ఈ ద్వయం ఆఖరి వికెట్‌కు అజేయంగా 39 పరుగులు జోడించడంతో పాటు ఫాలోఆన్ ప్రమాదం నుంచి భారత్‌ను రక్షించింది. ఫలితంగా ఆసీస్ రెండో ఇన్నింగ్స్ ఆడాల్సిన పరిస్థితి ఏర్పడింది. నాలుగో రోజు మంగళవారం వెలుతురులేమితో ఆట ముందుగానే ముగియగా, ప్రస్తుతం భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 252/9 పరుగులతో ఉంది. అయితే ఆసీస్ స్కోరుకన్నా 193 పరుగులు వెనుకబడి ఉంది. దీంతో చివరిరోజైన బుధవారం ఆట ఆసక్తికరంగా మారింది. గెలుపుపై కన్నేసిన ఆసీస్ తొలి సెషన్‌లో భారత్ చివరి వికెట్‌ను త్వరగా తీసి బ్యాటింగ్‌కు దిగాల్సి ఉంటుంది. తర్వాత భారత్‌ను బరిలోకి దించి ఆలౌట్ చేయగలిగితేనే ఆ జట్టు ఈ టెస్టును దక్కించుకుంటుంది. అటు భారత్ నెగ్గే అవకాశాలు దాదాపు లేకపోయినా, ఆలౌట్ కాకుండా డ్రా కోసం పోరాడాల్సిందే. మరోవైపు నాలుగోరోజు కూడా మ్యాచ్‌కు పలుమార్లు వర్షం అంతరాయం కలిగించడంతో 57.5 ఓవర్ల ఆటే సాగింది.

రాహుల్, జడ్డూ నిలకడ: వాస్తవానికి ఫాలోఆన్ తప్పించుకునే విషయంలో భారత్‌కు కాస్త అదృష్టం తోడైందనే చెప్పాలి. ఓవర్‌నైట్ స్కోరు 51/4తో నాలుగో రోజు ఆట ఆరంభించిన భారత్ మొదటి బంతికే రాహుల్ వికెట్‌ను కోల్పోవాల్సింది. కమిన్స్ ఓవర్‌లో అతడిచ్చిన సులువైన క్యాచ్‌ను రెండో స్లిప్‌లో స్మిత్ వదిలేశాడు. అప్పటికి రాహుల్ స్కోరు 33. ఈ చాన్స్‌ను సద్వినియోగం చేసుకున్న రాహుల్ మరో 51 రన్స్ జోడించడం భారత్‌కు కలిసొచ్చింది. ఆ తర్వాత కెప్టెన్ రోహిత్ (10) పేలవ ఫామ్‌ను కొనసాగిస్తూ కమిన్స్‌కు చిక్కాడు. ఈ దశలో రాహుల్‌కు అండగా జడేజా నిలిచాడు. ఈ జోడీ వికెట్ల పతనాన్ని అడ్డుకుంటూ ఆసీస్ బౌలర్లను దీటుగా ఎదుర్కొంది. చూస్తుండగానే ఇద్దరూ అర్ధసెంచరీలు సాధించి ఆరో వికెట్‌కు 67 రన్స్ జోడించారు. రాహుల్ సెంచరీ ఖాయమనిపించినా.. స్లిప్‌లో కళ్లుచెదిరే రీతిలో అతడి క్యాచ్‌ను స్మిత్ పట్టేశాడు. అటు నితీశ్ (16)తో కలిసి జడ్డూ జట్టు ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో ఏడో వికెట్‌కు మరో 53 రన్స్ చేరాయి. కమిన్స్ ఓవర్‌లో నితీశ్ బౌల్డ్ కాగా, దూకుడుగా ఆడే క్రమంలో జడేజా 9వ వికెట్‌గా వెనుదిరిగాడు.

టెయిలెండర్ల పోరాటం: భారత్ ఫాలోఆన్ దాటాలంటే 246 స్కోరు సాధించాల్సిందే. కానీ జడేజా అవుటైనప్పుడు స్కోరు 213/9గా ఉంది. క్రీజులో ఆకాశ్, బుమ్రా ఉండడంతో ఈ ఆఖరి వికెట్‌పైనే మరో 33 రన్స్ చేయాల్సి ఉంది. అటు ఆసీస్ శిబిరంలో సంబరాలు.. ఇటు భారత్ శిబిరంలో ఆందోళన స్పష్టంగా కనిపించింది. భారత్ మరోసారి బ్యాటింగ్ చేయాల్సిందే అనే భావన అంతటా కనిపించింది. కానీ గాబాలో అద్భుతమే జరిగింది. ఆకాశ్, బుమ్రా మొండిగా నిలిచారు. ఆసీస్ పేసర్లను సమర్థవంతంగా ఎదుర్కొంటూ చకచకా రన్స్ రాబట్టారు. ఆకాశ్ దూకుడుగా ఆడుతుండడంతో రిస్క్ వద్దు.. సింగిల్స్ చాలు అన్నట్టుగా అతడికి కెప్టెన్ నుంచి సంకేతాలు అందాయి. అటు బుమ్రా కూడా వికెట్ కాపాడుకుంటూ సహకరించాడు. చివరికి ఆట ఆఖరి ఓవర్‌లో ఆకాశ్ ఫోర్‌తో ఫాలోఆన్ దాటించగానే స్టేడియంలో ప్రేక్షకులు హర్షధ్వానాలు చేశారు. అదే ఓవర్‌లో ఆకాశ్ అద్భుత సిక్సర్ బాది ఆకట్టుకున్నాడు. అయితే వెలుతురులేమితో వెంటనే ఆటను ముగించారు.


ఆకాశ్ (27 బ్యాటింగ్), బుమ్రా (10 బ్యాటింగ్)



గెలిచినంత సంబరం

అక్కడ భారత్ మ్యాచ్ గెలిచింది లేదు.. కనీసం ఆసీస్ స్కోరును కూడా దాటింది లేదు. కానీ డ్రెస్సింగ్ రూమ్‌లో కోచ్ గంభీర్, కెప్టెన్ రోహిత్, స్టార్ బ్యాటర్ విరాట్ పట్టరాని సంతోషంతో సంబరాలు చేసుకున్నారు. ఎందుకంటే.. ఎట్టి పరిస్థితిలో భారత్‌కు ఫాలోఆన్ తప్పదని భావించిన వేళ.. గాబాలో జరిగిన అద్భుతాన్ని వారు నమ్మలేకపోయారు. ఆఖరి వికెట్‌కు ఆకాశ్, బుమ్రా క్రీజులో నిలకడను ప్రదర్శిస్తూ ఒక్కో పరుగు జత చేస్తూ వచ్చారు. కమిన్స్ ఓవర్‌లో గల్లీ మీదుగా ఆకాశ్ కొట్టిన ఫోర్‌తో జట్టు 246 స్కోరుతో ఫాలోఆన్ దాటింది. అటు టెన్షన్‌గా చూస్తున్న గంభీర్ ఒక్క ఉదుటున లేచి కోహ్లీకి హైఫైవ్స్ ఇవ్వగా.. అటు రోహిత్, విరాట్ కూడా చప్పట్లతో సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఇప్పుడీ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

స్కోరుబోర్డు

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 445

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) మార్ష్ (బి) స్టార్క్ 4; రాహుల్ (సి) స్మిత్ (బి) లియోన్ 84; గిల్ (సి) మార్ష్ (బి) స్టార్క్ 1; విరాట్ (సి) క్యారీ (బి) హాజెల్‌వుడ్ 3; పంత్ (సి) క్యారీ (బి) కమిన్స్ 9; రోహిత్ (సి) క్యారీ (బి) కమిన్స్ 10; జడేజా (సి) మార్ష్ (బి) కమిన్స్ 77; నితీశ్ (బి) కమిన్స్ 16; సిరాజ్ (సి) క్యారీ (బి) స్టార్క్ 1; బుమ్రా (బ్యాటింగ్) 10; ఆకాశ్ (బ్యాటింగ్) 27; **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 74.5 ఓవర్లలో 252/9. వికెట్ల పతనం:** 1-4, 2-6, 3-22, 4-44, 5-74, 6-141, 7-194, 8-201, 9-213. **బౌలింగ్:** స్టార్క్ 24-3-83-3; హాజెల్‌వుడ్ 6-2-22-1; కమిన్స్ 20.5-2-80-4; లియోన్ 21-0-54-1; హెడ్ 1-0-1-0; మార్ష్ 2-0-6-0.

గాయంతో హాజెల్‌వుడ్ అవుట్

ఆసీస్ పేసర్ హాజెల్‌వుడ్ గాయంతో ఈ సిరీస్‌కు దూరమయ్యే అవకాశం కనిపిస్తోంది. నాలుగో రోజు ఆటకు ముందు వామప్ సమయంలో అతడి కుడి కాలి కండరాలు పట్టేశాయి. ఆ తర్వాత మ్యాచ్ ఆరంభమైన కాసేపటికి వచ్చి కేవలం ఒక్క ఓవర్ మాత్రమే వేశాడు. ఆ తర్వాత స్కానింగ్ కోసం వెళ్లి తిరిగి బరిలోకి దిగలేదు. చివరి రోజు కూడా దూరం కానున్నాడని ఆసీస్ జట్టు ప్రకటించింది. అయితే విగతా రెండు టెస్టులు కూడా తను ఆడే అవకాశం లేదని, అతడి స్థానంలో బోలాండ్‌ను ఆడించనున్నట్టు సమాచారం.

కివీస్ భారీ విజయం

హామిల్టన్: ఇంగ్లండ్‌తో ఇప్పటికే తొలి రెండు టెస్టులు ఓడి సిరీస్‌ను కోల్పోయిన ఆతిథ్య న్యూజిలాండ్ చివరిదైన మూడో మ్యాచ్‌లో మాత్రం సత్తా చాటింది. ఈ టెస్టులో ఏకంగా 423 పరుగుల భారీ తేడాతో ఘనవిజయం సాధించింది. తద్వారా తమ పేసర్ టిమ్ సౌథీకి అద్భుత వీడ్కోలు పలికింది. 658 పరుగుల లక్ష్యంతో నాలుగో రోజైన ఓవర్‌నైట్ స్కోరు 18/2తో బరిలోకి దిగిన ఇంగ్లండ్.. స్పిన్నర్ శాంట్నర్ (4/85) ధాటికి రెండో ఇన్నింగ్స్‌లో 234 రన్స్‌కే పరిమితమైంది. బెథెల్ (74), రూట్ (54), అట్కిన్సన్ (43) రాణించారు. గాయంతో స్టోక్స్ బరిలోకి దిగలేదు. సౌథీ, హెన్రీకి రెండేసి వికెట్లు దక్కాయి. తొలి ఇన్నింగ్స్‌లో కివీస్ 347, ఇంగ్లండ్ 143 స్కోర్లు చేశాయి. రెండో ఇన్నింగ్స్‌లో కివీస్ 453 రన్స్ చేసింది. కాగా, తొలి రెండు టెస్టులు నెగ్గడంతో ఇంగ్లండ్ 2-1తో సిరీస్‌ను నెగ్గింది.

గుకేష్‌కు ఘన సన్మానం



చెన్నై (ఆంధ్రజ్యోతి): ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ గెలుచుకున్న పిన్న వయసు ఆటగాడిగా చరిత్ర సృష్టించిన గుకేష్‌ను అతని సొంత రాష్ట్రం తమిళనాడు ఘనంగా సన్మానించింది. మంగళవారం ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్, చెస్ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ పాల్గొని గుకేష్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా గుకేష్‌కు నజరానాగా రూ. 5 కోట్ల చెక్‌ను సీఎం అందజేశారు.

యోధాస్ ఆశలు సజీవం

పుణె: ప్రొ కబడ్డీ లీగ్‌లో టేబుల్ టాపర్ హరియాణా స్టీలర్స్‌కు యూపీ యోధాస్ జట్టు షాకిచ్చింది. మంగళవారం జరిగిన కీలక పోరులో యోధాస్ 31-24 తేడాతో స్టీలర్స్‌పై గెలుపొందింది. ఓడితే ఇంటికే అన్న పరిస్థితుల్లో మ్యాచ్ బరిలోకి దిగిన యోధాస్ ఆరంభం నుంచే ఆధిక్యాన్ని నిలబెట్టుకుంటూ అనుకున్న ఫలితాన్ని రాబట్టింది. భవానీ రాజ్‌పుత్ 11 పాయింట్లు సాధించి యోధాస్ జట్టు గెలుపులో కీలకపాత్ర పోషించాడు. ఈ విజయంతో యూపీ యోధాస్ పాయింట్ల పట్టికలో మూడోస్థానానికి చేరి ప్లేఆఫ్స్ ఆశలను సజీవంగా ఉంచుకుంది. మరో మ్యాచ్‌లో జైపూర్ పింక్‌పాంథర్స్ 35-26 తేడాతో బెంగళూరు బుల్స్‌ను చిత్తు చేసింది. జైపూర్ జట్టు పట్టికలో ఐదో స్థానంలో కొనసాగుతోంది.

దేవుడా.. ఇంకెన్ని చేయాలి!



న్యూఢిల్లీ: ముంబై బ్యాటర్ పృథ్వీ షాకు దెబ్బమీద దెబ్బ తగులుతోంది. ఐపీఎల్ వేలంలో అన్‌సోల్డ్‌గా మిగిలిన పృథ్వీకి తాజాగా విజయ్ హజారే ట్రోఫీ కోసం ఎంపిక చేసిన ముంబై జట్టులో చోటు దక్కలేదు. ఫిట్‌నెస్ సమస్యలు, క్రమశిక్షణ రాహిత్యం కారణంగా రంజీ సీజన్ మధ్యలోనే జట్టులో చోటు కోల్పోయిన పృథ్వీ.. ఇటీవల సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీతో మళ్లీ జట్టులోకొచ్చాడు. అయితే, ఆ టోర్నీలో అంతగా సత్తా చాటకపోయినా, జట్టుకు మెరుపు ఆరంభాలు అందించాడు. ఈ క్రమంలోనే హజారే టోర్నీకి ఎంపికవుతానని పృథ్వీ భావించాడు. కానీ, సెలెక్టర్లు ఉద్వాసన పలకడంతో తీవ్ర భావోద్వేగానికి గురైన పృథ్వీ.. తన ఆవేదనను సోషల్ మీడియాలో పంచుకున్నాడు. 'దేవుడా..చెప్పు. ఇంకా ఎన్ని చేయాలి? 65 ఇన్నింగ్స్‌లు.. 3399 పరుగులు.. 126 స్ట్రయిక్ రేట్.. 55.7 సగటు.. నమోదు చేసినా, ఇవేవీ నా ఎంపికకు సరిపోవడం లేదు. అయినా నీ (దేవుడి)పై నమ్మకం సడలదు. కచ్చితంగా పునరాగమనం చేస్తా. ఓం సాయిరాం..' అని పృథ్వీ ఇన్‌స్టాలో పోస్ట్ చేశాడు. 25 ఏళ్ల షా టీమిండియా తరఫున అరంగేట్ర టెస్టులోనే శతకం బాదడంతో ఎంతో ప్రతిభావంతుడనే ప్రశంసలు అందుకొన్నాడు. కానీ, అదే జోరును కొనసాగించలేక జట్టులో చోటు కోల్పోయాడు.

బిజినెస్

మ్యూచువల్ ఫండ్స్ నుంచి ఎంఎఫ్ లైట్

అందుబాటులోకి కొత్త పెట్టుబడి పథకం

కనీస పెట్టుబడి రూ.10 లక్షలు



న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) నుంచి 'ఎంఎఫ్ లైట్' పేరుతో కొత్త పెట్టుబడి పథకం అందుబాటులోకి రానుంది. మార్కెట్ నియంత్రణ మండలి సెబీ ఇందుకు ఆమోద ముద్ర వేసింది. దీనికి సంబంధించి ఎంఎఫ్ నిబంధనలు సవరించింది. అధిక రిస్క్‌కు సిద్ధపడే మదుపరులు మాత్రమే ఈ పథకంలో పెట్టుబడి పెట్టేందుకు అర్హులు. స్పెషలైజ్డ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ (ఎస్ఐఎఫ్) ద్వారా మ్యూచువల్ ఫండ్ సంస్థలు ఈ పథకాల్లోకి పెట్టుబడులు స్వీకరిస్తాయి. ఎంఎఫ్ లైట్ పథకాల్లో మదుపు చేయాలనుకునే మదుపరులు కనీసం రూ.10 లక్షలు పెట్టుబడి పెట్టాలి. అయితే అధీకృత మదుపరులకు ఈ నిబంధన వర్తించదు.

అర్హతలు

పోర్టుఫోలియో మేనేజ్‌మెంట్ సర్వీసెస్ (పీఎంఎస్), ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్ (ఏఐఎఫ్)కు ప్రత్యామ్నాయంగా సెబీ ఈ సరికొత్త పెట్టుబడి పథకాన్ని తీసుకొచ్చింది. కనీసం రూ.35 కోట్ల నికర ఆస్తులు ఉన్న ఎంఎఫ్‌ల అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (ఏఎంసీ)లను మాత్రమే ఈ ఎంఎఫ్ లైట్ పథకాలు ప్రారంభించేందుకు అనుమతిస్తారు. అయితే గత ఐదేళ్ల నుంచి వరుసగా లాభాల్లో ఉన్న ఏఎంసీలకైతే రూ.25 కోట్ల నికర ఆస్తులు ఉంటే సరిపోతోంది..

మిత్రా పేరుతో కొత్త ప్లాట్‌ఫామ్

నిర్వహణలో లేని, క్లెయిమ్ చేయని మ్యూచువల్ ఫండ్స్ నిష్క్రియ ఖాతాల (ఫోలియో)ను ట్రాక్ చేసేందుకు సరికొత్త ప్లాట్‌ఫామ్‌ను అందుబాటులోకి తేవాలని కూడా సెబీ నిర్ణయించింది. మ్యూచువల్ ఫండ్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రేసింగ్ అండ్ రిట్రీవల్ అసిస్టెంట్ (మిత్రా) పేరుతో ఈ ప్లాట్‌ఫామ్ అందుబాటులోకి వస్తుంది. ఈ ప్లాట్‌ఫామ్ సాయంతో మదుపరులు మరిచిపోయిన నిర్వహణలో లేని, క్లెయిమ్ చేయని తమ ఎంఎఫ్ ఫోలియోలను ట్రాక్ చేసుకోవచ్చు. అయితే ఇందుకోసం వారు తమ తాజా కేవైసీ వివరాలను అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. రిజిస్ట్రార్ అండ్ ట్రాన్స్‌ఫర్ ఏజెంట్లు (ఆర్‌టీఏ) ఈ ప్లాట్‌ఫామ్స్‌ను నిర్వహించాలని సెబీ ప్రతిపాదించింది.



రూ.5 లక్షల కోట్లు గల్లంతు

స్టాక్ మార్కెట్లో భారీ నష్టాలు

- సెన్సెక్స్ 1,064 పాయింట్లు డౌన్
- 81,000 దిగువ స్థాయికి సూచీ
- 24,300 వద్దకు పడిపోయిన నిఫ్టీ
- ఫెడ్ రిజర్వ్ సమీక్ష నేపథ్యంలో

మార్కెట్లో పోటెత్తిన అమ్మకాలు

ముంబై: ప్రామాణిక ఈక్విటీ సూచీలు మంగళవారం భారీ నష్టాలను చవిచూశాయి. సెన్సెక్స్ 1,064.12 పాయింట్లు (1.30 శాతం) పతనమై 80,684.45 వద్దకు పడిపోయింది. నిఫ్టీ 332.25 పాయింట్లు (1.35 శాతం) క్షీణించి 24,336 వద్దకు జారుకుంది. అమెరికా సెంట్రల్ బ్యాంకైన ఫెడరల్ రిజర్వ్‌తో పాటు బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ (బీఓఈ), బ్యాంక్ ఆఫ్ జపాన్ (బీఓజే) ఈవారంలో ప్రామాణిక వడ్డీ రేట్లపై నిర్ణయాన్ని ప్రకటించనున్న నేపథ్యంలో అప్రమత్తమైన ఇన్వెస్టర్లు అమ్మకాలను పోటెత్తించారు. వాణిజ్య లోటు రికార్డు స్థాయికి పెరగడం, రూపాయి క్షీణతతో పాటు మన మార్కెట్ నుంచి విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు మళ్లీ తరలిపోతుండటం ట్రేడింగ్ సెంటిమెంట్‌ను మరింత కుంగదీసింది. అమ్మకాల హోరులో మదుపరుల సంపదగా భావించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజే రూ.4.92 లక్షల కోట్లకు పైగా తగ్గి రూ.455.14 లక్షల కోట్లకు (5.36 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీలూ నష్టపోయాయి. బీఎస్ఈలోని చిన్న, మధ్య స్థాయి కంపెనీల ప్రాతినిధ్య సూచీలైన మిడ్‌క్యాప్ 0.65 శాతం, స్మాల్‌క్యాప్ 0.52 శాతం నష్టపోయాయి. అన్ని రంగాల సూచీలు నష్టాల్లో ముగిశాయి. టెలికాం అత్యధికంగా 2.18 శాతం పతనమవగా.. మెటల్, ఆటో, ఎనర్జీ, ఆయిల్ అండ్ గ్యాస్, కమోడిటీస్, ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇండెక్స్‌లు 1.77 శాతం వరకు క్షీణించాయి. బీఎస్ఈలో 2,502 కంపెనీల స్టాక్స్ నష్టపోగా.. 1,521 లాభపడ్డాయి. 84 యథాతథంగా ముగిశాయి. 28 కంపెనీల షేర్లు సరికొత్త ఏడాది కనిష్ఠానికి జారుకున్నాయి.

ఐపీఓ సమాచారం

- వెంటివ్ హాస్పిటాలిటీ రూ.1,600 కోట్ల తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ), కరారో ఇండియా లిమిటెడ్ ఇష్యూ ఈ నెల 20న ప్రారంభమై 24న ముగియనున్నాయి. వెంటివ్ హాస్పిటాలిటీ ఐపీఓ ధరల శ్రేణిని కంపెనీ రూ.610-643గా నిర్ణయించింది. కరారో ఇండియా ఇష్యూ ప్రైస్ బ్యాండ్ రూ.668-704గా ఉంది.
- ఎన్‌బీఎఫ్‌సీ సంస్థ ఆయ్ ఫైనాన్స్ ఐపీఓకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఐపీఓ ద్వారా కంపెనీ రూ.1,450 కోట్లు సమీకరించనుంది.
- ఆరాధ్య డిస్పోజల్ ఇండస్ట్రీస్ ఐపీఓకు వచ్చేందుకు ఎన్ఎస్ఈ ఎస్ఎంఈ ప్లాట్‌ఫామ్ 'ఎన్ఎస్ఈ ఎమర్జ్'కు డీఆర్‌హెచ్‌పీ సమర్పించింది. ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.10 ముఖ విలువ కలిగిన 36.96 లక్షల షేర్లను విక్రయించనుంది.

కార్ల తయారీలో మారుతి రికార్డు

ఒక ఏడాదిలో 20 లక్షల కార్ల ఉత్పత్తి

న్యూఢిల్లీ: దేశీయ కార్ల తయారీ దిగ్గజం మారుతి సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ) ఒక క్యాలెండర్ సంవత్సరంలో 20 లక్షల యూనిట్ల తయారీ మైలురాయిని తొలిసారిగా అధిగమించింది. అలాగే సుజుకీ మోటార్ కార్పొరేషన్‌కు ప్రపంచవ్యాప్తంగా గల తయారీ కేంద్రాల్లో కూడా ఈ మైలురాయి అధిగమించింది మారుతి సుజుకీ ఒక్కటే. 20 లక్షల ఉత్పత్తిగా ఎర్టిగా కారును మనేసార్ ప్లాంట్ నుంచి విడుదల చేశారు. ఈ 20 లక్షల కార్లలో 60 శాతం హరియాణా ప్లాంట్లలో తయారు కాగా 40 శాతం గుజరాత్‌లో తయారయ్యాయి.

మహీంద్రా క్రిష్-ఈతో

కోరమాండల్ జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వ్యవసాయ రంగానికి అవసరమైన పరిష్కారాలు అందించడంలో పేరెన్నిక గన్న కోరమాండల్ ఇంటర్నేషనల్.. మహీంద్రా అండ్ మహీంద్రా వ్యవసాయ పరికరాల విభాగం అనుబంధ సంస్థ అయిన క్రిష్-ఈ తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. దీని కింద కోరమాండల్ డ్రోన్ స్ప్రేయింగ్ సర్వీసు గ్రోమోర్ డ్రైవ్‌ను విస్తరిస్తారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్‌లలో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. కోరమాండల్ డ్రోన్ సర్వీసెస్ తన అనుబంధ సంస్థ దక్ష మానవరహిత వ్యవస్థ ద్వారా డ్రోన్ల సరఫరా, పైలట్ శిక్షణ, సర్వీస్ మద్దతు అందిస్తోంది. క్రిష్-ఈ కస్టమర్లు క్రిష్-ఇ ఖేతీ కేలియే యాప్ ద్వారా ఫీజు చెల్లింపు ప్రాతిపదికన డ్రోన్ స్ప్రేయింగ్ సేవలు పొందవచ్చు.

శ్రీసిటీలో కంప్రెసర్ల తయారీ ప్లాంట్

తైవాన్ సంస్థ రెచీ ప్రెసిషన్‌తో డైకిన్ జాయింట్ వెంచర్

న్యూఢిల్లీ: ఎయిర్ కండిషనింగ్, రిఫ్రిజిరేషన్ సిస్టమ్స్ తయారీ దిగ్గజం డైకిన్ ఇండస్ట్రీస్.. తైవాన్‌కు చెందిన రెచీ ప్రెసిషన్ సంయుక్త భాగస్వామ్యం (జేవీ)లో ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ సిటీలో కంప్రెసర్ల తయారీ ప్లాంట్ ఏర్పాటు చేయనుంది. ఇన్వర్టర్, నాన్ ఇన్వర్టర్ ఏసీలకు రోటరీ కంప్రెసర్ల డిజైన్, తయారీ, విక్రయం కోసం ఒక జేవీ ఏర్పాటు చేయబోతున్నట్టు రెండు సంస్థలు ప్రకటించాయి. ఈ ప్లాంట్‌లో దేశీయ మార్కెట్‌తో పాటు కొన్ని ఎంపిక చేసిన విదేశీ మార్కెట్ల కోసం కంప్రెసర్లు తయారుచేస్తారు. ఈ ప్రాజెక్టుపై పెట్టుబడి ఎంత అన్నది డైకిన్ ప్రకటించకపోయినప్పటికీ సుమారు రూ.1,000 కోట్లు ఉంటుందని పరిశ్రమ వర్గాలంటున్నాయి. వచ్చే ఐదారేళ్ల కాలంలో ఈ మొత్తం ఇన్వెస్ట్ చేస్తారు. అయితే ఈ జేవీలో డైకిన్ మెజారిటీ భాగస్వామిగా ఉండనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో ఈ ప్లాంట్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. హెచ్‌వీఏసీ (హీటింగ్, వెంటిలేషన్, ఏసీ, రిఫ్రిజిరేషన్) విభాగంలో రోటరీ కంప్రెసర్లు, మోటార్లు, ఇతర విడిభాగాల తయారీలో రెచీ ప్రెసిషన్‌కు మంచి పేరుంది. కాగా ఇప్పటికే శ్రీసిటీలో ప్లాంట్‌ను నిర్వహిస్తున్న డైకిన్ భారత హెచ్‌వీఏసీ మార్కెట్లో అగ్రగామి కంపెనీల్లో ఒకటిగా ఉంది.

ఐటీఆర్‌లో తేడాలుంటే ఎస్ఎంఎస్‌లు

న్యూఢిల్లీ: ఆదాయ పన్ను (ఐటీ) చెల్లింపుదారులకు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) ప్రత్యేక విజ్ఞప్తి చేసింది. 2021-22, 2023-24 ఆర్థిక సంవత్సరాలకు ఆదాయ పన్ను రిటర్నులు (ఐటీఆర్) దాఖలు చేశారా? లేదా? ఫైల్ చేసినా మీరు దాఖలు చేసిన ఐటీఆర్‌లోని ఆదాయ, ఖర్చుల లావాదేవీలు.. యాన్యువల్ ఇన్ఫర్మేషన్ స్టేట్‌మెంట్ (ఏఐఎస్) లోని లావాదేవీల మధ్య తేడాలు ఉంటే వెంటనే సరిచేసుకోవాలని సూచించింది. ఇలాంటి పన్ను చెల్లింపుదారులను ఇప్పటికే గుర్తించి, తేడాలను సరిదిద్దుకోవాలని వారి మొబైల్ ఫోన్లు, ఈ-మెయిల్స్‌కు సందేశాలు పంపించింది. ఈ-వెరిఫికేషన్ స్కీమ్, 2021లో భాగంగా ఈ ప్రచారం చేపట్టినట్టు సీబీడీటీ తెలిపింది. ఐటీఆర్-ఏఐఎస్ మధ్య తేడాలు ఉన్న ఆదాయ పన్ను చెల్లింపుదారులు ఆ తేడాలను సరిదిద్దుకుని ఈ నెలాఖరులోగా తమ ఐటీఆర్‌లు మళ్లీ ఫైల్ చేయాలని కోరింది.

రియల్‌మీ 14 ఎక్స్ 5జీ



రియల్‌మీ.. మార్కెట్లోకి సరికొత్త 5జీ ఫోన్ 14ఎక్స్ విడుదల చేస్తోంది. ఐపీ69 డస్ట్ అండ్ వాటర్ రెసిస్టెన్స్‌తో తీసుకువస్తున్న తొలి ఫోన్ ఇదే. బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు రియల్‌మీ ఈ ఫోన్‌ను విడుదల చేయనుంది. మీడియాటెక్ డైమెన్సిటీ 6300 5జీ చిప్‌సెట్, 18 జీబీ డైనమిక్ రామ్, 128 జీబీ అంతర్గత మెమొరీ, 6.67 అంగుళాల హెచ్‌డీ+ఐపీఎస్ ఎల్‌సీడీ స్క్రీన్ ఈ స్మార్ట్‌ఫోన్ ప్రత్యేకతలు.


పెన్నా, సంఘీ.. అంబుజాలో విలీనం

న్యూఢిల్లీ: పెన్నా సిమెంట్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌తో పాటు సంఘీ ఇండస్ట్రీస్‌ను తనలో విలీనం చేసుకోబోతున్నట్లు అదానీ గ్రూప్‌నకు చెందిన అంబుజా సిమెంట్ మంగళవారం వెల్లడించింది. ఇందుకోసం విడివిడిగా విలీన పథకాలను ప్రకటించింది. ప్రస్తుతం ఈ రెండు కంపెనీలు అంబుజాకు అనుబంధ విభాగాలుగా ఉన్నాయి. సంస్థ నిర్మాణాన్ని క్రమబద్ధీకరించడంతో పాటు మెరుగైన పాలనకు ఇది తోడ్పడనుందని అంబుజా సిమెంట్ ఒక ప్రకటనలో పేర్కొంది. జాతీయ కంపెనీల చట్టం ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) సహా ఇతర నియంత్రణ మండళ్ల అనుమతులకు లోబడి విలీన ప్రక్రియ పూర్తికి 9-12 నెలల సమయం పట్టవచ్చని అంచనా వేసింది. అంబుజా సిమెంట్ 2023 డిసెంబరులో సంఘీ ఇండస్ట్రీస్‌ను, 2024 ఆగస్టులో పెన్నా సిమెంట్‌ను కొనుగోలు చేసింది. కాగా, విలీన పథకంలో భాగంగా సంఘీ ఇండస్ట్రీస్ వాటాదారులకు తాము కలిగిన ప్రతి 100 షేర్లకు గాను అంబుజా సిమెంట్స్‌కు చెందిన 12 షేర్లు దక్కనున్నాయి. పెన్నా సిమెంట్ విషయానికొస్తే, రికార్డు తేదీ నాటికి కంపెనీ షేర్లు కలిగిన వారికి ఒక్కో షేరుకు రూ.321.50 లభించనుంది.

ప్రత్యేక కంపెనీగా ఐటీసీ హోటల్స్

జనవరి 1 నుంచి అమలు

ఐటీసీ హోటల్స్ పేరుతో హోటళ్ల వ్యాపారాన్ని విభజించేందుకు అన్ని షరతులను పూర్తి చేసినట్లు ఐటీసీ గ్రూప్ మంగళవారం వెల్లడించింది. ఈ విభజన 2025 జనవరి 1 నుంచి అమల్లోకి రానుంది. ఇందులో భాగంగా, ఐటీసీ హోటల్స్.. 60 శాతం ఈక్విటీ వాటా షేర్లను ఐటీసీ వాటాదారులకు కంపెనీలో వారి షేర్‌హోల్డింగ్ ఆధారంగా కేటాయించనుంది. కంపెనీలోని మిగతా 40 శాతం వాటాను ఐటీసీ కలిగి ఉండనుంది. ఐటీసీ హోటల్స్ దేశంలోని 90కి పైగా ప్రాంతాల్లో 140కి పైగా హోటళ్లను నిర్వహిస్తోంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	78,000 ▲	71,500 ▲	1,00,000 ▼
విజయవాడ	79,400 ▼	72,300 ▼	92,000 ▼
విశాఖపట్నం	76,900 ▼	70,490 ▼	90,320 ▼
రాజమండ్రి	78,000 ▲	71,500 ▲	93,000 ▲
ప్రొద్దుటూరు	79,400 ▲	72,300 ▼	92,000 ▼
ముంబై	76,362 ▼	69,948 ▼	88,525 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



18వ తేదీ			
హైదరాబాద్	580	విజయవాడ	610
వరంగల్	582	గోదావరి	610
చిత్తూరు	603	విశాఖపట్నం	600
		డజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	96	విజయవాడ	104
వరంగల్	96	గుంటూరు	107
కరీంనగర్	96	ఒంగోలు	107
మహబూబ్‌నగర్	96	చిత్తూరు	97
కర్నూలు	96	నెల్లూరు	97
విశాఖపట్నం	108	అనంతపురం	97
గోదావరి	104		

మృత్యు వలయం



రాష్ట్రంలో ఇటీవలి కాలంలో గంజాయి, ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్స్ లాంటి వ్యసనాలతో అప్పుల పాలై ఆత్మహత్య చేసుకున్న కొన్ని ఘటనలు..

కామారెడ్డికి చెందిన ఐదుగురు వ్యక్తులు గంజాయికి అలవాటు పడి.. ఆ మత్తులో ఓ యువకుడిపై దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. యువకులు గంజాయి సేవించి విచక్షణ కోల్పోవడంతోనే ఈ ఘటన చోటుచేసుకున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.

సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం బొమ్మారెడ్డి గూడేనికి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి.. టెలిగ్రామ్‌లో వచ్చిన ఓ లింకు ఓపెన్ చేసి ఆన్‌లైన్‌లో వర్క్‌ఫ్రమ్ హోమ్ ఎంచుకొని కొన్ని టాస్క్‌లు పూర్తి చేశాడు. అందులో అతను రూ.200 పెడితే సైబర్ నేరగాళ్లు రూ.250 పంపారు. దీంతో అతడు అత్యాశకు పోయి విడతలవారీగా రూ.12 లక్షలు పెట్టాడు. ఆ డబ్బంతా తన చెల్లి పెళ్లి కోసం బ్యాంకులో దాచినవి. ఆ డబ్బుపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై అతడు ఆత్మహత్య చేసుకున్నాడు.

వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అప్పల్‌రావు పేటకు చెందిన ఓ వ్యక్తి.. తన తల్లిదండ్రులు ధాన్యం విక్రయించగా వచ్చిన డబ్బులను బ్యాంకులో జమ చేయగా.. ఆ ఖాతాను ఉపయోగించి ఆన్‌లైన్ గేమ్ ఆడాడు. మొత్తం డబ్బు ఆన్‌లైన్ గేమ్‌కు పోవడంతో ఆత్మహత్య చేసుకున్నాడు.

ఈజీ మనీ కోసం ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లో డబ్బులు పెట్టి నష్టపోయిన వరంగల్ జిల్లా రాయపర్తికి చెందిన ఓ వ్యక్తి.. ఆ డబ్బులను తిరిగి సంపాదించేందుకు దొంగతనాన్ని ఎంచుకున్నాడు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో ఏకంగా 13 దొంగతనాలకు పాల్పడి.. చివరికి పోలీసులకు చిక్కాడు.

సిద్దిపేట జిల్లా రామునిపట్లకు చెందిన ఓ కానిస్టేబుల్.. ఆన్‌లైన్ బెట్టింగ్స్ కు అలవాటు పడి రూ. కోటి వరకు అప్పులు చేశాడు. వాటిని తీర్చే మార్గంలేక తన భార్య, ఇద్దరు చిన్నపిల్లలను రివాల్వర్‌తో కాల్చి.. తాను కాల్చుకున్నాడు.

షాద్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తి ఆన్‌లైన్ బెట్టింగ్, పేకాటకు బానిసై 25 లక్షలు పోగొట్టుకున్నాడు. ఇంటి నిర్మాణం కోసం కూడబెట్టిన ఈ డబ్బులు మొత్తం పోవడంతో అప్పుల పాలై.. ఆ బాధను తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

మంచిర్యాలకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి.. ట్రేడింగ్ మార్కెట్లో పెట్టుబడుల కోసం లోన్ యాప్‌లో అప్పులు చేశాడు. నష్టాలు రావడం, వాటినితీర్చే మార్గం లేపోవడంతో భార్య, ఇద్దరు కుమారులకు విషమిచ్చి, తాను ఉరేసుకున్నాడు.

జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం గణేశ్‌పల్లికి చెందిన ఓ యువకుడు ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసయ్యాడు. తల్లిదండ్రులు వ్యవసాయం ద్వారా వచ్చిన రూ.6 లక్షలను బ్యాంకులో వేయగా.. అతడు ఆన్‌లైన్ గేమ్స్ ఆడి ఆ మొత్తం డబ్బును పోగొట్టాడు. చివరికి పురుగుల మందు తాగి తనువు చాలించాడు.

మహబూబ్‌నగర్‌లో ఓ వ్యాపారి ఒక్కగానొక్క కొడుకు.. బెట్టింగ్‌ల్లో లక్షల రూపాయలు పోగొట్టుకున్నాడు. ఇంట్లో తెలియడంతో ఆత్మహత్య చేసుకున్నాడు.

ఖమ్మం పట్టణానికి చెందిన ఓ యువకుడు మద్యానికి బానిసై.. తాగేందుకు డబ్బులివ్వడం లేదని 80 ఏళ్ల వృద్ధురాలైన సొంత అమ్మమ్మనే కొట్టి చంపాడు.

ఖమ్మం జిల్లా చింతకాని మండలం రామకృష్ణాపురానికి చెందిన యువకుడు మద్యానికి బానిసై ...ఆ మత్తులోనే రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు.

నల్లగొండ జిల్లా డిండి మండలం చెరుకుపల్లికి చెందిన ఓ వ్యక్తి.. కోళ్ల సరఫరా చేసే వాహనాన్ని నడుపుతూ ఆన్‌లైన్ పేకాటకు అలవాటు పడ్డాడు. ఏకంగా రూ.20 లక్షలు పోగొట్టుకున్నాడు. చేసిన అపుల తీర్చేందుకు పొలం అమ్మాడు. అయితే అప్పులు తీరకపోవడంతో తప్పుదారి పట్టి చైన్ స్నాచింగ్‌ను ఎంచుకున్నాడు. ఓ వృద్ధురాలి మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కుని పారిపోయాడు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులకు దొరికాడు.

మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం బగిరాత్‌పల్లికి చెందిన ఓ రైల్వే ఉద్యోగటి ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, జల్సాలకు అలవాటు రూ.2 కోట్ల వరకు పోగొట్టుకున్నాడు. గమనించిన అతని తండ్రి.. వాటిని మానుకోవాలని పలుమార్లు హెచ్చరించాడు. అయినా మానుకోకపోవడంతో అర్ధరాత్రి కుమారుడి తలపై ఇనుప రాడ్డుతో కొట్టి చంపాడు.

నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం బ్రాహ్మణపల్లికి చెందిన ఓ యువకుడు ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడ్డాడు. తొలుత లాభాలు రావడంతో బెట్టింగ్ కొనసాగిస్తూ వెళ్లాడు. అనంతరం డబ్బులు పోవడమే తప్ప.. తిరిగి రాలేదు. ఇలా అప్పులు చేసి మరీ ఆన్‌లైన్ బెట్టింగ్‌లో పెట్టి రూ.18 లక్షలు పోగొట్టుకున్నాడు. ఈ అప్పులు తీర్చేందుకు తల్లిదండ్రులు తమకున్న అర ఎకరం వ్యవసాయ భూమి అమ్మినా.. తీరలేదు. ఓవైపు చేతిలో చిల్లిగవ్వ లేకపోవడం, మరోవైపు అప్పులవారి వేధింపులు పెరగడంతో.. తీవ్ర మనోవేదనకు గురయ్యారు. చివరికి చేసేదేమీ లేక తల్లిదండ్రు లు, కొడుకు కలిసి ఇంట్లోనే ఉరేసుకున్నారు.

హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం మల్లక్కపేటకు చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగి.. ఆన్‌లైన్ గేమ్ ఆడి సుమారు రూ.8 లక్షలు పోగొట్టుకున్నాడు. అప్పులు తీర్చే మార్గం లేక మనోవేదనకు గురయ్యాడు. చివరికి విషయాన్ని సెల్ఫీ వీడియో ద్వారా చెప్పి పురుగుల మందు తాగి ప్రాణాలు తీసు కున్నాడు.

పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో నివాసముండే సింగరేణి ఉద్యోగి.. క్రికెట్ బెట్టింగ్ కోసం లోన్ యాప్‌లో రూ.60 వేలు అప్పుగా తీసుకున్నాడు. రూ.50 వేలు తిరిగి చెల్లించగా.. మిగతా సొమ్ము విషయంలో లోన్ యాప్ నుంచి వేధింపులు ఎక్కువయ్యాయి. లోన్ యాప్ నిర్వాహకులు అతడి తల్లిదండ్రుల ఫొటోలు మార్ఫింగ్ చేసి బంధువులకు షేర్ చేశారు. అవమానం భరించలేక ఆ ఉద్యోగి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే అంతిమ సంస్కారాల సమయంలోనూ యాప్ నిర్వాహకులు తల్లిదండ్రులకు ఫోన్‌లు చేసి వేధించారు.



(మొదటిపేజీ తరువాయి)

యువత లక్ష్యంగా.. చాపకింద నీరులా విస్తరిస్తున్నాయి. సాంకేతికత పెరిగాక.. చేతిలో 5జీ స్పీడ్ సెల్‌ఫోన్ వచ్చాక.. పల్లె ప్రాంతాల్లోకీ ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్స్, లోన్‌యాప్‌ల ద్వారా సులువుగా డబ్బులు తీసుకోవడం లాంటి విష సంస్కృతి వచ్చేసింది. దాంతో గ్రామీణ యువత పక్కదారి పడుతున్నారు. పెళ్లికోసం ఇంట్లో ఉంచిన డబ్బును, ఇళ్ల కట్టుకోవడం కోసం బ్యాంకులో దాచిన బ్యాలెన్స్‌ను, ధాన్యం అమ్మగా వచ్చిన ధనాన్ని ఆన్‌లైన్ ఆటలకు అప్పగించేసి, విషయం తెలిశాక ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. తల్లిదండ్రులను తీరని క్షోభకు గురిచేస్తున్నారు. యువత మాత్రమే కాకుండా.. వివాహమై కుటుంబాన్ని బాధ్యతగా నడిపించాల్సిన వారు సైతం వ్యసనాలకు బానిసలై భారంగా తనువు చాలిస్తున్నారు. కుటుంబ సభ్యులపై మోయలేని భారం మోపుతూ, వారికీ భవిష్యత్తు లేకుండా చేస్తున్నారు.

అప్పులు తీర్చడం కోసం దొంగతనాలు..

ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, గేమ్‌లు ఆడి మోసాలకు గురైన వారిలో కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతుండగా, మరికొందరు ఆ అప్పులు తీర్చేందుకు దొడ్డిదారులు వెతుక్కుంటున్నారు. దొంగతనాలు, దోపిడీలు, చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నారు. ఇలా దొంగతనం చేస్తూ పోలీసులకు పట్టుబడిన కేసులు ఇటీవల కాలం పెద్దసంఖ్యలో వెలుగులోకి వస్తున్నాయి. మరోవైపు తమ వాళ్ల చేసిన అప్పులను తీర్చే క్రమంలో కుటుంబ సభ్యులు తమ స్థిరాస్తులను సైతం అమ్మేస్తున్నారు. అయినా అప్పులు తీరే పరిస్థితి కనిపించక కుటుంబమంతా కలసి బలవన్మరణానికి పాల్పడుతున్న హృదయ విదారక ఘటనలూ చోటుచేసుకుంటున్నాయి.

ఆత్మహత్యకు పురిగొల్పుతున్న లోన్ యాప్‌లు!

గంజాయి, ఆన్‌లైన్ గేమ్స్ వంటి వ్యసనాల బారిన పడిన వారు.. తక్షణ అవసరం కోసం వెంటనే అప్పు ఇచ్చే లోన్ యాప్‌లు, మైక్రో ఫైనాన్స్ సంస్థలను ఆశ్రయిస్తూ.. వాటి ఉచ్చులో చిక్కుకుంటున్నారు. 'ఎటువంటి పత్రాలతో పనిలేకుండా.. తక్షణమే రుణం పొందండి' అంటూ లోన్ యాప్‌లు అదే పనిగా మొబైల్ ఫోన్‌కు మెసేజ్ పంపిస్తుండడం, బాధితులు అప్పటికే షైకంలో కూరుకుపోయి తక్షణ డబ్బు కోసం ఎదురుచూస్తుండడంతో.. సదరు లోన్ యాప్ నుంచి వచ్చిన లింక్‌ను ఓపెన్ చేస్తున్నారు. దీంతో అతని మొబైల్‌లోని వివరాలన్నీ లోన్ యాప్ నిర్వాహకులకు చేరిపోతాయి. ఇక ఇచ్చే రుణాన్ని ఎన్ని రోజుల్లో చెల్లించాలన్న దానిపైనా బాధితుడి నుంచి ఆమోదం తీసుకుంటారు. తీసుకునే మొత్తానికి దాదాపు రెట్టింపు సొమ్మును వాయిదాల్లో తిరిగి చెల్లించేలా ఆ ఒప్పందం ఉంటుంది. ఏ ఒక్క వాయిదా చెల్లించకపోయినా.. పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. అప్పటికే బాధితుడి మొబైల్ నుంచి వివరాలను సేకరించిన యాప్ నిర్వాహకులు.. అతడి ఫొటోను మార్ఫింగ్ చేసి నగ్నంగా ఉన్న ఫొటోను తన కాంటాక్టు లిస్టులో ఉన్నవారికి పంపిస్తుంటారు. అంతేకాకుండా.. కాంటాక్టు లిస్టులో ఉన్న వారికి ఫోన్లు సైతం చేసి బాధితుడి అప్పు గురించి చెబుతారు. ఇలా పరువు బజారున పడడంతోపాటు వేధింపులకు తాళలేక బాధితుడు ఆత్మహత్యకు పాల్పడే పరిస్థితులు తలెత్తుతున్నాయి.

గంజాయి దొరుకుతోంది ఇలా..

గంజాయిని అరికట్టేందుకు పోలీసులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా.. దానిని వినియోగిస్తున్న వారికి ఏదో రకంగా అది లభిస్తూనే ఉంది. తెలంగాణలో ఎక్కడా గంజాయి సాగు లేకుండా చేసి నా.. ఇటు ఏపీలోని నుంచి, అటు మహారాష్ట్ర నుంచి రాష్ట్రంలోకి గంజాయి సరఫరా జరుగుతోంది. ఏపీలోని విశాఖపట్నం అటవీప్రాంతం నుంచి తెలంగాణలోకి కొందరు దీనిని సరఫరా చేస్తున్నారు. నల్లమల అటవీ ప్రాంతం నుంచి హైదరాబాద్‌తోపాటు ముంబై, చెన్నై, బెంగళూరు నగరాలకూ గంజాయి రవాణా అవుతోంది. నల్లమల ప్రాంతం నుంచి గంజాయి రవాణాకు సంబంధించి ఒక్క నాగర్‌కర్నూల్ పోలీస్‌స్టేషన్‌లో ఏడాది వ్యవధిలో నాలుగు కేసులు నమోదయ్యాయి. ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. అయితే ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి.. రాష్ట్రంలోకి గంజాయి రవాణా జరగకుండా పోలీసులు అడ్డుకట్ట వేస్తుండడంతో.. గతంతో పోలిస్తే కొంత మేరకు గంజాయి వినియోగం కొంత మేరకు తగ్గింది. అయితే విక్రయముఠా లు వ్యూహం మార్చి కొత్తరూపంలో గంజాయిని సరఫరా చేస్తున్నాయి. గతంలో క్వింటాళ్ల చొప్పున గంజాయిని వాహనాల్లో తరలించగా.. ఇప్పుడు దానిని తక్కువ పరిమాణంలో తరలిస్తున్నారు. పోలీసులకు పట్టుబడకుండా తప్పించుకుంటున్నారు. ఒకవేళ పట్టుబడినా.. తక్కువ పరిమాణంలో ఉన్నందున కేసు నుంచి కూడా త్వరగా బయటపడతామన్న ఆలోచనతో వారు ఈ వ్యూహాన్ని ఎంచుకుంటున్నారు. ఇదే కాకుండా.. గంజాయిని ద్రవరూపంలోకి మార్చి ఒకటి రెండు లీటర్ల పరిమాణంలో తీసుకొస్తూ బస్సు ల్లో, ఇతర వాహనాల్లో ప్రయాణిస్తూ పోలీసులకు దొరకకుండా వెళ్లిపోతున్నారు. అనంతరం దానిని 'హ్యాష్ ఆయిల్' పేరుతో అతి తక్కువ పరిమాణంలో 5గ్రాములు, 10 గ్రాముల చొప్పున చిన్న చిన్న ట్యూబ్‌లలో విక్రయిస్తున్నారు. ఈ హ్యాష్ ఆయిల్‌ను పోలీసులు కనిపెట్టి అరికడుతున్నా.. గంజాయికి అలవాటు పడినవారు దీనిని కొనుగోలు చేస్తూ ఇతరులకు కూడా విక్రయిస్తున్నారు.



ప్రాణాలు తీసుకునేలా 'మైక్రో'ల వేధింపులు

మైక్రో ఫైనాన్స్ సంస్థలు.. తిరిగి వాటిని వసూలు చేసుకునే క్రమంలో ఏజెంట్ల ద్వారా తీవ్రంగా ఒత్తిడి చేస్తున్నాయి. వాయిదాలు చెల్లించని వారిపై ఈ ఏజెంట్లు దాడులకూ తెగబడుతున్నారు. కుటుంబ సభ్యులనూ అందులోకి లాగుతూ నలుగురి ఎదుట పరువు తీసేలా వ్యవహరిస్తున్నారు. దీంతో అప్పులు తీసుకున్నవాళ్లు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా గిరిజన, ఏజెన్సీ ప్రాంతాలనే ఈ ఏజెంట్లు లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర నుంచి ఆదిలాబాద్ లాంటి ఏజెన్సీ ప్రాంతాల్లో వీరి దందా ఎక్కువగా సాగుతోంది. ఈ సంస్థల ప్రతినిధులు మారుమూల మండలాల్లో చిన్న గదులను అద్దెకు తీసుకుని తమ వ్యవహారాలు కొనసాగిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా రక రకాల మైక్రో ఫైనాన్స్ కంపెనీల పేర్లతో అమాయక ప్రజలకు రుణాలు ఇస్తున్నారు. వారి అవసరాలను ఆసరాగా చేసుకుని నూటికి 5 నుంచి 15 శాతం వరకు వడ్డీ వేస్తున్నారు. అత్యవసర సమయంలోనైతే 20 శాతం వడ్డీ కూడా విధిస్తున్నారు. రుణాలు ఇచ్చే సమయంలో ఇన్సూరెన్స్, డాక్యుమెంట్ చార్జీల పేరిట అదనంగా వసూలు చేస్తున్నారు. ఏదైనా ఒక నెల వాయిదా చెల్లించకపోతే వడ్డీకి వడ్డీ విధిస్తున్నారు. ఇంట్లో ఎవరైనా అనారోగ్యం బారిన పడి చనిపోయినా, ఇంటి ముందు శవం ఉన్నా వడ్డీ మాత్రం కట్టాల్సిందేనంటూ బెదిరింపులకు దిగుతున్నారు. తెల్లవారు జామున, సాయంత్రం వేళల్లో ఇంటికి వచ్చి వడ్డీ, అసలు వసూలు చేస్తున్నారు. ఇదంతా బహిరంగంగానే జరుగుతున్నా.. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణను కలిసిన మహేశ్‌కుమార్‌గౌడ్



హైదరాబాద్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణను టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ మంగళవారంనాడు మర్యాద పూర్వకంగా కలిశారు. వేమూరి రాధాకృష్ణ ఇంటికి వెళ్లిన మహేశ్‌కుమార్‌గౌడ్.. ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై వారిరువురూ కొంత సేపు మాట్లాడుకున్నారు.

మహిళా సంఘాలకు ఇచ్చే చీరల డిజైన్ ఖరారు

» పరిశీలించి ఆమోదించిన ముఖ్యమంత్రి రేవంత్



చీరలను పరిశీలిస్తున్న సీఎం రేవంత్, సీతక్క

హైదరాబాద్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మెప్మా, సెర్ప్, స్త్రీ నిధిలో ఉన్న మహిళా సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం అందించదలచిన చీరల నమూనా ఖరారయింది. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం అసెంబ్లీలోని తన చాంబర్‌లో వాటిని పరిశీలించి, ఆమోదించారు. మహిళా సభ్యులకు అందించే చీరెల కోసం "టెస్కో" సంస్థ దాదాపు వంద డిజైన్లను సిద్ధం చేయగా వాటిలో ఒక దానిని సీఎం ఆమోదించారు. రాబిన్ బ్లూ కలర్ అంచుతో స్కై బ్లూ రంగులో ఉన్న చీర డిజైన్‌ను సీఎం ఎంపికచేశారు. రాష్ట్రంలో సెర్ప్ పరిధిలో 43 లక్షలు, మెప్మాలో 18 లక్షలు, స్త్రీ నిధి పరిధిలో 2 లక్షల మంది.. మొత్తం 63 లక్షల మంది మహిళా సభ్యులున్నారు. ఒక్కో సభ్యురాలికి రెండేసి చీరలను ప్రభుత్వం అందించనుంది. సంక్రాంతి కానుకగా వాటిని అందించేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

సీఎంను కలిసిన టీ- ఒలింపిక్ అసోసియేషన్

హైదరాబాద్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన ప్రభుత్వ సలహాదారు జితేందర్‌రెడ్డి పాలకవర్గంతో మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో ఆయనను కలిసి, కొద్దిసేపు క్రీడల అంశంపై ముచ్చటించారు.

చలే చలి!.. పెరుగుతున్న చలిగాలులు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్): రాష్ట్రంలో చలి తీవ్రత పెరుగుతోంది. ఉదయం, సాయంత్రాల్లో ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే జనం జంకుతున్నారు. ముఖ్యంగా ఇళ్లలో వృద్ధులు.. వ్యవసాయ పనుల కోసం రైతులు, కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం బడికి వెళ్లేటప్పుడు, సాయంత్రం తిరిగి ఇంటికొచ్చేటప్పుడు విద్యార్థులు చలికి తట్టుకోలేకపోతున్నారు. ప్రత్యేకించి పల్లెలు, తండాల్లో పొద్దున, పొద్దుగూకిన తర్వాత చలి మంటలు కనిపిస్తున్నాయి. చలిగాలుల తీవ్రతతో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా బేలలో 5.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. గ్రేటర్ హైదరాబాద్‌లో సాయంత్రం నుంచి మొదలయ్యే చలి రాత్రికి తీవ్రమై.. మర్నాడు మధ్యాహ్నం దాకా వణికిస్తోంది. తెల్లవారుజామున పొగమంచు కారణంగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని, దీని ప్రభావంతో గురువారం కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది.

స్వల్ప విషయంలో నిలిచిన ఐపీఎస్ పెళ్లి

» తెలంగాణ మాజీ ఎమ్మెల్యే కుమార్తెతో ఐపీఎస్‌కు పెళ్లి నిశ్చయం
» కాంగ్రెస్ జెండాలతో ర్యాలీగా వెళ్లాలని పట్టుబట్టిన పెళ్లి కుమార్తె బంధువులు
» ససేమిరా అన్న ఐపీఎస్
» ముదిరిన వివాదం.. నిలిచిన పెళ్లి

గుంటూరు, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్వల్ప విషయంలో తలెత్తిన వివాదంతో ఓ ఐపిఎస్ పెళ్లి కి బ్రేక్ పడింది. పెళ్లి కుమారుడు ఐపీఎస్ అధికారి కాగా పెళ్లి కుమార్తె డాక్టర్. వివరాల్లోకి వెళ్తే నగరానికి చెందిన యువకుడు గుజరాత్ క్యాడర్ ఐపీఎస్ అధికారిగా ఎంపికయ్యారు. ఆయన ప్రొబిషనరీ పీరియడ్ పూర్తి చేసుకొని అక్కడ ఓ జిల్లాకు ఎస్పీగా ఇటీవలే నియమితులయ్యారు. ఆయనకు తెలంగాణలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే కుమార్తె అయిన డాక్టర్‌తో వివాహం నిశ్చయించారు. మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల 30 నిమిషాలకు డాన్ బాస్కోలో వివాహం జరగాల్సి ఉంది. రాత్రికి శ్రీ కన్వెన్షన్‌లో విందు ఏర్పాటు చేశారు. మరి కొద్ది సేపట్లో పెళ్లి తంతు ప్రారంభం కావలసిన సమయంలో తెలంగాణ ప్రాంతం నుండి వచ్చిన పెళ్లి కుమార్తె తరఫు బంధువులు పెద్ద సంఖ్యలో పట్టాభిపురం మెయిన్ రోడ్డుపై జూట్‌మిల్లు సమీపంలో ఉన్న ఐపీఎస్ అధికారి ఇంటి వద్దకు వెళ్లారు. తెలంగాణలోని తమ సంప్రదాయం ప్రకారం ఇరువురిని ఇంటి వద్ద నుంచి డాన్ బాస్కో వరకు కారులో కాంగ్రెస్ పార్టీ జెండాలతో ఊరేగింపుగా తీసుకు వెళ్లాలని పట్టుబట్టారు. అందుకు పెళ్లి కుమారుడు ఐపిఎస్ అధికారి కావడంతో ససేమిరా అన్నారు. దీంతో ఈ విషయం ఇరు వర్గాల మధ్య పంతానికి దారి తీసింది. చివరకు సున్నితమైన అంశం వివాదాస్పదంగా మారడంతో బ్రేక్ పడింది. పెళ్లి కుమార్తె తండ్రి తెలంగాణకు చెందిన మాజీ ఎమ్మెల్యే. ఆయన ఏఐసీసీలో కీలకంగా వ్యవహరిస్తుండటంతో తొలుత సంప్రదింపులు ద్వారా సమస్య పరిష్కారానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో మాజీ ఎమ్మెల్యే బంధువులు, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పెళ్లి కుమారుడు ఇంటి వద్ద హడావిడి చేశారు. దీంతో పెళ్లి కుమారుడు ఐపీఎస్ అధికారి కావడంతో పోలీసులు అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో పెద్ద సంఖ్యలో పోలీస్ అధికారులు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి చోటుచేసుకుంది. ఇంతలో కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలి, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, సుంకర పద్మశ్రీ లతోపాటు పలువురు కాంగ్రెస్ నాయకులు ఐపీఎస్ అధికారి ఇంటికి వెళ్లి ఆయనతో కుటుంబ సభ్యులతో చర్చలు జరుపుతున్నారు. పీటల మీద పెళ్లి నిలిచిపోయిందని తెలియడంతో పెళ్లి కుమార్తె తల్లి గుండెపోటుతో ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. పెళ్లికి ఐపీఎస్ అధికారి కుటుంబ సభ్యులు విముఖత చూపుతుండటంతో వారిని ఒప్పించేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. అర్ధరాత్రి దాటినా చర్చలు కొనసాగుతూనే ఉన్నాయి. మరో వైపు పెళ్లికి వచ్చిన సుమారు వందల మంది పెళ్ళి కుమారుడి ఇంటి బయటే మోహరించి కూర్చున్నారు. పెళ్లి కుమారుడు తరఫున ఆయన బంధువైన ఫాదర్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో చర్చలు జరుపుతున్నారు.

పదేళ్లలో పర్యాటకాన్ని ధ్వంసం చేశారు

» మన సంస్కృతినీ నాశనం చేశారు
» అప్పులు తప్ప ఏమీ మిగల్చలేదు
» గత సర్కారుపై మండిపడ్డ జూపల్లి
» బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల ఆందోళనల మధ్యే 3 బిల్లులకు ఆమోదం
» రైతులకు సంకెళ్లపై అధికార, విపక్ష సభ్యుల పోటాపోటీ ప్రదర్శన
» కేటీఆర్ పదేపదే కోరడంతో ఆందోళనలకు బీజేపీ మద్దతు

హైదరాబాద్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో గడిచిన పదేళ్లలో పర్యాటక రంగాన్ని ధ్వంసం చేశారని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆరోపించారు. బీఆర్‌ఎస్ పాలనలో పర్యాటక విధానాన్ని ప్రకటించకపోవడం సిగ్గుచేటన్నారు. చారిత్రక, వారసత్వ కట్టడాలను నిర్లక్ష్యం చేశారని, తెలంగాణ సంస్కృతిని ధ్వంసం చేశారని ధ్వజమెత్తారు. రాష్ట్రాన్నంతా దోచుకుని చిప్ప చేతికిచ్చారంటూ గత ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. మంగళవారం పర్యాటక విధానంపై శాసనసభలో జరిగిన లఘు చర్చలో జూపల్లి మాట్లాడారు. తారామతి బారాదరి ప్రపంచంలోనే పేరుగాంచిన పర్యాటక ప్రాంతమని.. అక్కడ ప్రైవేటు సంస్థలు నెలకు కోట్లలో వ్యాపారం చేస్తుండగా, పర్యాటక శాఖకు రూ.6లక్షలకు మించి ఆదాయం రావడం లేదన్నారు. పర్యాటకంతోపాటు రాష్ట్రంలో రాజకీయ సంస్కృతి కూడా ధ్వంసమైందని.. తన ప్రసంగానికి అడ్డుపడుతున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను ఉద్దేశించి పేర్కొన్నారు. టూరిజంతోపాటు రాజకీయాలనూ సరిచేసేందుకు సీఎం కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. ఆయన మాట్లాడుతుండగానే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు ఆందోళనలను కొనసాగించారు. కూర్చోవాలని సభాపతి పదేపదే విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదు. అసహనానికి గురైన మంత్రి జూపల్లి రెండు చేతులు జోడించి.. 'యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలని నిర్ణయించాం. అందులో భాగంగానే పర్యాటక విధానాన్ని రూపొందించాం. పదేళ్లు రాష్ట్రాన్ని గాలికొదిలేశారు. ఇప్పుడు మేం కష్టపడుతుంటే అడ్డుపడుతున్నారు. చేతులు జోడించి ప్రార్థిస్తున్నా. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే విషయంలో రాజకీయాలు వద్దు. అభివృద్ధిని అడ్డుకోవద్దు' అని విజ్ఞప్తి చేశారు.



రైతుల సంకెళ్లపై పోటాపోటీ ప్రదర్శన

లగచర్లలో అరెస్టయిన రైతులకు సంకెళ్లు వేసిన ఘటన మంగళవారం సభను కుదిపేసింది. నల్ల చొక్కాలు ధరించిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు సభ ప్రారంభమైనప్పటి నుంచి నిరసన కొనసాగిస్తూనే ఉన్నారు. రైతులకు బేడీలు వేసిన చిత్రాలను చూపిస్తూ ఆందోళన చేశారు. వెల్‌లోకి దూసుకెళ్లేందుకు యత్నించారు. భోజన విరామం తర్వాత కూడా ఇదే తంతు కొనసాగింది. రైతులకు బేడీలు వేసిన విషయం తెలిసిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి సంబంధిత పోలీసులను సస్పెండ్ చేశారని మంత్రి సీతక్క చెప్పారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా బీఆర్‌ఎస్ పాలనలో రైతులకు సంకెళ్లు వేసిన చిత్రాలను ప్రదర్శించారు. ఈ గందరగోళం మధ్యనే 3 బిల్లులను సభ ఆమోదించింది. భోజన విరామం తర్వాత బీఆర్‌ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలు కలిసి రైతుల సంకెళ్ల చిత్రాలను ప్రదర్శించారు. కాసేపటికి బీజేపీ సభ్యులు తమ స్థానాలకు వెళ్లిపోగా.. కేటీఆర్.. 'ఎందుకు కూర్చున్నారు..? ముందుకు రండి' అని పదే పదే కోరడంతో వారు లేచి మద్దతుగా వెళ్లారు.

కౌశిక్‌రెడ్డి ప్రవర్తనపై మళ్లీ అభ్యంతరం..

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ప్రవర్తన సభలో మళ్లీ చర్చనీయాంశమైంది. గత సమావేశాల్లో ఆయన తీరును స్పీకర్, సీఎం తప్పుపట్టారు. మంగళవారం భోజన విరామం తర్వాత సభలో కౌశిక్‌రెడ్డి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని ఎత్తుకుని తిప్పారు. సభాపతి వైపు చేతులు చూపిస్తూ, అరుస్తూ హేళన చేశారు.

గ్రామపంచాయతీ సిబ్బంది బకాయి వేతనాలు చెల్లించాలి

» ధర్నా చౌక్ వద్ద ఉద్యోగ, కార్మిక సంఘాల మహాధర్నా

కవాడిగూడ, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ సిబ్బంది వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని, ప్రత్యేక బడ్జెట్ కేటాయించి గ్రీన్ చానల్ ద్వారా వేతన చెల్లింపులు చేయాలని ప్రభుత్వాన్ని కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. జీవో నంబరు 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని, పీఎఫ్, ఇఎస్ఐ రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ లాంటి చట్టబద్ధ సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ మేరకు తెలంగాణ గ్రామపంచాయితీ ఉద్యోగ కార్మిక సంఘాల జేఏసీ, సీఐటీయూ, ఏఐటీయూసీ, టీయూసీఐ, ఎఫ్‌టీయూ తెలంగాణ గ్రామపంచాయతీ కారొబార్, బిల్‌కలెక్టర్ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరాపార్కు వద్ద చలో హైదరాబాద్‌లో భాగంగా మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో 12,790 గ్రామ పంచాయతీల్లో సుమారు 60వేల మంది ఉద్యోగులు, కార్మికులు పనిచేస్తున్నారన్నారు. 2018లో గత ప్రభుత్వం జీవో 51ని విడుదల చేసి సిబ్బంది వేతనాలను రూ. 8500 పెంచుతూనే పంచాయతీ కార్మికుల మెడకు ఉరితాళ్లు బిగిస్తూ మల్టీ పర్పస్ వర్కర్ విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ జీవోను సవరించి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని, కేటగిరీల వారీగా వేతనాలను పెంచాలని కారోబార్, బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ కల్పించాలని కోరారు. పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేసి వేతనాలు పెంచాలని కోరారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని లేని పక్షంలో రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి ప్రభుత్వాన్ని స్తంభింప చేస్తామని హెచ్చరించారు.

ధర్నాకు మొదట అనుమతిచ్చి ఆపై రద్దు చేసిన పోలీసులు

ఈ మహాధర్నాకు మొదట సెంట్రల్ జోన్ డీసీపీ అనుమతి ఇవ్వడంతో రాష్ట్రంలోని పంచాయతీ సిబ్బంది మంగళవారం ఉదయం ఇందిపార్కు ధర్నా చౌక్‌కు తరలివచ్చారు. అయితే సెంట్రల్‌జోన్ డీసీపీ ఇచ్చిన అనుమతిని సెంట్రల్ జోన్ అడిషనల్ డీసీపీ ఉన్నఫలంగా రద్దు చేసి మహాధర్నాకు వారిని వచ్చినట్లు అరెస్టు చేశారు. దాంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. కార్మికులు పెద్దఎత్తున వేలాదిగా తరలి రావడంతో మధ్యాహ్నం 12 గంటల తరువాత ధర్నాకు పోలీసులు అవకాశం ఇచ్చారు.

ఫార్ములా-ఈ కేసులో ఏ-1గా కేటీఆర్?

» ఏ-2గా అర్వింద్ కుమార్.. ఏసీబీ నమోదు చేసే చాన్స్
» కేటీఆర్‌పై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి
» ఏసీబీకి సీఎస్ శాంతికుమారి లేఖ
» ఫార్ములా-ఈ నిధుల దుర్వినియోగం కేసులో బీఆర్‌ఎస్ నేత చుట్టూ బిగుస్తున్న ఉచ్చు



హైదరాబాద్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజకీయాల్లో మరో కీలక పరిణామం. ఫార్ములా-ఈ రేసు వ్యవహారంలో వచ్చిన అవినీతి ఆరోపణలపై బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్‌ను ఏసీబీ విచారించనుంది. ఈ మేరకు ఏసీబీకి రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం అనుమతి ఇచ్చింది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కేటీఆర్ మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా పని చేసిన విషయం తెలిసిందే. బీఆర్‌ఎస్ హయాంలో మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పని చేసిన అర్వింద్ కుమార్‌తో పాటు మరో ఇద్దరు అధికారులు ఇప్పటికే విచారణ ఎదుర్కొంటున్నారు. ఈ కేసులో కేటీఆర్‌ను ఏ 1గా, అర్వింద్‌కుమార్‌ను ఏ2గా చేర్చనున్నట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. కాగా, అవినీతి ఆరోపణలపై ఎవరైనా ఎమ్మెల్యేను విచారించాలంటే రాష్ట్ర గవర్నర్ ముందస్తు అనుమతి తప్పనిసరి. కేటీఆర్‌ను ప్రశ్నించేందుకు గవర్నర్ ఇప్పటికే అనుమతిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారికి లేఖ రాశారు. ఈ నేపథ్యంలో శాంతికుమారి.. గవర్నర్ అనుమతి గురించి తెలుపుతూ మంగళవారం ఏసీబీకి లేఖ రాశారు. రూ.55 కోట్ల ఫార్ములా-ఈ నిధుల దుర్వినియోగం కేసులో విచారణకు తమ ముందు హాజరు కావాలంటూ ఏసీబీ కేటీఆర్‌కు నోటీసులు పంపనుంది. మరోవైపు, పోలీసు ఉన్నతాధికారులు మంగళవారం శాసనసభలోని సీఎం చాంబర్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమయ్యారు. కేటీఆర్ కేసుకు సంబంధించిన వివరాలను సీఎంకు వివరించినట్లు సమాచారం.

కోయిల్‌సాగర్ పెండింగ్ పనులు..
2026 జూన్ నాటికి పూర్తి: ఉత్తమ్



హైదరాబాద్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని కోయిల్‌సాగర్ ప్రాజెక్టు పెండింగ్ పనులను 2026 జూన్ నాటికి పూర్తిచేస్తామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శాసన సభ ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల పరిధిలోని ఎత్తిపోతల పథకాలు సహా పలు ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తిచేయాలని కోరగా మంత్రి సమాధానమిచ్చారు. 19ఏ ప్యాకేజీ పనుల్లో గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఆలస్యమవుతోందని తెలిపారు. దీనికంటే ముందు 17, 18 ప్యాకేజీలను కూడా పూర్తిచేస్తామన్నారు. పెద్దారెడ్డిపేట ఎత్తిపోతలు, నల్లవాగు కాలువ ఆధునీకరణ పనులపై అంచనాలు రూపొందుతున్నాయని వెల్లడించారు.

1000 కొత్త బస్సులు కొంటాం: పొన్నం




రాష్ట్రంలో మహాలక్ష్మి పథకం అమలుతో బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో 40 నుంచి 100 శాతానికి పెరిగిందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రద్దీకి అనుగుణంగా కొత్తగా 1000 బస్సులు కొనుగోలు చేయనున్నట్లు పేర్కొన్నారు. వీటిని స్వయం సహాయక సంఘాల ద్వారా కొంటామని ప్రశ్నోత్తరాల్లో భాగంగా చెప్పారు. చెన్నూరు ఆర్టీసీ డిపో స్థలంపై కోర్టులో స్టే ఉందని, దానిని వెకేట్ చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఇక వేములవాడ-కొండగట్టు-ధర్మపురికి కలిపి బస్సులు నడుపుతామని, కాగజ్‌నగర్ డిపో ప్రతిపాదనను పరిశీలిస్తామని చెప్పారు. అంతకుముందు చెన్నూరు ఎమ్మెల్యే జి.వివేక్ మాట్లాడుతూ చెన్నూరు డిపో నిర్మాణం తక్షణం చేపట్టాలని కోరారు. ఇక వేములవాడ డిపోకు అదనంగా 20 కొత్త బస్సులు సమకూర్చాలని ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కోరారు. కాగా, కాగజ్‌నగర్‌లో డిపో కోసం విలువైన స్థలం కేటాయింపు జరిగిందని, దానిపై వంద మంది కన్ను ఉందని బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. ఆ స్థలాన్ని వినియోగించుకొని డిపో కట్టాలని సూచించారు.

మా నియోజకవర్గాల్లో సమస్యల్ని పరిష్కరించండి

- సభలో ఎమ్మెల్యేలు

అధ్యక్షా.. మా నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలంటూ జీరో అవర్‌లో పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడారు. దళితబంధు రెండో విడత నిధులను వెంటనే విడుదల చెయ్యాలంటూ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి కోరారు. నత్తనడక సాగుతున్న ఛే నంబర్ బ్రిడ్జి నిర్మాణ పనుల వేగవంతానికి చర్యలు తీసుకోవాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ కోరారు. ఇక, నియోజకవర్గాలకు కేటాయించే ప్రత్యేక నిధుల ఖర్చు సహా వివిధ అంశాల్లో ఇన్‌చార్జి మంత్రుల పాత్ర ఏంటని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ప్రశ్నించారు. తన నియోజకవర్గంలో ఏడాదిగా వీధి దీపాలు పని చేయడం లేదని ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. ఆదిలాబాద్‌కు 2017లో మంజూరైన ఆర్వోబీల నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వ వాటా నిధులు చెల్లించాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ సభ కోరారు. సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వరులు విజ్ఞప్తి చేశారు. కాగా, నిధులన్ని కొడంగల్‌కే తీసుకెళ్తారా.. మా నియోజకవర్గాలకు ఇవ్వరా? అని బీజేపీ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ప్రశ్నించారు. రాష్ట్రంలో రైతుల కంటే విద్యార్థుల ఆత్మహత్యలు అధికమయ్యాయని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం దృష్టి సారించాలని ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. లేనిపక్షంలో ఎంఐఎం ఆందోళన చేపడుతుందని ప్రకటించారు. తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటును స్వాగతిస్తున్నామని చెప్పారు. ఇక, గోషామహల్ మైదానంలో ఉస్మానియా ఆస్పత్రి నూతన భవన నిర్మాణం నిర్ణయంపై పునరాలోచన చెయ్యాలని గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ ప్రభుత్వాన్ని కోరారు. పాల్వంచ, కొత్తగూడెం మునిసిపాలిటీని కార్పోరేషన్‌గా మార్చాలని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు కోరారు. అనంతరం మధ్యాహ్నం ఒంటిగంటకు సభకు విరామం ప్రకటించారు. అయితే తాము కొన్ని ప్రశ్నలు అడగాల్సి ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కోరినా స్పీకర్ అవకాశం ఇవ్వకపోవడంపై వారు కాసేపు నినాదాలు చేసి బయటకు వెళ్లారు.



లీకులిచ్చి వార్తలు రాయించుకుంటున్న సీఎం

- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

కేసులు, అరెస్టులని లీకులిచ్చి వార్తలు రాయించుకుంటూ ముఖ్యమంత్రి వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కేపీ వివేకానంద అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ ఆరోపించారు. ఫార్ములా ఈ రేస్ కేసులో కేటీఆర్‌ను ఇరికించేందుకు సీఎం కుట్ర చేస్తున్నారని, ఎలాంటి విచారణకైనా కేటీఆర్ సిద్ధమని వారు పేర్కొన్నారు. లగచర్ల రైతులు జైల్లో మగ్గుతుంటే సీఎం, మంత్రులు రాక్షసానందం పొందుతున్నారని విమర్శించారు.

మూసీ పేరిట నష్టం జరిగితే ఊర్కోం : కవిత

మూసీ ప్రక్షాళనకు బీఆర్ఎస్ వ్యతిరేకం కాదని, కానీ ఆ ప్రాంత ప్రజలకు నష్టం జరిగితే సహించేది లేదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శాసన మండలి మీడియా పాయింట్ వద్ద మంగళవారం మాట్లాడుతూ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపైకి బుల్డోజర్లు పంపుతోందని ఆరోపించారు. ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు ప్రపంచ బ్యాంకు నుంచి రూ.4100కోట్ల రుణం కోరిందని, డీపీఆర్ లేకుండా ఆ రుణం ఎలా ఇస్తారని ఆమె ప్రశ్నించారు. ఏడువేల మంది తమ ఇళ్లను కోల్పోతున్నారనే కేసీఆర్ మూసీ ప్రాజెక్టు జోలికి వెళ్లలేదని కవిత తెలియజేశారు.

ఎన్టీఆర్ గార్డెన్‌లో అసెంబ్లీ ఉంటే బాగుంటుంది

- రాజగోపాల్‌రెడ్డి

సచివాలయం పక్కన.. ఎన్టీఆర్ గార్డెన్‌లో అసెంబ్లీ నిర్మాణం జరిగితే బాగుంటుందని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ నిర్మాణం కోసం అవసరమైతే హుస్సేన్‌సాగర్ ఎఫ్‌టీఎల్ పరిధిని కూడా కుదించవచ్చని అసెంబ్లీ లాబీల్లో మీడియాతో ఆయన చిట్‌చాట్‌గా మాట్లాడారు. ఇక తనకు మంత్రి పదవి అనేది అధిష్ఠానం నిర్ణయమన్నారు. కాగా, రాష్ట్రంలో చీకటి ఒప్పందం చేసుకున్న బీఆర్ఎస్, బీజేపీలు ప్రభుత్వ బిల్లులను అడ్డుకుంటున్నాయని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆరోపించారు. లగచర్లను సాకుగా చూపి స్పోర్ట్స్ యూనివర్సిటీ బిల్లును అడ్డుకున్నారని మండిపడ్డారు. ఇక, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, ఈర్లపల్లి శంకర్ మాట్లాడుతూ అధికారం ఉంటేనే కేసీఆర్ అసెంబ్లీకి వస్తారా ? అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వంపై దుష్ప్రచారాన్ని మానుకోవాలని బీఆర్ఎస్ నేతలకు హితవు పలికారు.

కెప్టెన్ లేని నావలా బీఆర్ఎస్ పరిస్థితి

- ఫీజు బకాయిలను దశల వారీగా చెల్లిస్తాం: భట్టి



ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను అసెంబ్లీ సమావేశాల తర్వాత దశల వారీగా చెల్లిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చెప్పారు. ఆర్థిక సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వెళుతున్నామని అన్నారు. ప్రైవేటు కళాశాలల యజమానులు, విద్యా శాఖ ఉన్నతాధికారులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. అలాగే, బీఆర్ఎస్ పార్టీ.. కెప్టెన్ లేని నావలా తయారైందని, నాయకుడు లేకుంటే పార్టీ ఎలా ఉంటుందో సభలో స్పష్టంగా తెలుస్తోందని అసెంబ్లీ లాబీల్లో మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభను తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. భూమిలేని కూలీలకు డబ్బులు ఇస్తామంటే బీఆర్ఎస్ వద్దంటోందని, రైతు కూలీలకు మేలు జరగడం వారికి ఇష్టం లేదని అన్నారు.

నేడు కాంగ్రెస్ చలో రాజ్‌భవన్

గౌతమ్ అదానీ అమెరికాలో ఆర్థిక అవకతవకలకు పాల్పడి దేశం పరువు తీసినందుకు నిరసనగా ఏఐసీసీ పిలుపు మేరకు టీపీసీసీ బుధవారం చలో రాజ్‌భవన్ కార్యక్రమాన్ని చేపట్టనుంది. నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం నుంచి రాజ్‌భవన్ వరకూ జరిగే నిరసన ప్రదర్శనలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు, పార్టీ ముఖ్యనేతలు పాల్గొననున్నారు.

అప్పుల నిప్పులు

(మొదటిపేజీ తరువాయి)

సభలో లేకపోవటంతో భట్టిని రప్పించాలని బీఆర్ఎస్ సభ్యులు డిమాండ్ చేస్తూ నిరసన తెలిపారు. ఆ తర్వాత సభలోకి వచ్చిన భట్టి.. 2023 డిసెంబరు నుంచి 2024 నవంబరు 30 దాకా ఎఫ్ఆర్‌బీఎం రుణాలు రూ.52,118 కోట్లు తీసుకోగా, కార్పొరేషన్‌లు/ఎస్‌పీవీలు తీసుకున్న ఎఫ్ఆర్‌బీఎం యేతర రుణాలు రూ.61,991 కోట్లు అని తెలిపారు. ఎఫ్ఆర్‌బీఎం యేతర రుణాల్లో భాగంగా గ్యారెంటీ ఇచ్చిన అప్పులు రూ.51,277 కోట్లు కాగా, డ్రా చేసిన మొత్తం రూ.51,891 కోట్లు అని వెల్లడించారు. దీనిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పందిస్తూ.. ఏడాదికాలంలో (మంగళవారం నాటికి) కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1,27,208 కోట్ల అప్పులు చేసిందన్నారు. ఈ లెక్కన ఐదేళ్లలో అప్పు రూ.6 లక్షల కోట్లు దాటనుందని, పదేళ్లలో తాము రూ.4.17 లక్షల కోట్లు మాత్రమే అప్పు చేశామని చెప్పారు. రుణాలపై ప్రభుత్వం తప్పుడు సమాచారం ఇస్తోందని, అవసరమైతే ఆడిటర్లను పిలిచి చర్చ జరపాలని డిమాండ్ చేశారు. దీనిపై డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ, 'అప్పులపై కావాలంటే మళ్లీ శ్వేతపత్రం విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నాం. పాత కథలు చెబితే వినం. గతంలో మీరే రూల్స్ రూపొందించారు. ప్లకార్డులు ప్రదర్శించొద్దు. నినాదాలు ఇవ్వొద్దు అని రాసుకున్నారు. ఆ నిబంధనలు మీరే పాటించరా? మీ హయాంలో చేసిన అప్పులకు అసలు/వడ్డీ కలిపి రూ.66 వేల కోట్లు కట్టాం. రైతు కూలీలకు ఏటా రూ.12 వేలు ఇస్తామని చెబితే మాపై ప్రివిలేజ్ మోషన్ వేస్తారా? మీది భూస్వామ్య మనస్తత్వం' అని మండిపడ్డారు. మాకు నీతులు చెబుతారా అని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. అప్పులపై సభ బయట మాట్లాడినందుకే ప్రివిలేజ్ మోషన్ ఇచ్చాం, దానిపై ఆవేశం ఎందుకంటూ ప్రశ్నించారు.

రాజకీయాల కోసం హరీశ్ అబద్ధాలు: భట్టి

బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. 'ఏడాదిలో రూ.1,27,218 కోట్ల అప్పులు చేశారు. అనేక బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. 6 గ్యారంటీలు, 13 హామీల అమలు జరుగలేదు. చిన్న చిన్న పనులకు కూడా బిల్లులు రావడం లేదు. డబ్బులు ఎటుపోతున్నాయి?' అని ప్రభుత్వాన్ని నిలదీశారు. భట్టి కల్పించుకొని.. హరీశ్‌రావు రాజకీయాల కోసం అబద్ధాలు చెబుతుంటారు కానీ వేముల ప్రశాంత్‌రెడ్డి అయినా నిజాలు మాట్లాడతారని అనుకున్నామన్నారు. రూ.లక్ష కోట్లు కాదు.. రూ.52 వేల కోట్ల అప్పు మాత్రమే చేశామని తెలిపారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి ఏటా కట్టాల్సిన అప్పు అసలు/వడ్డీ కలిపి రూ.6 వేల కోట్లు కాగా, పదేళ్ల బీఆర్ఎస్ పాలన వైఫల్యాల తర్వాత ఏడాదికి రూ.66 వేల కోట్ల అసలు/వడ్డీ కట్టాల్సిన పరిస్థితి తలెత్తిందన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడే నాటికి రూ.40 వేల కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిలో రూ.14 వేల కోట్ల చెల్లింపులు చేశామని వెల్లడించారు. 'ప్రతీ గింజను కొంటున్నాం, 3-4 రోజుల్లోనే చెల్లింపులు చేస్తున్నాం. మీ జీవితంలో మూడు రోజుల్లో ఎప్పుడైనా చెల్లింపులు చేశారా? క్వింటాలుకు రూ.500 సన్నాలకు ఇస్తున్నాం. డిస్కమ్‌లకు రూ.18 వేల కోట్లు బకాయిలు పడ్డారు. ఒక్క ఏడాదిలోనే రూ.11 వేల కోట్లు సబ్సిడీ కింద డిస్కమ్‌లుకు చెల్లించాం. మీ పదేళ్లకాలంలో రూ.లక్ష కోట్లు డిస్కమ్‌లకు టారిఫ్ సబ్సిడీ కింద చెల్లించాల్సి ఉండగా ఎంత చెల్లించారు? మేం మెస్ ఛార్జీలు 40 శాతం పెంచాం. కాస్మెటిక్ ఛార్జీలు 200 శాతం పెంచాం. అప్పులపై మళ్లీ శ్వేతపత్రం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం' అని ప్రకటించారు. హరీశ్ బదులిస్తూ.. పదేళ్లలో రూ.60 వేల కోట్లను డిస్కమ్‌లకు టారిఫ్ సబ్సిడీ కింద చెల్లించామన్నారు. బీజేపీ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ, గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని ఇచ్చిన హామీని ఎప్పటిలోగా అమలు చేస్తారని ప్రశ్నించారు. భట్టి కల్పించుకొని.. ఎఫ్ఆర్‌బీఎం దాటి అప్పులు చేయలేదని, పదేళ్ల జరిగిన ఆర్థిక విధ్వంసాన్ని ఒక్క ఏడాదిలో సరిచేయలేమన్నారు. ఓఆర్ఆర్‌ను 30 ఏళ్లకు అమ్ముకొని వెళ్లారని, కానీ, తాము ఆస్తులు అమ్మకూడదని.. తాకట్టుపెట్టి అప్పులు చేస్తున్నామని చెప్పారు. అప్పులపై చర్చ జరుగుతున్నంత సేపు బీఆర్ఎస్, కాంగ్రెస్ సభ్యులు పోటాపోటీగా నినాదాలు చేశారు.

నల్ల షర్టులు, బేడీలతో బీఆర్ఎస్ సభ్యులు

చికిత్స కోసం ఆస్పత్రికి తీసుకెళ్లిన లగచర్ల రైతుకి బేడీలు వేసినందుకు నిరసనగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మంగళవారం.. నల్లచొక్కాలు, చేతులకు బేడీలతో అసెంబ్లీకి హాజరయ్యారు.

మా బావగారూ కోరుతున్నారు!

కొత్త రెవెన్యూ డివిజన్లు, మండలాలపై పరిశీలిస్తాం

- కోమటిరెడ్డిని ఉద్దేశించి పొంగులేటి
- అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో కోరిన ఎమ్మెల్యేలు
- చేర్యాలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా డిమాండ్‌కు కోమటిరెడ్డి సంఘీభావం
- శాసనసభలో అరుదైన సన్నివేశం

హైదరాబాద్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): శాసనసభలో మంగళవారం ఆసక్తికర సన్నివేశాలు చోటు చేసుకున్నాయి. ప్రతిపక్షానికి చెందిన ఎమ్మెల్యే డిమాండ్‌కు ప్రభుత్వంలోని సీనియర్ మంత్రి మద్దతునివ్వగా, ఓ మంత్రి.. మరో మంత్రిని సభలోనే 'బావగారు' అంటూ సంబోధించారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల పరిధిలో కొత్త రెవెన్యూ డివిజన్లు, మండల కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరిన సందర్భంగా ఇవి చోటుచేసుకున్నాయి. బీఆర్ఎస్ సభ్యుడైన జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ కూడా హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే ఈ హామీ ఏదీ తాము ఇవ్వలేదని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బదులిచ్చారు. దీంతో రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జోక్యం చేసుకుంటూ.. ఆలేరు, చేర్యాల పోరాటాల గడ్డ అని, జిల్లాలు/డివిజన్ల పునర్వ్యవస్థీకరణ పేరుతో గత ప్రభుత్వం వాటిని ముక్కలు చెక్కలు చేసిందని అన్నారు. చేర్యాల రెవెన్యూ డివిజన్ కోసం నిరాహార దీక్షలకు తాను కూడా హాజరయ్యాయని తెలిపారు. ఆలేరు,





చేర్యాల, మక్తల్ డివిజన్‌ల డిమాండ్లు న్యాయమైన కోరికలని, వాటిని తీర్చాలని మంత్రి పొంగులేటికి సూచించారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను ప్రజాప్రభుత్వం పరిష్కరించాలన్నారు.

పరిధులు సర్దుబాటు చేస్తాం..

మంత్రి కోమటిరెడ్డి విజ్ఞప్తిపై రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పందిస్తూ.. రాష్ట్రంలో రెవెన్యూ డివిజన్ల ఏర్పాటు, మండల పరిధులు, నియోజకవర్గ పరిధుల విషయంలో ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకుంటుందన్నారు. "సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చిన ఇదే సమస్యపై మా బావగారు కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా మాట్లాడారు. దీనిపై ప్రభుత్వం దృష్టి సారిస్తుంది" అని అన్నారు. ఒక నియోజకవర్గం రెండు, మూడు జిల్లాల పరిధిలోకి వెళ్లడంతో ఎమ్మెల్యేలు కూడా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కొత్త రెవెన్యూ డివిజన్లు, మండలాలు, నియోజకవర్గాల పరిధుల ఏర్పాటు, సర్దుబాటు చేసే అంశంపై ప్రతిపక్షం సూచనలు కూడా స్వీకరిస్తామన్నారు. కాగా, మహబూబాబాద్ నియోజకవర్గంలోని ఇనుగుర్తిని మండలం చేయాలని ఎమ్మెల్యే మురళీనాయక్ కోరారు. బోథ్‌ను రెవెన్యూ డివిజన్ చేయాలని అనిల్‌జాదవ్, మక్తల్‌ను రెవెన్యూ డివిజన్ చేయాలని వాకిటి శ్రీహరి, ధర్మపురిని రెవెన్యూ డివిజన్ చేయాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని మరో విప్ బీర్ల ఐలయ్య విజ్ఞప్తి చేశారు. ఇందుకు మంత్రి పొంగులేటి బదులిస్తూ.. ఆలేరు డివిజన్ ప్రతిపాదనల దశలో ఉందని, మక్తల్, ఆత్మకూరు డివిజన్‌ల ఏర్పాటుకు సాధ్యాసాధ్యాల కమిటీ నివేదికను కలెక్టర్ల నుంచి కోరామని చెప్పారు. కొత్తగా 11 రెవెన్యూ డివిజన్ల కోసం విజ్ఞప్తులు వచ్చాయని గుర్తు చేశారు.

కేటీఆర్‌కు బెయిల్ కూడా రాదు: కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ఫార్ములా-ఈ కారు రేసింగ్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్ చేసింది పెద్ద తప్పు అని, ఆయన జైలుకు వెళ్లక తప్పదని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. కేటీఆర్‌కు బెయిల్ కూడా రాదని, ఏడేళ్లు జైల్లోనే ఉండాల్సి వస్తుందని చెప్పారు. మీడియా పాయింట్ వద్ద జర్నలిస్టులతో ఇష్టాగోష్ఠిలో మంత్రి మాట్లాడుతూ కేటీఆర్‌కు బెయిల్ రావాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మొక్కుతున్నారని, అసెంబ్లీకి నల్ల దుస్తులతో రావడాన్ని చూస్తే వారంతా శబరిమల వెళ్లడానికి ధరించినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు.

'జమిలి' 2029లో కాదు

2027లోనే

అసెంబ్లీ లాబీలో అధికార, విపక్ష ఎమ్మెల్యేల ఆసక్తికర చర్చ

హైదరాబాద్, డిసెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఎన్నికలు ఎప్పుడు? అసెంబ్లీ లాబీల్లో ఎమ్మెల్యేల మధ్య ఇప్పుడు దీనిపై ఒకటే చర్చ..! అదేంటీ.. శాసనసభకు గత ఏడాది, లోక్‌సభకు ఏడు నెలల కిందటనే కదా ఎన్నికలు జరిగింది..? మళ్లీ ఇప్పుడు ఎందుకీ ప్రస్తావన..? అనే అనుమానం వస్తోందా..? లాబీల్లో ఎమ్మెల్యేల చర్చ 'జమిలి' గురించి. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకే దఫాలో ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం గట్టి ప్రయత్నాలు సాగిస్తున్న నేపథ్యంలో.. మంగళవారం వివిధ పార్టీలకు చెందిన శాసనసభ సభ్యుల మధ్య ఆసక్తికర సంభాషణ జరిగింది. అధికార, ప్రతిపక్షాల వారు భిన్న అభిప్రాయాలు వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 2028 చివరి వరకు అధికారం ఉన్నందున.. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు జమిలి ఎన్నికలు 2029లోనే ఉంటాయనే ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుత లోక్‌సభ సభ్యుల పదవీ కాలం 2029 వరకు ఉన్నదని.. పైగా, ప్రధాని మోదీ రెండేళ్ల అధికార గడువును వదలుకుని ముందస్తు ఎన్నికలకు వెళ్లే అవకాశమే లేదంటూ తమ వాదనను సమర్థించుకున్నారు. ఇక బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మాత్రం ఎన్నికలు 2027లోనే జరుగుతాయనే ఆశాభావం వ్యక్తం చేశారు. జమిలికి మరో రెండేళ్లలోనే అవకాశం ఉందన్నారు. అప్పటితో కాంగ్రెస్ ప్రభుత్వ గడువు ముగిసిపోతుందని, అసెంబ్లీకి వచ్చిన గులాబీ పార్టీ మాజీ ఎమ్మెల్యే ఒకరు జోస్యం చెప్పారు. మరోవైపు తెలంగాణలో వచ్చేసారి కచ్చితంగా తమదే అధికారం అనే ఆలోచనలో ఉన్న బీజేపీకి చెందిన శాసన సభ్యులు మాత్రం రెండు రకాల వాదనలు వినిపించారు. "జమిలి ఎన్నికలు 2027లో జరగొచ్చు.. లేదా 2029లో ఉండొచ్చు" అని బీజేపీ శాసనసభా పక్ష ఉప నేత పాయల శంకర్ అన్నారు. 2026లో జరిగే నియోజకవర్గాల పునర్విభజన తర్వాత దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉందన్నారు.



నేడు శాసనసభలో కొత్త ఆర్‌వోఆర్ యాక్ట్ బిల్లు

- ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం
- ఉదయం మంత్రివర్గ సమావేశం
- ఆమోదం అనంతరం సభలోకి బిల్లు
- గ్రామ రెవెన్యూ వ్యవస్థ పునరుద్ధరణ

హైదరాబాద్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొస్తున్న 'తెలంగాణ భూమి హక్కులు పట్టాదార్ పాస్‌పుస్తకం చట్టం-2024 (ఆర్‌వోఆర్)' బిల్లు బుధవారం శాసన సభ ముందుకు రానుంది. ఇందుకోసం బుధవారం ఉదయం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ప్రత్యేకంగా మంత్రివర్గ సమావేశం జరగనుంది. మంత్రివర్గం ఆమోదించిన వెంటనే బిల్లును శాసనసభలో ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. ఇందుకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసంలో మంగళవారం సాయంత్రం ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. వాస్తవానికి ఆర్‌వోఆర్ చట్టానికి సంబంధించిన బిల్లును ఈ నెల 19న ప్రవేశపెట్టాలని గతంలో యోచించారు. కానీ, ఒకరోజు ముందే దీనిని ప్రవేశపెడుతున్నారు. కొత్త బిల్లు చట్టరూపం దాల్చాక.. ఇప్పటివరకు ఉన్న 'ధరణి' వెబ్‌సైట్ పేరును 'భూమాత'గా మార్చనున్నారు. కొత్త చట్టంలో ప్రతి రెవెన్యూ రికార్డుకు సంబంధించిన నిర్ణయాలపై అప్పీల్ వ్యవస్థను పునరుద్ధరించనున్నారు. ప్రతి గ్రామంలో భూరికార్డులతో ముడిపడిన వ్యవహారాలు చూడటానికి రెవెన్యూశాఖకు చెందిన సిబ్బంది ఉండనున్నారు. ప్రతి రెవెన్యూ గ్రామంలో ఒక ఉద్యోగి రెవెన్యూశాఖ తరఫున విధులు నిర్వహిస్తారు. తద్వారా.. గత కేసీఆర్ ప్రభుత్వం రద్దు చేసిన గ్రామ రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరించనున్నారు.

ముసాయిదాలోని ముఖ్యాంశాలు..

- ఆర్‌వోఆర్ చట్టం- 2024 ముసాయిదాలో డిజిటల్ ల్యాండ్ రికార్డులను సరిదిద్దే నిబంధన ఉంది. ఇప్పటికే ఉన్న సర్క్యులర్ 1 లేదా దాని సవరించిన వర్షన్‌కు చట్టబద్ధమైన మద్దతు ఉంటుంది.
- పార్ట్-బీ కేసులపై నిర్ణయం తీసుకునే వీలుంది.
- విక్రయం, బహుమతి, తనఖా, మార్పిడి, వారసత్వం, సివిల్ లేదా రెవెన్యూ కోర్టు డిక్రీ/ఆర్డర్, లోక్ అదాలత్ అవార్డు, అసైన్‌మెంట్ పట్టా, ఓఆర్‌సీ, 38ఈ, 13బీ, సేవల సర్టిఫికెట్‌తోపాటు ఇతర చట్టబద్ధమైన పద్ధతుల్లో హక్కులు పొందిన యజమానుల హక్కులను నమోదు చేస్తారు. ఆర్వోఆర్ 2020లో వీటికి అవకాశం లేదు.
- ప్రభుత్వం నిర్దేశించిన తేదీ నుంచి రిజిస్ట్రేషన్‌కు ముందే సర్వే, సబ్ డివిజన్ నిర్వహించాలి. రిజిస్ట్రేషన్ తర్వాత నిర్ణీత గడువులోగా మ్యుటేషన్ పూర్తి చేయాలి.

100% ఇళ్లకు నల్లా కనెక్షన్లు ఒట్టిమాటే!

- 2021లోనే అన్ని ఇళ్లకూ తాగునీరు అబద్ధం
- 2024 జూలైలో 4.49 లక్షల ఇళ్లలో సర్వే చేస్తే.. 1.28 లక్షల ఇళ్లకు లేవని తేలింది
- పాఠశాలల్లో ఆహార కల్తీ పై అనుమానాలు
- శాసనమండలిలో మంత్రి సీతక్క

హైదరాబాద్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నల్లా కనెక్షన్ల ద్వారా 100 శాతం ఇళ్లకు తాగునీటిని సరఫరా చేసిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచినట్లు 2021లో ప్రకటించారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క చెప్పారు. నల్లా కనెక్షన్లతో 53,98,219 ఇళ్లకు మంచి నీటిని సరఫరా చేసినట్లు 2021 జనవరిలో జేవోఐ-ఐఎంఐఎస్ వెబ్‌సైట్ ప్రకారం ప్రకటించారని గుర్తుచేశారు. కానీ, 2024 జులైలో 4.49 లక్షల ఇళ్లలో కుటుంబ సర్వే నిర్వహించగా 3.21 లక్షల ఇళ్లకే నల్లా కనెక్షన్‌లు ఉన్నాయని, మరో 1.28 లక్షల గృహాలకు లేవని తేలిందని చెప్పారు. శాసనమండలిలో మంగళవారం ప్రశ్నోత్తరాల సందర్భంగా బీఆర్ఎస్ సభ్యుడు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అడిగిన ప్రశ్నకు మంత్రి సీతక్క సమాధానం చెబుతూ ఈ వివరాలు వెల్లడించారు. నీటిసరఫరాను మెరుగుపర్చడానికి గాను నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి 2 టీఎంసీల నీరు విడుదల చేసేందుకు కర్ణాటకతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆమె చెప్పారు. రాష్ట్రంలోని ఆశ్రమ పాఠశాల్లో వరుసగా జరుగుతున్న ఆహార కల్తీ ఘటనలపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని సీతక్క అన్నారు. మండలిలో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెబుతూ.. ఆయా స్కూళ్లకు సామగ్రిని సరఫరా చేసే వారిపై నిఘా పెంచినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రెసిడెన్షియల్ స్కూళ్లలో జరుగుతున్న వరుస ఘటనలపై హౌస్ కమిటీ వేసి విచారణ జరిపించాలని మధుసూదనాచారి కోరగా, ఏసీబీకి రిఫర్ చేయాలని ఎంఎస్ ప్రభాకర్ సూచించారు. నిరసన తెలిపే విషయంలోనూ బీఆర్ఎస్ నేతల్లో సమానత్వం లేదని మంత్రి సీతక్క చెప్పారు. ఆ పార్టీ ఎమ్మెల్యేలకు బేడీలు వేశారు తప్ప.. కేటీఆర్, హరీశ్ బేడీలు వేసుకోలేదని, వారి దొరతనం మరోసారి బయటపడిందని అన్నారు. అసెంబ్లీ లాబీల్లో మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ.. రైతులకు బేడీలు వేయడంపై బీఆర్ఎస్ నేతలకు మాట్లాడే అర్హత లేదన్నారు. లగచర్ల రైతుకు బేడీలు వేయడంపై ఆగ్రహించిన సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యులపై చర్యలు కూడా తీసుకున్నారని గుర్తుచేశారు. కాగా.. పదేళ్ల పాటు తాము చేసిన తప్పులకు బేడీలు వేయించుకునే అర్హత ఉందంటూ సింబాలిక్‌గా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు బేడీలతో అసెంబ్లీకి వచ్చారని మంత్రి జూపల్లి చమత్కరించారు.



బడి మానేస్తున్న బాలికలు పెరుగుతున్నరు

రాష్ట్రంలో వివిధ కారణాలతో బడి మానేస్తున్న బాలికల సంఖ్య పెరిగిపోవడం ఆందోళనకరమైన అంశమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. పాఠశాలల మూసివేతపై బీఆర్ఎస్ సభ్యుడు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇస్తూ.. విద్య, వైద్యం ప్రభుత్వ బాధ్యత అన్నారు. పాఠశాలల్లో విద్యార్థినుల సంఖ్య 22 లక్షల నుంచి 18 లక్షలకు తగ్గిపోవడం బాధకరమన్నారు. 2023-24లో 1745 స్కూళ్లలో, 2024-25లో 1913 స్కూళ్లలో విద్యార్థులు చేరలేదని వివరించారు. ఉపాధ్యాయ నియామకాల తర్వాత 79 స్కూళ్లలో తరగతులను పునఃప్రారంభించినట్లు తెలిపారు.

మూసీపై వాడీవేడి చర్చ..

మూసీ సుందరీకరణ ప్రాజెక్టు అంశంపై అధికార-విపక్ష సభ్యుల మధ్య మండలిలో వాడీవేడిగా చర్చ జరిగింది. డీపీఆర్ లేనిదే 1.5 లక్షల కోట్ల వ్యయంతో ప్రాజెక్టును ప్రభుత్వం ఎలా ప్రకటిస్తుందని బీఆర్ఎస్ సభ్యులు ప్రశ్నించగా.. ఈ మొత్తం మూసీతో పాటు హైవేలు, ఎలివేటెడ్ కారిడార్‌లు, రింగ్ రోడ్లు, తదితర ప్రాజెక్టులకు మొత్తంగా అయ్యే అంచనాగా సీఎం పేర్కొన్నారని మంత్రి శ్రీధర్‌బాబు వివరణ ఇచ్చారు. డీపీఆర్ తయారు చేసిన తర్వాత అంచనా వ్యయంపై స్పష్టత వస్తుందన్నారు. మూసీ పరివాహక ప్రాంతంలో వరద ముంపునకు గురయ్యే 309 కుటుంబాలు స్వచ్ఛందంగా తరలి వెళ్లినట్లు వివరించారు. వారికి ఒక్కో కుటుంబానికి రెండు పడకల ఇళ్లతో పాటు రూ.25 వేల చొప్పున షిఫ్టింగ్ అలవెన్స్ అందించినట్లు తెలిపారు. జీవనోపాధి కోసం రూ.2 లక్షల చొప్పున 172 మందికి రూ.3.44 కోట్లను పంపిణీ చేసినట్లు చెప్పారు. కాగా, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఒక్కొక్కరూ రూ.వెయ్యి కోట్లు సంపాదించారంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలంటూ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను హరీశ్, పల్లా కోరారు.

200కు మించిన గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు: శ్రీధర్‌బాబు



ఏడాదిలోనే రాష్ట్రంలో మారియెట్, ఫెడెక్స్, అమెజాన్ తదితర సంస్థలు నూతనంగా గ్లోబల్ క్యాపబులిటీ సెంటర్ల(జీసీసీ)ను ప్రారంభించినట్లు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. మండలిలో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం చెబుతూ.. 20 వేల మందికి ఉపాధి కల్పించే లక్ష్యంతో జీసీసీలను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే హైదరాబాద్‌లో 200కు పైగా జీసీసీలు కార్యకలాపాలు ప్రారంభించినట్లు వివరించారు. ఏఐ సిటీ నిర్మాణానికి 200 ఎకరాలు కేటాయించినట్లు చెప్పారు. రాష్ట్రంలో 30 లక్షల మందికి పైగా నిరుద్యోగులున్నట్లు వెల్లడించారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు 2017 నుంచి రాయితీలను చెల్లించకపోవడంతో 3,700 కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయన్నారు. బాపూఘాట్ వద్ద గాంధీ సరోవర్ ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి సమీపంలోని రక్షణ స్థలాలను సేకరించేందుకు ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలిపారు.

లగచర్ల ఘటనపై చర్చించాల్సిందే

- అప్పటి వరకు సమావేశాలను సాగనివ్వం
- మండలిలో బీఆర్ఎస్ సభ్యుల నిరసన
- వెల్‌లోకి దూసుకెళ్లి ప్లకార్డుల ప్రదర్శన

హైదరాబాద్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): లగచర్ల ఘటనపై చర్చ చేపట్టాలంటూ శాసనమండలిలో బీఆర్ఎస్ సభ్యులు రెండో రోజు కూడా పట్టుబట్టారు. ఆ విషయంపై చర్చించేదాకా సభను కొనసాగనివ్వబోమంటూ నిరసనకు దిగడంతో మంగళవారం మండలిలో గందరగోళం చోటుచేసుకుంది. భోజన విరామం అనంతరం మండలిలో తెలంగాణ రాష్ట్ర పర్యాటక విధానంపై చర్చ కొనసాగుతుందని చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రకటించగానే నల్ల దుస్తులు ధరించి సభకు హాజరైన బీఆర్ఎస్ సభ్యులు.. ప్లకార్డులు పట్టుకుని వెల్‌లోకి దూసుకెళ్లారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్లకార్డులు ప్రదర్శించడం సభా సంప్రదాయం కాదని చైర్మన్ వారిస్తున్నప్పటికీ బీఆర్ఎస్ సభ్యులు వినిపించుకోలేదు. సభలో డిప్యూటీ సీఎం భట్టి ప్రకటన చేస్తారని చెప్పడంతో బీఆర్ఎస్ సభ్యులు వెళ్లి కూర్చున్నారు. కాగా, బీఏసీలో నిర్ణయించినట్లుగా వ్యవసాయ రంగం-రుణమాఫీ అంశంపై చర్చ చేపడుతున్నామని, అన్ని అంశాలను ప్రస్తావించేందుకు అవకాశం ఉంటుందని సూచించారు. దీంతో ప్రతిపక్ష సభ్యులు మళ్లీ వెల్‌లోకి దూసుకొచ్చారు. చైర్మన్ నచ్చజెప్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోవడంతో సభను బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. తర్వాత బీఆర్ఎస్ సభ్యులు చైర్మన్ చాంబర్ ఎదుట ప్లకార్డులతో నిరసన ప్రదర్శన చేపట్టారు. రైతుల సమస్యలపై చర్చించేందుకు ఇష్టంలేక మండలిని వాయిదా వేశారని మధుసూదనాచారి ఆరోపించారు. లగచర్ల ఘటనపై రైతులకు క్షమాపణ చెప్పి.. బేషరతుగా విడుదల చేయాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు.



చేతులకు బేడీలతో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ సభ్యులు


రాష్ట్రపతికి స్వాగతం పలుకుతున్న గవర్నర్, సీఎం తదితరులు

హైదరాబాద్‌కు చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

స్వాగతం పలికిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, అల్వాల్, మేడ్చల్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): శీతాకాల విడిది కోసం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్ చేరుకున్నారు. మంగళవారం సాయంత్రం 5.10 గంటలకు ప్రత్యేక విమానంలో హకీంపేట విమానాశ్రయానికి చేరుకున్న ఆమెకు.. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ(ఇన్‌చార్జ్ డీజీపీ) రవిగుప్తా, త్రివిధ దళాలకు చెందిన అధికారులతోపాటు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్, సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్కడి నుంచి రాష్ట్రపతి నేరుగా భారీ కాన్వాయ్‌తో సికింద్రాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంకు చేరుకున్నారు. ఈ నెల 21 వరకు ఐదు రోజుల పాటు అక్కడే ఉండి వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

వైద్య వృత్తి.. మానవ సేవకు గొప్ప మార్గం

మంగళగిరి ఎయిమ్స్‌కు తొలి బ్యాచ్‌తోనే గుర్తింపు: రాష్ట్రపతి

అమరావతి, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మానవాళికి సేవ చేసేందుకు గొప్ప మార్గం వైద్య వృత్తి అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఏపీలోని మంగళగిరి ఎయిమ్స్ మొదటి స్నాతకోత్సవంలో పాల్గొని, విద్యార్థులకు బంగారు పతకాలు, పట్టాలను ప్రదానం చేసిన ముర్ము.. ఈ విద్యా సంస్థ తొలి బ్యాచ్‌తోనే ఎయిమ్స్‌కు మంచి గుర్తింపు రావాలని ఆకాంక్షించారు. ఇప్పుడు పట్టాలు తీసుకుని బయటకు వెళ్తున్న విద్యార్థులే.. దేశవిదేశాల్లో మంగళగిరి ఎయిమ్స్‌కు బ్రాండ్ అంబాసిడర్లని కొనియాడారు. "ప్రపంచంలోనే భారత్ వైద్య పర్యాటకానికి కేంద్రంగా అభివృద్ధి చెందుతోంది. ఇందులో వైద్యుల పాత్ర కీలకం. వైద్య శాస్త్రాలు కొత్త సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. వీటికి పరిష్కార మార్గాలు అవసరం. ఈ ప్రయత్నంలోనే భాగంగానే.. ఎయిమ్స్‌లో సైటోజెనిటిక్స్ ల్యాబొరేటరీని ఏర్పాటు చేశారు" అని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి ప్రతాపరావు గణపత్‌రావు జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కాళేశ్వరం కమిషన్ విచారణ

హైదరాబాద్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై విచారణలో భాగంగా మంగళవారం రాత్రి జస్టిస్ పినాకి చంద్రఘోష్ హైదరాబాద్‌కు చేరుకున్నారు. వచ్చీ రాగానే బుధవారం విచారణకు హాజరుకావాలని మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే. జోషి, నీటిపారుదల శాఖ మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ రజత్ కుమార్‌కు కబురు పంపారు. ఈ దఫా వారం రోజుల పాటు (ఈ నెల 24దాకా) హైదరాబాద్‌లోనే ఉండి విచారణ చేపట్టనున్నారు. ఈ షెడ్యూల్‌లో మాజీ ఈఎన్‌సీలు సీ మురళీధర్, నల్లా వెంకటేశ్వర్లు, ఈఎన్‌సీ బి.హరిరామ్, సీఎంవో మాజీ కార్యదర్శి స్మితా సబర్వాల్, మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును క్రాస్ ఎగ్జామినేషన్ చేయనున్నారు. జనవరిలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ నీటిపారుదల శాఖ మంత్రి టి.హరీశ్‌రావు, మాజీ మంత్రి, ప్రస్తుత బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌ను కమిషన్ క్రాస్ ఎగ్జామినేషన్‌కు పిలవనుంది.

పోలీసు కంప్యూటర్ సర్వీసెస్‌కు జాతీయ అవార్డు

హైదరాబాద్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఈ- పెట్టీ కేసులకు సంబంధించి మొబైల్ యాప్ ఆవిష్కరణకు గాను తెలంగాణ పోలీసు కంప్యూటర్ సర్వీసెస్ స్టాండర్డైజేషన్ విభాగానికి 15వ జాతీయ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అవార్డు దక్కినట్లు అదనపు డీజీపీ వివి శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఈ అవార్డును ఈ నెల 13వ తేదీన గువాహటిలో నిర్వహించిన కార్యక్రమంలో అసోం రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి పవన్ కుమార్ చేతుల మీదుగా తెలంగాణ పోలీసు విభాగానికి చెందిన ఎస్పీ కిరణ్ కుమారీ అందుకున్నారని ఆయన చెప్పారు. టెక్నాలజీ వినియోగంలో తెలంగాణ పోలీసు విభాగం దేశవ్యాప్తంగా విశిష్ట స్థానాన్ని ఏర్పరచుకుందని కొనియాడారు.

అదనంగా సోయాబీన్ కొనుగోలు: తుమ్మల

హైదరాబాద్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సోయాబీన్ పంటకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన పరిమాణం 59,508 మెట్రిక్ టన్నుల కంటే.. అదనంగా 25 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని, ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ల విజ్ఞప్తి మేరకు పంట కొనుగోలుకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో 49 సెంటర్ల ద్వారా సోయాబీన్ కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగుతోందని మంగళవారం ఒక ప్రకటనలో ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, మార్క్‌ఫెడ్ నోడల్ ఏజెన్సీ ద్వారా రైతుల నుంచి ఇప్పటికే 59 వేల మెట్రిక్ టన్నుల సోయాబీన్‌ను కేంద్రం ప్రకటించిన మద్దతు ధర రూ.4,892తో సేకరించినట్లు వెల్లడించారు. సోయాబీన్ రైతులకు మద్దతు ధర లభించేందుకు వీలుగా మరొక 25 వేల మెట్రిక్ టన్నుల సేకరణకు అనుమతి ఇవ్వాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని కోరామని, ఇది పరిశీలనలో ఉందని ఆయన తెలిపారు.

దమ్ముంటే అసెంబ్లీని 15 రోజులు నడపాలి

- ఫార్ములా కార్ రేసింగ్‌పై సభలో చర్చకు సిద్ధం: కేటీఆర్

హైదరాబాద్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి దమ్ముంటే అసెంబ్లీ సమావేశాలను 15 రోజులు నడపాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. అధికారపక్షానికి నచ్చిన అంశాలపై చర్చించి ముగించటం కాదని, రాష్ట్రంలో ఎన్నో సమస్యలున్నాయని.. వాటన్నింటిపైనా చర్చించాలని డిమాండ్ చేశారు. ఫార్ములా ఈ కార్ రేసింగ్ పేరుతో తనపై ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో ఆ అంశంపైనా సభలో సుదీర్ఘ చర్చకు తాను సిద్ధమేనని తెలిపారు. మంగళవారం తెలంగాణభవన్‌లో కొడంగల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాసమస్యలు చర్చించిన తర్వాత... రేవంత్‌రెడ్డి ఆరోపిస్తున్న స్కాములపై కూడా చర్చించేందుకు తాము సిద్ధమన్నారు. లగచర్ల రైతుల కోసం బీఆర్ఎస్ పోరాడుతుందని ఆయన చెప్పారు.

సర్కారు నిర్లక్ష్యం.. విద్యార్థినులకు ప్రాణ సంకటం

- మాజీ మంత్రి హరీశ్‌రావు


హైదరాబాద్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): బడిలో పాఠాలు వినాల్సిన పిల్లలు కాంగ్రెస్ పాలనలో అనారోగ్యంతో ఆస్పత్రి పడకలపైకి చేరుతుండటం ఆందోళన కలిగిస్తోందని మాజీమంత్రి హరీశ్ రావు అన్నారు. సర్కార్ నిర్లక్ష్యం ఖమ్మం జిల్లా దానవాయిగూడెం బీసీ సంక్షేమ వసతిగృహం విద్యార్థినులకు ప్రాణసంకటంగా మారిందని మంగళవారం 'ఎక్స్' వేదికగా ఆయన ఆరోపించారు. ఆ వసతి గృహంలోని లక్ష్మి, భవాని, కీర్తి అనే ముగ్గురు విద్యార్థినులను మార్చి నుంచి నవంబరు వరకు 15సార్లు ఎలుకలు కొరికితే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కాగా, శాసనసభ ఆవరణలో మంగళవారం మార్షల్స్‌ని పెద్దసంఖ్యలో మోహరించడం పట్ల హరీశ్‌రావు విస్మయం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం భయపడుతోందనడానికి ఇదే నిదర్శనమన్నారు.

తెలంగాణలో..

ఎంబీబీఎస్ చేసినవాళ్లు లోకలే

- పీజీ కోర్సుల్లో.. స్థానిక కోటాకు వారు అర్హులే: హైకోర్టు
- ఈ కోవలో ఏపీ, రాజస్థాన్.. ఇతర రాష్ట్రాల విద్యార్థులు
- మెడికల్ పీజీ రూల్స్ వివరణ-2ను కొట్టివేసిన హైకోర్టు
- ఈ తీర్పు ఈ ఏడాదికే: ధర్మాసనం

హైదరాబాద్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పీజీ వైద్య కళాశాలల్లో ప్రవేశానికి సంబంధించిన నిబంధనలపై హైకోర్టు కీలక తీర్పునిచ్చింది. 15% ఆలిండియా కోటాలో.. తెలంగాణలో ఎంబీబీఎస్, బీఏఎంఎస్, బీహెచ్‌ఎంఎస్ పూర్తిచేసిన రాష్ట్రేతర విద్యార్థులు కూడా పీజీ కోర్సుల్లో స్థానిక కోటాకు అర్హులని పేర్కొంటూ.. ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ మెడికల్ కాలేజీల(పీజీ అడ్మిషన్లు) నిబంధనలు-2021లోని రూల్ 8(2)కు రాష్ట్ర ప్రభుత్వం అక్టోబరు 28న జీవో 148, జీవో 149 ద్వారా చేసిన సవరణల్లోని వివరణ-2ను హైకోర్టు కొట్టివేసింది. "ఆలిండియా కోటాలో తెలంగాణలో ఎంబీబీఎస్ పూర్తిచేసిన రాష్ట్రేతర విద్యార్థులు పీజీ మెడికల్ కోర్సుల్లో స్థానిక కోటాకు అర్హులు కాదు" అనేది ఈ రూల్ సారాంశం. దీంతో.. ఈ రూల్‌ను సవాల్ చేస్తూ సుమారు వంద మంది రాష్ట్రేతర విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్లలో సింహభాగం ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్‌కు చెందినవారున్నారు. అఖిల భారత కోటాలో భాగంగా వీరంతా తెలంగాణలో ఎంబీబీఎస్ పూర్తిచేశారు. తెలంగాణ మెడికల్ పీజీ కోర్సుల్లో స్థానిక కోటాకు తాము కూడా అర్హులమేనని వాదిస్తున్నారు. ఈ పిటిషన్‌లపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావు ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు విద్యాసాగర్, మయూర్‌రెడ్డి, ఎ.వెంకటేశ్, ఎస్.సత్యంరెడ్డి, సురేందర్‌రావు తదితరులు వాదనలను వినిపించారు. రూల్ 8(2)లోని వివరణ-2 రాష్ట్రపతి ఉత్తర్వులు-1974కు విరుద్ధంగా ఉన్నాయని.. దాన్ని కొట్టివేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రపతి ఉత్తర్వులకు విరుద్ధంగా ప్రభుత్వం సవరణలు తేవడానికి వీల్లేదని పేర్కొంటూ 'పి.లక్ష్మణరావు వర్సెస్ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' తదితర కేసుల్లో తీర్పులను ప్రస్తావించారు. అడ్మిషన్ల ప్రక్రియ గత ఏడాది నవంబరు 9నే మొదలైన నేపథ్యంలో.. రూల్స్‌ను సవరించడం చెల్లదని పేర్కొన్నారు. మెరిట్ ఆధారంగా అభ్యర్థులకు ప్రాధాన్యం ఇవ్వాలే తప్ప స్థానికత ఆధారంగా వారిని దూరం పెట్టడం చెల్లదని పేర్కొన్నారు.



అప్పటికి తెలంగాణ ఏర్పడి పదేళ్లు కాలేదని, దాంతో ఏపీ పునర్విభజన చట్టంలోని సెక్షన్ 95 ప్రకారం ఏపీ అభ్యర్థులకు ఇప్పటికీ అవకాశం ఉంటుందని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం, కాళోజీ హెల్త్ యూనివర్సిటీ తరఫున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదనలను వినిపించారు. ఏపీ పునర్విభజన చట్టంలోని సెక్షన్ 95 ప్రకారం పదేళ్లపాటు మాత్రమే ఏపీ, తెలంగాణ రాష్ట్రాల విద్యార్థులకు ప్రత్యేక కోటా ఉందని గుర్తుచేశారు. ఆ గడువు ముగిసిన నేపథ్యంలో రాష్ట్రపతి ఉత్తర్వులు-1974, ఆర్టికల్-371(డీ)కి సంబంధించిన ప్రస్తావనే అవసరంలేదన్నారు. స్థానికత ఆధారంగా రిజర్వేషన్ కల్పించేందుకు నిబంధనలను సవరించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని పేర్కొన్నారు. 'డీపీ జోషి' కేసులో తీర్పును ఈ సందర్భంగా ప్రస్తావించారు. 8-12వ తరగతి వరకు తెలంగాణలో చదివి ఉన్న వాళ్లు మాత్రమే పీజీ మెడికల్‌లో స్థానిక కోటాకు అర్హులుగా ఉండాలనేది ప్రభుత్వ ఉద్దేశమని.. అందుకే వివరణ-2ను చేర్చినట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాల వారు ఇక్కడ ఎంబీబీఎస్ చదివినంత మాత్రాన మెడికల్ పీజీలో స్థానిక కోటాకు అర్హులైపోరని స్పష్టంచేశారు. పిటిషనర్లలో ఎక్కువ మంది 15% ఆల్ ఇండియా కోటాలో తెలంగాణలో చదవిన వారు లేదా మేనేజ్‌మెంట్ కోటాలో ఎంబీబీఎస్ పూర్తిచేసిన ఇతర రాష్ట్రాల వారు ఉన్నట్లు గుర్తుచేశారు. వాదోపవాదనలను నమోదు చేసుకున్న ధర్మాసనం.. ఆర్టికల్ 371(డీ), రాష్ట్రపతి ఉత్తర్వులు, ఏపీ పునర్విభజన చట్టం, ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ యాక్ట్-1983 వంటి వాటిపై విస్తృతంగా చర్చించింది. తెలంగాణ మెడికల్ కాలేజెస్ రూల్స్-2021 రూల్8(2)లోని వివరణ-2ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. నాన్-లోకల్ కోటాతో సంబంధం లేకుండా ఎవరైతే తెలంగాణలో ఎంబీబీఎస్, బీఏఎంఎస్, బీహెచ్‌ఎంఎస్ పూర్తిచేస్తారో.. వారంతా మెడికల్ పీజీ కోర్సుల్లో స్థానిక అభ్యర్థుల కోటాకు అర్హులేనని స్పష్టంచేసింది. అయితే వివరణ-2 కొట్టివేత 2024-25 విద్యాసంవత్సరానికి మాత్రమే వర్తిస్తుందని పేర్కొంటూ.. ఉత్తర్వులను జారీచేసింది.

బయట చదివిన రాష్ట్ర విద్యార్థులు నాన్-లోకల్

హైకోర్టు తాజా తీర్పుతో.. పీజీ వైద్యవిద్య ప్రవేశాల్లో తెలంగాణ రాష్ట్ర విద్యార్థులు సీట్లను కోల్పోయే ప్రమాదం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో 2,886 పీజీ మెడికల్ సీట్లున్నాయి. వీటిల్లో 1,300 సీట్లు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఉన్నాయి. వీటిల్లోని 50% సీట్లు ఆలిండియా కోటాకు వెళ్తాయి. మన రాష్ట్ర విద్యార్థులకు మిగిలేవి 650 సీట్లే.! ప్రైవేటులో 1,500కు పైగా సీట్లలో 50% కన్వీనర్ కోటా కిందకు వస్తాయి. మిగతా 50శాతంలో 35% మేనేజ్‌మెంట్ కోటా, 15% ఎన్నారై కోటాకు వెళ్తాయి. మొత్తమ్మీద రాష్ట్ర విద్యార్థులకు 1,400 సీట్లు మిగులుతాయి. వీటిల్లో డిమాండ్ ఎక్కువగా ఉండే ఈ వెయ్యి సీట్లలో ఇప్పుడు ఇతర రాష్ట్రాల వారికీ లోకల్ కోటా కింద సీట్లు రిజర్వ్ అవుతాయి. వేరే రాష్ట్రాల్లో ఎంబీబీఎస్ చదివిన రాష్ట్ర విద్యార్థులు కూడా ఇక్కడ పీజీకి నాన్-లోకల్ అవుతున్నారు. ఇలా నాన్-లోకల్ అంటున్న వైద్య విద్యార్థులు చాలా మంది కాంటాక్టు పద్ధతిలో సర్కారీ దవాఖానాల్లో పనిచేస్తున్నారు. కొందరైతే రెగ్యులర్ ఉద్యోగాలను సాధించారు. ఉద్యోగాలకు లోకల్ అయినా.. వైద్య విద్యకు తాము నాన్-లోకల్ అనడం సరికాదని విద్యార్థులు చెబుతున్నారు. నీట్(పీజీ)లో మంచి ర్యాంకులు వచ్చినా.. నాన్-లోకల్ పేరిట తమకు సీటు దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రేపటి నుంచి పుస్తకాల పండగ

- ప్రతి రోజూ సాయంత్రం సాహితీ చర్చలు
- ప్రాంగణానికి దాశరథి పేరు
- 330కు పైగా స్టాళ్లు.. 10 రోజులు సందడి

హైదరాబాద్ సిటీ, డిసెంబరు17(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరానికి ముందే నగరాన్ని అలరించే పుస్తకాల పండుగ గురువారం ఎన్టీఆర్ స్టేడియంలో ప్రారంభం కానుంది. పదిరోజుల పాటు ఈ ఉత్సవం జరిగే ప్రాంగణానికి హైదరాబాద్ బుక్‌ఫెయిర్ కమిటీ ఈ ఏడాది మహాకవి దాశరథి కృష్ణమాచార్య పేరును ప్రకటించింది. జ్యోతిరావుపులే జీవిత చరిత్రను తెలుగులోకి తొలిసారిగా అనువదించిన రచయిత్రి, ప్రసిద్ధ విమర్శకురాలు బోయి విజయభారతి పేరును బుక్‌ఫెయిర్ ప్రధాన వేదికకు పెడుతున్నారు. ఈ ఏడాది పుస్తకావిష్కరణలకు ప్రత్యేక వేదికను ఏర్పాటుచేశారు. దానికి తోపుడుబండి సాదిక్‌అలీ పేరు, మీడియా పాయింట్‌కు ఉప్పల నరసింహం, రచయిత్రుల స్టాళ్లకు గుస్సాడి కళాకారుడు కనకరాజు పేర్లు పెడుతున్నట్లు ప్రకటించారు. ఈ పుస్తక మహోత్సవంలో 200కుపైగా నిర్వాహకులు, 330కుపైగా స్టాళ్లను ఏర్పాటు చేవారు. అందులో హార్పర్ కాలిన్స్ ఇండియా, సేజ్, పెంగ్విన్ తదితర ఆంగ్ల ప్రచురణలు, మున్షీరాం మనోహర్‌లాల్, కేంద్ర సాంస్కృతిక అకాడమీ, సీపీ బ్రౌన్ అకాడమీలాంటి జాతీయ ప్రచురణ సంస్థలుండడం విశేషం. హైదరాబాద్ బుక్‌ట్రస్ట్, వీక్షణం, ఎమెస్కో, నవయుగ, నవ తెలంగాణ, నవచేతన, తెలంగాణ పబ్లికేషన్స్, బాలగోపాల్ రచనలు, విశ్వనాథ సాహిత్య పీఠం, సైబాబ ముస్లిం మైనార్టీ ప్రచురణలు, భూమి బుక్ ట్రస్ట్, మంచిపుస్తకం, అన్వీక్షికి, ఛాయా.. ఇలా తెలుగులో ప్రత్యేకమైన ప్రచురణ సంస్థల స్టాళ్లన్నీ అందుబాటులో ఉండనున్నాయి. పుస్తకాలపై పది శాతం రాయితీ ఇవ్వనున్నాయి.

బాలోత్సవ్...

ఈ ప్రదర్శనలో భాగంగా 9 రోజుల పాటు మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 6గంటల వరకు పిల్లల కార్యక్రమాలను ఏర్పాటు చేస్తారు. రంగస్థల నిపుణుడు శాంతారావు ఆధ్వర్యంలో పిల్లలకు డ్రామా వర్క్‌షాప్, స్టోరీ టెల్లింగ్, క్రాఫ్టవర్క్ శిక్షణ శిబిరాలు, వినూత్న వస్త్రాలంకరణ, బృంద నృత్య, సంగీత ప్రదర్శనలు, చిత్రలేఖనం, కథారచన పోటీలను నిర్వహిస్తారు. సాయంత్రం 6గంటల నుంచి వివిధ అంశాలపై సాహిత్య చర్చాగోష్ఠులు, కవితా పఠనాలు నిర్వహించనున్నారు. కాగా.. ప్లాస్టిక్ రహితంగా పుస్తక ప్రదర్శన నిర్వహించాలన్న లక్ష్యంతో పుస్తక స్టాళ్ల నిర్వాహకులకు వస్త్ర సంచులు ప్రత్యేక రాయితీకి ఇవ్వనున్నారు.


కూకట్‌పల్లి కాముని చెరువు వద్ద స్థానికులతో రంగనాథ్

ఆ అక్రమ నిర్మాణాలు కూల్చివేస్తాం!

- జూలై తర్వాత నిర్మాణాలను వదలం
- అనుమతులున్న వాటి జోలికి వెళ్లం
- నివాసిత భవనాలనూ కూల్చబోం
- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్
- 'వాసవి' తీరుపై రంగనాథ్ అసహనం

హైదరాబాద్ సిటీ/కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): 'హైడ్రా ఆవిర్భవించిన జూలై 2024 తర్వాత చెరువులు, నాలాలు, పార్కులు, ప్రభుత్వ స్థలాల్లో నిర్మించిన అక్రమ నిర్మాణాలను తప్పకుండా కూల్చివేస్తాం. అదే సమయంలో ప్రభుత్వ విభాగాల అనుమతి తీసుకొని నిర్మించిన, ఇప్పటికే నివాసముంటున్న భవనాల జోలికి మాత్రం వెళ్లబోం' అని హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఎసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. వాణిజ్య నిర్మాణాలకు ఈ నిబంధన వర్తించదని, జూలై 2024 కంటే ముందు చెరువులు, నాలాలు, ప్రభుత్వ స్థలాల్లో నిర్మించిన నివాసేతర నిర్మాణాలను తొలగిస్తామని పేర్కొన్నారు. మంగళవారం కూకట్‌పల్లిలోని ఖైతలాపూర్ కాముని చెరువు, మైసమ్మ చెరువులను ఆయన సందర్శించారు. కాముని చెరువును నిర్మాణ రంగ వ్యర్థాలు, మట్టితో నింపుతున్నారని, అనుసంధాన కాలువలను కబ్జా చేస్తున్నారన్న ఫిర్యాదుల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించారు. చెరువును ఆనుకొని ఉన్న రాఘవేంద్ర కాలనీ వాసులతో ఆయన మాట్లాడారు. కాముని చెరువు నుంచి మైసమ్మ చెరువుకు వచ్చే వరద కాలువ మళ్లించి వాసవి సంస్థ భవనాలు నిర్మిస్తున్నదని, దీంతో దిగువన ఉన్న సఫ్ధార్‌నగర్, రాజీవ్‌గాంధీనగర్ బస్తీలు వర్షాకాలంలో మునిగిపోతాయని, భవిష్యత్తులో ఇబ్బందులు వస్తాయని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఆ ప్రాజెక్టు అనుమతులు పరిశీలిస్తామని చెప్పిన రంగనాథ్.. నాలా పనులు పూర్తి చేయకుండా వాసవి సంస్థ బహుళ అంతస్తుల భవనాలు నిర్మించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. కాముని చెరువులో అక్రమంగా వ్యర్థాలు డంపింగ్ చేసిన వారిని వదిలేది లేదని, చెరువుల్లో నిర్మాణాలు చేపడితే కూల్చివేస్తామని రంగనాథ్ హెచ్చరించారు. వచ్చే వర్షాకాలానికి ఇబ్బంది లేకుండా కాముని చెరువు, మైసమ్మ చెరువుల మధ్య ఉన్న వరద కాలువ నిర్మాణ పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చెరువులో వ్యర్థాలు, మట్టి, బండరాళ్లను డంప్ చేస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు.

జూన్ 2న సనత్‌నగర్ టిమ్స్ ప్రారంభోత్సవం

- సీఎం రేవంత్ చేతుల మీదుగా ప్రారంభం
- అప్పటికల్లా పనుల పూర్తికి చర్యలు
- మావి స్కీంలు.. బీఆర్ఎస్‌వి స్కాంలు
- త్వరలో గోషామహల్ గ్రౌండ్స్‌లో ఉస్మానియా కొత్త ఆస్పత్రి నిర్మాణ పనులు
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి


ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలించి, అధికారులకు సూచనలు చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

హైదరాబాద్, ఎర్రగడ్డ, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్‌లో నిర్మితమవుతున్న తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ సైన్సెస్ (టిమ్స్) ఆస్పత్రిని తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజైన జూన్ 2న ప్రారంభించనున్నారు. ఆ రోజున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ప్రారంభింపజేసేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. అప్పటివరకు పనులన్నింటినీ పూర్తిచేసేలా కార్యాచరణ రూపొందించామని, ఇప్పటికే శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. మంగళవారం ఆయన సనత్‌నగర్ (ఎర్రగడ్డ)లో టిమ్స్ ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. తాము స్కీంలను అమలుచేస్తూ ప్రజలకు చేరువవుతుంటే.. బీఆర్ ఎస్ మాత్రం స్కాంలు చేసుకుంటూ ప్రజల్లో ఆ పార్టీ అభాసుపాలు అవుతుందంటూ ఎద్దేవా చేశారు. విదేశాల్లో అందిస్తున్న విధంగానే రాష్ట్రంలోనూ నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఎమర్జెన్సీ వార్డులో రోగులు వేచి చూడాల్సిన పరిస్థితి లేకుండా అత్యాధునిక పర్యవేక్షణ విధానాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. రోగులతో పాటు వచ్చే వారి రోగి సహాయకులు ఉండేందుకు ఆధునాతన సౌకర్యాలతో 'ధర్మశాల'ను నిర్మిస్తున్నామని, వారికి భోజన వసతి కల్పించేందుకు 'అక్షయపాత్ర' సంస్థతో ఒప్పందం చేసుకున్నామని, రూ.5కే భోజనం అందిస్తామని చెప్పారు. వచ్చే రెండు మూడు నెలల్లో గోషామహల్ గ్రౌండ్స్‌లో ఉస్మానియా కొత్త ఆసుపత్రి నిర్మాణాన్ని చేపడుతామన్నారు. పంజాగుట్టలో నిర్మించే నిమ్స్ అదనపు భవనాలను వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఎల్బీ నగర్ టిమ్స్ పనులను వేగవంతం చేశామని, అల్వాల్ టిమ్స్ నిర్మాణంలో ఉన్న సమస్యలను పరిష్కరించుకుని ముందుకువెళ్తున్నామని చెప్పారు. ఆయనవెంట ఆర్ అండ్ బీ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్, సీఈలు రాజేశ్వరరెడ్డి, లింగారెడ్డితో పాటు ఎస్ఈ విశ్వకుమార్ తదితరులు ఉన్నారు.

3 నెలల చిన్నారి మాడుకు సర్జరీ

అరుదైన శస్త్రచికిత్స చేసిన కామినేని వైద్యులు


సర్జరీకి ముందు మూడు నెలల చిన్నారి

హైదరాబాద్ సిటీ/మన్సురాబాద్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఖాళీగా ఉండాల్సిన మాడు భాగం మూసుకుపోయి పుట్టిన ఓ చిన్నారికి కామినేని ఆస్పత్రి పిల్లల వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేశారు. ఆస్పత్రి న్యూరో సర్జన్, మినిమల్ యాక్సెస్ బ్రెయిన్, స్పైన్ సర్జన్ డాక్టర్. ఎస్ రమేశ్.. ఆ సర్జరీ వివరాలను మంగళవారం మీడియాకు తెలిపారు. వరంగల్‌కు చెందిన దంపతులకు పుట్టిన చిన్నారికి మాడు భాగం గట్టిగా ఉండడాన్ని మూడునెలల వయసులో గుర్తించారు. సాధారణంగా నవజాత శిశువుల్లో మాడు పైభాగం మెత్తగా ఉంటుంది. కానీ, ఆ శిశువుకు అలా లేకపోవడంతో పిల్లల వైద్యులకు చూపించారు. దాన్ని శస్త్రచికిత్స ద్వారా సరిచేయాల్సిందేనని వారు చెప్పడంతో తల్లిదండ్రులు చిన్నారిని కామినేని ఆస్పత్రికి తీసుకొచ్చారు. అన్ని పరీక్షలూ చేసిన తర్వాత.. ఎండోస్కోపిక్ విధానంలో ఆ చిన్నారికి 'సూచరెక్టమీ' చేశామని డాక్టర్ ఎస్. రమేశ్ తెలిపారు. మూసుకుపోయిన మాడు ప్రాంతాన్ని ఈ విధానంలో తెరిచి, మెదడు తగినంతగా ఎదిగేందుకు కావల్సిన వాతావరణాన్ని కల్పించామని చెప్పారు. ఈ శస్త్రచికిత్స చేసిన తర్వాత హెల్మెట్ థెరపీ కూడా చేశామని, దాదాపు 12 నుంచి 15 నెలల పాటు ప్రతిరోజూ సుమారు 22-23 గంటలు శిశువుకు ఈ చికిత్స చేసినట్లు తెలిపారు. దీని వల్ల ఎక్కడ మెదడు ఎదుగుదల సాధారణంగా ఉంటుందని ఆయన వివరించారు. ఈ హెల్మెట్ కూడా ఇక్కడ అందుబాటులో ఉండదని.. ప్రత్యేకంగా బెంగళూరు నుంచి తెప్పించామని వెల్లడించారు. "హెల్మెట్‌లోని కుషన్ అనేక పొరలుగా ఉంటుంది. శిశువు ఎదిగేకొద్దీ మెదడు కూడా ఎదుగుతుంది కాబట్టి.. అందుకు తగినట్లుగా కొన్ని పొరలను తొలగిస్తూ ప్రక్రియ పూర్తిచేశాం. ఇప్పుడా చిన్నారి పూర్తి ఆరోగ్యంతో ఉంది" అని డాక్టర్ రమేశ్ చెప్పారు. ప్రతి మూడువేల మంది శిశువుల్లో ఒకరికి ఇలా జరగవచ్చని.. కొంతమంది పిల్లల్లో జన్యుపరమైన కారణాల వల్ల అత్యంత అరుదుగా మాడు భాగం కూడా మూసుకుపోయి ఉంటుందని, దానివల్ల మెదడులో ఒత్తిడి పెరిగిపోవడం, తల భాగం అస్తవ్యస్తంగా పెరగడం, కంటిచూపు తేడా రావడం వంటి సమస్యలు వస్తాయని వివరించారు.

బాలల హక్కుల పరిరక్షణ

కమిషన్ చైర్‌పర్సన్‌గా సీతాదయాకర్‌రెడ్డి?

- నియమించనున్న ప్రభుత్వం!


సీతాదయాకర్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్‌గా మాజీ ఎమ్మెల్యే కొత్తకోట సీతాదయాకర్‌రెడ్డి నియమితులు కానున్నట్లు సమాచారం. చైర్‌పర్సన్‌తోపాటు ఆరుగురు సభ్యులను భర్తీ చేసేందుకు మహిళా, శిశు, వికలాంగులు, వయోవృద్ధుల శాఖ నవంబరు 25 నుంచి డిసెంబరు 2 వరకు దరఖాస్తుల స్వీకరించింది. దాదాపు 445 దరఖాస్తులు వచ్చినట్టు సమాచారం. వీటిని పరిశీలించి, సభ్యులను ఖరారు చేసేందుకు మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి, శాఖ ముఖ్య కార్యదర్శితో పాటు మరో ఇద్దరు సభ్యులతో కలిపి ప్రభుత్వం త్రిసభ్య కమిటీని ఏర్పాటుచేసింది. గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే.. మహబూబ్‌నగర్ జిల్లాలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలోనే సీతాదయాకర్‌రెడ్డికి కమిషన్ చైర్‌పర్సన్ పోస్టు వరించనున్నట్టు ప్రచారం జరిగింది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఏ సోషియాలజీ చేసిన సీతాదయాకర్‌రెడ్డి 2009లో దేవరకద్ర నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.